ఈనాడు

గుంటూరు 2-5-2026 శనివారం సిటీ సంపుటి 31 సంచిక 26
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



సెలవుల్లో సరదాగా!

హలో నేస్తాలూ.. ఈ డింబు మిమ్మల్ని ప్రేమగా పలకరించడం కోసం పొద్దున్నే వచ్చేశాడు చూశారా! వస్తూ వస్తూ బోలెడన్ని కబుర్లు, కొత్త సంగతులు కూడా మోసుకొచ్చాడు. ఈ వేసవిలో ఇలా ప్రత్యేకంగా మనం ఇన్ని విషయాలు ఎందుకు చెప్పుకొంటున్నామో తెలుసా? దీని వెనక చాలా మంచి కారణం ఉంది.

నేర్చుకుందాం.. రండి!

సెలవులంటే ఏంటో మా బాబాయ్ నాకు మొన్ననే ఓ మాట చెప్పాడు. 'స్కూల్లో చెప్పని విషయాలు ఈ నెలన్నరలో నేర్చుకోమని' వాటి ఉద్దేశం అంట. ఏడాదంతా పుస్తకాల్లో మునిగిపోయే పిల్లలకు.. ఒక్కసారిగా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూపించే గొప్ప రోజులే వేసవి సెలవులట! మరి ఇంత ప్రత్యేకమైన హాలిడేస్‌ను మరింత సందడిగా మార్చడానికే ఈ 'సెలవుల్లో సరదాగా'తో మీ ముందుకు వచ్చేస్తున్నా. ఇందులో మనం పంచుకుంటున్న విషయాలు మీకెంతో మేలు చేయగలవు తెలుసా! సబ్జెక్టులకు అవతల ఏం ఉందో చూడగలరు. అందుకే వీటిని చక్కగా పాటించండేం.

మీరు, మీ ఫ్రెండ్స్ మాత్రమే కాదు.. అమ్మానాన్నలను కూడా ఇందులో కలపండి. వారికి మన కబుర్లు చూపించి చదివించండి. వారి సాయంతో ఇందులో చెబుతున్న ఆర్ట్స్, క్రాఫ్ట్స్, యాక్టివిటీలు అన్నీ రోజూ చేయండి. అలా చేస్తే సెలవులు పూర్తయ్యేసరికి మీకెన్ని కొత్త విషయాలు తెలిశాయో లెక్క పెట్టుకుంటే మీరే ఆశ్చర్యపోతారు. టీచర్లకు చూపిస్తే వారూ శభాష్ అంటారు. వేస్తారు కదూ!



అమెరికా-ఇరాన్ మధ్య కుదరని సయోధ్య

యుద్ధం ముగింపునకు ఇరాన్ నూతన ప్రతిపాదన



- సంతృప్తికరంగా లేదన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- టెహ్రాన్ నాయకత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయంటూ అసహనం 3లో
- భవిష్యత్ దాడులకు ఉన్న ఐచ్ఛికాలపై సమీక్ష

14 - 16 మధ్య అండమాన్‌కు నైరుతి రుతుపవనాలు 8లో

అమరావతి నిర్మాణ ఖర్చుపై వైకాపా దుష్ప్రచారం

మీకోసం చ.అడుగుకు రూ.35,714 ఖర్చు చేయొచ్చుగానీ, రాజధానికి రూ.6,980 వెచ్చిస్తే తప్పా? 2లో

జగన్‌పై ఎంఏ షరీఫ్ ధ్వజం

కల్తీ నెయ్యి సరఫరాకు ప్రధాన కారకుడు



ధర్మారెడ్డే



టెండరు నిబంధనలు సడలించడానికి అనుమతిచ్చింది ఆయనే

ఆ నిర్ణయాల వల్లే తితిదేలోకి కల్తీ నెయ్యి సరఫరా సంస్థల చొరబాటు

వాటిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా కొనసాగించారు

ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి • ప్రభుత్వానికి ఏకసభ్య కమిషన్ నివేదిక

అప్పటి ఈవో సింఘాల్, ఆర్థిక సలహాదారు బాలాజీల ప్రమేయంపైనా ప్రస్తావన

తితిదే బోర్డుకు ప్రత్యేక ఆహ్వానితులు వద్దు

నిపుణులను సభ్యులుగా నియమించాలి

విశ్రాంత ఐపీఎస్ దినేష్‌కుమార్ కమిషన్ సిఫార్సులు 10లో

ఈనాడు - అమరావతి

వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ కోసం కల్తీ నెయ్యి సరఫరా జరగటానికి నాటి ఈవో ఏవీ ధర్మారెడ్డే ప్రధాన కారణమని ఏకసభ్య కమిషన్ నిగ్గుతేల్చింది. నాణ్యమైన నెయ్యి సరఫరాకు తూట్లు పొడిచేలా టెండరు నిబంధనలు సడలించటానికి ఆయనే అనుమతిచ్చారని.. ఆ నిర్ణయాల ఫలితంగానే కల్తీ నెయ్యి సరఫరా చేసే మోసపూరిత సంస్థలు తితిదేలోకి చొరబడ్డాయని స్పష్టం చేసింది. ఆయన చర్యల వల్ల తితిదే నెయ్యి కొనుగోలు ప్రక్రియ పూర్తిగా ప్రమాదంలో పడిపోయిందని వెల్లడించింది. సరఫరా సంస్థల అర్హతలు, విశ్వసనీయత, వాటి సామర్థ్యం, నాణ్యత హామీ వ్యవస్థలు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది పరిశీలించటంలో ధర్మారెడ్డి (మిగతా 10లో)

బాధ్యత మరిచిన సుబ్బారెడ్డి

బోర్డు ఛైర్మన్‌గా నెయ్యి నాణ్యత పరీక్షలకు ఆదేశించారు..

కానీ ఫలితాలేంటో తెలుసుకోవాల్సిన బాధ్యతను విస్మరించారు

కల్తీ నిర్ధారణయిందని ఛైర్మన్‌కు చెప్పామన్న అధికారులు



ఈనాడు, అమరావతి: తితిదేకు సరఫరా అవుతున్న నెయ్యి నమూనాలను మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐలో పరీక్షల కోసం పంపిండంటూ ఆదేశించిన అప్పటి పాలక మండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి.. వాటి ఫలితాల గురించి మాత్రం అసలు పట్టించుకోలేదు. నెయ్యి నమూనాల్లో కల్తీ ఉన్నట్లు సీఎఫ్‌టీఆర్ఐలో నిర్వహించిన పరీక్షల్లో నిగ్గు తేలిందని సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లామని అప్పటి ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎం, గోదాముల విభాగం డిప్యూటీ ఈవోలు వారి వాంగ్మూలాల్లో వెల్లడించారు. అయితే వారు అలాంటి (మిగతా 10లో)

మరో 4 ఈఎస్ఐ ఆసుపత్రులు

శ్రామికుల కోసం 15 'లేబర్ అడ్డా'లు

పనిలేనప్పుడు వారికి అక్కడే నైపుణ్య శిక్షణ

ఒకటో తేదీ అంటే గుర్తొచ్చేది 'పేదల సేవే'

ప్రతి నెలా రూ. 2,721 కోట్లు పింఛన్లుగా అందిస్తున్నాం

కృష్ణా జిల్లా పమిడిముక్కల ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు



పమిడిముక్కలలో భవన నిర్మాణ కార్మికులకు పీ4 పథకం కింద రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు సుభాష్, రవీంద్ర, పామర్రు ఎమ్మెల్యే కుమార్‌రాజా

ఈనాడు-అమరావతి: ఈనాడు డిజిటల్-మచిలీపట్నం: శ్రామికుల కష్టంతోనే సమాజం అభివృద్ధిలో ముందుకెళుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఎండావానా లెక్కచేయక ప్రమాదకర పరిస్థితుల్లోనూ కష్టపడి పని చేసే కార్మికులకు సెల్యూట్ చేశారు. కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం అమరావతి, అచ్యుతాపురం, కర్నూలు, శ్రీసిటీల్లో కొత్తగా ఈఎస్ఐ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పనికోసం ఎండా వానల్లో ఎదురుచూస్తూ నిలబడే కార్మికుల కోసం 'లేబర్ అడ్డా'ల పేరుతో ప్రయోగాత్మకంగా 15 షెల్టర్లు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఎవరికైనా పని చేసేవాళ్లు కావాలని ఫోన్ చేస్తే ఇక్కడి నుంచి పంపిస్తామని, భవిష్యత్తులో వీటిని నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా (మిగతా 3లో)



బయట తిండిపై 'బండ' పడింది

- ఒకేసారి రూ.993 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర
- మెనూ ధరలు 10 శాతం వరకు పెంపు
- ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రాథమిక నిర్ణయం!
- వ్యాపారాలపై ఒత్తిడి పెరుగుతుంది 2లో
- ఏపీ హోటల్, రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రకటన

ధ్యానం చేసేద్దాం..



మనం రోజూ ఎంతో అల్లరి చేస్తాం, ఆడుకుంటాం, గోల చేస్తుంటాం కదా! అయితే వీటన్నింటితో పాటు మన శరీరాన్ని, మైండ్‌ను ప్రశాంతంగా ఉంచడం కూడా అవసరమే. దీన్నే 'ధ్యానం' అంటారు. ఈ సెలవుల్లో మనం ఈ కొత్త స్కిల్ ప్రాక్టీస్ చేయడం ద్వారా బోలెడు లాభాలున్నాయి. స్కూళ్లు మొదలయ్యాక బాగా చదువుకోగలం, [illegible]

దీనికోసం ఈ గదిలో ఒక మూలన చాప మీద హాయిగా కూర్చోండి. వెన్నుముక నిటారుగా ఉంచాలి. మీ రెండు చేతులను మోకాళ్లపై ఉంచి, బొటన వేలు-చూపుడు వేలు కలిపి ఉంచండి (దీన్నే జ్ఞానముద్ర అంటారు).

- మెల్లగా కళ్లు మూసుకుని మీ చుట్టూ వినిపించే శబ్దాలను గమనించండి. పక్షుల కూతలు, ఫ్యాన్ తిరిగే చప్పుడు... ఇలా ఏది వినిపించినా ప్రశాంతంగా వినండి.
- మీ శ్వాసపై ధ్యాస పెట్టండి. గాలి లోపలికి వెళ్తున్నప్పుడు, బయటకు వస్తున్నప్పుడు మీ పొట్ట ఎలా కదులుతుందో గమనించండి.
- ఐదు నిమిషాలు పూర్తికాగానే, మెల్లగా రెండు అరచేతులను ఒకదానికొకటి రుద్ది, ఆ వెచ్చదనాన్ని కళ్లపై ఉంచుకుని నెమ్మదిగా కళ్లు తెరవండి.

సెలవుల్లో సరదాగా!

లాభాలెన్నో..

- మనకు ఒత్తిడి వచ్చినప్పుడు వచ్చే కోపాన్ని, ఏడుపును ఎలా కంట్రోల్ చేసుకోవాలో తెలుస్తుంది.
- ఇలా రోజూ చేయడం వల్ల మెదడు చురుగ్గా మారుతుంది.
- మీరు చదివే పాఠాలు ఎక్కువకాలం గుర్తుంటాయి.
- పరీక్షల సమయంలో లేదా కొత్త విషయం నేర్చుకునేటప్పుడు కలిగే భయం, కంగారు మాయమైపోతాయి. మరి ఇవాళ్టి నుంచే ధ్యానం మొదలు పెడదామా!



ప్ర. చిటపట చినుకులు.. చిటారు చినుకులు.. ఎంత కురిసినా వరదలు రావు.. ఏమిటవి?
జ: [illegible]

చెప్పగలరా!



ప్ర. పిడికెడంత పిట్ట అరిచి గోల పెడుతుంది. ఎత్తుకుంటే చెవిలో గుసగుసలాడుతుంది.. ఏమిటది?
జ: [illegible]

ప్ర. పిల్లికి ముందు రెండు పిల్లులు. పిల్లికి వెనుక రెండు పిల్లులు. పిల్లికి మధ్య ఒక పిల్లి. మొత్తం ఎన్ని పిల్లులు?
జ: [illegible]

2028 నాటికి అమరావతిలో బసవతారకం ఆసుపత్రి

నిర్మాణ పనులను ప్రారంభించిన నందమూరి బాలకృష్ణ



ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నందమూరి బాలకృష్ణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: తన తల్లి బసవతారకం పేరుపై ఏర్పాటుచేస్తున్న క్యాన్సర్ ఆసుపత్రుల ద్వారా పేద, ధనిక తేడా లేకుండా అందిస్తున్న అత్యాధునిక వైద్యసేవలను మరింత విస్తృతం చేస్తామని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తుళ్లూరు, అనంతవరం మధ్య ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భూమి పూజ చేశారు. బాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. 'అమరావతిలో ప్రభుత్వం కేటాయించిన 21 ఎకరాల్లో.. జీ+9 అంతస్తులతో ఆసుపత్రి భవన నిర్మాణం చేపడతాం. 2028 నాటికి సుమారు రూ.700 కోట్లతో 500 పడకల సామర్థ్యంతో మొదటిదశ పూర్తిచేస్తాం. హైదరాబాద్‌లో బసవతారకం ఆసుపత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తయింది. [illegible] జూన్ 22న [illegible] హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రి నిర్మాణానికి తొలిగా నా అభిమాని కర్నూలుకు చెందిన మోతీలాల్ రూ.10వేల విరాళం అందించారు. మరో 20 ఏళ్లు నా నట జీవితాన్ని కొనసాగిస్తా' అని వెల్లడించారు. 'చంద్రబాబు సారథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి నిర్మాణం కొనసాగుతోంది. ఇది ఆంధ్రులకు గర్వకారణం' అన్నారు. ఈ కార్యక్రమంలో బసవతారకం ఆసుపత్రి మెంబర్ జేఎస్ఆర్ ప్రసాద్, రావి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, బొర్రా రామకృష్ణ, అమరావతి ఐకాస కన్వీనర్ పువ్వాడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బయట తిండిపై 'బండ' పడింది

- ఒకేసారి రూ.993 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర



ఈనాడు, అమరావతి: వాణిజ్య సిలిండర్ల ధరను ఒక్కసారిగా రూ.993 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రెస్టారెంట్లు, హోటళ్లు, రోడ్డు పక్కన ఉండే టిఫిన్ సెంటర్లు, బేకరీలు, క్లౌడ్ కిచెన్లపై బండ పడింది. 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర మూడు నెలలుగా పెరుగుతుండడంతో రూ.3 వేలు దాటింది. ఆల్‌టైం గరిష్ఠ స్థాయికి చేరిన ఈ ధర చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య సిలిండర్ ధర పెరగడంతో ఇప్పటికే హోటళ్లు ఆహారపదార్థాల ధరలు పెంచాయి. రోడ్డుపక్కన బండ్లు, చిన్న టిఫిన్ సెంటర్లలోనూ రూ.5-10 వరకు పెంచాయి. ఇప్పుడు మరోసారి సిలిండర్ ధర పెరగడంతో ఆహార పదార్థాల ధరలు మరింత ఎగబాకడం ఖాయం. దీంతో సామాన్యుడి జేబుకు చిల్లు పడనుంది.

మార్చి నుంచి మూడోసారి..

ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి వాణిజ్య సిలిండర్ ధర పెరగడం ఇది మూడోసారి. మార్చిలో రూ.144, ఏప్రిల్ 1న సుమారు రూ.200 చొప్పున పెరిగాయి. ఈ వరుస పెరుగుదలతో రెస్టారెంట్లు, హోటళ్లు, చిరువ్యాపారులపై ప్రభావం పడింది. తాజాగా పెరిగిన ధరతో బయట ఆహార పదార్థాలు, ఫుడ్ డెలివరీ మరింత ప్రియం కానుంది. ముఖ్యంగా చిన్న రెస్టారెంట్లు, రోడ్డు పక్కన ఉండే హోటళ్లు, ఫుడ్ క్యాటరర్లు, క్లౌడ్ కిచెన్‌లపై ఈ ప్రభావం చాలా తీవ్రంగా ఉండనుంది. వాణిజ్య సిలిండర్ ధర పెంపుతో వారి ఆదాయానికి గండి పడుతుంది. ఇప్పటికే సిలిండర్ ధరలతో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులకు మళ్లీ ధర పెరుగుదల శరాఘాతంలా మారింది.

హోటల్ కార్మికుల ఉపాధిపైనా ప్రభావం

హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్డు పక్కన నడిచే వీధి వ్యాపారాలపై ప్రభావం పడితే వాటిలో పనిచేసే కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారుతుంది. రెస్టారెంట్లు, హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు వ్యాపారం చేయలేకపోతే మొదట దెబ్బతినేది కార్మికులే. ఇప్పటికే ఆహార పదార్థాల ధరలు పెరిగినందున మరింత పెంచితే వినియోగదారులు కొనుగోళ్లు తగ్గిస్తారని, ధర పెంచకపోతే తాము నష్టపోతామని వ్యాపారులు వాపోతున్నారు. ఆహార పదార్థాల ధర పెరగడం ఒక్కటే కాదు.. గొలుసుకట్టులా చాలా వాటిపై గ్యాస్ ధర పెరుగుదల ప్రభావం చూపుతుంది.

గత్యంతరం లేదు.. ధరలు పెంచాల్సిందే: వ్యాపారులు

మధ్యస్థాయి హోటల్ లేదా రెస్టారెంట్ రోజుకు సగటున 2-5 సిలిండర్లు వినియోగిస్తుంది. దీంతో రోజుకు రూ.2-5వేల వరకు అదనపు భారం పడనుంది. ఇప్పటికే తక్కువ లాభాలతో నడుస్తున్న వ్యాపారాలపై ఒత్తిడి పెరుగుతుందని ఏపీ హోటల్, రెస్టారెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంపీ పవన్ కార్తీక్ పేర్కొన్నారు. ఆతిథ్య రంగంలో ఉపాధి, పర్యాటకాభివృద్ధికి కీలకంగా వ్యవహరిస్తున్న హోటళ్ల రంగంపై కొనసాగుతున్న ఒత్తిడి మొత్తం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని వ్యాఖ్యానించారు.

★ హోటల్ రంగాన్ని నిలబెట్టేందుకు గత్యంతరం లేని పరిస్థితుల్లో మెనూ ధరలను 10% వరకు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వీ స్వామి ప్రకటించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పన్ను రాయితీలు, సబ్సిడీ అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

★ వంటనూనెలు, పప్పులు, కూరగాయల ధరలకు తోడు గ్యాస్ ధర పెరగడంతో ఆహార పదార్థాల రేటు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వీధి వ్యాపారులు పేర్కొంటున్నారు.

రాష్ట్రంలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర (రూ.ల్లో)

ప్రాంతం	ఏప్రిల్ 30న	మే 1న
విజయవాడ	2,251	3,244
విశాఖపట్నం	2,153	3,200
అనంతపురం	2,268	3,259

★ రవాణా, ఇతరత్రా ఛార్జీల కారణంగా ప్రాంతాల మధ్య ధరల్లో వ్యత్యాసం ఉంటోంది.

అమరావతి నిర్మాణ ఖర్చుపై వైకాపా దుష్ప్రచారం

- జగన్‌పై ఎంఏ షరీఫ్ ధ్వజం



ఈనాడు, అమరావతి: "వైకాపా ప్రభుత్వంలో విశాఖ రుషికొండ మీద 1.40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మీకోసం విలాసవంతమైన ప్యాలెస్ కట్టుకున్నారు. అందుకు చదరపు అడుగుకు రూ.35,714 చొప్పున ఖర్చు పెట్టారు. మీ రాజభోగం కోసం రూ.700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. అలాంటి మీకు ప్రజా రాజధాని నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.6,980 వెచ్చిస్తే అభ్యంతరమేంటి?" అని వైకాపా అధినేత జగన్‌ను ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ ప్రశ్నించారు. మీరేమో ప్రజాధనంతో రాజభవనాలు కట్టుకోవచ్చు, ప్రజల కోసం ఖర్చుచేస్తే అవినీతి కనిపించిందా? అని ధ్వజమెత్తారు. అమరావతి నిర్మాణానికి చ.అడుగుకు ఖర్చు రూ.12వేలని ఓసారి, రూ.14వేలని మరోసారి వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం షరీఫ్ విలేకర్లతో మాట్లాడారు. 2021-22లో పూర్తయిన తెలంగాణ సచివాలయ నిర్మాణానికి చ.అడుగుకు రూ.6,500 చొప్పున ఖర్చుచేశారని గుర్తుచేశారు. "అప్పటి కంటే ఇప్పుడు నిర్మాణసామగ్రి ధరలు, ఖర్చులు బాగా పెరిగాయి. అయినా.. ఏపీ ప్రభుత్వం చ.అడుగుకు రూ.6,980 చెల్లిస్తోంది. తెలంగాణ విషయంలో లేని అభ్యంతరం... అమరావతి విషయంలోనే ఎందుకొచ్చింది? ఇది అమరావతిని అడ్డుకోవాలనే కుట్రలో భాగం కాదా?" అని జగన్‌ను ప్రశ్నించారు.

బూచిగా చూపే కుతంత్రం

"కూటమి ప్రభుత్వంలో అమరావతి నిర్మాణ పనులు అత్యంత పారదర్శకంగా, శరవేగంగా సాగుతున్నాయి. దీన్నిచూసి ఓర్వలేక వైకాపా నాయకులు అసత్యాలు మాట్లాడుతున్నారు. గతంలో మూడు రాజధానులని, ఇప్పుడు మావిగన్ అంటూ ప్రజల్ని గందరగోళానికి చేస్తున్నారు. రాజధాని మీద ఒక ప్రణాళికే లేని వైకాపాకు రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదు" అని ఎంఏ షరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ కొత్త భవన నిర్మాణానికి రూ.1200 కోట్లు ఖర్చయితే...రూ.970 కోట్లు మాత్రమే అయ్యిందంటూ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అక్కడి ఖర్చును తక్కువ చేసి... అమరావతిని బూచిగా చూపే కుతంత్రంలో ఇదంతా భాగమని ధ్వజమెత్తారు.

రాజధాని అంటే రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్

అమరావతి అంటే ఇటుకలు, సిమెంటు కాదని.... రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్ అని షరీఫ్ స్పష్టం చేశారు. "ప్రభుత్వం వద్ద ఉన్న 5వేల ఎకరాల మిగులుభూమి విలువే రూ.లక్షల కోట్లు ఉంటుంది. వీటిద్వారా వచ్చే ఆదాయంతో రుణాలు తీర్చే వెసులుబాటు ఉంది. తెలంగాణలో హైదరాబాద్ నుంచే 70% ఆదాయం వస్తోంది. ఆ నిధులతోనే అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అమరావతి విషయంలోనూ భవిష్యత్తులో అదే జరుగుతుంది" అని షరీఫ్ పేర్కొన్నారు.

ప్రియుడు ఫోన్ రీఛార్జ్ చేయించలేదని యువతి ఆత్మహత్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రియుడు ఫోన్ రీఛార్జ్ చేయించలేదని మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్‌లో జరిగింది. కుత్బుల్లాపూర్ ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్న కిరణ్మయి(26) 2015లో ప్రేమ వివాహం చేసుకుంది. భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో విడిపోయారు. తర్వాత కిరణ్మయి కూకట్‌పల్లిలో బ్యూటీషియన్ కోర్సు నేర్చుకొని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తోంది. ప్రైవేటు ఉద్యోగం చేసే వెంకటేశ్ ఎలియాస్ చందు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఏడాది నుంచి వారు ప్రశాంత్‌నగర్‌లో సహజీవనం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆమె ఫోన్ రీఛార్జ్ అయిపోయింది. ఆమెకు జీతం ఇంకా రాకపోవడంతో రీఛార్జ్ చేసుకోలేకపోయింది. వెంకటేశ్ కూడా రీఛార్జ్ చేయించకపోవడంతో శుక్రవారం ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది.

రాష్ట్రంలో ఎండతీవ్రత పెరుగుతోంది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో శుక్రవారం 45.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. 20 జిల్లాల్లోని 252 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం 64 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది.

మరింత కచ్చిత వాతావరణ సమాచారానికి విస్తృత పరిశోధన

- కేంద్ర భూవిజ్ఞానశాఖ కార్యదర్శి రవిచంద్రన్
- ఏయూలో అత్యాధునిక పరిశోధన, పరీక్ష కేంద్రం ప్రారంభం



శిలాఫలక ఆవిష్కరణలో రవిచంద్రన్ తదితరులు

ఈనాడు, విశాఖపట్నం- ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మరింత లోతైన, కచ్చితమైన సమాచారం నిమిత్తం ఏయూ కేంద్రంగా తీర ప్రాంత వాతావరణ పరిశోధన, పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి రవిచంద్రన్ తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం-పుణె) ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో 'ఓపెన్ ఫీల్డ్ అబ్జర్వేటరీ ఆఫ్ కోస్టల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ టెస్ట్ బెడ్ (సి-కార్ట్)'ను వీసీ రాజశేఖర్‌తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 'ఈ పరీక్ష కేంద్రం ద్వారా వచ్చే సమాచారాన్ని సాంకేతికంగా పరిశోధించి మెరుగైన వాతావరణ సమాచారం అందించేందుకు వీలవుతుంది. ఏయూ వాతావరణ విభాగానికి ఐఐటీఎం ద్వారా పరిశోధనా నైపుణ్యం తోడవ్వడం గర్వకారణం. భవిష్యత్తులో ఈ భాగస్వామ్యం మరిన్ని గొప్ప ఆవిష్కరణలకు నాంది పలుకుతుంది' అని పేర్కొన్నారు. ఐఐటీఎం సంచాలకుడు డాక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ.. 'ఆధునిక శాస్త్ర, సాంకేతికతతో వాతావరణాన్ని ముందుగానే అంచనా వేయడం, ప్రభావాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇక్కడ ఏర్పాటు చేసిన పరికరాలు వాతావరణ పరిస్థితులను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు సహాయ పడతాయి. తుపాన్ల తీవ్రత అంచనా వేయడం మెరుగవ్వడంతో పాటు మత్స్యకారులు, రైతులు, విపత్తు నిర్వహణ సంస్థలకు ముందస్తు హెచ్చరికలివ్వడం సులువవుతుంది' అని అన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.60 కోట్ల విలువైన పరికరాలు సమకూరాయని, ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఐఐటీఎం ప్రాజెక్టు డైరెక్టర్ పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ సమాచారం అందరికీ అర్థమయ్యేలా 'మౌసమ్ వాణి'

- త్వరలో అందుబాటులోకి
- ఐఐటీఎం సంచాలకుడు సూర్యచంద్రరావు



ఈనాడు, విశాఖపట్నం: "వాతావరణ భాష రైతులకు అర్థం కావట్లేదు. స్థానిక భాషల్లో లేకపోవడంతో సమాచారం వారికి వెళ్లట్లేదు. ఈ సమస్య పరిష్కారానికి చాట్‌జీపీటీ తరహా అప్లికేషన్‌ను ఐఐటీఎం రూపొందించింది. దీనికి 'మౌసమ్ వాణి' అని పేరు పెట్టాం" అని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం-పుణె) సంచాలకుడు సూర్యచంద్రరావు పేర్కొన్నారు. ఏయూలో తీర ప్రాంత వాతావరణ పరిశోధన, పరీక్ష కేంద్ర ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 'రెండు, మూడువారాల్లో మౌసమ్ వాణిని ప్రారంభిస్తున్నాం. దీనిని చాట్‌జీపీటీలా వాడొచ్చు. ఫోన్ చేసైనా సమాచారం తెలుసుకోవచ్చు. ఎరువులు వేయడానికి ఇది సరైన సమయమేనా.. వర్షం ఏమైనా పడుతుందా, గొడుగు తీసుకువెళ్లాలా అనే ప్రశ్నలు రైతులు వేస్తే వెంటనే సమాధానం ఇస్తుంది. ఇది వస్తే వాతావరణ సమాచారాన్ని చాట్‌జీపీటీ తరహాలో అందిస్తున్న మొదటి దేశంగా మనం నిలుస్తాం. హిందీ, ఆంగ్ల భాషల్లో మొదట ప్రారంభించి తర్వాత అన్ని ప్రాంతీయ భాషల్లో తీసుకొస్తాం. రుతుపవనాల ప్రభావం దేశంపై ఎలా ఉండొచ్చన్నది ఇప్పుడే చెప్పలేం. జులై, సెప్టెంబరు నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడొచ్చు' అని చెప్పారు.

పెళ్లింట విషాదం

విద్యుత్తు షాక్‌తో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



సతీష్

సంతకవిటి, న్యూస్‌టుడే: మరికొన్ని గంటల్లో సోదరుడి పెళ్లి. ఇల్లంతా పచ్చని తోరణాలతో, బంధువులతో కళకళలాడుతోంది. ఇంతలో విద్యుత్తు అలంకరణ తీగలు యమపాశమయ్యాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పొట్టనపెట్టుకున్నాయి. ఈ హృదయవిదారక ఘటన విజయనగరం జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సంతకవిటి మండలం మిర్తివలసకు చెందిన పొన్నాడ రమణ, పుష్పలత దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు రాజేష్ సివిల్ ఇంజినీరుగా, రెండో కుమారుడు సతీష్, మూడో కుమారుడు దీపక్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. మొదటి ఇద్దరి వివాహాలు అయ్యాయి. నెల్లూరుకు చెందిన యువతితో చిన్న కుమారుడు దీపక్‌కుమార్ పెళ్లి శుక్రవారం చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. తమ్ముడి పెళ్లి పనులు చేసేందుకు సతీష్ (32) శుక్రవారం వేకువజామున 3 గంటలకు లేచాడు. స్నానం చేసి, తడి దుస్తులు మేడమీద గోడపై ఆరబెట్టేందుకు వెళ్లాడు. ఇంటి అలంకరణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలపై దుస్తులు పడడంతో షాక్‌కు గురయ్యాడు. చీకటిగా ఉండటంతో కుటుంబసభ్యులకు విషయం తెలియలేదు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో వారు వెళ్లి చూశారు. కొన ఊపిరితో ఉన్న సతీష్‌ను వెంటనే శ్రీకాకుళంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఈ నెలలో కాస్త ఉపశమనం

అనేక చోట్ల సాధారణం కన్నా ఎక్కువ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: ఎండల తీవ్రత అధికంగా ఉండే మే నెలలో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురవనున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. ఈశాన్య, మధ్యభారతంలోని కొన్ని ప్రాంతాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు, ఉరుములు సంభవించనున్నాయి. దీంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవ్వనున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ దాదాపుగా ఇదే పరిస్థితులు కొనసాగనున్నాయి. ఏపీలోని ఉత్తర, మధ్య కోస్తాలోని పగటి ఉష్ణోగ్రతలు సాధారణం, అంతకన్నా తక్కువగా, దక్షిణ కోస్తా, రాయలసీమలోని ఎక్కువ ప్రాంతాల్లో కాస్త ఎక్కువగా నమోదవుతాయి. అదే సమయంలో రాష్ట్రంలో వడగాలుల ప్రభావం ఉండనుంది. కోస్తా, రాయలసీమలో సగటున మూడు నుంచి నాలుగు రోజులు వడగాలులు వీస్తాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ప్రకాశం, నెల్లూరు తిరుపతి జిల్లాల్లో సాధారణం కన్నా ఆరు నుంచి ఏడు రోజులు ఎక్కువగా వడగాలులు ఉండొచ్చు. ఏలూరు, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, బాపట్ల, పల్నాడు, గుంటూరులో మూడు నుంచి నాలుగు, కాకినాడ, తూర్పుగోదావరి, రాయలసీమలో సాధారణం కంటే ఒకటి నుంచి రెండు రోజులు ఎక్కువగా వడగాలులు వీయొచ్చని ఐఎండీ పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

2-5-2026 శనివారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, బహుళ పక్షం
పాడ్యమి: రా. 11-01 తదుపరి విదియ
విశాఖ: తె. 5-38 తదుపరి అనూరాధ
వర్జ్యం: ఉ. 9-31 నుంచి 11-16 వరకు
అమృత ఘడియలు: రా. 8-01 నుంచి 9-45 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-38 నుంచి 7-18 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.38; సూర్యాస్తమయం: సా.6.15
అన్నమాచార్య జయంతి

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	43.0	27.5
విజయవాడ	42.9	28.8
నెల్లూరు	42.6	29.6
అనంతపురం	41.6	28.2
కర్నూలు	41.4	28.7
విశాఖపట్నం	34.4	29.2
విజయనగరం	33.0	15.0
తిరుపతి	31.9	25.8
శ్రీకాకుళం	31.0	26.0

వేలిముద్రలతో బొమ్మలు!



మనకు బొమ్మలు గీయడం అంటే ఎంతో ఇష్టం కదూ! పెన్సిళ్లు, పెన్నులు, రంగు రంగుల కాగితాలతో నచ్చిన బొమ్మ గీస్తుంటాం. కానీ కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా సరిగ్గా రావు కదా.. అలా కాకుండా మన వేలిముద్రలతోనే సులభంగా బొమ్మలు గీయొచ్చని మీకు తెలుసా?

దీనికోసం మనకు రంగులు/స్కెచ్‌లు, కొన్ని కాగితాలు, మార్కర్/పెన్ను వంటివి కావాలి.

సెలవుల్లో సరదాగా!

1. మీ వేలిని నచ్చిన రంగుకి మెల్లగా అద్దండి.
2. కలర్ అంటుకున్న వేలిని కాగితంపై గట్టిగా నొక్కి ముద్ర వేయాలి.
3. రంగు పూర్తిగా ఆరే వరకు కాస్త కదిలించకుండా ఆగండి.
4. పెన్ను లేదా మార్కర్‌తో ఆ వేలిముద్రకు ఆకారం ఇచ్చే సరి.

రకరకాల కీటకాలు, సీతాకోక చిలుకలు, చెట్లు, పూలు.. ఇలా అన్నింటినీ సులభంగా గీయొచ్చు.

చిట్టి చేతులకు.. సీతాకోకచిలుక

సీతాకోకచిలుకలు చూడగానే ముద్దొచ్చేలా ఉంటాయి కదా.. అలాంటి బటర్‌ఫ్లై మన చేతి మీద వాచీలా ఉంటే ఎలా ఉంటుంది? దాన్ని బ్రేస్‌లెట్‌లా పెట్టుకుంటే ఇంకా బాగుంటుంది కదా.. అయితే చేసేద్దామా మరి!



- ఒక కాగితంపై సీతాకోకచిలుక బొమ్మను గీసి, దాని రెక్కల మీద చిన్న చిన్న డిజైన్లతో అందంగా మెరుపులు వేయాలి.
- తర్వాత ఆ భాగాన్ని కత్తెర సాయంతో బటర్‌ఫ్లై ఆకారంలో కత్తిరించాలి.
- ఇప్పుడు మరో పొడవాటి కాగితాన్ని తీసుకుని, మన చేతి చుట్టూ వచ్చేలా పట్టీలా కత్తిరించాలి.
- సీతాకోకచిలుకను ఈ పట్టీ మధ్యలో ఉంచి గమ్‌తో అంటించాలి. అంతే మన బ్రేస్‌లెట్ రెడీ.

మరో 4 ఈఎస్‌ఐ ఆసుపత్రులు

(మొదటి పేజీ తరువాయి)

మాయిస్తామని తెలిపారు. పని ఉంటే వెళ్తారని, లేనప్పుడు నైపుణ్య శిక్షణ పొందే ఏర్పాటు చేస్తామన్నారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో ప్రజావేదికలో భాగంగా ఏర్పాటుచేసిన 'పేదల సేవలో', 'మే డే' కార్యక్రమాల సభలో ముఖ్యమంత్రి శుక్రవారం మాట్లాడారు. ప్రధానాంశాలివీ..

అసంఘటిత రంగ కార్మికుల కోసం ఏటా రూ.615 కోట్లు

'ఎన్టీఆర్ కార్మికుల కష్టాన్ని గుర్తించే.. తెలుగుదేశం పార్టీ గుర్తులో నాగలి, కార్మికుడు, గుడిసె లాంటి చిహ్నాలు పెట్టారు. ఒకటో తేదీ అంటే ప్రభుత్వానికి, తనకు గుర్తొచ్చేది పేదల సేవే. వారి రుణం తీర్చుకునేందుకే కష్టపడుతున్నాం. గత 22 నెలలుగా రాష్ట్ర పునర్నిర్మాణం కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఇప్పటి వరకూ 62.47 లక్షల మందికి రూ.63,188 కోట్లను పింఛన్ రూపంలో అందజేశాం. ఒకటో తేదీ కోసం ప్రతి నెలా రూ.2,721 కోట్లను ముందుగానే పింఛన్లకు సిద్ధంగా పెట్టుకుంటున్నాం. రాష్ట్రంలోని 88 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ఏటా రూ.615 కోట్లు ఖర్చు చేస్తున్నాం. కార్మికులు, పేదల కోసమే 263 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశాం.

లక్ష మంది కార్మికులకు నైపుణ్య శిక్షణ

పోలవరం, అమరావతి నిర్మాణం, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్, వ్యవసాయంలో అగ్రిటెక్.. వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. విశాఖలో గూగుల్ సంస్థ దేశంలోనే అతిపెద్ద పెట్టుబడి రూ.1.40 లక్షల కోట్లను పెడుతోంది. ఇది చూశాక రిలయన్స్ జియో రూ.1.70 లక్షల కోట్లు పెడతామని ముందుకొచ్చింది. కష్టజీవులకు చేతినిండా పని ఉంటోంది. లక్ష మందికి నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. నిర్మాణ రంగ కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.25 వేలు ఇస్తాం. పిల్లలు పుడితే.. అతని భార్య, కుమార్తెకు రూ.20వేలు ఇస్తాం. ఎవరైనా చనిపోతే రూ.80 వేలు ఇస్తాం.

పింఛన్ల పంపిణీపై 93 శాతం సంతృప్తి

నేను ఒక టీం లీడర్‌ను. జట్టులో సభ్యులంతా సరిగా పనిచేస్తేనే నేను విజయం సాధించినట్టు. నా టీంలో మహిళా అధికారి కరుణ.. ప్రతి నెలా 1న 1.66 లక్షల మంది ఉద్యోగులతో ఒక్క రూపాయి అవినీతి లేకుండా పింఛను సరిగా ఇవ్వగలుగుతున్నాం. పింఛన్ల పంపిణీ బాగుందని అత్యధికంగా 93 శాతం సంతృప్తి స్థాయి వచ్చింది.



కృష్ణా జిల్లా పమిడిముక్కలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడి చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బందితో ముచ్చటించారు. వారితో ఇలా ఫొటో దిగారు

33 శాతం రిజర్వేషన్లను సాధించి తీరతాం

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ఇప్పుడు అడ్డుకున్నా.. తప్పకుండా భవిష్యత్తులో సాధించి తీరతాం. ఆడబిడ్డలు ఎక్కువ మంది ఉంటే.. చట్టసభలకు కళ వస్తుంది. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలి. డ్వాక్రా మహిళలు ఇప్పుడు రూ.28 వేల కోట్లను కార్పస్ సేవింగ్స్‌గా పెట్టుకున్నారు. గత ఏడాది లక్ష మందిని ఎంఎస్ఎంఈలుగా పెట్టించాం. ఈ ఏడాది లక్ష మందిని పెట్టిస్తాం.

డిసెంబర్ నాటికి బందరు పోర్టు పూర్తి

2028లో వచ్చే కృష్ణా పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం.. ఇబ్బంది లేకుండా చేస్తాం. బందరుపోర్టు పనులు 57 శాతం పూర్తయ్యాయి. వచ్చే డిసెంబర్ నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టాం. భారత్‌మాల పథకంలో భాగంగా మచిలీపట్నం బైపాస్, విజయవాడ-మచిలీపట్నం రహదారులను ఆరు లేన్లుగా విస్తరణ జరుగుతోంది.

ఉత్తమ కార్మికులకు సీఎం చేతుల మీదుగా శ్రమశక్తి పురస్కారాలు

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా.. అత్యుత్తమ సేవలు అందించిన కార్మికులు, యాజమాన్యాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా శ్రమశక్తి పురస్కారాలు అందజేశారు.

నాశనం చేయడమనేది జగన్ మానసిక సమస్య

జగన్‌ది వైకాపా కాదు.. గొడ్డలి, కోడికత్తి పార్టీ. ఆయనకు ఒక మానసిక సమస్య ఉంది. అందరినీ మోసం చేయడం.. అవకాశం ఇస్తే అందరినీ నాశనం చేయడం. గద్దెనెక్కిన తొలిరోజే ప్రజావేదికను కూల్చేశారు. మేం కష్టపడి పోలవరం 72 శాతం పూర్తిచేస్తే నాశనం చేశారు. మళ్లీ మీరు ఆయన్ను నమ్మితే.. నేను అభివృద్ధి చేయడం, ఆయనొచ్చి విధ్వంసం చేయడం ఇదే జరుగుతుంది.

పురస్కారాలు అందుకున్న కార్మికులు

- ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్ కార్మికుడు ఎస్.పోతురాజు
- బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఐటీసీ కంపెనీ కార్మికుడు కె.రామకృష్ణ
- కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్మలూరులోని 1947 ఐఎన్‌సీ కంపెనీకి చెందిన పిల్లా జ్యోతి
- కర్నూలు జిల్లా గొండిపర్లలోని శ్రీ రాయలసీమ హైపో ప్లాంట్‌కు చెందిన ఎం.రవికుమార్

ఉత్తమ యాజమాన్య పురస్కార గ్రహీతలు

- కృష్ణా జిల్లా పెద్దఅవుటపల్లిలోని హైటెక్ ఫ్రిర్ సిస్టమ్స్ లిమిటెడ్ డైరెక్టర్ కె.సుమంత్
- కృష్ణా జిల్లా పామర్రు మండలం కురుమద్దాలిలోని సామ్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ఎల్ఎల్‌పీ సంస్థ సీఎండీ వి.సాంబశివరావు
- కృష్ణా జిల్లా బొమ్మలూరులోని దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కె.అప్పారావు

ఇదిగో లేబర్ అడ్డా



పమిడిముక్కల సభా ప్రాంగణం వద్ద సీఎం పరిశీలనార్థం ఏర్పాటు చేసిన లేబర్‌అడ్డా నమూనా ఇది. ప్రభుత్వం సమీకృత కార్మిక సౌకర్యాల సముదాయాలు (లేబర్ అడ్డా)లను విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, నెల్లూరు నగరాల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయనుంది. వీటిలో కార్మికులకు అవసరమైన మౌలిక వసతులతో పాటు ప్రతిరోజూ పని దొరికేలా ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించారు.



తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ

తిరుమల, న్యూస్‌టుడే: చైత్రమాస పౌర్ణమిని పురస్కరించుకుని తిరుమలలో శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా గరుడసేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ కేంద్రం

- రూ.15,000 కోట్లతో ఏర్పాటు చేయనున్న డీఆర్‌డీవో
- రక్షణరంగ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా

ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి సమీపంలో రూ.15,000 కోట్ల పెట్టుబడితో ఐదో తరం (ఫిఫ్త్ జనరేషన్) స్టెల్త్ యుద్ధ విమాన ప్రాజెక్టు ఏర్పాటుకానుంది. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎఎంసీఏ)లు ఇక్కడ తయారుకానున్నాయి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ రక్షణ పరిశోధన, పరిశోధన సంస్థ (డీఆర్‌డీవో) దీన్ని ఏర్పాటుచేయనుంది. ఇందుకోసం డీఆర్‌డీవోకు 600 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. భారత వైమానిక, నౌకాదళాల కోసం ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ మోడల్‌ను రూపొందించింది. దేశ రక్షణ అవసరాలకు వాటిని వినియోగించనున్నారు. సంస్థకు అనుబంధంగా యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. ప్రాజెక్టుకు సమీపంలోనే మరో 400 ఎకరాలను ప్రభుత్వం వాటికోసం అందుబాటులో ఉంచనుంది. ఈ నెల 15న ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం.

2029 నాటికి అందుబాటులోకి నమూనా

ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి.. దీని మొదటి నమూనా (ప్రోటోటైప్) 2029 నాటికి అందుబాటులోకి తీసుకురావాలన్నది రక్షణ శాఖ లక్ష్యం. మొత్తంగా ఐదు ప్రోటోటైప్‌లను అభివృద్ధి చేయాలన్నది ఆలోచన. ఇందులో అత్యాధునిక సాంకేతికతతో కూడిన రెండు ఇంజిన్లు ఉంటాయి. దీని బరువు 25 టన్నుల వరకు ఉంటుంది. లోపలి భాగంలో ఆయుధాలను అమర్చుకునే సదుపాయం, అధునాతన ఏఐ ఆధారిత సెన్సర్లతోపాటు సూపర్ క్రూయిజ్ సామర్థ్యం ఉంటుంది. సుఖోయ్ ఎస్‌యూ-30 యుద్ధ విమానాలకు ప్రత్యామ్నాయంగా స్వదేశీ సాంకేతికతతో యుద్ధ విమానాన్ని తయారుచేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. దీని ద్వారా 2035 నాటికి పూర్తిస్థాయిలో ఎయిర్‌క్రాఫ్ట్‌లు తయారుచేయాలన్నది ఆలోచన.

డిఫెన్స్.. ఏరోస్పేస్ క్లస్టర్‌గా శ్రీసత్యసాయి జిల్లా

శ్రీసత్యసాయి జిల్లా భవిష్యత్తులో ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ క్లస్టర్‌గా మారనుంది. రక్షణ రంగానికి అవసరమైన యుద్ధ విమానాలు, రాడార్ల వంటి కీలక ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రానుంది. ఇప్పటికే రక్షణ రంగానికి సంబంధించిన పలు భారీ ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వీటితోపాటు భారతదేశపు అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఏఎంసీఏ)ల తయారీ కేంద్రం కూడా ఏర్పాటుకానుండటం గమనార్హం.

- ఇప్పటికే పాలసముద్ర దగ్గర భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) భారీ డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనికి సుమారు 1,000 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ సంస్థ రూ.500 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయనుంది. క్షిపణి వ్యవస్థలు, రాడార్లు, ఏరోస్పేస్ రంగానికి అవసరమైన ఉత్పత్తులను తయారుచేయనుంది.
- భారత్‌ఫోర్జ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ మడకశిరలో భారీ డిఫెన్స్ ఎనర్జెటిక్స్ తయారీ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే 1,000 ఎకరాలను కేటాయించింది. రక్షణరంగానికి అవసరమైన పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రి, గన్ ప్రొపెల్లెంట్లను ఇక్కడ తయారు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.2,500 కోట్లను సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది.

బెంగళూరు విమానాశ్రయానికి దగ్గరగా..

ప్రాజెక్టు ఏర్పాటుచేసే ప్రాంతానికి 90 కి.మీ. లోపు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఉంటుంది. దీంతోపాటు పుట్టపర్తిలో ఇప్పటికే విమానాశ్రయం ఉంది. దీన్ని కూడా అవసరాల కోసం వినియోగించుకునే అవకాశం ఉంది. బెంగళూరులో విస్తరణకు అవకాశం లేకపోవడంతో పలు సంస్థలు రక్షణరంగ ప్రాజెక్టుల ఏర్పాటుకు శ్రీసత్యసాయి జిల్లా వైపు చూస్తున్నాయి. దీన్ని అందిపుచ్చుకునేలా ప్రభుత్వం భూములను అందుబాటులో ఉంచింది. యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టుకు అనుబంధ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా భవిష్యత్తులో కనీసం రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని అధికారుల అంచనా.





ఎల్వీ ప్రసాద్ ఐకేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో జాస్తి వెంకట్, జీఎన్ రావు, సత్యకుమార్ యాదవ్, వెనిగండ్ల రాము, బాలశౌరి తదితరులు
★ గుడ్లవల్లేరులో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఐకేర్ సెంటర్

గ్రామాల్లో నేత్ర వైద్య సేవలు అభినందనీయం

- గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐకేర్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

గుడివాడ, న్యూస్‌టుడే: లాభాపేక్ష లేకుండా ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో నేత్రవైద్య సేవలు అందిస్తున్న ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ గుడ్లవల్లేరు లాంటి గ్రామీణ ప్రాంతాల్లోనూ సేవలు ప్రారంభించడం అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని పెంజేంద్ర రోడ్డులో జాస్తి సుబ్బారావు, పోలవరపు సత్యనారాయణ మెమోరియల్ ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ ఐకేర్ సెంటర్‌ను ఆయన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ జీఎన్ రావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ ఛైర్మన్ జాస్తి వెంకట్ ఈ ఐకేర్ సెంటర్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం 4 లక్షల క్యాటరాక్ట్ సర్జరీలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు చేస్తామన్నారు. ఐకేర్ సెంటర్‌లో చంద్రబాబు నేత్రవైద్య పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న సీఎం చంద్రబాబు

అమెరికా-ఇరాన్ మధ్య కుదరని సయోధ్య

వాషింగ్టన్, దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధానికి శుభంకార్డు ఇప్పట్లో పడేలా కనిపించడం లేదు! సంక్షోభ పరిష్కారం కోసం జరిగిన మరో ప్రయత్నం తాజాగా విఫలమైంది. శాంతి చర్చలపై అనిశ్చితి కొనసాగుతున్నవేళ.. యుద్ధం విరమణ దిశగా అమెరికాకు ఇరాన్ నూతన ప్రతిపాదన సమర్పించింది. అయితే అది తనకు సంతృప్తికరంగా లేదని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. టెహ్రాన్ నాయకత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయని.. దానితో ఒప్పందం కుదురుతుందో లేదో చెప్పలేనని వ్యాఖ్యానించారు. మరోవైపు- ఇరాన్‌పై దాడులకు తమ ముందున్న అవకాశాలన్నింటినీ ట్రంప్ అధికారులతో సమీక్షించడం.. ఇజ్రాయెల్‌కు 24 గంటల వ్యవధిలో 6,500 టన్నుల సైనిక సామగ్రిని చేరవేయడం వంటి పరిణామాలు ఉద్రిక్తతలు మరింత పెరగొచ్చన్న ఆందోళన కలిగిస్తున్నాయి. ఇరాన్ ప్రయోగించే డ్రోన్‌లు, క్షిపణులను భస్మం చేయగల "ఐరన్ బీమ్" అనే లేజర్ ఆయుధాన్ని యూఏఈకి ఇజ్రాయెల్ తాజాగా విక్రయించింది.

- ఇరాన్ విషయంలో సైనికపరంగా తమ ముందున్న కొత్త ఐచ్ఛికాలను ప్రత్యేక సమీక్షలో ట్రంప్‌నకు అమెరికా కమాండర్లు వివరించారు. హర్మూజ్ సమీపంలోని దీవులకు సైనికులను తరలించడం, 60% శుద్ధి చేసిన యురేనియంను స్వాధీనం చేసుకునేందుకు ఇస్ఫహాన్‌లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టడం, స్వల్పకాలంలో భారీ దాడులు చేయడం వంటివి ఇందులో ఉన్నాయి. కాగా పశ్చిమాసియాలో మోహరించి ఉన్న అమెరికా విమానవాహక నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్' ఎట్టకేలకు అక్కడి నుంచి వెనుదిరగటం గమనార్హం.

పాక్ ద్వారా చేరవేత

దిగ్బంధనాన్ని తొలగించి, అణు చర్చలను వాయిదా వేస్తే.. యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధమంటూ ఇరాన్ గతంలో ప్రతిపాదించింది. దాన్ని ట్రంప్ తిరస్కరించారు. దీంతో- సవరించిన ప్రతిపాదనను పాకిస్థానీ మధ్యవర్తుల ద్వారా అమెరికాకు ఇరాన్ గురువారం సాయంత్రం సమర్పించింది. అందులోని వివరాలు పూర్తిగా బయటకు రాలేదు.

ఐఆర్‌జీసీ వర్సెస్ అధ్యక్షుడు?

ట్రంప్ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తున్నట్లుగా... ఇరాన్‌లో సైన్యం, ఎన్నికైన రాజకీయ నాయకత్వం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. యుద్ధం వేళ.. ఇరాన్‌లో కీలక నిర్ణయాలన్నీ తామే తీసుకుంటామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) చెబుతుంటే, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ వర్గం అలా కుదరదంటోంది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అనుసరిస్తున్న వైఖరితో అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా విదేశాంగ మంత్రి అరాగ్చీ.. ఐఆర్‌జీసీకి అనుకూలంగా వ్యవహరించడంపై పెజెష్కియాన్ ఆగ్రహంగా ఉన్నారని ఇరాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఆత్మవిశ్వాసం.. ఎవరెస్టంత!

- బేస్ క్యాంపును అధిరోహించి.. భేష్ అనిపించుకుని..
- రాష్ట్రానికి తిరిగి వచ్చిన దివ్యాంగ విద్యార్థులు



ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించిన విద్యార్థులతో ఎస్ఎస్ఏ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: వారంతా దివ్యాంగులు... పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు.. మొత్తం 21 మంది. మైనస్ 5 నుంచి 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు... గడ్డ కట్టించే చలి.. అయినా భయపడలేదు. ఒక్కో అడుగూ ముందుకే వేశారు. బూట్లలోకి మంచు చేరి కాళ్లకు బొబ్బలు వచ్చినా.. చలికి గోళ్లు లేచిపోయినా లెక్క చేయలేదు. ఆక్సిజన్ అందక... ఊపిరాడని పరిస్థితులకూ ఎదురొడ్డారు. ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలే అందరిలోనూ. చివరికి అనుకున్నది సాధించారు. ఎవరెస్ట్ బేస్‌క్యాంపును అధిరోహించారు. సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో మంచులో నిలుచుని జాతీయజెండాను ఎగరేశారు. ఏపీ సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ సాహసం చేసి... శుక్రవారం విజయవాడ తిరిగి వచ్చారు. ఈ బృందాన్ని ఎస్ఎస్ఏ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అభినందించారు. ఈ యాత్రలో ఎంతో నేర్చుకున్నామని... సరికొత్త లోకాన్ని చూశామని ఆనందం వ్యక్తంచేశారు. తమకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా గుండెధైర్యం చెదరకూడదని, ఒకరికి ఒకరు తోడుగా పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలనే పాఠాలను నేర్చుకున్నట్లు చెప్పారు. వీరి తల్లిదండ్రులందరూ దినసరి కూలీలే.

పట్టుదలగా ముందుకు..

– సింధు, చంద్రగిరి, తిరుపతి



బేస్ క్యాంపు ఎక్కేందుకు పట్టుదలతో ముందుకు సాగాను. అధిరోహణకు ఏడు రోజులు.. తిరిగి వచ్చేందుకు మరో 3రోజులు పట్టింది. ఈ పదిరోజులూ స్నానం చేయలేదు. ఆక్సిజన్ సరిగా అందక ఊపిరాడనప్పుడు భయమేసింది. ఒక్కోసారి వికారం... తలనొప్పి వంటి సమస్యలు వచ్చాయి. ఈ విజయం ఎంతో ఆనందాన్నిచ్చింది.

ఆ సంతోషాన్ని మరచిపోను..

– పవన్ ప్రసాద్, మార్పురివాండ్లపల్లి, శ్రీసత్యసాయి జిల్లా



ఇంట్లో నుంచి బయటకు రావడం ఇదే తొలిసారి. ఎవరెస్ట్ దగ్గర చలి వాతావరణానికి తట్టుకోలేకపోయాను. కాళ్లకు బొబ్బలు వచ్చాయి.. వాంతులు అయ్యాయి. నేను చాలా విషయాలను మరచిపోతుంటాను. బేస్ క్యాంపునకు చేరుకుని.. జాతీయ జెండాను ఎగరేసినప్పుడు కలిగిన సంతోషాన్ని మాత్రం ఎప్పటికీ మరచిపోను.

మొదటిసారి ఒంటరిగా...


– తలారి మధు మనోజ్, కొలిమిగుండ్ల, నంద్యాల జిల్లా



ఇల్లు, బడి.. ఇవే నా లోకం. మొదటిసారి ఇంట్లో వారి సహాయం లేకుండా బయటకు వచ్చాను. తోటివారితో కలిసి సాహసయాత్ర పూర్తిచేశాను. వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదని ఎంత కష్టమైనా గెలవాలని నేర్చుకున్నా. మొదట్లో ఇచ్చిన కఠిన శిక్షణ మాకు ఎంతో ఉపయోగపడింది.

రాబోయే రోజుల్లో వేరుగా ఉంటుంది

- మేమనుకుంటే జగన్ సార్ దాకా అవసరం లేదు
- ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి బెదిరింపులు



వీరేశ్

ఈనాడు, కర్నూలు, ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: భీమా కుటుంబం గురించి మాట్లాడితే రాబోయే రోజుల్లో వేరుగా ఉంటుందని ఓ వ్యక్తి కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి తీవ్ర హెచ్చరిక చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం హల్‌చల్ చేసింది. ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తండ్రి పేరు భీమిరెడ్డి. సాయిప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులను స్థానికంగా భీమా కుటుంబంగా పేర్కొంటారు. భీమా కుటుంబంలో ఎవరి జోలికి వెళ్లినా రాబోయే రోజుల దాకా అవసరం లేదని.. ఎప్పుడు కావాలంటే అప్పుడు వేరుగా ఉంటుందని ఆ వ్యక్తి హెచ్చరించారు. తాము అనుకుంటే విషయం జగన్ దాకా అవసరం లేదని, గుర్తుపెట్టుకోవాలని పేర్కొన్నారు. 'భీమా కుటుంబంలో ఒక్కరు గెలిచినా మమ్మల్ని కాపాడతారు. మనోజ్‌రెడ్డి గురించి, మా రెడ్డి గురించి గానీ మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండు. ఆయన ఆదోనికి పెద్దాయన. మా జోలికి రావద్దు. మేము మీ జోలికి వస్తే తట్టుకోలేవు. భీమా కుటుంబం కోసం గొంతు కోసుకుంటారు. మీ కోసం ప్రాణం ఇచ్చే వారు కూడా లేరు' అని హెచ్చరించారు. వీడియోలో మాట్లాడిన వ్యక్తి మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడుబూరు మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన వీరేశ్‌గా గుర్తించారు. ఆదోని మూడోపట్టణ పోలీసుస్టేషన్‌లో వీరేశ్‌పై కేసు నమోదు చేశారు.

- ఈ వీడియో విషయమై ఎమ్మెల్యే పార్థసారథి మీడియాతో మాట్లాడారు. ప్రజలను భయపెట్టి బతుకుదామనుకునేవారే ఇలాంటి బెదిరింపులకు పాల్పడతారన్నారు. వైకాపా వారు చేసిన అన్యాయాలు, అక్రమాలు, కబ్జాలపై చట్టబద్ధంగా తాను పోరాడుతానని తేల్చిచెప్పారు.

హెచ్‌ఏఎల్ నూతన సీఎండీగా రవి



బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)కు 22వ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.రవి నియమితులయ్యారు. ఇప్పటి వరకు సీఎండీగా సేవలు అందించిన డాక్టర్ కె.సునీల్ నుంచి గురువారం ఆయన బాధ్యతలు తీసుకున్నారని సంస్థ శుక్రవారం ప్రకటించింది. హెచ్‌ఏఎల్‌లో మూడు దశాబ్దాలుగా తయారీ, డిజైనింగ్, ఎలక్ట్రానిక్స్ తదితర విభాగాల్లో రవి సేవలు అందించారు. ఏరోస్పేస్, రక్షణ విభాగం, ఆవిష్కరణ, కృత్రిమ మేధస్సు తదితర విభాగాల్లో హెచ్‌ఏఎల్‌ను ప్రపంచ స్థాయిలో నిలబెట్టడానికి సేవలు అందిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

25 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 25 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

స్వావలంబనకు పటిష్ఠ ప్రణాళిక!

సగటు భారతీయులకు పోషకాల పరంగా కీలక వనరులు పప్పుధాన్యాలే. మనకు అత్యవసరమైన ప్రొటీన్‌లో పాతికశాతం వాటి నుంచే అందుతుంది. సామాన్యుల ఆహారంలో విడదీయలేని భాగమైన అపరాల విషయంలో పరాధీనత మాత్రం దేశానికి అనేక విధాలుగా నష్టదాయకమవుతోంది. 2024-25లో భారత రైతాంగం 2.5 కోట్ల టన్నుల పప్పులను పండించింది. కానీ, నానాటికీ పెరుగుతున్న అవసరాలకు ఈ దిగుబడులు ఏమాత్రం సరిపోవట్లేదు. దాంతో, అనివార్యంగా దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో 2024-25లో ఇండియా సుమారు 73 లక్షల టన్నుల పప్పుధాన్యాలను విదేశాల నుంచి తెప్పించుకుంది. అందుకోసం రూ.46వేల కోట్లు ధారపోసింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే దిగుమతులు 50శాతం దాకా అధికమయ్యాయి. పరాయి దేశాలపై ఆధారపడే దురవస్థను తప్పించి రాబోయే అయిదేళ్లలో పప్పుధాన్యాలలో స్వయంసమృద్ధి సాధించేందుకు కేంద్రం ఇప్పటికే ప్రత్యేక పథకాన్ని తెచ్చింది. అందుకోసం రూ.11వేల కోట్లకు పైగా ప్రత్యేకించింది. నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవస్థాగతంగా జరగాల్సిన కృషి ఏమిటో ఇక్రిశాట్ నివేదిక తాజాగా పూసగుచ్చింది. సాగు సమస్యలూ అస్థిర ధరలకు సహేతుక పరిష్కారాలు చూపిస్తూ, సేకరణ విధివిధానాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తేనే అపరాల్లో స్వావలంబన సాధ్యపడుతుంది.

మన దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితులు, నేలల్లో ఎన్నో రకాల పంటలు పండించే వీలుంది. అయినప్పటికీ పంటమార్పిడి అంతంతమాత్రంగానే సాగుతోంది. దానివల్ల దేశవ్యాప్తంగా మొత్తం స్థూల సాగు విస్తీర్ణంలో అపరాల వాటా ఇరవై శాతం లోపే ఉంది. దీనికి అనేక కారణాలున్నాయి. చీడపీడల విజృంభణకు తోడు వాతావరణ మార్పులతో పప్పుధాన్యాల దిగుబడులు కొన్నేళ్లుగా తెగ్గోసుకుపోతున్నాయి. వాటిని తట్టుకుని మంచి దిగుబడినిచ్చే విత్తనాలు కరవవుతున్నాయి. అపరాల్లో ఒక హెక్టారుకు ప్రపంచ సగటు ఫలసాయం 909 కేజీలైతే, ఇండియాలో అది 660 కిలోలే వస్తోంది. ధైర్యం చేసి పండించేవారిని మద్దతు ధరలు వెక్కిరిస్తున్నాయి. నిల్వ సౌకర్యాలూ అరకొరగానే ఉంటున్నాయి. ప్రభుత్వ సేకరణా ఆశాజనకంగా లేకపోవడంతో పప్పుధాన్యాల సాగు పట్ల రైతులు విముఖత చూపుతున్నారు. 2031 నాటికి అపరాల ఉత్పత్తిని మూడున్నర కోట్ల టన్నులకు, సాగు విస్తీర్ణాన్ని 3.10 కోట్ల హెక్టార్లకు తీసుకెళ్లాలన్నది సర్కారీ సంకల్పం. అది నెరవేరాలంటే, విత్తు నుంచి విపణి వరకు ప్రభుత్వాలు ప్రతి దశలో అన్నదాతలకు అండగా నిలవాలి!

దేశీయంగా విపరీతమైన వరి సాగు మూలంగా ఉపరితల, భూగర్భ జల వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. నీటిని తోడేందుకు భారీగా విద్యుత్ అవసరమవుతోంది. దానివల్ల పలు పర్యావరణ సమస్యలూ ఉత్పన్నం అవుతున్నాయి. ఒక ఎకరా వరికి కావాల్సిన నీటితో అయిదెకరాల కందిని పండించవచ్చునని పరిశీలనలు చాటుతున్నాయి. పైగా పప్పుధాన్యాల పంటలు నేలలో నత్రజనిని స్థిరీకరించి భూసారాన్ని పెంచుతాయి. తద్వారా అధికంగా ఎరువులు చల్లాల్సిన అవసరాన్ని తగ్గిస్తాయి. వర్షాధార ప్రాంతాల్లో అపరాల సాగు అనుసరణీయమైనది. తద్భిన్నంగా ప్రస్తుతం దాదాపు 70 లక్షల హెక్టార్ల మెట్టభూముల్లో వరి సాగవుతోంది. వాటిని క్రమంగా అపరాలవైపు మళ్లించాలి. త్వరలో ఖరీఫ్ సీజన్ మొదలు కాబోతున్న నేపథ్యంలో పప్పుధాన్యాల విస్తీర్ణాన్ని పెంచేందుకు అధికారగణం ఇప్పటి నుంచే సరైన ప్రణాళికలు రూపొందించి, అవి లోపరహితంగా అమలయ్యేలా చూడాలి. అపరాల సాగుదారులకు భవిష్యత్తుపై భరోసా కల్పించాలి. రైతాంగానికి, పర్యావరణానికి, దిగుమతులను తగ్గించి విదేశ మారకద్రవ్యాన్ని ఆదా చేసి దేశార్థికానికి మేలుచేసే పంటమార్పిడికి విరివిగా ప్రోత్సాహమందించాలి!




సమాచార మార్పిడి- కమ్యూనికేషన్ అనేది చాలా ముఖ్యం. శాస్త్రవేత్తలు కేవలం శాస్త్రీయ పరిభాషలో మాట్లాడటం వల్ల విధాన నిర్ణేతల ఆసక్తిని, ప్రజల నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. వారు ప్రజలతో కలిసి పనిచేయాలి. తమ పరిశోధనలను ప్రజలకు అర్థమయ్యే భాషలోకి తేవాలి. అప్పుడే ప్రజల మద్దతు లభిస్తుంది.

– సౌమ్య స్వామినాథన్

చిందర వందర కేబుళ్లు...

పర్యావరణానికి ఉరితాళ్లు!





డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ మౌలిక వసతుల విస్తరణ వేగంగా జరుగుతోంది. అయితే, విద్యుత్ స్తంభాలపై గజిబిజిగా వేలాడుతున్న కేబుళ్లు, రోడ్ల పక్కన వదిలేసిన వైర్లు, పనికిరాని ఫైబర్ లైన్లు, వాటి మధ్యే కొత్త లైన్లు అన్నీ గందరగోళంగా కనిపిస్తుంటాయి. పరిస్థితిని సరిదిద్దకపోతే దీర్ఘకాలంలో పలురకాల సమస్యలు తప్పవు.

ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు (ఓఎఫ్‌సీ) డిజిటల్ ప్రపంచానికి వెన్నెముక. దేశంలో కాంతి రూపంలో అత్యంత వేగంగా ప్రసారం చేసే ఈ సాంకేతిక వల్లే వీడియోకాల్స్, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ లావాదేవీలు సులభతరం మారాయి. రాగి కేబుళ్లతో పోలిస్తే ఫైబర్ అధిక వేగం, తక్కువ సిగ్నల్ నష్టం, తక్కువ విద్యుత్ వినియోగం, దీర్ఘకాలికత వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ వేగంగా జరుగుతోంది. అయితే, పాత కేబుళ్లను తొలగించకుండానే కొత్త కేబుళ్లు వేయడం, ఒకే ప్రాంతంలో పలువురు సర్వీస్ ప్రొవైడర్లు కేబుళ్లను వేసుకోవడంతో గందరగోళం పెరుగుతోంది. నగరాలు కేబుల్ అడవులుగా మారుతున్నాయి. పర్యావరణ సమస్యలూ తోడవుతున్నాయి. ఫైబర్ కేబుళ్లలో ప్లాస్టిక్ పొరలు, రక్షణ కోసం ఉపయోగించే పదార్థాలు సరైన రీతిలో తొలగించకున్నా, కాల్చేసినా, గాలి, నేల కాలుష్యం పెరుగుతుంది. అక్రమంగా రీసైక్లింగ్ చేసే క్రమంలో విషపూరిత పదార్థాలు విడుదలయ్యే ప్రమాదం ఉంది. కొత్త ఫైబర్ కేబుళ్ల తయారీ ప్రక్రియలో అధిక ఉష్ణోగ్రతలు, రసాయన ప్రక్రియలు శక్తి వినియోగాన్ని పెంచుతాయి. అంటే, అవసరం లేని కేబుళ్ల ఉత్పత్తి పెరగడం వల్ల పర్యావరణంపై అదనపు భారం పడుతోంది.



సర్క్యులర్ ఎకానమీతో...

ప్రపంచంలోని పలు దేశాలు ఈ సమస్యలను ముందుగానే గుర్తించాయి. ఐరోపా దేశాలు సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని అనుసరిస్తూ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణకు కఠినమైన నియమాలు అమలు చేస్తున్నాయి. తయారీదారులపై బాధ్యతలు మోపుతూ, పాత కేబుళ్లను తిరిగి సేకరించి రీసైకిల్ చేయడం తప్పనిసరి చేశాయి. సింగపూర్ వంటి దేశాలు కామన్ డక్ట్ వ్యవస్థను సమర్థంగా యుటిలిటీ కారిడార్లను ఏర్పాటుచేసి, అన్నిరకాల కేబుళ్లను సరైన రీతిలో నిర్వహించే విధానాన్ని తీసుకొచ్చాయి. మనదేశంలోనూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు ఉన్నా, ఫైబర్ కేబుళ్లకు ప్రత్యేకంగా వర్తించే సమగ్ర విధానం లేదు. ఈ-వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు ఉన్నా, అమలులో లోపాలు వేధిస్తున్నాయి. ముఖ్యంగా టెలికాం మౌలిక వసతులకు సంబంధించిన వ్యర్థాలపై ప్రత్యేక దృష్టి అవసరం. ప్రస్తుతం దేశంలో లక్షల కిలోమీటర్ల మేర విస్తరించిన ఫైబర్ నెట్‌వర్క్, భవిష్యత్తులో మరింత పెరుగుతుందని అంచనా. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, సమగ్ర విధానాలు రూపొందించడం అవసరం. దేశవ్యాప్తంగా అన్ని ఫైబర్ కేబుళ్లకు సంబంధించిన డిజిటల్ అసెట్ రిజిస్ట్రీ రూపొందించాలి. ప్రతి కేబులుకూ జియోట్యాగింగ్ చేసి, దాని యాజమాన్యం, స్థానం, స్థితి, వినియోగ స్థాయి వంటి వివరాలను నమోదు చేయాలి. దీని వల్ల అనవసర డూప్లికేషన్ గుర్తించడంతో పాటు, నిర్వహణ, మరమ్మతులు తేలికవుతాయి. ప్రతి కేబుల్ వివరాల్ని సులభంగా తెలుసుకోవచ్చు. వాడకం ముగిసిన కేబుళ్లను నిర్దిష్ట కాలవ్యవధిలో తొలగించే డీకమిషనింగ్ నిబంధనలు తీసుకురావాలి. దీంతో నగరాల్లో శుభ్రత పెరుగుతుంది. పర్యావరణానికి ముప్పు తగ్గుతుంది.

టెలికాం సంస్థలపై ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్) విధానాన్ని కఠినంగా అమలు చేయాల్సి ఉంది. అంటే, కేబుల్ వేయడం మాత్రమే కాకుండా, దాని నిర్వహణ, తొలగింపు, రీసైక్లింగ్ వరకు సంస్థలదే బాధ్యతగా ఉండాలి. తద్వారా బాధ్యతాయుతమైన వినియోగం పెరుగుతుంది. నగరాల్లో కామన్ డక్ట్ వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా అన్ని కేబుళ్లను ఒకే మార్గంలో ఏర్పాటు చేయడం నిర్వహణను సులభతరం చేస్తుంది. భవిష్యత్తులో ఉపగ్రహ సాంకేతికతతో కలిపిన హైబ్రిడ్ కనెక్టివిటీ మోడళ్లను ప్రోత్సహించడం ద్వారా భౌతిక కేబుళ్లపై ఒత్తిడిని తగ్గించవచ్చు. రీయూజ్, రీసైక్లింగ్, రీఫర్బిష్ వంటి సర్క్యులర్ మోడళ్లను టెలికాం రంగంలో ప్రవేశపెట్టాలి. జియో మ్యాపింగ్, ఏఐ ఆధారిత ట్రాకింగ్ వంటి చర్యల ద్వారా అనధికారికంగా కేబుళ్లు వేయడాన్ని నియంత్రించవచ్చు. మన దేశంలో కొన్ని నగరాల్లో కామన్ డక్ట్ మోడల్‌ను ప్రయత్నించినా, దేశవ్యాప్తంగా సమగ్ర విధానం కొరవడింది. ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ వేగంగా జరుగుతున్న దశలో, నిర్వహణకు సంబంధించిన విధానాల్లో వెనకంజ వేయడం ఆందోళన కలిగించే విషయం.

ఖర్చులూ కలిసి వస్తాయి...

ప్రస్తుత పరిస్థితుల్లో ఫైబర్ మౌలిక వసతుల విస్తరణను క్రమబద్ధీకరించడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి, పెట్టుబడులను సమర్థంగా వినియోగించడానికి సమగ్ర విధానాలు అవసరం. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉమ్మడి ఫైబర్ మౌలిక వసతుల ఏర్పాటు మేలు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వమే ఫైబర్ మౌలిక వసతులను అభివృద్ధి పరచాలి. వీటిని లీజు పద్ధతిలో అందుబాటులో ఉంచాలి. దీనివల్ల అనవసర డూప్లికేషన్ తగ్గుతుంది. పెట్టుబడులు సమర్థంగా వినియోగమవుతాయి. నిర్వహణ కేంద్రీకృతమవుతుంది. పారదర్శకత పెరుగుతుంది. ఇది భారత టెలికమ్యూనికేషన్ చట్టం,2023లో పేర్కొన్న సమాన యాక్సెస్, మౌలిక వసతుల సమర్థ వినియోగ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ సూత్రాలను అనుసరించే సర్క్యులర్ మోడల్ ద్వారా పనికిరాని కేబుళ్లలోని పదార్థాలను తిరిగి వినియోగించుకునే విధానాలను అభివృద్ధి చేయాలి. ఇది పర్యావరణ రక్షణకు తోడ్పడటమే కాకుండా, ఖర్చులనూ తగ్గిస్తుంది. ఫైబర్ నెట్‌వర్క్ నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వాడాలి. ఫైబర్‌తో పాటు ఉపగ్రహ సాంకేతికతను కలిపిన హైబ్రిడ్ కనెక్టివిటీ మోడళ్లను ప్రోత్సహించాలి. ప్రతి ప్రాంతంలో ఫైబర్ వేయడం సాధ్యం కానప్పుడు ఉపగ్రహ కనెక్టివిటీ ద్వారా మౌలిక వసతులపై ఒత్తిడి తగ్గుతుంది. ఇది సమగ్ర డిజిటల్ కనెక్టివిటీ సాధనకు దోహదం చేస్తుంది. ప్రణాళికాబద్ధంగా ఫైబర్ విస్తరణ చేపట్టిన తెలుగు రాష్ట్రాలు ఈ విషయంలో ముందడుగు వేయగలవు. సరైన విధానాలతో దేశానికి మార్గదర్శకంగా నిలవగలవు.



పన్నీరు వేణుప్రసాద్
మేనేజింగ్ డైరెక్టర్,
తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్

టాకీ సినిమాలు వచ్చి అప్పటికి దశాబ్దం పైనే అయింది. అయినా మూకీ సినిమాలే తీస్తూ ప్రేక్షకుల్ని నవ్వించిన చార్లీ చాప్లిన్ 1940లో మొదటిసారి టాకీ చిత్రం తీశారు. ఆయనే రాసి, నిర్మించి, దర్శకత్వం వహించి, నటించిన ఆ చిత్రం ఇప్పటివరకు వచ్చిన సినిమాలన్నింట్లో 'గ్రేటెస్ట్ కామెడీ ఫిల్మ్'గా పేరు తెచ్చుకుంది. కేవలం నవ్వుకుని మర్చిపోయే కామెడీ కాదది. ప్రేక్షకుల్ని ఆలోచింపజేసే పొలిటికల్ సెటైర్. సినిమా చివర్లో నాలుగున్నర నిమిషాల ప్రసంగం ఇప్పుడు విన్నా నేటి పరిస్థితుల గురించే రాశారేమో అనిపిస్తుంది. ప్రపంచం ఒక యుద్ధం తాలూకు నష్టాలనుంచి తేరుకోకముందే మరో యుద్ధపు కోరల్లో చిక్కుకుని అల్లాడుతున్న సమయమది. అటువంటి విపత్కర పరిస్థితుల్లో చాప్లిన్ నియంతృత్వాన్ని నిలదీస్తూ 'ది గ్రేట్ డిక్టేటర్' సినిమా తీశారు. దాని క్లైమాక్స్‌లో ఒక సామాన్యుడు,



ఆ శక్తి మనకు ఉంది!

పొరపాటున నియంత స్థానంలో నిలబడాల్సి వస్తుంది. ఆ సందర్భంలో ఆ పాత్రలో చాప్లిన్ ప్రసంగం- మానవ చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైనదిగా నిలిచిపోయింది.

చాప్లిన్ నోట పలికినవి కేవలం సినిమా డైలాగులు కావు, అవి అణచివేతకు గురైన మానవాళి ఆర్తనాదాలు. 'మనం మనుషులం. ఇతరుల దుఃఖం చూసి కాదు, సంతోషం చూసి బతకాలనుకుంటాం. ఈ ప్రపంచంలో ప్రతిఒక్కరికీ చోటుంది. జీవితం స్వేచ్ఛగా అందంగా సాగవచ్చు. కానీ మనమే దారి తప్పాం. దురాశ మనసుల్ని విషపూరితం చేసింది. ద్వేషమనే అడ్డుగోడలు కట్టి రక్తపాతంలోకి నడిపించింది. విజ్ఞానం మనల్ని నిరాశావాదులుగా, తెలివితేటలు కఠినచిత్తులుగా, కనికరం లేనివారిగా మారుస్తున్నాయి. ఆధునాతన సాంకేతికతలతో వేగాన్ని అందుకున్నాం కానీ, ఆ ఉద్ధృతిలో కొట్టుకుపోతూ మనసుల్ని ఎక్కడో పారేసుకుంటున్నాం. ఎక్కువగా ఆలోచిస్తున్నాం, తక్కువగా అనుభూతి చెందుతున్నాం. మెషినరీ కన్నా మనకు కావాల్సింది మానవత్వం. తెలివితేటలకన్నా దయ, స్నేహభావం కావాలి. ఇవి లేనినాడు సర్వస్వం నాశనమవుతుంది. హింసను వీడి ప్రేమ వైపు, ద్వేషాన్ని వీడి కరుణ వైపు అడుగులు వేయడం అనివార్యం. ద్వేషం అశాశ్వతం, నియంతలు మరణిస్తారు. స్వేచ్ఛ మాత్రమే శాశ్వతం. మానవత్వపు ఉనికి ఏ ఒక్క వ్యక్తిలోనో, సమూహంలోనో లేదు, అది ప్రతి మనిషి అంతరాత్మలోనూ ఉంది. ఆ అంతరంగ చైతన్యమే మనకు ఆత్మప్రబోధం కావాలి. సుఖాలను, సంతోషాలను సృష్టించే శక్తి మనలోనే ఉంది. జీవితమంటే- ప్రేమ, ఆత్మీయతలతో సాగాల్సిన ఒక మధుర ప్రయాణం. స్వార్థాన్ని వీడి, మైత్రీభావంతో నిండిన నవ ప్రపంచాన్ని నిర్మించుకోవడమే కాలం మన ముందుంచిన అతిపెద్ద బాధ్యత. విజ్ఞానం, సాంకేతిక ప్రగతి మనుషులందరికీ సమానమైన సంతోషాన్నిచ్చే దిశగా సాగాలి. యుద్ధం మృత్యువు వైపు నడిపిస్తే, శాంతి మనల్ని జీవితం వైపు మళ్లిస్తుంది...' అంటూ సాగుతుందా ప్రసంగం. శిథిలాల మధ్య కూడా జీవితం కొత్తగా మొలకెత్తుతుందని, మానవత్వం మళ్లీ చిగురిస్తుందని చాప్లిన్ చెప్పిన మాటలు సార్వకాలిక సత్యాలు. నేడు మనకు కావాల్సింది మనుషులను కలిపే వారధులు. విడదీసే గోడలూ కందకాలు కాదు. రేపటి తరాలకు మనం ఇవ్వాల్సింది- ద్వేషం లేని శాంతియుత ప్రపంచాన్ని.

– అనిల్ అట్లూరి

అజగర వ్రతం

ప్రహ్లాదుడు రాజ్యపాలన చేస్తున్నప్పుడు తన దగ్గరికి వచ్చిన అజగరుడు అనే విప్రోత్తముణ్ని ప్రాణులకు ప్రశాంతత ఎలా సిద్ధిస్తుందో తెలపమని అడిగాడు. దానికతడు 'స్థితి వినాశనాలు సంభవిస్తాయి. జీవించి ఉన్న కాలంలో ఏవి ప్రాప్తించినా అవి అస్థిరాలు. మనం నిమిత్తమాత్రులం. సంపదలు, బంధువులు మిత్రులు అశాశ్వతాలని గుర్తించాలి...' అని చెబుతాడు.

'వరదలో కట్టెలు కొట్టుకుని వస్తాయి. అవి క్షణకాలం ఒకదానితో ఒకటి కలిసి మళ్లీ కొట్టుకుపోతాయి. వరద అనేది కాలం అయితే క్షణకాలం కలిసి ఉండే కట్టెల్లాంటి వాళ్లం మనం. ఈ జ్ఞానం తెలిసినవాడు స్థిరచిత్తుడు, ప్రశాంతుడు అవుతాడు. మనకు ఏర్పడిన బంధాలన్నీ తీపి గుర్తులో చేదు ఫలాలో కావచ్చు. ఏ వికారం, వికారం లేకుండా వాటి వల్ల ఏర్పడే ఫలితాలను అలాగే ఆహ్వానించాలి, అనుభవించాలి. తనకు ఎదురైన విషమ పరిస్థితులకు ఎదుటివారే కారణమంటూ ఆరోపించకూడదు. ఎప్పుడు పగిలిపోతుందో తెలియని నీటి బుడగలాంటి జీవితంలో అహంకారం, గర్వం, అసూయ, వంచనలకు మనసులో ఎందుకు చోటివ్వాలి? నా వరకు నేను శుభాశుభాల పట్ల ఆసక్తి, వ్యతిరేకత ఏదీ చూపను. ఆయా ఫలితాలు నన్ను నిమిత్తం చేసుకుని వస్తాయి. నేను వాటిని నిర్వికల్పంగా అనుభవిస్తాను. పంచభక్ష్యాలైనా ఉత్తి రొట్టె అయినా నాకు ఒకటే. ఆకలి తీరడమే పరమార్థం. కలిమి లేములు, జనన మరణాలు, ఉత్థాన పతనాలు మొదలైన ద్వంద్వాల పట్ల నిర్లిప్త వైఖరి అవలంబిస్తాను. దైవం ప్రసాదించిన ఆహార విహారాదులు, శయన వాహనాది సుఖాలతో లేదా కష్టాలతో కూడా నిత్య సంతృప్తి చెందుతాను. నాకు లభించింది ఏదైనా దైవమే ఇచ్చిందని నమ్ముతాను. శౌచనిరతి, ఓర్పు, సర్వ సమత నా విధానం. ఇదే నా వ్రతం. మూర్ఖులకు ఇది దుర్లభం. పండితులూ సమర్థులకు సులభసాధ్యం' అని అజగరుడు ప్రహ్లాదుడికి వివరిస్తాడు. ఇది అజగర వ్రతంగా పురాణాలలో కనిపిస్తుంది.




అంతర్యామి

వాడికి ప్రమోషన్ వచ్చింది నాకు రాలేదు, వాడు దొంగదారుల్లో డబ్బు సంపాదిస్తున్నాడు, న్యాయానికి ధర్మానికి ఇవి రోజులు కావు... అని అసహనంతో చిటపటలాడేవారు శాంతి ఎలా పొందగలరు? ఇలాంటి లౌకిక వాసనల ఆలోచనా చక్రంలో ఇరుక్కుని, ఇంకిపోతున్న చెరువు నీటిలో చేపల్లాగా దుఃఖిస్తుంటారు వారు. మృత్యువు ఏ క్షణమైనా రావచ్చనే స్పృహతో లౌకిక విషయాల పట్ల అనాసక్తి, అలౌకిక విషయాల పట్ల ఆసక్తి పెంచుకుంటూ అందరూ అజగరుడి మాటల అంతరార్థం తెలుసుకోవాలి. శాంతికి అశాంతికి, తృప్తికి అసంతృప్తికి, నిందకు గౌరవానికి, కష్టాలకు సుఖాలకు కూడా మనమే కారణం. సంఘటనలు జరుగుతాయి. వాటి ఫలితాలు మనల్ని నిమిత్తం చేసుకుని వస్తాయి. దైవంపై ధ్యాస ఉంచి సాధన చేస్తే ద్వంద్వాల పట్ల సమభావన సమకూరుతుంది. అజగర వ్రతాన్ని అవగాహన చేసుకుంటే మనసులో మలినం, క్లేశం తొలగి శాంతి చేకూరుతుంది.

– శివలెంక ప్రసాదరావు

యూపీఐ విప్లవం

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వ్యవస్థ మన ఆర్థిక కార్యకలాపాలను విప్లవీకరించింది. దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు అది మూలస్తంభంలా నిలుస్తోంది. యూపీఐ సాయంతో వేగంగా, సురక్షితంగా, ఉచితంగా లావాదేవీలు జరపడం వీలవుతుంది. ఈ క్రమంలో యూపీఐ వినియోగం ఏటేటా పెరుగుతోంది. ఆయా సంవత్సరాల్లో జనవరి నెలలో దేశ వ్యాప్తంగా యూపీఐ లావాదేవీల పరిమాణం... (కోట్లలో)



2021	230
2022	461
2023	803
2024	1,220
2025	1,699
2026	2,170

(ఆధారం: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నివేదిక)

జనాభా... భారమా? లాభమా?

ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం మనది. జనసంఖ్యలో పెరుగుదలను నియంత్రించేందుకు 70 ఏళ్లుగా అన్ని ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చాయి. అయితే ఇటీవలి కాలంలో జనాభా పెరుగుదలను ప్రోత్సహించాలనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. మరి, ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా పెరుగుదల అవసరమేనా, అనర్థమా అనేది చర్చనీయాంశం.

జపాన్, ఇటలీ, దక్షిణ కొరియా వంటి దేశాల్లో సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడంతో వృద్ధుల సంఖ్య పెరిగింది. ఫలితంగా యువ కార్మిక శక్తి తగ్గి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతోంది. తక్కువ జనన రేటు వల్ల భవిష్యత్తులో ఉద్యోగులు తగ్గిపోతారు. దాంతో ఉత్పాదకత పడిపోతుంది. పన్నుల ఆదాయమూ తగ్గిపోతుంది. దీన్ని నివారించడానికి జనాభా పెంపు అవసరమనే వాదనలున్నాయి. అధిక జనాభా పరిశ్రమలకు, సేవా రంగానికి మానవ వనరులను అందిస్తుంది. తద్వారా కార్మిక శక్తి పెరుగుతుంది. జనాభా పెరిగితే మార్కెట్ విస్తరిస్తుంది. ఉత్పత్తులు, సేవలకు డిమాండ్ అధికమవుతుంది. యువత ఎక్కువగా ఉంటే, వృద్ధులను చూసుకునే సామర్థ్యం పెరుగుతుంది. లేకపోతే యువతపై ఆధారపడే వృద్ధుల సంఖ్య పెరిగి, పరిస్థితి అసమతుల్యంగా మారుతుంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 1.5శాతానికి పడిపోయింది. ఇది రిప్లేస్‌మెంట్ రేటు 2.1శాతంకంటే తక్కువ. అంటే, ప్రతి తరం తనను తాను భర్తీ చేసుకునేంతగా జననాలు ఉండటం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో వృద్ధాప్య సమాజంగా మారే ప్రమాదం ఉందనే ఉద్దేశంతో జనాభా పెరుగుదలను ప్రోత్సహించాలని కొందరు అభిప్రాయపడుతున్నారు. జనాభా తగ్గుదల వల్ల కలిగే నష్టాన్ని నివారించాలన్న ఉద్దేశం ఇందులో కనిపిస్తోంది.



చైనా గుణపాఠాలు

జనసంఖ్యను పెంచడం వల్ల పూర్తిస్థాయిలో ప్రయోజనాలు కలుగుతాయా అనేది పరిశీలించాల్సిన అంశం. విద్య, ఆరోగ్య, ఉపాధి రంగాలను బలోపేతం చేయకపోతే, జనాభా పెంపు వనరులపై మరింత ఒత్తిడి తెస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పట్టణ, గ్రామీణ అసమానతలు పెరిగే ప్రమాదం ఉంది. దీర్ఘకాలంలో సుస్థిర అభివృద్ధి లేకపోతే ప్రయోజనం ఉండదు. జనాభా పెరగడం వల్ల నీరు, విద్యుత్, ఆహారం, నివాసం, భూమి వంటి వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. అధిక జనాభాకు తగిన విద్యా, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాలకు సవాలుగా మారుతుంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు ఉన్నా- ఉపాధ్యాయుల కొరత, సౌకర్యాల లోటు వేధిస్తోంది. జనాభా పెరుగుదలతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది, కానీ ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే ఇప్పటికే కూడా తరగతి గదులు, బోధనా వనరులు తగినంతగా ఉండవు. నాణ్యమైన విద్య అందించడం మరింత కష్టమవుతుంది. ఇది భవిష్యత్తులో నైపుణ్యాలు లేని కార్మిక శక్తి పెరగడానికి దారితీస్తుంది. నేడు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ- వైద్యులు, నర్సులు, ఔషధాలు, పరికరాలకు కొరత వేధిస్తోంది. జనాభా పెరుగుదలకు సమాంతరంగా మాతాశిశు మరణాలు పెరిగే ప్రమాదమూ ఉంది. పట్టణాల్లో పెద్ద ఆసుపత్రులు జనసందోహంతో నిండిపోతాయి. ఫలితంగా చికిత్సలు ఆలస్యమవుతాయి. ఇది ఆరోగ్య సౌకర్యాల అసమానతలను మరింతగా పెంచుతుంది. ఇప్పటికే గ్రామీణ యువత ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస వెళ్తుండటం వల్ల అక్కడ అనధికారిక నివాసాలు ఎక్కువవుతున్నాయి. వలసలతో ఆర్థిక అసమానతలు ఇంకా పెరుగుతాయి. జనాభా పెరుగుదలను ప్రోత్సహించే విషయంలో చైనాను ఉదాహరిస్తుంటారు. ఒకే సంతానం విధానంతో అక్కడ జనాభా పెరుగుదల ఆగిపోయింది; ఆర్థిక వ్యవస్థకు అండగా నిలిచే యువత తగ్గిపోయింది. దీంతో తదనంతర కాలంలో చైనా ప్రభుత్వం ఇద్దరు, ముగ్గురు పిల్లల విధానాల్ని ప్రవేశపెట్టినా ఆశించిన ఫలితాలు దక్కలేదు. ప్రజలు ఎక్కువ మందిని కనడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో చైనా అనుభవాల్ని గుణపాఠంలా భావించాలి. జనాభా పెంపుదలను ప్రోత్సహించడమనేది దేనికీ సమగ్ర పరిష్కారం కాదు. ఇప్పటికే ఆటోమేషన్, ఏఐ, రోబోటిక్స్ వల్ల ఉద్యోగాలు తగ్గుతున్న సంగతినీ ఇక్కడ గమనంలో ఉంచుకోవాలి.


సమతుల దృక్పథం అవసరం

జనాభా పెరుగుదలను ఆశించడం కన్నా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ప్రయత్నించడం మేలు. సమతుల అభివృద్ధి, వనరుల సమర్థ వినియోగం, వసతులు, గ్రామీణ ప్రాంతాల బలోపేతంపై దృష్టి పెట్టడం వల్ల సమాజానికి నిజమైన మేలు కలుగుతుంది. జనాభా పెరుగుదలను ప్రోత్సహించడం అనేది పరస్పర వ్యతిరేక ప్రభావాలకు కారణమయ్యే సున్నితాంశం. పెరిగే జనాభా ఒకవైపు సరికొత్త ఆర్థిక అవకాశాలను తీసుకొస్తుంది. మరోవైపు వనరులపై ఒత్తిడినీ పెంచుతుంది. వృద్ధాప్య సమాజం నివారణ, ఆర్థిక స్థిరత్వం కోసం జనాభాను ప్రోత్సహించినా, కేవలం సంపద వృద్ధికోసమే ఆ పని చేస్తే దీర్ఘకాలంలో అంతగా లాభించదు. వనరులు పరిమితంగా ఉన్నప్పుడు, ఎక్కువ జనాభా సమాజానికి భారంగానే మారుతుంది. వనరుల సమర్థ వినియోగం సమతుల అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. అందుకని, సుస్థిర అభివృద్ధి దృష్టితో తీసుకునే నిర్ణయాలతోనే సమాజానికి నిజమైన ప్రయోజనం కలుగుతుంది.

– ఎస్.లలితప్రసాద్, ఆడిటర్

మెరిసే రాయి

రాము సోము ఇద్దరు ఫ్రెండ్స్. ఒకరోజు చెరువుగట్టున ఆడుకుంటున్నారు. అప్పుడు వాళ్లకు మెరిసే నల్లటిరాయి కనిపించింది. దాన్నిచూసి రాము.. 'దానికేమైనా మాయశక్తులు ఉన్నాయేమో అనిపిస్తుంది' అన్నాడు. అప్పుడు సోము నవ్వి.. 'మాయ లేదు.. మర్మం లేదు. దాని వెనక ఏదో కారణం ఉండే ఉంటుంది. ఒకసారి వెళ్లి మన సైన్స్ టీచర్ రఘురాం సర్‌ని అడుగుదాం' అన్నాడు. ఆ రాయిని తీసుకెళ్లి ఆయనకు చూపించి.. ఇదేంటని అడిగారు. అప్పుడాయన.. ఒక గుండుపిన్ను తీసి ఆ రాయికి దగ్గరగా పెట్టారు. అది టక్కున దానికి అతుక్కుపోయింది. అది చూసి రాము, సోము ఆశ్చర్యపోయారు. 'ఇదేంటి వింతగా ఉంది!' అన్నాడు రాము. 'పిల్లలూ! ఇది మాయ రాయి కాదు. దీన్ని 'లోడ్‌స్టోన్' అంటారు. అంటే ఇది ప్రకృతిలో దొరికే



సహజమైన అయస్కాంతం. దీనికి ఇనుముతో చేసిన వస్తువులను ఆకర్షించే శక్తి ఉంటుంది. దీనికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసా? పూర్వం గ్రీస్ దేశంలోని మెగ్నీషియా అనే ప్రాంతంలో చాలామంది గొర్రెల కాపరులు తిరుగుతుండేవారు. వాళ్ల చెప్పులకు ఉండే మేకులకు, పట్టుకునే కర్రలకు ఉన్న ఇనుప తొడుగులకు అక్కడ నేల మీద ఉన్న కొన్ని నల్లటి రాళ్లు అతుక్కుపోయేవి. అది ఒక కాపరి గుర్తించాడు. ఆ వింతను చూసి మొదట భయపడినా, తరవాత అది వాటికి ఉన్న శక్తి అని తెలుసుకున్నారు. మెగ్నీషియా ప్రాంతంలో దొరికిన సహజ అయస్కాంత రాళ్లకు 'మాగ్నెటైట్' అని పేరు పెట్టారు. అది క్రమంగా 'మాగ్నెట్'గా స్థిరపడింది' అని చెప్పారు రఘురాం. 'మరి ఇది మనకు ఎలా ఉపయోగపడుతుంది మాస్టారూ' అని అడిగాడు రాము. 'మనం వాడే స్పీకర్లు, ఫ్రిజ్ డోర్లు, దిక్సూచి.. ఇలా అన్నింటిలోనూ ఈ అయస్కాంత సూత్రమే ఉంటుంది. మనం సైన్స్ గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే ఇలాంటి ఎన్నో వింతల వెనకున్న విషయాలు అర్థమవుతాయి' అన్నారు మాస్టారు.

– యర్రాప్రగడ ప్రసాద్

కనిపెట్టండి

ఇక్కడ ఇచ్చిన ఆధారాల సాయంతో వచ్చే పదాలను రాయండి.



జవాబు: 1.CARD 2.MON- DAY 3.COLD

జై భావదేవ

జై భావదేవ నామస్మరణతో పొన్నూరు మార్మోగింది. సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో హోమాలు చేశారు. దేవాలయం నుంచి మహాత్మాగాంధీ సెంటర్ మీదుగా పాతపొన్నూరు వెళ్లిన రథోత్సవం తిరిగి దేవస్థానానికి చేరుకుంది. భక్తులకు ఇబ్బంది లేకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, పొన్నూరు





ప్రత్యేక అలంకరణలో శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి

రథోత్సవంలో భక్తులు

కార్యకర్తలకు అండగా ఉంటా

గుంటూరు లోక్‌సభ తెదేపా నేతల ఆత్మీయ విందులో మంత్రి లోకేశ్



జిల్లా తెదేపా నేతలతో సమావేశమైన మంత్రి లోకేశ్, పక్కన పెమ్మసాని

ఈనాడు, అమరావతి, పట్టాభిపురం, న్యూస్‌టుడే: తెలుగుదేశం అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలకు సమస్య వస్తే తాను అండగా ఉంటానని, ఏ సమయంలోనైనా తన దృష్టికి తీసుకురావచ్చని తెదేపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. తాడేపల్లి మండలం కుంచనపల్లిలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాసంలో శుక్రవారం జరిగిన ఆత్మీయ విందులో ఆయన పాల్గొన్నారు. గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై నియోజకవర్గాలవారీగా నేతలతో చర్చించారు. గడచిన 22 నెలల్లో సాధించిన అభివృద్ధి, నిధుల సేకరణ అంశాలపై మాట్లాడారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు సాధించడం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని లోకేశ్ వివరించారు. జిల్లాలో తెదేపా బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉండగా తెదేపా కోసం కృషి చేసిన కార్యకర్తలు కొన్ని సందర్భాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి పెమ్మసానితో పాటు ఎమ్మెల్యేలు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యకర్తలకు సమస్య వస్తే ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చని లోకేశ్ స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పరిస్థితుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయ కలయికను పురస్కరించుకుని కేకు కోశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెదేపా జిల్లా అధ్యక్షుడు, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

రాక్రీట్ సంస్థపై కేసు నమోదు

పేరేచర్ల జగనన్న లేఔట్‌లో రూ.10.65 కోట్ల దుర్వినియోగం

మేడికొండూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో పేదలకు సంబంధించి ఇళ్లు కట్టకుండానే ఉద్దేశపూర్వకంగా రూ.10.65 కోట్లు కాజేశారన్న ఫిర్యాదుపై రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ తోపుదుర్తి అమర్‌నాథ్‌రెడ్డిపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అమర్‌నాథ్‌రెడ్డి వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనుచరుడు. సీఐ మధుసూదనరావు తెలిపిన వివరాల మేరకు.. గత వైకాపా ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేరేచర్ల శివారు ఇళ్ల నిర్మాణం చేపట్టింది. మూడో ఆప్షన్ కింద మొత్తం 4,504 ఇళ్లు ప్రభుత్వం కట్టేందుకు అనంతపురం జిల్లాకు చెందిన రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. పనులు మొదలు పెట్టిన ఆ సంస్థ కాలపరిమితి లోపు పూర్తి చేయలేదు. పూర్తి చేసిన వాటిలో కొన్ని నివాస యోగ్యంగా లేవు. ఈ నేపథ్యంలో కొంత మంది లబ్ధిదారులు కొద్ది నెలల కిందట జిల్లా గృహ నిర్మాణ సంస్థను ఆశ్రయించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం కలగజేసుకుని విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. సంస్థ ఇళ్ల పనులు పూర్తి చేయకుండానే ఉద్దేశపూర్వకంగా అవకతవకలు, మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడిందని, రూ.10.65 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని అధికారులు నిగ్గు తేల్చారు. దీనిపై ప్రత్తిపాడు డివిజన్ గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఇంజినీర్ జున్నూరు బాబురావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీకు అంత.. నాకు ఇంత

- భూముల ధరలు పెంచి.. వచ్చిన డబ్బు పంచుకుని...
- జగనన్న కాలనీల పేరుతో ఇష్టారాజ్యంగా దోపిడీ
- విజిలెన్స్ విచారణతో అక్రమాలు బహిర్గతం

ఈనాడు - అమరావతి

బహిరంగ మార్కెట్లో ఎకరం విలువ రూ.30 లక్షలుంటే... నాటి వైకాపా ప్రభుత్వం చెల్లించింది రూ.60 లక్షలు...

ఇదేదో రైతుల మీద ప్రేమతో కాదు... నాటి వైకాపా నాయకులు దోచుకునేందుకు వీలుగా...



జగనన్న కాలనీ..

ప్రజాధనాన్ని పప్పుబెల్లాలుగా పంచేసుకున్న నాటి వైకాపా నాయకులు.. నిరుపేదలకు నిలువ నీడ చూపించలేకపోయారు. జగనన్న కాలనీల పేరుతో సాగిన అక్రమాల లోతుకెళ్లేకొద్దీ ఎన్నో వాస్తవాలు బయటపడుతున్నాయి. బహిరంగమార్కెట్లో ఉన్న విలువకంటే రెట్టింపు మొత్తాలతో భూములను ప్రభుత్వంతో కొనిపించి.. అదనంగా వచ్చిన దాంట్లో కమీషన్లు దండుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం.. కొందరు వైకాపా నేతల స్వార్థం.. వెరసి.. రూ.2 వేల కోట్ల విలువైన లావాదేవీల మాటున రూ.కోట్లు కొల్లగొట్టారు. విజిలెన్స్ విచారణలో అక్రమాల బాగోతం బయటపడినా.. అనేకమంది అక్రమార్కుల వివరాలు వెల్లడైనా.. కీలకమైన నాటి ప్రజాప్రతినిధుల ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలుచోట్ల బహిరంగ మార్కెట్‌కు పందశాతం పెంచి పరిహారం చెల్లించడం గమనార్హం.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో లేఔట్ల వివరాలు ఇలా....

- మొత్తం లేఔట్లు: 1,789
- జగనన్న కాలనీలకు ఉపయోగించిన భూమి: 7,370.322 ఎకరాలు
- మౌలికవసతులతో అభివృద్ధి చేసిన లేఔట్లు: 1,353
- మౌలికవసతులు అభివృద్ధి చేసిన విస్తీర్ణం: 5,402.605 ఎకరాలు
- కనీస వసతులు కల్పించని లేఔట్లు: 436
- కనీస వసతులు కల్పించని విస్తీర్ణం: 1,969.696 ఎకరాలు

డివిజన్ల వారీగా భూసేకరణలో ఎకరాకు చెల్లించిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు రూపాయల్లో...

జిల్లా	డివిజన్	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	గుంటూరు	80,00,000	12,25,000
గుంటూరు	తెనాలి	92,51,000	15,01,000
బాపట్ల	బాపట్ల	81,30,000	13,00,000
	రేపల్లె	65,00,000	13,00,000
	చీరాల	45,00,000	5,20,000
పల్నాడు	నరసరావుపేట	44,00,000	8,00,000
	గురజాల	20,00,000	10,50,000
	సత్తెనపల్లి	69,00,000	12,00,000

సాధారణ భూసేకరణ విధానంలో రైతుల నుంచి భూమి తీసుకుని ఉంటే చెల్లించాల్సిన మొత్తం: రూ.2004,55,02,037

స్వచ్ఛంద భూసేకరణ విధానం వల్ల చెల్లించింది రూ. 2054,59,68,408

దీనివల్ల ప్రభుత్వంపై పడిన అదనపు భారం: రూ. 50,04,66,371

- గురజాల గ్రామంలో ఒక రైతు నుంచి ఎకరా రూ.15 లక్షల చొప్పున 1.50 ఎకరాలు సేకరించి.. సొలస శ్రీను, మరో ఇద్దరు రూ.25 వేలు వసూలు చేశారు.
- గురజాలలోనే ఎకరా రూ.15 లక్షల చొప్పున 1.50 ఎకరాలు ఇచ్చిన రైతు నుంచి మస్తాం ప్రసాద్, సొలస శ్రీను మధ్యవర్తులుగా ఉండి రూ.లక్ష డిమాండ్ చేయగా...రైతు రూ.35 వేలు ఇచ్చినట్టు విజిలెన్స్ విచారణలో వెల్లడించారు.
- మూడు జిల్లాల పరిధిలో జగనన్న కాలనీలకు భూములిచ్చిన రైతుల్లో 159 మందిని విజిలెన్స్ అధికారులు విచారించారు.

భూసేకరణలో బహిరంగమార్కెట్లో ఎకరా ధర.. నాటి వైకాపా ప్రభుత్వం ఎంత చెల్లించిందో తేడా ఇలా...

మండలం	గ్రామం	మార్కెట్ ధర	చెల్లించింది
		రూ.లక్షల్లో	
గుంటూరు జిల్లాలో...			
పొన్నూరు	నిడుబ్రోలు	20 - 25	41
తెనాలి	పెదరావూరు	26	67.50
తెనాలి	బుర్రిపాలెం	25 - 30	71.25
మేడికొండూరు	పేరేచర్ల	24 - 30	60
తాడికొండ	దామరపల్లి	30	47.50
	ఇదే గ్రామంలో ఎకరం రూ.70 లక్షలు ఉన్నచోట రూ.47.50 లక్షలే ఇచ్చారు.		
తాడికొండ	దామరపల్లి	70	47.50
తాడికొండ	లాం	30	60
గుంటూరుతూర్పు	ఏటుకూరు	50 - 60	72
	ఇక్కడ ఎకరం రూ.కోటి ఉన్నచోట రూ.72 లక్షలే చెల్లించారు.		
బాపట్ల జిల్లాలో...			
బాపట్ల	ప్యాడిసన్‌పేట	30	42
బాపట్ల	మూలపాలెం	30	34
భట్టిప్రోలు	భట్టిప్రోలు	12	30.30
అద్దంకి	సౌతఅద్దంకి	6.93	18
	ఇక్కడ కొన్ని సర్వే నంబర్లలో ఎకరం రూ.10 లక్షలుండగా.. రూ.26 లక్షలు చెల్లించారు.		
పల్నాడు జిల్లాలో....			
నాదెండ్ల	గణపవరం	30	44
నరసరావుపేట	ఉప్పలపాడు	10	18
గురజాల	గురజాల	13	15
చిలకలూరిపేట	పసుమర్రు	30	31

పేదలకు అత్యాధునిక వైద్యం అందించడమే ధ్యేయం



ఆసుపత్రి నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: సమాజాన్ని పట్టి పీడిస్తున్న క్యాన్సర్ వ్యాధి నుంచి పేదలను రక్షించడమే ధ్యేయంగా తన తల్లి బసవ తారకం పేరుతో రాజధానిలో అత్యాధునిక క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు హిందూపురం ఎమ్మెల్యే, బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన రాజధానిలో ఆసుపత్రి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం తుళ్లూరులోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ప్రాజెక్టు కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ తన తల్లి బసవతారకం చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. సిబ్బంది, ఉద్యోగులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఆసుపత్రి నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అమరావతి ఐకాస కన్వీనర్ పువ్వాడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాయ.. ఉగ్రరూపాయ



గరిష్ఠ ఉష్ణోగ్రతలతో అల్లాడిన ఉమ్మడి జిల్లా

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే, కలెక్టరేట్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. వేడి సెగతో గాలులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. ఉదయం 8 గంటలకే సూరీడు ప్రభావం చూపుతుండటంతో పగటివేళ ప్రజలు బయటకు రావడానికే భయపడే పరిస్థితి. సముద్రం వైపు నుంచి వస్తున్న వేడిగాలులు, గాలిలో తేమ లేకపోవడంతో ఉష్ణోగ్రతలు మరింత పెరగడానికి కారణమవుతోంది. మే నెల తొలి రోజే వేడి పెరగడంతో మే నెల మధ్యస్థానికి వచ్చేసరికి పరిస్థితులు ఎలా ఉంటాయోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. పిడుగురాళ్లలో రికార్డుస్థాయిలో 45.9 డిగ్రీలతో సూర్యుడు భగ్గుమన్నాడు. నరసరావుపేటలో 44 డిగ్రీలు నమోదైంది. ఉదయం 7 గంటల నుంచే ఉక్కపోత ప్రారంభమైంది. రాత్రి వరకు వేడిగాలులు వీస్తూనే ఉన్నాయి.

ఇళ్లకే పరిమితం.. ఉదయం నుంచి రోడ్లపై జనం పలుచగా కనిపించారు. మధ్యాహ్నం గుంటూరు నగరంలో రోడ్లు బోసిపోయాయి. సాయంత్రం 5 గంటలకు కూడా వేడి తీవ్రత తగ్గలేదు. విద్యుత్తు వినియోగం పెరిగింది.

ఎల్‌నినో ప్రభావంతోనే.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులతో ఈసారి ఎల్‌నినో ఏర్పడటం వల్ల అధికంగా ఉష్ణోగ్రత ఉంటోంది. ఇది పెరిగే కొద్దీ భూమిలో తేమ శాతం తగ్గిపోయి వాతావరణంలో వేడి మరింత పెరుగుతుంది. వాతావరణంలో తేమశాతం తగ్గడం, వేడి గాలులు వీచడం వల్ల ఈ పరిస్థితి ఉంటోందని లాంఫామ్‌కు చెందిన శాస్త్రవేత్త రత్నం తెలిపారు.

మరో ఐదు రోజులు ఇంతే - కలెక్టర్ సాయికాంత్ వర్మ

వచ్చే ఐదు రోజులూ ఎండ తీవ్రత అధికంగా ఉండొచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌కు మించి నమోదవ్వొచ్చు. జిల్లాలోని 18 మండలాలూ ప్రభావానికి లోనవ్వొచ్చు. అత్యవసర పనులుంటే తప్ప ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్యలో బయటకు రావొద్దు. తప్పనిసరి వెళ్లాల్సి వస్తే గొడుగు ఉపయోగించాలి. వదులు దుస్తులు ధరించాలి. తగినంత నీటిని తాగాలి. చిన్నారులు, వయసు పైబడినవారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి. చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. కళ్ల రక్షణకు సన్ గ్లాసెస్ ఉపయోగించడం మంచిది. గుండె సంబంధ వ్యాధులు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఎండలో తిరగొద్దు.

దయచేసి వినండి.. భద్రత పెంచండి

- రైళ్లలో ఆరు నెలల వ్యవధిలో రెండో అత్యాచారం
- దొంగతనాలతో ప్రయాణికుల్లో ఆందోళన

2025 అక్టోబరు 15: రాజమహేంద్రవరం స్టేషన్లో సత్రంగచ్చి-చర్లపల్లి ప్రత్యేక రైలు మహిళా బోగీలో ఓ మహిళ ఎక్కారు. గుంటూరు స్టేషన్‌కు చేరుకున్నాక బోగీలో ఆమె ఒక్కరే ఉండిపోయారు. రైలు బయల్దేరే సమయంలో 40 ఏళ్ల వ్యక్తి ప్రవేశించి లోపలికొచ్చాడు. అనంతరం తలుపు మూసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పెదకూరపాడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు దిగి పారిపోయాడు. బాధితురాలి ఫోన్ విక్రయించి బిర్యానీ తిన్నాడు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

ఐదు రోజుల క్రితం: రెంటచింతలకు చెందిన దంపతులు ఉపాధి నిమిత్తం విశాఖలో ఉంటున్నారు. గత ఆదివారం సాయంత్రం విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో నడికుడి బయల్దేరారు. జనరల్ బోగీలో మరుగుదొడ్డి వద్ద ఉన్నవారిని ఏసీ బోగీలో పని చేసే ఒడిశాకు చెందిన వ్యక్తి లోపలికొచ్చి కూర్చోమని చెప్పాడు. భర్త మరుగుదొడ్డి వద్దనే ఉండగా.. భార్య లోపలికి వెళ్లింది. ఇదే అదనుగా ఒడిశా వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు.

ఈనాడు - అమరావతి

రైలు ప్రయాణం సురక్షితమేనా..? వరుస ఘటనలు ఈ సందేహాన్ని రేకెత్తిస్తున్నాయి. కొద్ది నెలల వ్యవధిలో ఇద్దరు మహిళలపై అమానుషాలు జరగడం.. మరోవైపు దొంగతనాల పరంపర కొనసాగుతుండడం రైల్వే భద్రత వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతున్నాయి.

గుంటూరు రైల్వే డివిజన్‌లో 70 స్టేషన్లు ఉన్నాయి. వందకుపైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) సిబ్బంది పూర్తిస్థాయి భద్రత చర్యలు చేపట్టకపోవడంతో సమస్య వస్తోంది. సిబ్బంది కొరత, ఇతర కారణాలతో పర్యవేక్షణ మొక్కుబడిగా మారిందని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి.. రైళ్లు స్టేషన్ నుంచి కదులుతున్న సమయంలో, ఔటర్లలో ఆగినప్పుడు దొంగలు.. ప్రయాణికుల చేతుల్లోని సెల్‌ఫోన్లను లాక్కెళ్లిపోతున్నారు. రాత్రి సమయాల్లో గాఢ నిద్రలో ఉన్నప్పుడు గొలుసులు తెంచుకుపోతున్నారు. ఇటీవల బాపట్ల సమీపంలోని అప్పికట్ల వద్ద ప్రత్యేక రైలులో జరిగిన చోరీ ఘటనలే ఇందుకు నిదర్శనం. కృష్ణా వంతెన, గుంటూరు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతాల్లో రైళ్లు ఆగినా.. నెమ్మదిగా కదులుతున్నా.. దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. రాత్రి వేళల్లో జనరల్, స్లీపర్ కోచ్‌లలో తగినంతమంది పోలీసు సిబ్బంది ఉండడం లేదు. పాత నేరస్థుల కదలికలపై పూర్తిస్థాయి నిఘా కొరవడుతోంది. ఈ అంశాలపై రైల్వే ఉన్నతాధికారులు, భద్రత విభాగం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

రీల్స్ వివాదం.. ఇద్దరు వైద్యుల ఘర్షణ

ఉన్నత స్థాయి అధికారికి ఫిర్యాదు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు సర్వజనాసుపత్రిలో(జీజీహెచ్)లో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగ వైద్యుడు రీల్స్ చిత్రీకరణ వివాదానికి దారి తీసింది. శుక్రవారం ఆ విభాగ వైద్యుడు ఒకరు చేతిలో కర్ర పట్టుకుని సూపరింటెండెంట్ కార్యాలయ భవనం ముందు ప్రదర్శన చేస్తూ వీడియో తీసుకుంటుండగా.. అదే విభాగానికి చెందిన మరో వైద్యుడు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రోగులను వదిలేసి రీల్స్ చేస్తున్నావా? అని ఓ వైద్యుడు ప్రశ్నించడంతో.. నువ్వెవరు నాకు చెప్పడానికి అంటూ బదులిచ్చారు. దీంతో ఇద్దరి మధ్య పరుష పదజాలంతో మాటామాటా పెరిగి చివరికి ఘర్షణకు దారితీసింది. ఒకరిపైనొకరు దాడి చేసుకుంటున్న సమయంలో గమనించిన సిబ్బంది పక్కకు తీసుకువెళ్లి సర్దిచెప్పారు. ఇందులో రీల్స్ చేసిన వైద్యుడి తీరుపై మరో వైద్యుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ చేపట్టినట్లు సమాచారం. మొత్తంగా వైద్యసేవలు గాలికి వదిలి రీల్స్ చేస్తూ వైద్యుడు ప్రవర్తించడం.. ప్రశ్నించినందుకు గొడవకు దిగడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

24 కేంద్రాల్లో నీట్.. ఏర్పాట్లు పూర్తి

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: వైద్య విద్యలో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు ఎన్టీఏ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షకు 8,417 మంది హాజరుకానున్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల్లోపే పరీక్షల కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 1.30 గంటలు దాటితే పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. గుంటూరు నగరంలో ఏసీ, హిందూకళాశాలలతోపాటు నల్లపాడు కేంద్రీయ విద్యాలయం, ఏఎన్‌యూ తదితర చోట్ల, తెనాలి, మంగళగిరి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ఎన్టీఏ నిబంధనల మేరకు వస్త్రధారణ ఉండాలి. తలకు టోపీ, ఆభరణాలు, చేతులు, కాళ్లకు ఎలాంటి దారాలు ఉండకూడదు. ప్రతి విద్యార్థి అడ్మిట్ కార్డు పరిశీలన తరువాత మధ్యాహ్నం 1.40 గంటలకు పరీక్ష గదిలోకి అనుమతిస్తారు. 1.50 గంటలకు బుక్‌లెట్ ఇస్తారు.

ఆరోగ్యకర పంచాయతీగా పొంద్రపాడు

కేంద్ర ప్రభుత్వ నివేదికలో స్థానం

కాకుమాను, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ అభివృద్ధి సూచిక పీఏఐ 2.0 2023-24 నివేదిక ప్రకారం రాష్ట్రంలో 9 పంచాయతీలు వివిధ విభాగాలలో గ్రేడులు సాధించాయి. అందులో కాకుమాను మండలం పొంద్రపాడు ఆరోగ్యకరమైన పంచాయతీగా 91.33 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించింది. ఈ గుర్తింపు సాధించేందుకు సూచికలు ఇలా ఉన్నాయి. ఆరేళ్లలోపు చిన్నారులందరికీ వ్యాక్సినేషన్ ఇచ్చారు. మాతా శిశు, బాలింతల మరణాలు జరగలేదు. కలరా, డయేరియా లాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేశారు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించారు. పొంద్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. ల్యాబ్ టెస్టులు చేయడం, వైద్య శిబిరాలు ఏర్పాటు, దోమలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు మురుగు కాల్వలో మందు పిచికారి చేయించారు. గ్రామంలో చేసిన ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో ఫొటోలతో అప్‌లోడ్ చేశారు. ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని.. పొంద్రపాడు పంచాయతీకి స్థానం కల్పించడంతో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్, డిప్యూటీ ఎంపీడీవో రమేష్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది సహకారంతో సాధ్యమైందన్నారు.



పొంద్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పైరుకు నీరు.. సాగు జోరు

గత సీజన్‌లో 189.89 టీఎంసీలు

ఈనాడు - అమరావతి

నాగార్జునసాగర్ కుడికాలువ ఆయకట్టుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాగునీటిని సమృద్ధిగా అందించారు. ఏప్రిల్ 11 వరకు కాలువలకు నీరివ్వడంతో పంటలకు ఇబ్బందులు రాలేదు. ఆయకట్టుదారులకు నీటి కష్టాలు తప్పాయి. ఖరీఫ్‌లో పత్తి సాగు చేసినవారు జనవరి నుంచి దిగుబడులు తీసుకుని పంట తొలగించి రెండో పంటగా మొక్కజొన్న సాగు చేశారు. మరికొందరు ఖరీఫ్‌లో పంటలు వేయకుండా. . బీడుగా ఉంచి నవంబరులో మొక్కజొన్న వేశారు. చివరి ఆయకట్టుకూ నీరందడంతో ఈసారి దిగుబడులు బాగున్నాయని రైతులు చెబుతున్నారు.

గత ఐదేళ్లతో పోలిస్తే...



- సాగర్ కుడికాలువకు గతేడాది జులై నుంచి ఏప్రిల్ 11 వరకు ఇచ్చిన నీరు 189.89 టీఎంసీలు. దీంతో 9,55,519 ఎకరాలకు నీరందింది. గత ఐదేళ్లతో పోలిస్తే ఇది ఎక్కువ.
- ఏటా మార్చిలో కాలువలకు నీటి విడుదల ఆపేస్తే.. మార్చి, ఏప్రిల్ నెలల్లో మిర్చి పంటకు బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి తడులు పెట్టాల్సి వచ్చేది. దీంతో రైతులపై అదనపు భారం పడేది. ఈసారి ఏప్రిల్‌లో కూడా నీరివ్వడం, గత నెల 17 వరకు ఆయకట్టుకు సాగునీరు అందడంతో రైతులకు కలిసొచ్చింది. దీనివల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడింది.
- పొలాల నుంచి వచ్చే వృథా నీరు వాగుల్లోకి ప్రవహించింది. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని పంటలకు మళ్లించడంతో అదనపు విస్తీర్ణానికి నీరు ఇవ్వగలిగారు. నీటి లభ్యత ఉన్నందున ఏప్రిల్ లోనూ మిర్చి తోటలు కొనసాగుతున్నాయి.
- కాలువల నుంచి వచ్చిన నీరు వాగులు, కుంటల్లో నిల్వ ఉండడంతో మే నెలలోనూ మిర్చికి నీటి లభ్యత ఉన్నట్లే. ప్రస్తుతం ధర బాగున్నందున తోటలను కొనసాగించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.
- మరోవైపు తాగునీటికి ఇబ్బందులు రాలేదు.
- కాలువలపై ఉన్న విద్యుత్తు ప్లాంట్లకు సుమారు 9 నెలలపాటు నీటి ప్రవాహం ఉండడంతో విద్యుదుత్పత్తి కూడా పెరిగింది.

ఐదేళ్లలో నీటి విడుదల వివరాలు... సాగైన విస్తీర్ణం...

సంవత్సరం	టీఎంసీలు	ఎకరాలలో
2021-22	166.14	9,30,694
2022-23	199.41	9,26,524
2023-24	26.7	3,84,503
2024-25	192.30	8,71,578
2025-26	189.89	9,55,519

ఆకర్షణీయ నగరంగా గుంటూరు

ఎన్నో పనులు చేపడుతున్నాం: కేంద్ర సహాయ మంత్రి



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గుంటూరు నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో గుంటూరు నగర ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజా వినియోగం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. గోరంట్ల నీటి పథకాన్ని జులైనాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగరపాలక సంస్థ ప్రగతికి సంబంధించి 22 అంశాలపై చర్చించామని మీడియా సమావేశంలో వెల్లడించారు. కలెక్టర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ... పారిశుద్ధ్య నిర్వహణపై శాస్త్రీయ విశ్లేషణ చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. నగర కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ.. పీపీకే నాయుడు మార్కెట్ నిర్మాణానికి ఆసక్తి ఉన్నవారి నుంచి మే 15 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. రాత్రిపూట పారిశుద్ధ్య నిర్వహణ ప్రయోగాత్మకంగా చేపట్టామన్నారు. ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు మాట్లాడారు. సమావేశంలో డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, నగరపాలక సంస్థ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెమ్మసాని వెల్లడించిన వివరాలు...

- శంకర్‌విలాస్ పైవంతెన పనులు 2027 జులై నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.
- ఇన్నర్‌రింగ్ రోడ్డు మూడో దశ పనులు త్వరలోనే వేగం పుంజుకుంటాయి.
- కీలకమైన నార్ల ఆడిటోరియం పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి.
- పీపీపీ విధానంలో మానస సరోవరం, పీపీకే నాయుడు మార్కెట్, నల్లపాడు చెరువు ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
- బొంగరాలబీడులోని కార్మిక శాఖ బదిలీ చేసిన స్థలంలో వాకింగ్ ట్రాక్, క్రీడా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.
- త్వరలో 200 ఈ-ఆటోలొస్తున్నాయి. వాణిజ్య ప్రాంతాల్లో 320 ట్విన్ బిన్లు ఏర్పాటు చేస్తాం.
- మురుగుకాలువల్లో పూడికతీతకు 52 పనులను రూ.3.70 కోట్లతో చేపడుతున్నాం. 90 రోజులపాటు వాటి నిర్వహణను సంబంధిత ఏజెన్సీలే చూస్తాయి.
- 28 పార్కులను రూ.7.20 కోట్లతో అభివృద్ధి చేస్తాం.
- పువ్వులు, పండ్ల మార్కెట్‌తోపాటు లెదర్‌పార్క్ స్థలం కోసం ప్రయత్నిస్తున్నాం.

తూకాల్లో మోసాలు అరికట్టేందుకు నిరంతర తనిఖీలు

తూనికలు, కొలతల శాఖ జేసీ మాధురి



ఈనాడు మీతోడు

అవగాహనే మీ ఆయుధం

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
మాదిగ కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాదిగ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



2026) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైలను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 92475 20500 & 95501 28306 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

విద్యారంగ అభివృద్ధికి కూటమి కృషి

పొరుగుసేవల ఉపాధ్యాయులకు ఉద్వాసన

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే


పింఛన్ నగదు సద్వినియోగం చేసుకోండి

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే



దివ్యాంగుడికి నగదు అందజేస్తున్న కలెక్టర్ సాయికాంత్ వర్మ

ఎండకు తాళలేక..







మందుటెండలో టవల్ వేసుకుని..

ప్రసూతి వార్డు వద్ద రోగుల బంధువులు

- ఈనాడు, అమరావతి

జీజీహెచ్ వద్ద పోలీసులతో వైకాపా ఎమ్మెల్సీ వాగ్వాదం

★ ఆసుపత్రిలోకి అనుమతించాలని దౌర్జన్యం ★ పూడి శ్రీహరికి వైద్య పరీక్షల సమయంలో ఘటన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే



అత్యవసర విభాగం వద్ద పోలీసులతో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి వాగ్వాదం

పోలీసుస్టేషన్ వద్ద హైడ్రామా

...శ్రేణులతో కలిసి అదే విభాగానికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నిందితుడిని కలిసేందుకు కాదని, మరో రోగిని కలిసేందుకు వచ్చానని ఒకసారి.. టీపీ చెక్ చేయించుకోవడానికని మరోసారి మాట మార్చి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు అనుమతించకపోవడంతో దౌర్జన్యంగా లోపలికి వెళ్లబోయారు. అత్యవసర...

...సులు వారిస్తున్నా వినలేదు. కొద్దిసేపు హైడ్రామా నెలకొంది. వాహనాలను రోడ్డుపై అడ్డంగా పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శ్రీహరికి పోలీసులు నోటీసులు జారీ చేసి పంపించారు. ఆ సమయంలో వైకాపా శ్రేణుల తీరుతో ట్రాఫిక్ నిలిచిపోయి జనం అల్లాడిపోయారు. కొంతదూరం ర్యాలీగా నడిచి వెళ్లారు.

ఈగల్ చీఫ్‌కు అంతర్జాతీయ ర్యాపిడ్ రేటింగ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే



రవికృష్ణకు జ్ఞాపిక బహూకరిస్తున్న రవీంద్రరాజు, చెస్ సంఘం ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది

...ప్రతినిధులు రవికృష్ణను అభినందించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు, ఎన్టీఆర్ జిల్లా సంఘం అధ్యక్షుడు అక్బర్ పాషా, కార్యదర్శి పి.రేణుక, ఇతర సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎం కార్యక్రమాలు శనివారం	
కార్యక్రమం	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
మధ్యా హ్నం	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజ్ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

రాజాధిరాజ వాహనంపై నారసింహుడు

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే



...చారు. సాయంత్రం రాజాధిరాజ... నిర్వహించారు. ఆలయ సహాయ... సునీల్ కుమార్ ఉత్సవాన్ని... కైంకర్యపరులుగా మాల్యవంత... శేషమ్మ కుటుంబసభ్యులు... పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం



నారీ శక్తి గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఐజీ రాజకుమారి, ఎస్పీ వకుల్ జిందాల్, కళాశాల ప్రతినిధులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఐజీ రాజకుమారి తెలిపారు. శుక్రవారం గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని కమ్మజన సేవా సమితి మహిళా వసతి ప్రాంగణంలో నారీ శక్తి కార్యక్రమం నిర్వహించారు. పోలీసుశాఖ మహిళా, చిన్నారుల భద్రత విభాగం ఐజీ రాజకుమారి అతిథిగా హాజరై శక్తి యాప్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరు చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీని ద్వారా 33 రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ మహిళలు ఒంటరిగా ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు ఏమైనా ఇబ్బందులు, అనుమానాస్పద వ్యక్తులు తారసపడినప్పుడు శక్తి యాప్‌లో సేఫ్ ట్రావెల్ అనే ఐచ్ఛికం నొక్కితే వెంటనే పోలీసు సిబ్బంది చేరుకొని రక్షణ కల్పిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా నారీ శక్తి గోడప్రతులు ఆవిష్కరించారు. విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే నేర్పిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, అశోహరి శ్రీనివాస్, బెల్లం శ్రీనివాస్, సీఐలు రమేష్, నారాయణ, నిస్సార్‌బాషా, గంగా వెంకటేశ్వర్లు, కళాశాల వసతి గృహం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పా సెంటర్ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిన పలు స్పా సెంటర్లపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్, నల్లపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. పలువురిని అరెస్టు చేశారు. అమరావతి రోడ్డులోని ఏ9 బ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్‌పై దాడి చేసి ఏడుగురు విటులను అరెస్టు చేశారు. మరో స్పా సెంటర్‌లో అసాంఘిక కార్యకలాపాలు నడుపుతున్నారనే సమాచారం రావడంతో నిఘా పెట్టిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, నల్లపాడు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏడుగురు వ్యక్తులు, నలుగురు మహిళలను అదుపులోకి తీసుకుని 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్పా సెంటర్ మేనేజర్ ఆదినారాయణను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. ★ మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డు పేజ్‌వన్‌లో ఉన్న ఓ స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ముగ్గురు మహిళలతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్పా సెంటర్ మేనేజర్ సూర్యను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వెల్లడించారు.

ముందస్తు పన్ను చెల్లిస్తే పల్లెల్లోనూ 5 శాతం రాయితీ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గ్రామాల్లోనూ ముందస్తుగా ఇంటి పన్ను చెల్లిస్తే.. 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయి కుమార్ తెలిపారు. జిల్లాలో 2026-27 సంవత్సరానికి పన్ను చెల్లింపులకు సంబంధించి అందిన డిమాండ్ డ్రాఫ్టులు, చెక్కులను పంచాయతీరాజ్ సంచాలకుడు కృష్ణతేజకు శుక్రవారం అందించారు. మే 31వ తేదీ లోగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు. ఐనవోలు, శాఖమూరు, వెలగపూడి గ్రామ పంచాయతీల పరిధిలోని విట్ విశ్వవిద్యాలయ యాజమాన్యం రూ.1,26,25,845 డిమాండ్ డ్రాఫ్ట్ అందించగా రూ.5,89,993 రాయితీ పొందారని, తక్కెళ్లపాడు సిబార్ దంత కళాశాల రూ.3,14,489 చెల్లించి రూ.11,074 రాయితీ పొందినట్లు పేర్కొన్నారు. తెనాలి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి జంపాల సుశీల రూ.2,84,872 చెల్లించి రూ.9,689 రాయితీ పొందారని వివరించారు. ఆయా సంస్థలు అందించిన చెక్కులను పంచాయతీరాజ్ సంచాలకులకు అందించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు మే 31వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ ఆఫర్ ద్వారా పన్నులు చెల్లించి రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



డిమాండ్ డ్రాఫ్ట్‌ను పంచాయతీరాజ్ సంచాలకుడు కృష్ణతేజకు అందిస్తున్న డీపీవో నాగసాయికుమార్

బ్రాయిలర్ ధరలు (కిలో ఐ రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 118, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 239

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 156 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

నూతన వధూవరులకు మంత్రి లోకేశ్ ఆశీస్సులు



తాడేపల్లి: తెదేపా నాయకుడు, జిల్లా టీడీపీ [illegible] మంత్రి నారా లోకేశ్ [illegible] మంగళగిరి [illegible] ఆశీర్వదించారు.

స్పందన: మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: [illegible]

ఎమ్మెల్యే రాక నేడు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు జరగనున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే రామాంజనేయులు రానున్నారని [illegible] అధికారులు హాజరు కావాలని కోరారు.

నమ్మండి.. ఇది కాలువే..!



వట్టిచెరుకూరు వద్ద గడ్డి మొలిచి ఇలా..

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే

ప్రత్తిపాడు నియోజకవర్గం, గుంటూరు నగరపాలక సంస్థ, వట్టిచెరుకూరు మండలాలలోని గ్రామాల్లో వంకాయలపాడు మేజరుకు అనుబంధంగా విస్తరించిన ఏ-మైనర్ సాగునీటి కాలువ అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఈ కాలువ ప్రారంభం అయ్యే వంకాయలపాడు మేజరు నుంచి నుంచి చివరి భూములుగా ఉన్న కుర్నూతల వరకు పది కిలోమీటర్లు విస్తరించి ఉంది. సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో పూడిక ఏర్పడడం వల్ల నీరు అంతంత మాత్రంగానే సరఫరా అవుతోంది.

తాగునీటికీ తప్పని అవస్థలు.. ఏ-మైనర్ కాలువ ఆయకట్టు పరిధిలో కొర్నెపాడు, పుల్లడిగుంట, కుర్నూతల, అంకిరెడ్డిపాలెం, లింగాయపాలెం, పొత్తూరు గ్రామాల పంటలను సాగు నీరు అందించాల్సి ఉంది. కొర్నెపాడు, పుల్లడిగుంట, కుర్నూతల గ్రామాల మంచినీటి చెరువులకు తాగునీరు నింపుకొనేందుకు ఇదొక్కటే మార్గం. ప్రతి సంవత్సరం ఇందులో నీరు ఆయా చెరువులకు అందటం లేదు. ఫలితంగా నీటి ఎద్దడి ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి కాలువ ప్రక్షాళన పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వేసవిలోనే ఆ మేరకు పూడికతీత పనులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దేశాభివృద్ధికి జనగణన దోహదం


వివరాలు నమోదు చేస్తున్న కమిషనర్ అలీం బాషా తదితరులు

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: జనగణన కార్యక్రమం దేశ ఆర్థికాభివృద్ధికి పునాది వంటిదని, ప్రజల జీవన స్థితిగతులను అర్థం చేసుకోవడానికి అవసరమని మంగళగిరి, తాడేపల్లి నగర పాలక కమిషనర్ అలీం బాషా అన్నారు. మంగళగిరి పట్టణంలోని శాలివాహన నగర్‌లో శుక్రవారం ఆయన జనగణన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి కుటుంబం కచ్చితమైన వివరాలు అందించి సిబ్బందికి సహకరించాలన్నారు. మొదటి దశ గృహ వివరాల లెక్కలు ప్రక్రియ నెల రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి 539 మంది ఎన్యూమరేటర్లు, 87 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో 76.22 శాతం ఉత్తీర్ణత

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో మంగళగిరి మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా ఆరు జిల్లా పరిషత్, మూడు ఎయిడెడ్, మూడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు 715 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 545 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 76.22 గా నమోదైంది. మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఉత్తీర్ణత శాతం పెరగటంపై హర్షం వ్యక్తమవుతోంది.

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలంలోని ఆరు జడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు కేసీపీర్స్ హైస్కూల్‌లో పదో తరగతిలో 519 మంది పరీక్షకు హాజరుకాగా 363 మంది ఉత్తీర్ణులయ్యారు. 69.94 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 264 మంది బాలురు, 255మంది బాలికలు, పరీక్షలకు హాజరయ్యారు. 363 మంది విజయకేతనం ఎగరవేశారు.

నిత్యావసరాల అందజేత

మంగళగిరి, న్యూస్‌టుడే: కిందిస్థాయి సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహిస్తేనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని మంగళగిరి శివాలయం పాలక మండలి ఛైర్మన్ బోగి కోటేశ్వరరావు అన్నారు. మేడే సందర్భంగా ఆలయంలో విధులు నిర్వహిస్తున్న స్వీపర్స్, కార్యాలయ సిబ్బందిని పాలక మండలి సభ్యులు తిరుమలశెట్టి మురళీకృష్ణతో కలిసి సత్కరించారు. అనంతరం నిత్యావసరాలు పంపిణీ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు


గ్రామోత్సవానికి బయలుదేరిన స్వామివారు


దుగ్గిరాలలో గ్రామోత్సవం

నాగులపాడు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: [illegible] సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి [illegible]

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక శివాలయంలోని [illegible]

కనుల పండువగా కల్యాణం

లేమల్లెపాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: [illegible]

వైభవంగా ఆలయాల వార్షికోత్సవం

పాలపర్రు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: [illegible]


ఎమ్మెల్యే రామాంజనేయులు ఆధ్వర్యంలో..


లాం: దివ్యాంగుడికి పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్


దుగ్గిరాలలో ఎంపీపీ, ఎంపీడీవో ఆధ్వర్యంలో

సంక్షేమం.. అభివృద్ధే కూటమి లక్ష్యం

మంగళగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయ రావు, పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. మంగళగిరిలోని 8, 19, 21, 22 వార్డుల్లో శుక్రవారం వారు ఎన్టీఆర్ సామాజిక [illegible]

[illegible] ళ్లో ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్‌దారులకు పండగేనని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. [illegible]


మంగళగిరి: పింఛన్ పంపిణీ చేస్తున్న తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు ధనుంజయరావు, పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ అబద్ధయ్య

[illegible] పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. నగరపాలిక పరిధిలో 12,839 మందికి రూ.5.55 కోట్ల విలువైన పింఛన్లు అందజేసినట్లు చెప్పారు.

పింఛన్‌దారులకు పండగే

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదే[illegible]

వృద్ధులకు కొండంత అండ..

తాడికొండ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులకు కొండంత అండగా నిలుస్తున్నాయని, ఎవరిపై ఆధారపడి గౌరవంగా జీవిస్తున్నారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ [illegible] గ్రామంలోని వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. లబ్ధిదారుడు షేక్ జబ్బార్ ఖాన్ దివ్యాంగుడు కావడంతో ఆయన ఇంటికి వెళ్లి అతనితో పాటు నేలపై కూర్చుని ఎమ్మెల్యే పింఛను అందజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కళాశాల బస్సు ఢీ.. మనవడి మృతి

అమ్మమ్మ, తాతయ్యలకు తీవ్ర గాయాలు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: కళాశాల ఇంజినీరింగ్ కళాశాల బస్సు ఢీ కొనడంతో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేటకు చెందిన ప్రకాశ్ (28), తన తాతయ్య మాధవరావు, అమ్మమ్మ రాధలతో కలిసి ద్విచక్రవాహనంపై చౌడవరం వచ్చారు. పని ముగించుకుని గుంటూరు వెళ్తుండగా దాసరిపాలెం అండర్‌పాస్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఇంజినీరింగ్ కళాశాల బస్సు వెనుక ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో [illegible]

ఎరువుల వాడకంపై అవగాహన

తాడికొండ: [illegible] ఎం.గంగాదేవి పేర్కొన్నారు. తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు ఎరువుల వాడకంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంగాదేవి మాట్లాడుతూ.. పంటల్లో నత్రజని, పాస్పరస్ పొటాష్ ప్రాధాన్యాన్ని వివరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికే అధికారులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టరు బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గ [illegible] నికి చెందిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులకు అర్జీలను పంపించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించేలా చూస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

చిరు వ్యాపారులకు అండ


లబ్ధిదారులకు బండ్లు అందజేస్తున్న పల్లబోతుల శ్రీనివాసరావు, నాయకులు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ చొరవతో మంగళగిరి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు చిరువ్యాపారులకు బడ్డీకొట్లు, టిఫిన్, తోపుడు, ఇస్త్రీ బండ్లు, ప్లాట్‌ఫాం రిక్షాలను అందజేశారు. మంగళగిరి పట్టణానికి చెందిన సూఫూరి వెంకటేశ్వరరావు, షేక్. జబీనా, విజయలక్ష్మి, కామేశ్వరి, వెంకటేశ్వర్లుకు వీటిని అందజేశారు. తెదేపా మంగళగిరి పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ప్రజల సమస్యలను తెలుసుకొని అండగా నిలుస్తున్నారని అన్నారు. తెదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్. రియాజ్, అన్నెం నాగబాబు, వంగర హనుమాన్, షేక్.సుభాని, కొక్కిరపాటి పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ❖ గ్రామీణ మండలానికి చెందిన మొహమ్మద్ సలాలుద్దీన్, ముప్పా బ్రహ్మం, శివపార్వతిలకు తోపుడు బళ్లను స్థానిక నాయకులు అందజేశారు. తెదేపా మండలాధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, చినకాకాని గ్రామ తెదేపా అధ్యక్షుడు గుమ్మా హరిబాబు, కుక్కమళ్ల శ్రీనివాసరావు, గుర్రం నరసింహారావు, బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ స్వంత ఖర్చులతో పెదపాలెంలో కొడాలి వీరాంజనేయులుకు తోపుడుబండి, చిలువూరులో షేక్ మహబూబ్‌భాషాకు టిఫిన్ బండిని పంపారు. వీటిని తెదేపా మండల ఇన్‌ఛార్జి తేసంనేని శ్రీఅనిత, పార్టీ నాయకులు శుక్రవారం అందజేశారు. పెదపాలెంలో మాజీ సర్పంచి పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు పుతుంబాక సాయికృష్ణ, కొండూరు యాకోబ్ చిలువూరులో ఎంపీపీ షేక్ జబీన్, తోటకూర సీతారామయ్య, శొంఠి రమేష్, ఏసుపాదం, లియాఖత్‌వలి తదితరులున్నారు.


పెదపాలెంలో

పేదలకు మంత్రి లోకేశ్ భరోసా


లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న కిరణ్‌చంద్, నాయకులు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్య బాధితులకు మంత్రి నారా లోకేశ్ చొరవతో సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి. వీటిని మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముతకన సుజాతకు రూ.35,278, ప్రసాద్‌కు రూ.21,000, చిట్టిబొమ్మ హైమావతికి రూ.23,920, కంచర్ల వెంకటేశ్వరమ్మకు రూ.23,986 చొప్పున సాయం అందింది. తెదేపా గ్రామ అధ్యక్షుడు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్‌బాబు, వెంకటేశ్వరరావు, జాలాది సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ శుక్రవారం తమ పార్టీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 113 తాళ్ళూరు గ్రామ వాసులైన పసుపులేటి వెంకటరమణకు రూ.25000, సంపతి ముత్తయ్యకు రూ. 33,750, దూదేకుల మస్తాన్‌కు రూ. 87,983 చొప్పున సాయం అందింది.

చదువుతోపాటు నైపుణ్యాలు సాధించాలి


వాలీబాల్ శిక్షణ ప్రారంభిస్తున్న విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య

పెదనందిపాడు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు సాధించాలని విజ్ఞాన్ సంస్థల అధినేత లావురత్తయ్య అన్నారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం కళాశాల పాలకవర్గం సహకారంతో ఏర్పాటు చేసిన వాలీబాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రసంగించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు సమదుస్తులను పంపిణీ చేశారు. 13 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు బీ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం నంది పాఠశాలలో పదోతరగతి చదివి 590 మార్కులు సాధించిన అభిషేక్, 582 మార్కులు పొందిన జాహ్నవి, 578 మార్కులు సాధించిన టి.జ్యోత్స్నరాణిలతో పాటు వారి తల్లిదండ్రులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వీరయ్య, సత్యనారాయణ, ప్రిన్సిపల్ వీరరాఘవయ్య, పీడీ శ్రీనివాస్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ ఒక్క రోజు ముచ్చటే..!

దుగ్గిరాల, న్యూస్‌టుడే: రేవేంద్రపాడు వద్ద ట్రాఫిక్ నియంత్రణ ఒక్క రోజు మురిపంగా మారింది. శుక్రవారం ఉదయం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. దాదాపు అరగంట సేపు వాహనరాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ప్రతి రోజూ తెనాలి-మంగళగిరి ప్రధాన రహదారిలో వెళ్లే వాహనాలు, రేవేంద్రపాడు వంతెన మీద నుంచి వచ్చే వాహనాలు కలిసే చోట ట్రాఫిక్ అవస్థలు ఏర్పడుతున్నాయి. ఏదో వాహనం మధ్యలో ఇరికించడం, ఇక అన్నీ ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడడం మామూలైంది. రేవేంద్రపాడుకు చెందిన అన్వర్ అనే యువకుడు సామాజిక కోణంలో ట్రాఫిక్ అవస్థలపై గుంటూరులో కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్‌శాఖకు తెలిపారు. మరుసటి రోజు ఇద్దరు కానిస్టేబుళ్లను అక్కడ ఉంచి చర్యలు తీసుకున్నారు. అదీ ఒక్క రోజు మాత్రమే. తర్వాత రోజు నుంచి మళ్లీ మామూలే. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేవేంద్రపాడు వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీసు సేవలు ఉండాలని ప్రజలు కోరుతున్నారు.


రేవేంద్రపాడు వద్ద ఆగిన వాహనాలు

ప్రమాదాల కూడలి



మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని పేరేచర్ల శివారు తెల్ల క్వారీకి వెళ్లే దారి మలుపులోని కూడలి వద్ద ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. రాత్రి వేళల్లో వీటిని గమనించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం నేడు

పెదనందిపాడు: పెదనందిపాడు మండలం అన్నపర్రు కేఎస్సార్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం 8 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం జరగనుంది. యశోద హాస్పటల్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నపర్రు గ్రామపెద్దల సహాయ సహకారాలతో శిబిరాన్ని నిర్వహించనున్నారని నిర్వాహకులు కె.దైవప్రసాద్ తెలిపారు.


కొలువుదీరిన నూతన కార్యవర్గం

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: మంగళగిరి ఆర్య వైశ్య మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆర్య వైశ్య సంఘాల సమాఖ్య అధ్యక్షుడు సంకా బాలాజీ గుప్తా అధ్యక్షతన జరిగిన సమావేశంలో శుక్రవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి కల్యాణ మండపంలో కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షురాలిగా డాక్టర్ పొట్టి గిరిజ, కార్యదర్శిగా త్రిపురమల్లు అపర్ణా పార్వతి, కోశాధికారి పొట్టి వెంకటకీర్తి సహా 20మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర విభాగ అధ్యక్షుడు దేవతి భగవన్నారాయణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వనమా వేణుగోపాల్, మద్దుల శివశంకర ప్రసాద్, డాక్టర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్, బీటెక్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఎమ్మెస్సీ బోటనీలో 71 మంది పరీక్ష రాయగా 50 మంది, సాయిల్ సైన్స్, అగ్రికల్చర్ కెమిస్ట్రీలో 29 మంది పరీక్ష రాయగా 24 మంది, ఎంఏ జర్నలిజంలో ఎనిమిది మంది పరీక్ష రాయగా ఏడుగురు, జువాలజీలో పరీక్ష రాసిన 56 మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన చెప్పారు.

ఐక్య ఉద్యమాలతోనే శ్రామిక హక్కులకు రక్షణ


పెదనందిపాడులో..


ప్రత్తిపాడులో..


దుగ్గిరాలలో సీపీఎం నాయకులు


మంగళగిరి: మున్సిపల్ కార్యాలయం వద్ద..

మంగళగిరి, న్యూస్‌టుడే: ఐక్య ఉద్యమాలతో కార్మికుల హక్కులకు రక్షణ ఉంటుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. మంగళగిరి ఇందిరా నగర్ సీపీఐ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా శుక్రవారం ఏఐటీయూసీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల వ్యాప్తంగా కార్మిక సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి.

కార్మికులంతా ఏకతాటిపై నిలవాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: కార్మికులంతా ఏకతాటిపై నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ అన్నారు. మేడే సందర్భంగా శుక్రవారం స్థానిక పాతబస్టాండ్ కూడలి, వరగానిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని సీఐటీయూ జెండా ఎగురవేశారు.


మేడికొండూరు: పేరేచర్లలో


తుళ్లూరులో సీపీఎం నాయకుల నినాదాలు


మంగళగిరి గ్రామీణం: యర్రబాలెంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు

నూరు శాతం ఉత్తీర్ణత


అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, మాజీ సర్పంచి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

పెదపాలెం(దుగ్గిరాల), న్యూస్‌టుడే: పెదపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఈ ఏడాది నూరుశాతం ఫలితాలు సాధించింది. పరీక్షలకు హాజరైన వారందరూ ఉత్తీర్ణులయ్యారు. దీనికి తోడు ఆ స్కూలుకు చెందిన బుక్కా సాయిచందన 579 మార్కులు సాధించి మండలంలోని ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పాఠశాలలో ఐదుగురు బాలికలు 500 కన్నా ఎక్కువ మార్కులు సాధించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులను మాజీ సర్పంచి పాటిబండ్ల కృష్ణప్రసాద్ అభినందించారు. ఐదుగురు బాలికల్ని సత్కరించారు.

విద్యార్థులకు పోటీలు


నృత్యం చేస్తున్న చిన్నారులు

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచే బాలబాలికల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలని పాస్టర్లు కంభం వరప్రసాద్, నామా నవీన్, మన్యంపూడి దయారత్నం అన్నారు. మంగళగిరిలోని పరిశుద్ధ సెయింట్ పౌలు లూథరన్ టౌన్ చర్చి ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహించిన సీబీసీ తరగతులు గురువారం రాత్రితో ముగిశాయి. నృత్యం, ఆటల పోటీలు నిర్వహించారు. తరగతులకు హాజరైన బాలబాలికలకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, తాడికొండ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు తీర్చేందుకే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. గుంటూరులోని తాడికొండ నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే అధ్యక్షతన గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్ద నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. తాడికొండ, ఫిరంగిపురం, ఇతర మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.26,08,301ల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

మొక్కజొన్న చేను దగ్ధం

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం గుండిమెడలో శుక్రవారం మధ్యాహ్నం మొక్కజొన్న చేను దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి పడేయడంతో చేనుకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. గ్రామానికి చెందిన ఆరవల్లి శ్రీనివాస్ ఆరు ఎకరాలు మొక్కజొన్న వేశారు. ఇందులో దాదాపుగా రెండెకరాలు మంటల్లో కాలిపోయింది. మంగళగిరి అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు.

ఆ నగరం కుంగిపోతోంది



సరైన ప్రణాళిక లేని నగర విస్తరణ వల్ల కలిగే విపరిణామాలకు ఇది నిదర్శనం. మెక్సికో రాజధాని అయిన మెక్సికో సిటీ అసాధారణ స్థాయిలో కుంగుతోంది. ఇది ఎంత తీవ్రంగా ఉందంటే.. రోదసి నుంచి కూడా ఈ పరిణామం కనిపించింది. భూకక్ష్యలో పరిభ్రమిస్తున్న భారత్, అమెరికా సంయుక్త ఉపగ్రహం నైసార్ దీన్ని పసిగట్టింది. ఈ నగరం ఏటా 10 అంగుళాల మేర కుంగుతోందని అది పంపిన చిత్రం స్పష్టంచేస్తోంది. దీంతో ప్రపంచంలోనే అత్యంత వేగంగా కుంగిపోతున్న మహానగరాల్లో ఒకటిగా మెక్సికో సిటీ నిలిచింది. ఎక్కువ జనాభా కలిగిన నగరాల్లో మెక్సికో సిటీ కూడా ఒకటి. దీని విస్తీర్ణం 7,800 చదరపు కిలోమీటర్లు కాగా.. 2.2 కోట్ల మంది ఇక్కడ ఉంటున్నారు. ఈ నగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాన్ని ఒక పురాతన సరస్సు గర్భంపై నిర్మించారు. ఇక్కడి ముఖ్యమైన వీధులు ఒకప్పటి కాలువలు. ఈ ప్రాంతంలో నగర విస్తరణ, భూగర్భజలాలను విపరీతంగా తోడేయడం వల్ల నేలలోని జలాశయ గర్భం కిందికి పోతోంది. దీంతో శతాబ్ద కాలంగా నగరం కుంగుతోంది. ఫలితంగా పురాతన భవనాలు ఒకపక్కకు ఒరిగిపోయినట్లు కనిపిస్తున్నాయి. కుంగుదల వల్ల మెక్సికో సిటీలోని సబ్‌వేలు, మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఇళ్లు, వీధులు దెబ్బ తింటున్నాయి. శతాబ్ద కాలంలో 39 అడుగుల మేర నగరం కుంగినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.


అక్కడ అమెరికా ఏం చేస్తోంది?



అమెరికాలోని నెవాడా ఎడారిలో ఉన్న 'ఏరియా 51' ప్రదేశంలో బుధ, గురువారాల్లో ఏకంగా 17 భూ ప్రకంపనలు సంభవించాయి. ఈ అసాధారణ పరిణామం అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. అమెరికా రహస్య అణుపరీక్షే దీనికి కారణమా అన్న సందేహాలు కొందరిలో మొదలయ్యాయి. అణ్వస్త్ర పరీక్షలకు సిద్ధం కావాలని ఆ దేశాధ్యక్షుడు కొద్దినెలల కిందట సైన్యాన్ని ఆదేశించడం ఈ అనుమానాలకు మూలం. గ్రహాంతరవాసుల వ్యోమనౌకలు (యూఎఫ్‌వో) ఇక్కడ సంచరించాయన్న ఊహాగానాలు గతంలో ఉండేవి. దీంతో తాజా ప్రకంపనలకు అవే కారణమా అనే సందేహాలు మరికొందరిలో ఉన్నాయి.

ఏమిటీ ప్రకంపనలు? : నెవాడా ఎడారి ప్రాంతంలో అత్యంత రహస్య వైమానిక స్థావరానికి వేదికైన ఏరియా-51 సమీపంలో 24 గంటల వ్యవధిలో 17 ప్రకంపనలు వచ్చాయి. వీటి తీవ్రత రిక్టర్ సూచీపై 2.5 నుంచి 4.4 మధ్య నమోదైంది. వీటిలో అత్యంత బలమైన ప్రకంపన.. భూ ఉపరితలానికి 4 కిలోమీటర్ల లోతులోనే వచ్చింది. ఒక్కసారిగా ఇన్ని ప్రకంపనలు రావడాన్ని 'సైస్మిక్ స్వార్మ్' అంటారు. ఆ ప్రాంత భౌగోళిక తీరుతెన్నుల రీత్యా అది ఒకింత అసాధారణమే. నేల లోపల ఏదైనా రహస్య కార్యక్రమమే దీనికి కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు.

క్రికెట్ ప్యాడ్‌లు, గ్లవ్స్‌లో రూ.1,745 కోట్ల డ్రగ్స్



దిల్లీ: మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో (ఎన్సీబీ) ఓ భారీస్థాయి అంతర్జాతీయ అక్రమ రవాణా ప్రయత్నాన్ని అడ్డుకుంది. రూ.1,745 కోట్ల విలువ చేసే 349 కేజీల కొకైన్‌ను ముంబయిలో స్వాధీనం చేసుకుంది. "వైట్ స్ట్రైక్" పేరుతో దీర్ఘకాలిక పథక రచన అనంతరం నిర్వహించిన ఆపరేషన్ ఈ విజయానికి దారితీసింది. ఇందులో భాగంగా క్రికెట్ ప్యాడ్‌లలో, చేతి తొడుగు (గ్లవ్స్)లో, ఇంపోర్టెడ్ యంత్రాల ఖాళీ ప్రదేశాల్లో మాదక ద్రవ్యాల ప్యాకెట్లను చొప్పించి వాటిని దేశంలోకి తెచ్చే ప్రయత్నాన్ని ఎన్సీబీ అధికారులు పసిగట్టారు. దాదాపు ఆరు నెలలపాటు సమాచార సేకరణ, నిఘా తదితర కార్యకలాపాల అనంతరం చివరికి నవీ ముంబయి, ఠాణె జిల్లాల్లో కలంబోలీ - భివండీ కారిడార్‌లో దాడులు నిర్వహించామని ఎన్సీబీ అధికార వర్గాలు తెలిపాయి. ఎన్సీబీ సాధించిన విజయంపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. "నార్కోటిక్స్ బ్యూరో ఓ భారీ స్థాయి అంతర్జాతీయ మాదక ద్రవ్యాల ముఠా గుట్టు రట్టు చేసింది. బ్యూరో కింది స్థాయి నుంచి పై వరకూ సమన్వయంతో చేస్తున్న పనికి ఇదో మంచి ఉదాహరణ" అని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఎన్సీబీ బృందాలు ఇప్పుడు ఈ అక్రమ రవాణా ముఠా ప్రధాన సూత్రధారి, కొనుగోలు దారులు, అక్రమ రవాణాకు ఆర్థిక సాయం అందించినవారు ఎవరన్న అంశంపై విచారణ జరుపుతున్నాయి.

లఖ్‌నవూ రన్‌వేపై కోతులు ఇండిగో టేకాఫ్ నిలిపివేత

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూ నుంచి రాయ్‌పుర్‌కు వెళ్లాల్సిన ఇండిగో విమానం టేకాఫ్‌ను ఓ కోతుల గుంపు రన్‌వే దాటుతున్న కారణంగా నిలిపివేసినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. 6ఈ 6521 విమానం గురువారం ఉదయం 150 మందితో టేకాఫ్‌కు సిద్ధమైంది. 20 - 30 శాతం దూరం వెళ్లాక పైలట్లు రన్‌వేపై కోతులను గమనించారు. వెంటనే టేకాఫ్‌ను నిలిపివేసి, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విమానాశ్రయంలోని వన్య ప్రాణుల నిర్వహణ బృందం వెంటనే రంగంలోకి దిగి రన్‌వేపై ఉన్న కోతులను తరలించింది. వెనక్కి వచ్చిన ఇండిగో విమానం తిరిగి ఇంధనం నింపుకొన్నాక గంట ఆలస్యంగా బయలుదేరింది.



శక్తిని అనుసరించి పనులు ఎంచుకోవాలి

మనలో ఉత్సాహం, శక్తి స్థాయిలు రోజంతా ఒకేలా ఉండవు. ఆ ప్రకారం రోజంతా ఒకేరకంగా పనిచేయాలని భావించడం సరికాదు. కాబట్టి ఉత్సాహం, ఓపిక ఎక్కువగా ఉండే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ క్లిష్టమైన, కొత్త ఆలోచనలతో కూడిన, ఏకాగ్రత చూపాల్సిన పనులను పూర్తి చేసుకోవాలి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ తేలికపాటి పనులు చేసుకోవాలి.

– రోడ్ జోన్స్,
మాజీ క్రీడాకారుడు

సుప్రీం తలుపు తట్టిన మమత

కోల్‌కతా: ఓట్ల లెక్కింపునకు సమయం సమీపిస్తున్నా... ఎన్నికల సంఘంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోరాటాన్ని ఆపటం లేదు. తాజాగా బెంగాల్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపులో కేవలం కేంద్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ సుప్రీంకోర్టు తలుపుతట్టింది. కలకత్తా హైకోర్టు దీనిపై వ్యాజ్యాన్ని ఇప్పటికే కొట్టివేయడంతో సుప్రీంకు వెళ్లారు. దీనిపై సుప్రీంకోర్టులో శనివారం విచారణ జరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే ఓట్ల లెక్కింపునకు అనుమతించాలని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి అక్రమం లేదని కలకత్తా హైకోర్టు పేర్కొంది.

■ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవకతవకలకు అవకాశం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి మనోజ్ అగర్వాల్ శుక్రవారం తెలిపారు. ఈవీఎంలు తారుమారయ్యాయంటూ మమత గురువారం భవానీపుర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన గది వద్ద ధర్నా చేసిన నేపథ్యంలో అగర్వాల్ ఈ ప్రకటన వెలువరించారు.

15 కేంద్రాల్లో రీపోలింగ్: పశ్చిమ బెంగాల్‌లోని మగ్రాహాట్ పశ్చిమ్, డైమండ్ హార్బర్ శాసనసభ నియోజకవర్గాల్లో 15 చోట్ల శనివారం రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

ఇరాన్‌తో యుద్ధం ముగిసింది


కాంగ్రెస్‌కు తెలిపిన శ్వేతసౌధం

వాషింగ్టన్: ఇరాన్‌తో యుద్ధానికి అనుమతి పొందాల్సిన అవసరం లేకుండా ట్రంప్ సర్కారు జాగ్రత్త పడింది. ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతోనే ఆ యుద్ధం ముగిసిందని కాంగ్రెస్‌కు శ్వేతసౌధం శుక్రవారం తెలిపింది. ఇప్పటికే సెనెట్‌లో విచారణకు హాజరైన అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై సైనిక చర్య 60 రోజులకు మించి కొనసాగలేదని, కాబట్టి 1973 నాటి చట్టానికి అనుగుణంగా ఆ యుద్ధానికి కాంగ్రెస్ అనుమతి పొందాల్సిన అవసరం లేదని అన్నారు.

ఈయూ కార్లపై సుంకం 25 శాతానికి పెంపు: తమ దేశంతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని అమలుచేయని ఐరోపా సమాఖ్య (ఈయూ)పై అదనపు సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ఈయూ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే కార్లు, ట్రక్కులపై సుంకాన్ని 25 శాతానికి పెంచుతున్నట్లు వెల్లడించారు.

పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా?

కొట్టిపారేయలేమన్న ప్రభుత్వ వర్గాలు



దిల్లీ: సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును కొట్టిపారేయలేమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ, నాలుగేళ్లుగా రిటైల్ ధరలు సవరించకపోవడం వల్ల నష్టాలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేమని పేర్కొన్నాయి. హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రాకపోకలపై ఆంక్షలు, అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు కొలిక్కి రాకపోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇటీవల బ్యారెల్ ధర 126 డాలర్లకు చేరుకుంది. నాలుగేళ్లలో ఇదే గరిష్ఠం. ఆ తర్వాత కొంత తగ్గి ప్రస్తుతం 110 డాలర్లపైనే కొనసాగుతోంది.

ఇది ఎన్నికల బిల్లే.. ఇక పెట్రోల్ వంతు: రాహుల్


వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది 'ఎన్నికల బిల్లు' అంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. కేంద్రం తర్వాతి బాదుడు పెట్రోల్, డీజిల్‌పైనే అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఎన్నికల తర్వాత ద్రవ్యోల్బణ సెగ తగులుతుందని నేను ముందే చెప్పా. అన్నట్లుగానే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఒకేసారి రూ.993 పెంచారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు వాణిజ్య సిలిండర్‌పై రూ.1380 పెంచారు. అంటే కేవలం మూడు నెలల్లోనే 81శాతం పెరిగింది. టీ స్టాల్, దాబా, హోటల్, బేకరి, స్వీట్‌షాపులకు ఇక భారమే. ఈ ప్రభావం మీ ప్లేట్‌పైనా పడుతుంది. ఇప్పుడు గ్యాస్‌పై పెంచారు. తర్వాతి బాదుడు పెట్రోల్, డీజిల్‌పైనే" అని రాహుల్ గాంధీ కేంద్రంపై మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీని 'ఇన్‌ఫ్లేషన్ మ్యాన్ మోదీ' అంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. వాణిజ్య సిలిండర్ల ధరలను కేంద్రం తరచూ పెంచుతూ వ్యాపారాలను భారంగా మారుస్తోందని దుయ్యబట్టింది.

ఈ బూట్లతో షూట్ చేయొచ్చు



ఈటీవీ భారత్: రేయింబవళ్లు సరిహద్దుల్లో కాపలా కాసే సైనికుల కోసం ప్రత్యేకంగా బూట్లు సిద్ధమయ్యాయి. ఉత్తర్‌ప్రదేశ్ గోరఖ్‌పుర్ ఐటీఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు వీటిని తయారు చేశారు. ప్రస్తుతం ఇవి ప్రయోగ దశలో ఉన్నాయి. ఏఐ సాంకేతికతతో కూడిన ఈ బూట్ల సాయంతో శత్రువుల కదలికలను ముందుగానే పసిగట్టవచ్చు. ఇందులో అమర్చిన ప్రత్యేక గన్‌తో 100 మీటర్ల దూరంలోని లక్ష్యాలపైకి కాల్పులు జరపవచ్చు. బుల్లెట్లు అయిపోతే హైవోల్టేజ్ విద్యుత్ తరంగాలను ఇది ఉత్పత్తి చేయగలదు. ఈ బూట్లలోని మినీ కెమెరాలు, మోషన్ సెన్సర్లు సైనికుల చుట్టుపక్కల అనుమానాస్పద కదలికలను గుర్తించిన వెంటనే అప్రమత్తం చేస్తాయి. వైఫై సామర్థ్య కెమెరా, జీపీఎస్ వ్యవస్థలు క్లిష్ట పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌లతో సైనికులు అనుసంధానమై ఉండేందుకు సహాయపడతాయి. వీటిని వైర్‌లెస్ రిమోట్‌తోనూ ఆపరేట్ చేయవచ్చు. రూ.40 వేల వ్యయంతో ఏఐ సాయంతో వీటిని రూపొందించినట్లు విద్యార్థులు పేర్కొన్నారు.

14–16 మధ్య అండమాన్‌కు నైరుతి రుతుపవనాలు



దిల్లీ: నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే వచ్చే అవకాశం ఉందని, ఈనెల 14 నుంచి 16 మధ్య ఇవి అండమాన్ నికోబార్ దీవులను తాకొచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చెప్పింది. ఇది సాధారణ సమయం కంటే కొంచెం ముందే కావడం గమనార్హం. దీంతో మేలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ భారతంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఈసారి మే నెలలో పగటిపూట మాత్రమే కాదు, రాత్రి సమయాల్లోనూ వేడి ఎక్కువగా ఉంటుందని ఐఎండీ వెల్లడించింది. దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో సముద్రపు తేమతో కూడిన వేడి గాలి వల్ల ఎక్కువ ఉక్కపోత ఉండొచ్చని ఐఎండీ తెలిపింది.

లద్దాఖ్‌లో బుద్ధ అవశేషాల ప్రదర్శన



బుద్ధుడి అవశేషాలకు నమస్కరిస్తున్న అమిత్ షా

లేహ్/జమ్మూ: క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు.. ప్రజల సందర్శనార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్ధార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు. ఈ బుద్ధ అవశేషాలను విలియమ్ క్లాక్స్‌టన్ పెప్పె అనే బ్రిటిష్ జమీందారు ఒక పురాతన స్తూపంలో కనుగొన్నాడు. అవశేషాల్లో అస్థికలతోపాటు 1500 విలువైన రాళ్లు, బంగారు ఆభరణాలు కూడా ఉన్నాయి. వీటిని గత సంవత్సరం భారత్‌కు అందజేశారు. తాజాగా లేహ్ ప్రాంతంలోని జీవేత్సల్‌లో 2569వ బుద్ధ పూర్ణిమ సంబరాల సందర్భంగా ఈ అవశేషాల ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ప్రారంభించారు.

విద్వేష ప్రసంగ నేరమేదీ జరగలేదు

- అనురాగ్ ఠాకుర్, పర్వేశ్ వర్మలపై దాఖలైన వ్యాజ్యాల్లో సుప్రీంకోర్టు తీర్పు
- సీపీఎం నేతల పిటిషన్లు కొట్టివేత

దిల్లీ: పౌరసత్వ సవరణ చట్ట(సీఏఏ) వ్యతిరేక ఉద్యమం(2020)లో పాల్గొన్న వారిపై విద్వేష ప్రసంగాలు చేశారంటూ భాజపా నేతలు అనురాగ్ ఠాకుర్, పర్వేశ్ వర్మలపై దాఖలైన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పిటిషనర్లు చెబుతున్నట్లుగా గుర్తించదగిన నేరం ఏదీ జరగలేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఏప్రిల్ 29న పేర్కొంది. దీనికి సంబంధించిన తీర్పు ప్రతి శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. అనురాగ్ ఠాకుర్ కేంద్ర మాజీ మంత్రి కాగా, పర్వేశ్ వర్మ ప్రస్తుతం దిల్లీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. వీరిద్దరిపై విద్వేష ప్రసంగం కేసు నమోదు చేయాలన్న తమ అభ్యర్థనలను 2022 జూన్‌లో దిల్లీ హైకోర్టు తోసిపుచ్చగా సీపీఎం నేతలు బృందా కారాట్, కె.ఎం.తివారీ.. సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అంతకు ముందు ట్రయల్ కోర్టు కూడా సీపీఎం నేతల పిటిషన్‌ను కొట్టివేసింది. "అనురాగ్ ఠాకుర్, పర్వేశ్‌వర్మల ప్రసంగాలను హైకోర్టు స్వతంత్రంగా పరిశీలించింది. నేరంగా పరిగణించదగినది ఏమీ లేదని తేల్చింది. వారి ప్రసంగాలు ఏ వర్గానికీ వ్యతిరేకంగా లేవని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదనీ అభిప్రాయపడింది" అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించలేదని వెల్లడించింది.

పవన్‌ఖేడాకు ఉపశమనం



- సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ మంజూరు

దిల్లీ: కాంగ్రెస్ నేత పవన్ ఖేడాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ భార్యపై ఆరోపణల కేసులో న్యాయస్థానం ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనకు పలు పాస్‌పోర్టులు, విదేశాల్లో ఆస్తులు ఉన్నాయన్న ఖేడా ఆరోపణలపై హిమంత బిశ్వశర్మ సతీమణి రినికి భుయాన్ శర్మ ఫిర్యాదుతో గువాహటిలో కేసు నమోదైంది. ముందస్తు బెయిల్ అభ్యర్థనను గువాహటి హైకోర్టు తిరస్కరించడంతో పవన్ ఖేడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్ ధర్మాసనం గురువారం తీర్పు రిజర్వు చేసింది. తీర్పు ప్రతిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో శుక్రవారం అప్‌లోడ్ చేసింది. పవన్ ఖేడాకు షరతులతో ముందస్తు బెయిల్ ఇస్తున్నట్లు పేర్కొంది. రాజకీయ స్పర్థలే ఈ కేసుకు కారణమని అభిప్రాయపడింది. విచారణకు సహకరించాలని, పిలిచినప్పుడు పోలీసుల ముందు హాజరుకావాలని ఖేడాను ధర్మాసనం ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదనీ స్పష్టం చేసింది. అదనపు షరతులు విధించే స్వేచ్ఛ ట్రయల్ కోర్టుకు ఉందని పేర్కొంది. పవన్ ఖేడాకు ముందస్తు బెయిల్ లభించడంపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. వ్యక్తి స్వేచ్ఛ పరిరక్షణలో న్యాయస్థానాలే చివరి ఆధారమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వి పేర్కొన్నారు. ధర్మాసనం నిర్ణయాన్ని రాజ్యాంగ విజయంగా ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ అభివర్ణించారు.



నౌకాదళం చేతికి మహేంద్రగిరి

దిల్లీ: స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన స్టెల్త్ ఫ్రిగేట్ యుద్ధనౌక 'మహేంద్రగిరి' భారత నౌకాదళం చేతికి అందింది. శక్తిమంతమైన ఆయుధాలు, అధునాతన సెన్సర్లు ఈ వార్‌షిప్ సొంతమని నౌకాదళ అధికారులు శుక్రవారం తెలిపారు. ముంబయిలోని మజ్గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ సంస్థ దీన్ని నేవీకి అందించిందన్నారు. మహేంద్రగిరి.. నీలగిరి తరగతి (ప్రాజెక్ట్-17ఏ)లో ఆరో యుద్ధనౌక.

ఆలయానికి తీసుకొచ్చిన ఏనుగుల దాడి: ఇద్దరి మృతి

కొచ్చి/త్రిశ్శూర్: కేరళలోని రెండు వేర్వేరు ఆలయ ప్రాంగణాల్లో ఏనుగులు శుక్రవారం చేసిన ఆకస్మిక దాడుల్లో ఇద్దరు మృతిచెందారు. కొచ్చి సమీపాన అంగమాలిలోని కిడంగూర్ వద్ద ఉన్న ఆలయానికి తీసుకువచ్చిన ఏనుగు దాన్ని రవాణా చేసిన లారీ డ్రైవరుపై ఆకస్మిక దాడి చేసి చంపిందని, మావటిని తీవ్రంగా గాయపరిచిందని అధికారులు తెలిపారు. ఆలయ పరిధిలోని పలు వాహనాలను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. మరోవైపు, త్రిశ్శూర్ జిల్లాలోని ఇరింజాలకుడలో ఉన్న శ్రీ కూడల్‌మాణిక్యం ఆలయంలో జరగనున్న ఉత్సవం కోసం తీసుకువచ్చిన ఓ ఏనుగు దానికి ఆహారం తినిపిస్తున్న ఇద్దరు మావటి వాళ్లపై దాడి చేసింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు.

హిమంత వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ అసంతృప్తి

భారత హైకమిషనర్‌కు సమన్లు

ఢాకా: చొరబాటుదారుల గురించి ప్రస్తావిస్తూ అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు యునైటెడ్ న్యూస్ ఆఫ్ బంగ్లాదేశ్ వెల్లడించింది. భారత తాత్కాలిక హైకమిషనర్ పవన్ బాధేను గురువారం బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపినట్లు పేర్కొంది. హిమంత గతవారం అస్సాం నుంచి 20 మంది బంగ్లా చొరబాటుదారులను బలవంతంగా తిప్పిపంపినట్లు సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టు పెట్టారు. "మొండివాళ్లకు సున్నితమైన భాషలో చెబితే అర్థం కాదు. అస్సాం నుంచి వారంతట వారే వెళ్లిపోని చొరబాటుదారుల పట్ల మేం కఠినంగా వ్యవహరిస్తాం" అని హిమంత అందులో పేర్కొన్నారు.

ప్రభుత్వ విధానాలపై విమర్శలు ప్రజాస్వామ్యంలో తప్పేమీ కాదు

రాహుల్‌పై పిటిషన్‌ను కొట్టివేస్తూ అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్య

ప్రయాగ్‌రాజ్: ప్రభుత్వ చర్యలను, విధానాలను పరిశీలనాత్మక దృష్టితో చూడటం, వాటిని విమర్శించడం పార్లమెంటు ప్రజాస్వామ్యంలో అవశ్యకమేనని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారంటూ రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా 2025లో దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ డి చౌహాన్ శుక్రవారం కొట్టివేశారు. సైద్ధాంతికపరమైన భిన్నాభిప్రాయాలను కలిగి ఉండడం నేరం కాదని తెలిపారు. ప్రభుత్వంపై విమర్శలు గాను విపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని పిటిషనర్ సిమ్రాన్ గుప్తా కోరారు.

ఆహారంపైనా యుద్ధమిది..!

- 1000 కోట్ల భోజనాలు ప్రమాదంలో
- ప్రపంచాన్ని అతలాకుతలం చేయనున్న ఎరువుల సంక్షోభం



హర్మూజ్ జలసంధి మూతపడటంతో చమురే కాకుండా ఎరువుల సరఫరాపైనా పెను ప్రభావం చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఎరువుల వ్యాపారంలో (యూరియా, పొటాష్, అమ్మోనియా, ఫాస్ఫేట్) మూడింట ఒక వంతు ఈ మార్గం నుంచే జరుగుతోంది. ఇప్పుడు ఈ మార్గం మూసుకుపోవడంతో రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తి గణనీయంగా పడిపోనుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎరువుల ధరలు 80 శాతం వరకు పెరిగాయి. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులిలానే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రపంచ ఆహార భద్రతకు పెనుముప్పు వాటిల్లే అవకాశాలున్నాయి. తత్ఫలితంగా వారానికి దాదాపు 1000 కోట్ల భోజనాల(మీల్స్)కు ముప్పు తప్పదని, నిరుపేద దేశాలకు ఇది శరాఘాతమేనని ప్రపంచ ప్రఖ్యాత ఎరువుల కంపెనీల అధిపతుల్లో ఒకరైన స్వీన్ టోర్ హాల్‌సెథర్ హెచ్చరిస్తున్నారు. ఎరువుల రవాణాను ఆపేయడమంటే ఒకరకంగా ఆహారంపై యుద్ధం ప్రకటించడమేనని, ధనిక, పేదల మధ్య మరింత అంతరాన్ని పెంచడమేనని 'యారా' ఎరువుల కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అయిన స్వీన్ అభిప్రాయపడ్డారు. సంపన్న దేశాల్లోనూ ఆహార ధరలు మండిపోవచ్చునని ఆయన 'బీబీసీ' ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దాదాపు 5 లక్షల టన్నుల నత్రజని ఎరువును ఉత్పత్తి చేయలేక పోతున్నామని వివరించారు. నత్రజని వేయకపోతే పంటకాలం తొలిసీజన్‌లో దాదాపు 50 శాతం దిగుబడి తగ్గిపోతుందని విశ్లేషించారు. ఆసియా, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు దీనివల్ల తీవ్రంగా నష్టపోతాయని చెప్పారు. వారానికి వెయ్యికోట్ల భోజనాల్ని ఉత్పత్తిచేయలేకపోతే పేద దేశాల్లో ఆహార సంక్షోభం తప్పదన్నారు. ఎరువులు ఎక్కువగా నిల్వచేసుకున్న దేశాలకు తాత్కాలికంగా ఉపశమనం కలిగినా.. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే వాటికీ ముప్పు తప్పదని సింగపూర్‌లో ఆహార భద్రత సీనియర్ పరిశోధకులు ప్రొఫెసర్ పాల్ తేంగ్ అభిప్రాయపడ్డారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

వైట్‌హౌస్ డిన్నర్‌లో కాల్పులు.. నిందితుడి వీడియో విడుదల



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసులో ఓ కీలక వీడియోను అమెరికా న్యాయశాఖ విడుదల చేసింది. నిందితుడు అలెన్ భద్రతా వలయాన్ని ఎలా ఛేదించుకుని వచ్చాడో ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. హోటల్‌లో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ చెక్ పాయింట్ గుండా నిందితుడు ఒక్కసారిగా దూసుకొచ్చి కాల్పులు జరపడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఈ ఘటనలో విధుల్లో ఉన్న ఒక సీక్రెట్ సర్వీస్ అధికారి గాయపడ్డారు. కాల్పుల ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతోందని, అందులో భాగంగానే వీడియోను విడుదల చేసినట్లు అమెరికా అధికార వర్గాలు తెలిపాయి. విడుదల చేసిన వీడియోలో అలెన్ దాడికి ఒక రోజు ముందు హిల్టన్ హోటల్‌లోని ప్రాంతాన్ని పరిశీలిస్తున్నట్లు కూడా కనిపిస్తుంది. దీని ఆధారంగా ఈ ఘటన ముందస్తు ప్రణాళికతో జరిగిందని ప్రాసిక్యూటర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో గత నెల 24న నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో నిందితుడు అలెన్ కాల్పులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో విందులో పాల్గొన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియాతో పాటు ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియోను వెంటనే అక్కడి నుంచి తరలించారు.

ట్రంప్ మానసిక స్థితి బాగానే ఉందా?

హెగ్సెత్‌ను ప్రశ్నించిన డెమోక్రటిక్ నేత

వాషింగ్టన్: ఇరాన్‌తో యుద్ధం మొదలయ్యాక తొలిసారి కాంగ్రెస్ ఎదుట విచారణకు హాజరైన అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌ను డెమోక్రటిక్ చట్టసభ్యుడు సారా జాకబ్స్ ఓ అనూహ్య ప్రశ్న అడిగారు. "అసలు ట్రంప్ మానసిక స్థితి బాగానే ఉందా..? ఆయన అమెరికా కమాండర్-ఇన్-చీఫ్‌గా కొనసాగగలరా?" అని జాకబ్స్ ప్రశ్నించారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన హెగ్సెత్.. ట్రంప్ కంటే ముందు అమెరికా అధ్యక్షుడిగా నాలుగేళ్లు ఉన్న జో బైడెన్‌ను ఇలాంటి ప్రశ్నలే అడిగారా అంటూ ఎదురు ప్రశ్నించారు.

విదేశీ కోర్టు ఉత్తర్వుల కన్నా చిన్నారి సంక్షేమమే సర్వోన్నతం

దంపతుల వివాదంలో మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

ఇండోర్: పదేళ్ల బాలికను ఆమె తండ్రితో కెనడా పంపించేందుకు నిరాకరిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పాటించడం కన్నా చిన్నారి సంక్షేమమే సర్వోన్నతమైనదని జస్టిస్ విజయ్‌కుమార్ శుక్లా, జస్టిస్ బినోద్ కుమార్ ద్వివేదీ ధర్మాసనం పేర్కొంది. స్వర్గం కన్నా కన్నతల్లి, జన్మభూమి ఉన్నతమైనవని తెలిపింది. మహారాష్ట్రకు చెందిన దంపతులకు 2016లో అమెరికాలోని షికాగోలో బాలిక జన్మించింది. ఆ తర్వాత కుటుంబ నివాసం కెనడాకు మారింది. 2022 జనవరిలో కుమార్తెతో సహా భారత్‌కు వచ్చిన ఆ మహిళ కెనడా తిరిగి వెళ్లేందుకు నిరాకరించింది. కుమార్తెను తన వద్దకు పంపించాలంటూ భర్త అక్కడి కోర్టు ద్వారా ఉత్తర్వు తెచ్చుకున్నారు. దీనిని సవాల్ చేస్తూ భార్య మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. బాలికతో మాట్లాడిన జడ్జీలు ఆమెను తల్లితో పాటే భారత్‌లోనే ఉండేందుకు అనుమతించారు.


ఆలయ ప్రవేశ ఆంక్షలపై కేదార్‌నాథ్ పురోహితుల నిరసన

రుద్రప్రయాగ్: కేదార్‌నాథ్ ఆలయంలో సంప్రదాయ పూజా కార్యక్రమాల కోసం తూర్పు ద్వారం గుండా తమ ప్రవేశాన్ని పరిమితం చేయాలన్న కమిటీ నిర్ణయానికి వ్యతిరేకిస్తూ తీర్థ పురోహితులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సంఘటనను భద్రతా వైఫల్యం వల్ల జరిగిన అవగాహనా లోపంగా బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్ అభివర్ణించారు. ఛైర్మన్ అటువంటి ఆదేశాలు జారీచేయలేదని, దీనిపై స్పష్టత ఇచ్చేందుకు పురోహితులతో చర్చించామని ఆయన వెల్లడించారు.

వసుంధర

vasundhara@eenadu.in

సెలవుల్లో ఇలా! కొన్ని కబుర్లు... కొత్త రుచులు!



పిల్లలతో మనకుండే పెద్ద సమస్య వాళ్ల తిండే కదా! స్కూలుకి వెళ్లేటప్పుడైతే మరీనూ. సమయం సరిపోదంటారు, కూర నచ్చలేదంటారు... అన్ని పూట్లా తిండి దగ్గర పేచీలే. బాక్సులోనూ అన్నం మిగుల్చుకుని తెచ్చేస్తుంటారు. కాబట్టి, వాళ్లు మెచ్చేవే... నచ్చినట్టుగానే వండి పెడతాం. మరి పోషకాల సంగతేంటి? అన్నీ అందాలి కదా! అంటే అన్ని ఆకుకూరలూ, కాయగూరలూ తినిపించాల్సిందే. ఈ సెలవుల్లో అలా ప్రయత్నించేయండి. అలాగని తిను అవగానే తినేయరు. పేచీ మామూలే. కాబట్టి, ఇంట్లోవాళ్లంతా కలిసి భోజనం చేయడాన్ని నియమంగా పెట్టుకోండి. ఒక్కపూట అయినా తప్పక పాటించేలా చూసుకోండి. కొన్నిసార్లు పక్కవాళ్లను చూసీ తినేస్తుంటారు. కలిసి తింటోంటే బోలెడు కబుర్లు, చిన్ననాటి సంగతులు మాటల్లో దొర్లుతాయి. 'చిన్నప్పుడు మా అమ్మ ఈ కూర వండితే గిన్నె ఖాళీ చేసేవాళ్లం, చాటుమాటుగా తినేసేవాళ్లం' అని చెప్పి చూడండి. ఎంత ఆసక్తిగా వింటారో. ఆ రుచిని మీరు మైమరిచి వర్ణిస్తోంటే వాళ్ల నోట్లోనూ నీళ్లూరుతాయి. రుచి చూడాలన్న ఆసక్తి పెరుగుతుంది. ఆ క్రమంలో ఆ సరదా మాటలు, కథల మధ్యలో పేచీ లేకుండా భోజనమూ సాఫీగా చేసేస్తారు. కొత్త రుచులూ అలవాటు అవుతాయి. హడావుడి జీవితాలతో కలిసి తినడమూ లగ్జరీగా మారింది. కానీ ఇది అందరి మధ్యా అనుబంధాన్ని పెంచుతుంది. వాళ్లకీ ఆరోగ్యం. అందుకే ఈ వేసవి సెలవుల్ని ఇందుకు వేదిక చేసుకోండి మరి.

కలిసి గెలవండి జీవితాన్ని!



సంసారంలో గెలుపోటములు ఉండవు. ఒకరు గెలిచి మరొకరు ఓడిపోతే, అది సంసారానికే ఓటమి. ఇద్దరూ కలిసి గెలవడమే నిజమైన దాంపత్యం. అందుకోసమే ఈ సూత్రాలు...

అహానికి తావు లేకుండా...

దాంపత్యం అనేది రెండు చక్రాల బండి వంటిది. అవి రెండూ సమానంగా సాగినప్పుడే ప్రయాణం హాయిగా జరుగుతుంది. సంసారమైనా అంతే. మనం అనే భావన ఉండాల్సిన చోట... 'నేను' అనే మాట మధ్యలోకి వస్తే సమస్యలు మొదలైనట్లే. గొడవ ఏదైనా కలిసి కూర్చుని మాట్లాడుకోండి. పొరపాటు ఎవరివైపు జరిగినా ముందు మీరే మాట్లాడేందుకు చొరవ తీసుకోండి. ఈ అలవాటు మీ బంధాన్ని బీటలువారనీయదు.

మాటలు వదలొద్దు...

భార్యాభర్తలిద్దరూ చదువుకున్న వారు, ఉద్యోగస్థులు కావడంతో ఆర్థిక స్వతంత్రత పెరిగింది. ఇది మంచి పరిణామమే అయినా, నేను నీకంటే ఎక్కువ సంపాదిస్తున్నాను. నా కుటుంబం నీకంటే గొప్పది లేదా నా నిర్ణయమే ఫైనల్... వంటి మాటలు ఆధిపత్యం చెలాయిస్తున్నట్లుగా అనిపిస్తాయి. సంపాదన, హోదా ఏదైనప్పటికీ వ్యక్తిగా భాగస్వామికి ఇవ్వాల్సిన కనీస గౌరవాన్ని ఇవ్వాలి. చిన్న చిన్న విషయాల్లో కూడా వారి సలహాలు తీసుకోవడం వల్ల తాము కూడా ఈ ఇంట్లో ముఖ్యమే అనే భావన వారికి కలుగుతుంది.

కమ్యూనికేషన్ గ్యాప్...

ఆధిపత్యం చూపిస్తే... మనసు విప్పి మాట్లాడుకునే అవకాశం తగ్గిపోతుంది. అంతేకాదు, భాగస్వామితో తరచూ వాదనలు చేయడం, అందరి ముందూ విమర్శించడం వంటివి చేస్తుంటే కూడా గౌరవం తగ్గిపోవచ్చు. దీనివల్ల ఇంట్లో ప్రశాంతత కరువవుతుంది. ఇవన్నీ పిల్లలపైనా తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అంతేకాదు, గొడవ జరిగినప్పుడు ఇద్దరూ అరుచుకోవడంవల్ల సమస్య పరిష్కారం కాదు. ఒకరు కోపంగా ఉన్నప్పుడు మరొకరు మౌనంగా ఉండండి. ఆ తర్వాత సమస్యపై చర్చించడం ఉత్తమం. అప్పుడు ఇద్దరూ ఒక్క మాటమీద నడుస్తారు.

ఐఏఎస్ రాలేదు... ఐఐఎమ్ వచ్చింది!



ఫలితం దక్కకున్నా, మంచి ప్రయత్నం ఎప్పుడూ వృథా కాదు... అందుకు ఉదాహరణ గొట్టిపాటి శ్రీగీతశ్రేయ ప్రయాణమే. సివిల్స్ లక్ష్యం చేరుకోలేకున్నా, ఆ సంసిద్ధత ప్రఖ్యాత ఐఐఎమ్ అహ్మదాబాద్‌లో సీటుకు సాయపడిందంటారు శ్రేయ. అదెలానో ఆమె మాటల్లోనే...

మా సొంతూరు ప్రకాశం జిల్లా, నాగులపాలెం. నాన్న చెంచుబాబు... తిరుపతి జిల్లా, నాయుడుపేట డీఎస్పీ, అమ్మ రజని. నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్, విజయవాడ, గుంటూరు... ఇలా చాలా చోట్ల చదువుకున్నా. ఇంజినీరింగ్(ఈసీఈ) బిట్స్ హైదరాబాద్‌లో చేశా. ఆ సమయంలో రామకృష్ణ మఠం నిర్వహించే పలు శిక్షణ కార్యక్రమాలకు హాజరయ్యేదాన్ని. ఎన్జీవోల్లో వాలంటీర్‌గానూ పనిచేశా.

ప్రజాసేవపైన ఆసక్తితో ఇంజినీరింగ్ తర్వాత సివిల్స్ రాయాలనుకున్నా. 2022లో మొదటిసారి రాసినప్పుడు ప్రిలిమ్స్ క్లియర్ అవ్వలేదు. రెండో ప్రయత్నంలో మెయిన్స్‌కు అర్హత సాధించా. మూడోసారి రెండు మార్కులతో ప్రిలిమ్స్ దాటలేదు. మూడు సార్లు రాయాలన్న గడువు పెట్టుకుని 100 శాతం అంకితభావంతో సిద్ధమైనా సివిల్స్ లక్ష్యం నెరవేరలేదు. స్నేహితులంతా కార్పొరేట్ రంగంలో స్థిరపడ్డారు. నాలుగేళ్ల శ్రమ వృథా అయిపోయింది. నేను బాగా చదవలేదా? నా ప్రతిభ సరిపోదా' లాంటి ఆలోచనలు ఆరు నెలలు వెంటాడాయి. ఆ సమయంలో అమ్మానాన్న మాత్రం నచ్చింది చేయమని మద్దతిచ్చారు. తర్వాత ఏంటన్న ప్రశ్న ఎదురైంది. ఫ్రెషర్‌గా ఉద్యోగంలో చేరితే లాభం లేదనిపించింది. ఎంబీఏ చేస్తే నాయకత్వ స్థానంలో ఉండొచ్చనుకున్నా. అలాగని సాధారణ సంస్థల్లో కాకుండా ఐఐఎమ్‌ల్లోనే చేరాలనుకున్నా. వాటిలో ప్రవేశానికి నిర్వహించే కంబైన్డ్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) రాయాలనుకుని అయిదునెలలు సిద్ధమయ్యా. 2025 నవంబరులో పరీక్ష రాశా.

హాబీలు మేలు చేశాయి...

ఐఐఎమ్‌లో సీటు రావడం వెనక హాబీస్ నాకు బలంగా పనిచేశాయి. చిన్నప్పట్నుంచీ సంగీతం(వీణ), కూచిపూడి నృత్యం నేర్చుకుంటూ వచ్చా. వీటిలో సర్టిఫికెట్ కోర్సులూ చేశా. వాటిపైనా ఇంటర్వ్యూలో ప్రశ్నలు అడిగారు. ఇప్పటికీ ప్రాక్టీసు చేస్తున్నా, ప్రదర్శనలూ ఇస్తున్నా. కాబట్టి తడబాటు లేకుండా చెప్పా.

శ్రమ వృథా కాలేదు...

క్యాట్‌లో 99.62 పర్సంటైల్ వచ్చింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ తర్వాత... ప్రతిష్ఠాత్మక ఐఐఎమ్ అహ్మదాబాద్‌లో సీటు సాధించా. నెలల వ్యవధిలోనే ఇది సాధించడానికి కారణం... నా యూపీఎస్సీ ప్రిపరేషన్. సివిల్స్ అనుభవంవల్ల జాతీయ స్థాయి పోటీ పరీక్ష ఎలా ఉంటుందో అర్థమైంది. క్యాట్‌లో ఎలిమినేషన్ విధానం ఉంటుంది. ఇది సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌లో నేర్చుకున్నా. అనలిటికల్ రైటింగ్ పరీక్షకు పది శాతం వెయిటేజీ ఉంటుంది. మెయిన్స్ రాసిన అనుభవంతో దీన్నీ ఆత్మవిశ్వాసంతో రాయగలిగాను. ఐఐఎమ్ అహ్మదాబాద్ ప్రవేశాల్లో 50 శాతం ఇంటర్వ్యూ మార్కులకే ప్రాధాన్యత ఉంటుంది. అంటే మార్కులకంటే వ్యక్తిత్వమే ముఖ్యం. 'సివిల్స్ రాలేదు కాబట్టే ఇటు వచ్చావా' అని ఇంటర్వ్యూలో అడిగారు... నా ముందస్తు ప్రణాళిక గురించి చెప్పాను. అంతర్జాతీయ సంబంధాల గురించి అడిగారు. సివిల్స్ కోసం చదివాను. కాబట్టి తడబడకుండా సమాధానాలు చెప్పగలిగా. 'ఈ గ్యాప్‌వల్ల నీకు ఏఐ సాంకేతికత గురించి తెలీదు కదా' అన్నారు. టెక్నాలజీ నేపథ్యం కాబట్టి నేర్చుకోగలనని బదులిచ్చా. సివిల్స్ కోసం హ్యూమానిటీస్ చదువుకున్నానని వివరించా. ఓపెన్ కేటగిరీలోనే సీటు సాధించా. జూన్ 15 నుంచి క్లాసులు. ఎంబీఏ తర్వాత తప్పకుండా ఫేస్‌మెంట్స్‌కి వెళ్తాను. సివిల్స్‌ని వదిలేస్తాననీ చెప్పలేను.

ఓటమి కాదు, అనుభవం...

కెరియర్‌లో స్థిరపడ్డానికి అబ్బాయిలకు 30 ఏళ్లవరకూ అవకాశం ఇస్తారు. అమ్మాయిలకైతే 25 ఏళ్లకే పెళ్లి ప్రస్తావన తెస్తారు. లక్ష్యం ముఖ్యం అనుకున్నప్పుడు ఈ విషయంలో రాజీ వద్దు. ఎవరైనా సివిల్స్ రాయడం గురించి సలహా అడిగితే... ఏదాది కిందట వద్దని చెప్పేదాన్నేమో. ఇప్పుడు కచ్చితంగా రాయమని చెబుతా. ఏడాది వ్యవధిలో జీవితంలో ఎన్నో మార్పులు. మనిషిగా అప్పుడూ, ఇప్పుడూ నేనే. కానీ ఆలోచనల్లోనే తేడా. మానసికంగా దృఢంగా ఉండాలి. ఆత్మవిశ్వాసం తగ్గినప్పుడు వివేకానందుడి పుస్తకాలు చదువుతూ, ధ్యానం చేస్తూ మళ్లీ సాధారణ వ్యక్తిగా మారాను.

– యర్రాబత్తిన నాగరాజు, నాయుడుపేట

జఠర పరివర్తనాసనం

తుంటి కండరాల విశ్రాంతికి...



చేసే విధానం: మ్యాట్‌పైన వెల్లకిలా పడుకోవాలి. కాళ్లను నెమ్మదిగా 90 డిగ్రీల కోణంలోకి వచ్చేలా పైకి ఎత్తాలి. చేతుల్ని ఇరువైపులా భుజాల వరుసలో చాచాలి. అరచేతులు పైకి చూస్తున్నట్టు ఉండాలి. ఇప్పుడు గట్టిగా శ్వాస తీసుకుని... నెమ్మదిగా గాలిని వదులుతూ రెండు కాళ్లనూ ఎడమవైపు వంచాలి. పాదాలు అరచేతికి తాకే విధంగా ప్రయత్నించాలి. అదే సమయంలో తలను కుడివైపు తిప్పి, కుడి అరచేతిని చూడండి. ఈ సమయంలో మోకాళ్లను వంచకుండా సాధ్యమైనంత సాగదీయండి. ఇలా సాధారణ శ్వాస తీసుకుంటూ 12-15 సెకన్లు ఉండి... నిదానంగా కాళ్లను 90 డిగ్రీల కోణంలోకి తీసుకురావాలి. తర్వాత కాళ్లను కిందకు దించి శవాసనంలో విశ్రాంతి తీసుకోండి. ఇప్పుడు ఆసనాన్ని రెండో వైపు పునరావృతం చేయండి.

జాగ్రత్తలు: నడుము, తుంటి సర్జరీలు అయినవాళ్లు, నడుమునొప్పి ఉన్న వాళ్లు కొన్ని జాగ్రత్తలతో చేయాలి.

ఉపయోగాలు: తుంటి నడుము నొప్పి ఉన్నవాళ్లకి మంచి ఆసనం. ఎక్కువగా డ్రైవింగ్ చేసేవాళ్లు, ప్రయాణించేవాళ్లు ప్రతి రోజూ చేయాల్సిన ఆసనం. కాలేయం, ప్లీహం, జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.



– శిరీష, యోగ గురు

బంగారం - వెండి



1న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,54,670	1,39,150	2,55,750
విజయవాడ	1,49,865	1,39,650	2,53,000
ప్రొద్దుటూరు	1,51,600	1,39,470	2,45,000
రాజమహేంద్రవరం	1,50,380	1,37,850	2,65,000
విశాఖపట్నం	1,50,390	1,37,850	2,48,000
తమిళనాడు	-----	1,39,200	2,65,000

చిన్న చిన్నవే... చేద్దామా?

నిద్ర లేవడం ఆలస్యం... మొదలవుతుందండీ మన పరుగు. అవసరమైతే మల్టీ టాస్కింగ్‌లూ అలవోకగా చేసేస్తుంటాం. మధ్యలో ఫోన్ కాల్స్, రీల్స్... అరె అసలు ఖాళీ ఏది? కాబట్టే, ఒత్తిడి, అలసట, ఆందోళన అంటూ ఎన్నెన్నో కొని తెచ్చుకుంటాం. కాస్త పరుగాపి... అప్పుడప్పుడూ జీవితానికి పాజ్ బటన్ నొక్కండి.

ఒక్కసారి ఆలోచించండి... ఖాళీగా ఎప్పుడున్నారు? ఫోన్, పరుగు లేకుండా ఊరకనే అలా కూర్చోనో నిల్చోనో ఉండాలి. అలా ఎప్పుడైనా చేశారా? చెప్పడం కొంచెం కష్టమే కదూ! కళ్లో, చెయ్యో ఏదోఒక పని చేయకుండా మనం ఎప్పుడుండాలి? ఆ విరామాలు తీసుకోవడం లేదు గనకే మనసంతా ఒత్తిడికి చిత్తవుతోంది. అలసట దరిచేరుతోంది. అందుకే ఆ పాజ్ తీసుకోమంటున్నారు నిపుణులు. అందుకు పెద్దవే చేయక్కర్లేదు. చిన్న చిన్నవి చాలు.

ఇలా మొదలుపెట్టండి

మేల్కోవడం ఆలస్యం... పనుల్లోకి దిగిపోకండి. వాట్సాప్, మెయిల్స్‌నీ చెక్ చేయొద్దు. నెమ్మదిగా కూర్చొని, ఓ నిమిషంపాటు శ్వాస వ్యాయామాలు చేయండి. రోజూ ఒకే దినచర్య సాగుతుంది కదా మనకి! దీంతో ఆటోపైలట్ మోడ్‌లోకి వెళ్లిపోతాం. ఈ చిన్న ప్రక్రియ... మెదడుని ప్రస్తుతంలోకి తీసుకొస్తుంది. ఆలోచనల్ని నెమ్మదింపజేస్తుంది. దీంతో రోజు ఒత్తిడితో కాకుండా ప్రశాంతంగా మొదలవుతుంది.

శ్వాస తీసుకుని...

ఒక పని పూర్తయ్యేదాకా ఆగే సమయం ఎక్కడుంటుంది. అది అవుతుండగానే మరోదానిలోకి వెళ్లిపోతుంటాం. ఇదీ మెదడుకి భారం పెంచేదే. ఇలా చేయడానికీ కారణం లేకపోలేదు లెండి. సమయానికి పనులన్నీ పూర్తిచేయాలన్న తొందర. నిజమే కానీ... ఒకదాని నుంచి మరో దానిలోకి వెళ్లేముందు మూడు దీర్ఘశ్వాసలు గుర్తుంచుకుని మరీ తీసుకోండి. ఇది శరీరానికి విశ్రాంతిని ఇవ్వడమే కాదు... చేయబోయే పనిమీద మరింత స్పష్టతనీ ఇస్తుంది. పని ఆలస్యం కాకపోగా మరింత వేగంగా పూర్తవుతుందన్నమాట.

పక్కకు రండి

పనవ్వగానే కాసేపు రిలాక్స్ అవుదామనుకుంటాం. చేసేదేంటి? ఫోన్‌ని చేతులోకి తీసుకోవడమేగా! దాంతో మెదడు శాంతిస్తుందనుకుంటాం కానీ కాదు. భారం మోపుతున్నాం. కాబట్టి, కనీసం అయిదు నిమిషాలు పక్కనపెట్టండి. కిటికీలోంచి చూడటమో, స్ట్రెచింగ్‌లో చేయండి. ఖాళీగా కళ్లు మూసుకుని కూర్చున్నా మంచిదే. ఈ డిజిటల్ బ్రేక్ ఆఫీసులోనూ అవసరమే! ఇది అలసట తగ్గించి, ఏకాగ్రత పెరిగేలా చేస్తుంది.



ఏం ఆలోచిస్తున్నారు?

కూర కింద స్టవ్ కట్టేయాలి, పాలు ఫ్రిజ్‌లో పెట్టాలి, ఫలానా వాళ్లకు డబ్బులివ్వాలి, మీటింగ్ ఈ టైమ్‌కి... నిమిషనిమిషానికి ఎన్నెన్ని గుర్తుంచుకోవాల్సిన అంశాలు పెరుగుతాయో! ఒక్కోసారి ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లే ఉంటుంది కదా! అవన్నీ పేపర్‌మీద పెట్టండి. విపులంగా రాయాల్సిన పనిలేదు. పనులు, టెన్షన్స్ అన్నింటినీ ఇలా రాస్తే... ముందు ఆందోళన తగ్గుతుంది. ఆపై పనులమీద స్పష్టతా వస్తుంది. ఒక్కొటీ చేసుకుంటూ వెళితే సరి. మర్చిపోతామన్న భయమూ ఉండదు.

నేనెలా ఉన్నా

పిల్లల్ని ట్యూషన్‌కో, స్కూల్‌కో పంపాలన్నప్పుడు టెన్షన్‌లో ఉంటాం. మీటింగ్‌లోనో, శ్రీవారో కోప్పడితే బాధలో ఉంటాం. కాసేపటికి అది మారొచ్చేమో కానీ... ఎప్పుడైనా చెక్ చేసుకున్నారా? అంటే ఏమీలేదు... రోజు మధ్యలో ఇప్పుడు నేనెలా భావిస్తున్నా అని చెక్ చేసుకున్నారా? అలా మీకు మీరు ప్రశ్నించుకున్నా మనసు తేలికపడుతుందట. అంతేకాదు, భావోద్వేగాలమీద నియంత్రణా వస్తుందట.

ఇలా ముగిస్తే...

ఆఫీసు ముగియడం ఆలస్యం.. స్కూలు అయిపోయిన పిల్లాడిలా బయల్దేరతాం కదూ! ఒక క్షణం ఆగి ఏమేం చేశారో గుర్తుతెచ్చుకోండి. పూర్తయిన ప్రతి పనీ మన విజయమే. అది తెలియని ఉత్సాహాన్నిస్తుంది. చాలామంది ఉద్యోగినులు కష్టపడేది ఇక్కడే! పనికీ, వ్యక్తిగత జీవితానికీ మధ్య సమన్వయం కోల్పోవడం. ఈ తీరు పని నుంచి విశ్రాంతిని ఇస్తుంది. మరోదానికి మిమ్మల్ని సిద్ధం చేస్తుంది. ఇంటికి పని తాలూకూ ఆలోచనలు మోసుకెళ్లడమన్న పేచీ ఉండదు.

ఒక్కసారిగా జీవితంలో మార్పులు చేసుకోవాలంటే కష్టం. కానీ చిన్న చిన్న మార్పులు చేసుకోవడం తేలిక. పేరుకే ఇవి చిన్నగా కనిపిస్తాయి కానీ... తెచ్చే మార్పు చాలానే. పైగా ప్రత్యేకంగా సమయం కేటాయించక్కర్లేదు. కాస్త వెసులుబాటు చేసుకుంటే చాలు. దీర్ఘకాలంలో ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతనూ, ఆనందాన్నీ పెంచుతాయి. ఇంకేం మనసు కోసం ప్రయత్నించేయండి మరి.

ఏం కావాలంటే..!



రమ్య, రాధ ఇద్దరూ చిన్నప్పట్నుంచీ స్నేహితులు. కాలేజీ వరకూ కలిసే చదువుకున్నారు. కానీ ఉద్యోగం, పెళ్లి, పిల్లలు వాళ్ల మధ్య దూరాన్ని పెంచాయి. దాదాపు పదేళ్ల తర్వాత ఇద్దరూ అనుకోకుండా ఓ పెళ్లిలో కలిశారు. చాలా సంతోషంగా ఉన్నారు. వృత్తిరీత్యా ఇద్దరూ ఉన్నత స్థానాల్లోనే ఉన్నారు. పిల్లలూ బాగా చదువుకుంటున్నారు. అలా వాళ్ల మాటల ప్రవాహంలో రాధ... నీకు జీవితంలో ఇంకేం కావాలి అని అడిగింది రమ్యని. ప్రశాంతత అని టక్కున చెప్పింది రమ్య. అప్పటిదాకా సరదాగా సాగిన వాళ్ల సంభాషణ ఒక్కసారిగా నిరాసక్తతో నిండిపోయింది. ఇద్దరి ముఖాలూ పేలవమయ్యాయి. ఎంత ప్రశాంతత కావాలి అంది రాధ... ఆదివారం సాయంత్రం కూర్చొని సోమవారం జరగాల్సిన పనుల్ని ఆలోచిస్తూ భయపడనంత ప్రశాంతత కావాలి అంది రమ్య. వినడానికి చాలా చిన్న సంభాషణలా అనిపించినా... దానిలో ఎంత బాధ, నిస్సహాయతా దాగి ఉన్నాయో. తనపై ఇతరుల అంచనాలు, ఒత్తిడి, ఆందోళన ఇవే ఇప్పటి మహిళల జీవనశైలి. వీటన్నింటి నుంచి ఉపశమనంగా సెలవంటూ ఓ రోజు దొరికినా... అప్పుడు కూడా ఇంటిని చక్కబెట్టడమో, పిల్లల అవసరాలు చూడటమో, పెండింగ్‌లో ఉన్న ఆఫీస్ ఫైళ్లను తిరగెయ్యడమో చేస్తున్నారు. మరుసటి రోజుకి సిద్ధంగా ఉండాలనే భావనతో సన్నాహాలు మొదలుపెడుతున్నారు. ఇక వాళ్లకి విశ్రాంతి ఎక్కడ ఉంది. దాదాపు ఇప్పుడు మహిళలందరి పరిస్థితీ ఇదే. జీవితం అనే రేస్‌లో ఆగకుండా పరుగులు పెడుతూ, ఎవరో సెట్ చేసిన లక్ష్యాల్ని చేరుకోవాలి, తమని తాము నిరూపించుకోవాలనే కుతూహలంలో తమకేం కావాలో మరచిపోతున్నారు. ఎప్పుడో ఒకసారి ఇలాంటి సంభాషణలు ఎదురైతే కానీ... వాళ్లు కోల్పోతున్నదేంటో గుర్తించడం లేదు. ఇప్పటికైనా విశ్రాంతికి ప్రాధాన్యం ఇవ్వండి. నచ్చిన పనుల్ని చేయడానికి సమయాన్ని కేటాయించండి. స్నేహితుల్ని కలవండి. ప్రయాణాలు చేయండి. అప్పుడే ఈ యాంత్రిక జీవనవిధానం నుంచి బయటపడగలం. పాటిస్తారుగా మరి!

ఎండల్లో... చల్లని సేవ

ఎండలు మండిపోతున్నాయి. చిన్న పనిమీద బయటికెళ్లినా దాహంతో గొంతు ఎండిపోతుంటుంది. ఆ సమయంలో ఓ గ్లాసు చల్లని మజ్జిగ లేదా నిమ్మరసం దొరికితే ప్రాణం లేచొస్తుంది... దీన్ని గుర్తించారు మహారాష్ట్రకు చెందిన ఆ ఇద్దరు మహిళలు.. . అందుకే గత 26 ఏళ్లుగా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. వందలాది మంది దాహాన్ని తీరుస్తూ అమృతమూర్తులుగా పేరొందారు. స్థానికులు వాళ్లని ప్రేమగా తాక్వాలీ(తాక్ అంటే మజ్జిగ)అమ్మలు అని పిలుస్తున్నారు.



అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే నగరాల్లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఒకటి. మండుటెండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. దాంతో వర్ధమాన్ నగర్ ప్రాంతంలో సుధా బటావియా, సునందా భోండేకర్ అనే ఇద్దరు మహిళలు స్థానికులకు ఉచితంగా మజ్జిగ అందిస్తున్నారు. ఏటా మహావీర్ జయంతి నుంచి తొలకరి వచ్చేవరకు ఈ మజ్జిగ సేవని చేస్తున్నారు.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్డుపై ప్రయాణించే వాళ్లకీ కూలీలకూ ఆటో-రిక్షా డ్రైవర్లకూ పేదలకూ చల్లని మజ్జిగనీ నీళ్లనీ జల్‌జీరానీ అందిస్తున్నారు.

'ఆ మహిళలు ఇచ్చే మజ్జిగ దాహాన్ని తీర్చడమే కాకుండా, మనసుకు సాంత్వన కలిగిస్తుందని తాగినవాళ్లూ చెబుతున్నారు. ప్రస్తుతం వీళ్లు రోజూ 120 నుంచి 130 లీటర్ల మజ్జిగను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. చెప్పులులేని వారికి చెప్పులు, అవసరమైన వాళ్లకి టవల్స్, దుపట్టాలు, అప్పుడప్పుడూ ఐస్‌క్రీములు కూడా ఇస్తున్నారు.

స్పందించిన జనం!

ఆ మహిళల్ని చూసిన జనం కూడా తమ వంతుగా స్పందిస్తున్నారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో పలువురు ఈ మజ్జిగ సేవలో భాగం అవుతున్నారు. కొందరు ఆర్థిక సహాయం అందిస్తే, మరికొందరు ఆహార పదార్థాలు అందిస్తున్నారట. ఓ పుచ్చకాయ వ్యాపారి మూడు రోజులపాటు పుచ్చకాయలు పంపిణీ చేశాడట.

'మజ్జిగ తాగినప్పుడు వాళ్ల ముఖాల్లో కనిపించే ఆనందమే మాకు లభించే గొప్ప పారితోషికం. దీన్ని దైవకార్యంలా భావిస్తున్నాం' అని చెబుతున్నారీ తాక్వాలీ అమ్మలు. 'ఇది కేవలం మజ్జిగ కాదు. మనసుకు అందే ఆత్మీయత' అంటోన్న స్థానికుల మాటలు అక్షర సత్యమే కదూ!

హాయిగా... ఎంజాయ్ చేయండిక!



ఏ ఇబ్బందులూ ఉండొద్దు. చక్కగా అందరిలో కలియతిరగాలి. లుక్‌తో నలుగురి చేత వావ్ అనిపించుకోవాలి... వేడుక ఏదైనా మన మనసు కోరుకునేది ఇదే కదూ! కానీ ఏమాత్రం కుదరదు. మనకంటూ కొన్ని అత్యవసర వస్తువులు ఉంటాయా? వాటిని చేతిలో పట్టుకొనైతే తిరగలేం కదా. కాబట్టి, బ్యాగు గ్యారంటీ. వీలైనప్పుడల్లా దాన్ని పక్కన పెడుతూ తిరిగి వెతుక్కుని తెచ్చుకుంటూ దాంతో మన తిప్పలు మామూలుగా ఉండవు. పోనీ అవేమీ అక్కర్లేదు అనిపించినా ఫోన్ అయినా పట్టుకోక తప్పని పరిస్థితి. అంటే ఏ బరువూ లేకుండా వేడుకలో గడపడం మనకి అసాధ్యమే. అలాగని అన్నీ ఇంట్లో పెట్టి వెళ్లడమూ కుదరదు. ఏ సమయంలో ఏ అవసరం వస్తుందో చెప్పడం కష్టం. అందుకే చక్కగా ఈ స్లింగ్ బ్యాగ్స్ తెచ్చేసుకోండి. కర్చీఫ్, డబ్బులు, చిన్న వస్తువులు, ముఖ్యంగా ఫోన్... వీటిని దీనిలో పెట్టేసుకోవచ్చు. స్లింగ్ బ్యాగ్స్ కొత్తేమీ కాదే అంటారా? సాదాసీదా బ్యాగులు వేడుకలకు ఏం సరిపోతాయి చెప్పండి. అవి ఎంత ఖరీదైనవైనా, నయా స్టైల్‌వైనా మన సంప్రదాయ దుస్తులకు ఏమాత్రం తగనట్లే ఉంటాయి. కాబట్టే, ఇలా ప్రత్యేకంగా హ్యాండ్‌క్రాఫ్టెడ్‌వి తీసుకొస్తున్నారు. నడుముకి దోపుకొనేలా, భుజానికి తగిలించుకునేలా, ముంజేతికి చుట్టుకునేలా సిద్ధం చేస్తున్నారు. వీటినీ ఎంబ్రాయిడరీ, నగలు, పూసలతో తీర్చిదిద్దేసరికి ఇవీ ప్రత్యేక అలంకరణలా తోస్తున్నాయి. సంప్రదాయ లుక్‌కి మరిన్ని హంగులద్దేస్తున్నాయి. బరువులా అనిపించవు... అవసరమైన వాటికోసం వెతుక్కోవాల్సిన పని ఉండదు. దుస్తులకీ నప్పేస్తాయి. ఇంతకంటే ఇంకేం కావాలి చెప్పండి? ఈసారి నుంచి వేడుకేదైనా వీటితో సిద్ధమైపోండి. ఎంచక్కా ఎంజాయ్ చేయండి.

ఆహ్వానం వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా [illegible]కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

కలిసి చదివేస్తే..

ఫ్రెండ్స్.. సెలవుల్లో ఆటల్లో పడి చదవడం ఆటుంచి, కనీసం పుస్తకాలను తెరిచే సాహసం కూడా చేయరు మనలో కొందరు. కానీ, ఆ పుస్తకాలతోనే ఓ మంచి ఆట ఆడొచ్చని తెలుసా? అదే 'రీడింగ్ రేస్'. మన ఇంట్లో ఉండే తమ్ముడితోనో, చెల్లితోనో లేదా పక్కింటి ఫ్రెండ్‌తోనో ఈ ఆట ఆడుకోవచ్చు. చదువుకోవడాన్ని ఓ పనిలా కాకుండా, నవ్వే ఆటలా మార్చేయొచ్చు.



● ఈ గేమ్ చాలా సింపుల్. కావాల్సిందల్లా ఇష్టమైన ఒక కథల పుస్తకం.

● ముందుగా మనం ఒక పేజీ చదవాలి. తర్వాత ఎదుటివారిని ఆ తర్వాత పేజీ చదవమని చెప్పాలి.

● ఎవరైతే చదివేటప్పుడు మధ్యలో ఎక్కడా ఆగకుండా, ఒక్క తప్పు లేకుండా స్పష్టంగా చదువుతారో... వారే ఈ ఆటలో గెలిచినట్లు.

సెలవుల్లో సరదాగా!

● దీనివల్ల మనకు స్పష్టంగా, గట్టిగా చదవడం అలవాటవుతుంది.

● తప్పు చేయకూడదు అనే పట్టుదలతో, ఏకాగ్రతతో చదవడం నేర్చుకుంటాం.

● అమ్మ కూడా మనం బుద్ధిగా చదువుకుంటున్నామని భలే సంతోషిస్తుంది. మరి ఇంకెందుకు ఆలస్యం? వెంటనే దగ్గర ఉన్న కథల పుస్తకం బయటకు తీయండి.

● చదువుతున్నప్పుడు మనకు తెలియని కొత్త పదాలు ఎన్నో పరిచయం అవుతాయి.

భలే గమ్మత్తు

1. అందరికీ కనిపిస్తాను కానీ.. నన్ను నేను చూసుకోలేను. నేనెవరిని?

జవాబు: కన్ను

2. రెక్కలు లేవు కానీ గాలిలో ఎగురుతాను. కళ్లు లేవు కానీ కన్నీళ్లు పెడతాను. ఎవరు నేను?

జవాబు: మేఘం



లెక్కల గారడీ

1. ఒక తోటలో 5 చెట్లు ఉన్నాయి. ప్రతి చెట్టుకు 5 కొమ్మలు ఉన్నాయి. ప్రతి కొమ్మపై 5 పక్షులు కూర్చున్నాయి. మొత్తం ఎన్ని పక్షులు ఉన్నాయో లెక్కపెట్టి చెప్పండి.

జవాబు: 125

2. ఒక అంకెకు అదే అంకె కలిపినా, అదే అంకెతో గుణించినా ఒకే సమాధానం వస్తుంది. ఆ అంకె ఏంటో కనిపెట్టండి.

జవాబు: 2

నిబంధనలను నీరుగార్చి... నకిలీ డెయిరీలకు గేట్లు తెరిచి

నెయ్యి కల్తీ గురించి తెలిసీ కళ్లు మూసుకున్నారు ● నిగ్గుతేల్చిన ఏకసభ్య కమిషన్



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమలలో నెయ్యి కొనుగోళ్ల వ్యవహారానికి తీవ్రమైన సంస్థాగత లోపాలు, అప్పటి అధికారుల నిర్లక్ష్యం, విధి నిర్వహణలో వైఫల్యం, టెండర్ నిబంధనల్ని, డెయిరీల తనిఖీల్ని ఉద్దేశపూర్వకంగానే నీరుగార్చడం, నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసీ కళ్లుమూసుకుని వ్యవహరించడం వంటి ప్రధాన కారణాలుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్ కమిషన్ నిగ్గుతేల్చింది. నాణ్యతా ప్రమాణాల్ని పాటించడంలో అప్పటి ఈవో/అదనపు ఈవో, సీవీఎస్, జనరల్ మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్) నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంది. నెయ్యి కొనుగోళ్లకు సంబంధించిన ప్రతి కమిటీలోనూ కొందరే సభ్యులుగా ఉండటం, కమిటీలోని డెయిరీ/నెయ్యి నిపుణుల్లో కొందరినే పదేపదే నియమించటం వల్ల పక్షపాతంతో వ్యవహరించారని, సరఫరాదారులకు అనుకూలంగా వ్యవహరించారని, పారదర్శకత కొరవడిందని నిర్ధారించింది. ఆహారభద్రత, ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ పడ్డారని పేర్కొంది. కమిషన్ గుర్తించిన ప్రధాన లోపాలివీ..

కఠినతరం చేసిందీ... నీరుగార్చిందీ ఒకే కమిటీ

● టెండర్ నిబంధనల్ని పటిష్ఠం చేసేందుకు తితిదే నియమించిన కమిటీ సిఫార్సుల్ని 2019 ఆగస్టు 16న ఆమోదించారు. ఆరు నెలల తిరక్కుండానే వాటిని సడలించాలని నిర్ణయించారు.

● టెండర్లలో ఎక్కువ సంస్థలు పాల్గొనేలా వీలు కల్పించేందుకంటూ 2019 డిసెంబరు 28న బోర్డు తీర్మానం ద్వారా నిబంధనలు సడలించాలని నిర్ణయం తీసుకున్నారు. టెండర్ నిబంధనలను పటిష్ఠం చేయడానికి వేసిన కమిటీకే, వాటిని సడలించే బాధ్యతా అప్పగించారు.

● ఆ కమిటీ ఒకే ఒక్కసారి సమావేశమై సిఫార్సులు చేసేసింది. ఆరు నెలల క్రితమే తెచ్చిన టెండర్ నిబంధనల్ని మార్చడానికి ప్రాతిపదికేమిటో మాత్రం చెప్పలేదు. ఆ నిబంధనల్ని 2020 ఫిబ్రవరి 18న కొనుగోళ్ల కమిటీ, 2020 ఫిబ్రవరి 29న బోర్డు ఆమోదించేశాయి.

లక్ష్యం నెరవేరలేదు సరికదా... తీవ్ర అనర్థాలు

● టెండర్ నిబంధనల్ని సడలించడం వల్ల పోటీ పెంచి, అంతరాయం లేకుండా ఆవు నెయ్యి సరఫరా జరిగేలా చూడాలన్న లక్ష్యం నెరవేరలేదు సరికదా.. తీవ్రపరిణామాలు సంభవించాయి.

● నిబంధనలను నీరుగార్చడంతో తీవ్ర అనర్థాలు జరిగాయి. అనుభవం, సామర్థ్యం లేని డెయిరీలు టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించారు. అనుభవం, టర్నోవర్ పరిమితుల్ని తొలగించడం, భారత ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్దేశించిన ప్రమాణాలు, పరిమితులకు సరిపోల్చి చూడాలన్న నిబంధనను తీసేయడంతో భోలేబాబా, మాల్‌గంగా, ఏఆర్ డెయిరీ వంటి నాన్ సీరియస్, నకిలీ డెయిరీలు రంగ ప్రవేశం చేశాయి.

ప్లాంట్ల తనిఖీల్లో అవకతవకలు

● డెయిరీల సాంకేతిక అర్హతల మదింపు, ప్లాంట్ తనిఖీల్లో తీవ్ర అవకతవకలు జరిగాయి. డెయిరీలు సమర్పించిన తప్పుడు పత్రాల్నే తనిఖీ కమిటీలు గుడ్డిగా ఆమోదించాయి.

● ఏఆర్ఎస్ఎస్‌వీ నిబంధన ప్రకారం వార్షిక నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం 2,160 టన్నులు ఉండాలి. కానీ ఆ డెయిరీకి 56.8 టన్నులే ఉంది. అయినా తనకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ ఉన్నట్లు ఆ డెయిరీ తప్పుడు పత్రం సమర్పించింది.

● వైష్ణవి డెయిరీకి 0.37 టన్నుల వెన్న ఉత్పత్తి సామర్థ్యం మాత్రమే ఉంది. కానీ 752.93 టన్నుల సామర్థ్యం ఉన్నట్లు నకిలీ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ సమర్పించింది.

అయినా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టలేదు

● ప్రీమియర్ ఆగ్రో, వైష్ణవి డెయిరీ, భోలేబాబా డెయిరీలు సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందని మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎఫ్‌టీఆర్ఐ) నిర్ధారించినా వాటిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టలేదు. 2022 ఆగస్టు 3న ఇచ్చిన ఆ నివేదికను తితిదే సీనియర్ మేనేజ్‌మెంట్ ఉద్దేశపూర్వకంగానే తొక్కిపెట్టింది.

● భోలేబాబా నెయ్యి కల్తీదని సీఎఫ్‌టీఆర్ఐ కూడా చెప్పింది. అయినా ఆ డెయిరీ నుంచి కొనుగోళ్లు జరిపారు. గతంలో ఇచ్చిన ఆర్డర్ ప్రకారం నెయ్యి కొనుగోళ్లు కొనసాగించడంతో పాటు, అదనంగా 15 శాతం (ట్యాంకర్ల ద్వారా 1,07,625 కిలోలు, టిన్నుల ద్వారా 9,450 కిలోలు) నెయ్యి సరఫరాకు ఆర్డర్ ఇచ్చారు.

● టెండర్ నిబంధనల ప్రకారం ఫైనాన్షియల్ బిడ్ ఖరారయ్యాక నెయ్యి ధరపై సంప్రదింపులు(నెగోషియేషన్స్) ఆస్కారం లేదు. కానీ చాలా సందర్భాల్లో కొన్ని డెయిరీల లేఖలు, ఈమెయిల్స్ ద్వారా పంపిన ప్రతిపాదనల్ని ఆమోదించారు.

పరీక్ష లేకుండానే...

● భారత ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) 2022 జులై 1 నుంచి బీటా సిటోస్టెరాల్ పెరామీటర్ పరీక్షను తప్పనిసరి చేసింది. ఆ నిబంధనను తితిదే అమలు చేయలేదు. సరికదా ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధన అమల్లోకి రాకముందు ఖరారు చేసిన టెండర్లకు సంబంధించి ఆ నిబంధనను చేర్చకూడదని... నెయ్యి సరఫరాదారుల విజ్ఞప్తి మేరకు 2022 ఆగస్టులో వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. దీని వల్ల 2022 ఆగస్టు నుంచి 2023 నవంబరు మధ్య 70.78 లక్షల కిలోల నెయ్యి బీటా సిటోస్టెరాల్ పెరామీటర్ పరీక్షించకుండానే సరఫరా అయింది.

ల్యాబ్ సామర్థ్యం పెంచలేదు

2024 నవంబరు వరకు తితిదేకి చెందిన వాటర్ అండ్ ఫుడ్ ల్యాబ్‌కు.. నెయ్యిలో బీటా సిటోస్టెరాల్‌ను పరీక్షించేందుకు వీలుగా సదుపాయాలు కల్పించలేదు. 2023 డిసెంబరు 28 నుంచి 2023 నవంబరు 19 వరకు ఎలాంటి బీటా సిటోస్టెరాల్ పరీక్షలు లేకుండానే తితిదే 46.28 లక్షల కిలోల నెయ్యి కొనుగోలు చేసింది.

అన్ని కమిటీల్లోనూ వారే ఉంటే ఇంకెక్కడి నిష్పక్షికత?

● తితిదేలో ఏర్పాటు చేసిన వివిధ కమిటీల్లో కొందరే సభ్యులుగా ఉండటం వల్ల నిష్పక్షికత, పారదర్శకత లోపించింది. జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్), ఎస్వీజీఎస్ డైరెక్టర్ మూడు కమిటీల్లో ఉన్నారు. దీని వల్ల వివిధ దశల్లో స్వతంత్రంగా మదింపు చేయడంపై ప్రభావం పడింది.

● కొనుగోళ్ల కమిటీల్లో ఉన్న అధికారులే టెక్నికల్ ఎవాల్యుయేషన్, ప్లాంట్ ఇన్‌స్పెక్షన్ కమిటీల్లోనూ ఉండటం, కొనుగోళ్లకు సంబంధించి నిర్ణయాలు వారే తీసుకోవటం వల్ల పక్షపాతంతో వ్యవహరించే అవకాశం ఉంది.

కిలో రూ.294కు ఎలా వస్తుంది?

● అర్హత నిబంధనలు సడలించడంతో... నకిలీ డెయిరీలు చాలా తక్కువ ధరకు బిడ్లు వెయ్యడం మొదలుపెట్టాయి. 2019 నవంబరు 30న కేజీ ఆవు నెయ్యికి రూ.426.10 కోట్ చేసిన ఒక సంస్థ, 2020 మార్చి 9న రూ.294 మాత్రమే కోట్ చేసింది. అంటే కిలోకు రూ.132 తక్కువ కోట్ చేసింది. నాణ్యతతో రాజీ పడకుండా, కల్తీ చేయకుండా ఆవు నెయ్యిని అంత తక్కువ ధరకు సరఫరా చేయడం ఎలా సాధ్యం?

● అర్హత నిబంధనలు సడలించడం, చాలా తక్కువ మొత్తానికి బిడ్లు కోట్ చేయడం, కల్తీ నెయ్యి సరఫరా చేయడం ఒక పథకం ప్రకారం జరిగాయి.

● సహకార డెయిరీలను పక్కనపెట్టి, ప్రైవేటు డెయిరీలకు అవకాశం ఇవ్వడం నాణ్యతను దెబ్బతీసింది.

తితిదే బోర్డుకు ప్రత్యేక ఆహ్వానితులు వద్దు

● తితిదే ప్రజా సంబంధ మతపరమైన సంస్థగా ఉండాలి

● టెండర్ వ్యవస్థను సంస్కరించాలి

● విశ్రాంత ఐఏఎస్ దినేష్‌కుమార్ కమిషన్ సిఫార్సులు

ఈనాడు, అమరావతి: 'తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డుకు సలహాలు ఇచ్చేలా ప్రత్యేక ఆహ్వానితులుగా అనేక మందిని నియమిస్తున్నారు. ఇందుకోసం 2023లో చట్టాన్ని మార్చు చేశారు. సవరించిన చట్టాన్ని రద్దు చేయాలి. పాలనాపరమైన, నిర్మాణాత్మక, వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టాలి' అని విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్ కమిషన్ సిఫార్సులు చేసింది. ఆ సిఫార్సులివీ..



దినేష్‌కుమార్

తితిదే బోర్డును సంస్కరించాలి

నెయ్యి కల్తీ వ్యవహారంలో తితిదే బోర్డు పర్యవేక్షణ, పాలన తీరు ఆందోళన కలిగించింది. బోర్డులో నిర్మాణాత్మక మార్పులు చేయాలి. అసలు చట్టం 1987లోని 30 విభాగం సెక్షన్ 97కు 2023లో మార్పులు చేసి.. సుమారు 55 మంది ప్రత్యేక ఆహ్వానితులను నియమిస్తున్నారు. ఈ నియామకాలకు అవకాశం కల్పించే 2023 చట్టం 1లోని సెక్షన్ 97 (బి), 97 (డి)లను శాశ్వతంగా రద్దు చేయాలి.

● తితిదే ప్రొఫెషనల్‌గా పాలనా వ్యవహారాలు నిర్వర్తించే ఒక పబ్లిక్ మతపరమైన సంస్థగా ఉండాలి. బోర్డులో అవసరమైన నిపుణులు ఉండాలి. మెరుగైన నిర్ణయాలకు వీలుగా వీరు సంబంధిత ఉప కమిటీల్లోనూ భాగంగా ఉండాలి. విధాన రూపకల్పన, కార్యనిర్వహణ మధ్య బలమైన వారధి ఉండేలా దేవాదాయశాఖ కమిషనర్ స్థానంలో ఆలయ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఉన్న ఈవో లేదా జేఈవోను బోర్డులో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నియమించవచ్చు.

● కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 166 తరహాలో బోర్డు బాధ్యతలు, విధులు నిర్వహించే విధానాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవచ్చు.

మేనేజ్‌మెంట్ కమిటీ

బోర్డు నిర్ణయాలు సవ్యంగా అమలయ్యేలా మేనేజ్‌మెంట్ కమిటీ అవసరం. దశల వారీగా నిర్ణయాలు అమల్లోకి తేవాలి. పాలనాపరమైన ఆదేశాలు జారీ చేయాలి. సమన్వయ లోపాలను నిరోధించగలగాలి. వీటిలో అడ్డంకులను మేనేజ్‌మెంట్ కమిటీ పరిష్కరించాలి.

విజిలెన్స్ విభాగం ఏర్పాటు..

తాజా ఘటనల్లో విజిలెన్స్ విభాగం లోపం స్పష్టమైంది. మోసాలు, లోపాలు ఎక్కడున్నా గుర్తించేలా ఆ విభాగం ఉండాలి. ఈ నివేదికలోని అంశాలను పరిశీలించి సదరు విభాగం తమ విధులను పునఃసమీక్షించుకోవాలి. పర్యవేక్షణ మెరుగుపరచుకునేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

నిర్మాణాత్మక సంస్కరణలు

● ప్రొక్యూర్‌మెంట్ (కొనుగోలు) విభాగాన్ని బలోపేతం చేయాలి. తితిదేలో అన్ని ఆలయాలకు అవసరమైన కొనుగోళ్లు ఈ విభాగం బాధ్యత. ఇందుకు ఏడాదికి బడ్జెట్ రూ.618 కోట్లుగా అంచనా. అందువల్ల కొనుగోళ్లు, నిల్వలు, నాణ్యత, తనిఖీ, పర్యవేక్షణ స్థానాల్లోని అధికారులు, కమిటీ సభ్యుల పాత్రను, బాధ్యతలను నిర్దేశిస్తూ 'ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్' రూపొందించాలి. నైపుణ్యం, అనుభవమున్న జనరల్ మేనేజర్‌కు ఈ విభాగం అప్పగించాలి. డెయిరీల సాంకేతిక అంచనాలు, ప్లాంట్ల తనిఖీలకు నిపుణుడిని నియమించాలి.

● ప్రొక్యూర్‌మెంట్ విభాగం కొనుగోళ్ల కోసం ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలి. విక్రేతల ప్యానెల్ ఏర్పాటు చేయాలి.

● నిజమైన నెయ్యి ఉత్పత్తిదారులే పాల్గొనేలా టెండర్ నిబంధనలు కఠినంగా రూపొందించాలి. సాంకేతిక బిడ్‌ను అంతర్గత, బయటి నిపుణులతో కూడిన సాంకేతిక మదింపు కమిటీ అంచనా వేయాలి. అర్హత సాధించిన ప్రతి డెయిరీని ప్లాంట్ తనిఖీ కమిటీ క్షుణ్నంగా తనిఖీ చేయాలి. నెయ్యి నాణ్యతను తనిఖీ చేసే విభాగ లోపాలను ప్రొక్యూర్‌మెంట్ విభాగానికి తెలియజేయడంతో పాటు సీనియర్ మేనేజ్‌మెంట్‌కూ నివేదించాలి.

● నెయ్యి కొనుగోలుకు ఎల్-1 విధానం నుంచి నాణ్యత, ధర ఆధారిత ఎంపిక విధానానికి మారాలి. టెండర్ విధానంలో ఏకపక్షంగా ఉన్న క్లాజులు మార్చాలి. డెయిరీ అక్రమాలకు పాల్పడినట్లు తేలితే 2-3 ఏళ్ల పాటు నిషేధించాలి.

నాణ్యత తనిఖీ మెరుగుపరచాలి...

తితిదేలో నెయ్యితో సహా అన్ని ఆహార పదార్థాలకు కచ్చితమైన ప్రయోగశాల పరీక్షలు అవసరం. నేరుగా ఈవో, జేఈవోలకు నివేదిక ఇచ్చేలా నాణ్యత నియంత్రణ విభాగం అందుబాటులో ఉండాలి. క్రమం తప్పకుండా ల్యాబ్‌లలో పరీక్షించాలి (ఎలా పరీక్షలు చేయాలో కూడా నివేదిక తెలియజేసింది).

● నాణ్యత తనిఖీ కోసం నెయ్యి నమూనాలు సేకరించేందుకు ఒక కమిటీ ఉండాలి. సరఫరాదారు ఇచ్చిన నివేదికను ఈ నివేదికలతో సరిపోల్చాలి. తితిదే ఈవో నామినేట్ చేసిన బయటి నిపుణులతో కూడిన ఆడిట్ బృందం ఎప్పటికప్పుడు ప్రయోగశాలల ఆడిట్ చేయాలి.

● ఆహార భద్రతను పర్యవేక్షించే విభాగాన్ని ఏర్పాటు చేయాలి. తితిదే ల్యాబ్‌కు ఎవరైతే అధిపతి ఉంటారో ఆయనే దీనికి నేతృత్వం వహించాలి. వంటశాలలు, నిల్వలను తనిఖీ చేయాలి.

సమాచారం బహిర్గతం చేయాలి

ప్రజల్లో తితిదేపై విశ్వాసం పెంపొందించేందుకు బహిరంగ ప్రకటనల విధానం అనుసరించాలి. నెయ్యి పరీక్షల నివేదికలు తితిదే వెబ్‌సైట్‌లో పెట్టాలి. ఇటీవల నెయ్యి కల్తీ వ్యవహారంలో నిపుణుల ఎంపికకు నిర్దుష్ట విధానం లేదని తేలింది. నిపుణుల నియామకానికి అగ్రశ్రేణి పరిశోధనా సంస్థలకు లేఖలు రాయాలి. ప్రామాణిక ఆపరేటింగ్ విధానం రూపొందించాలి. లడ్డూ ప్యాకేజింగు, పంపిణీనీ మెరుగుపరచాలి. తితిదేలో ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను మెరుగుపరచాలి.

కల్తీ నెయ్యి సరఫరాకు ప్రధాన కారకుడు ధర్మారెడ్డే

(మొదటి పేజీ తరువాయి)

విఫలమయ్యారని నిర్ధారించింది. ఫలితంగానే మోసపూరిత సంస్థలకు నెయ్యి సరఫరా ఆర్డర్లు లభించాయని తెలిపింది. విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన ధర్మారెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ మేరకు విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ తాజాగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అప్పట్లో ఈవోగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్, ఆర్థిక సలహాదారు, చీఫ్ ఎకౌంటింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన బాలాజీ, ప్రొక్యూర్‌మెంట్ జీఎంలు పి.జగదీశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, నెయ్యి నిపుణుడు డా.బి.సురేంద్రనాథ్, డెయిరీ నిపుణుడు ఎం.విజయభాస్కరరెడ్డిల చర్యలు కల్తీ నెయ్యి సరఫరాకు ఎలా కారణమయ్యాయో కూడా నివేదికలో వివరించింది. వారిలో కొందరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ప్రధానాంశాలివీ..

బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా.. కొనసాగించారు

● ధర్మారెడ్డి 2019 జులై 12 నుంచి 2022 మే 8 వరకు తితిదే ప్రత్యేకాధికారిగా/అదనపు ఈవోగా పనిచేశారు. 2022 మే 8 నుంచి 2024 జూన్ 10 వరకు ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఈ హోదాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు, చర్యలే అక్రమాలకు కారణమయ్యాయి.

● 2022 ఫిబ్రవరి 14న ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలోనే నెయ్యి సరఫరా టెండరు నిబంధనల సడలింపునకు అనుమతిచ్చారు. నెయ్యి సరఫరాదారుల విశ్వసనీయత, వారి అర్హతలు, సామర్థ్యం, నాణ్యత హామీ వ్యవస్థల్ని సరిగ్గా తనిఖీలు చేయటంలో ధర్మారెడ్డి విఫలమయ్యారు.

● 2021 డిసెంబరులో భోలేబాబా డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారు. 2022 జూన్‌లో దానిపై అనర్హత వేటు వేశారు. అయినా నెయ్యి సరఫరా కొనసాగించటానికి ఆ సంస్థకు ధర్మారెడ్డి అనుమతిచ్చారు.

● భోలేబాబా, వైష్ణవి, ప్రీమియర్ డెయిరీలు కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నాయని 2022 ఆగస్టులోనే తేలినా వాటిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా తితిదేకు నెయ్యి సరఫరా కొనసాగించేలా చేశారు. ఇది తీవ్ర నిర్లక్ష్యం. టెండరు నిబంధనల అమలులో ధర్మారెడ్డి విఫలమయ్యారు. ప్రొక్యూర్‌మెంట్ విభాగంపై తగిన పర్యవేక్షణ, నియంత్రణ లేదు. ఆయన చర్యల వల్ల అనేక విధానపరమైన లోపాలు తలెత్తాయి.

ఆ నిబంధనను టెండర్ల షరతుల్లో చేర్చలేదు

● కల్తీనెయ్యి వ్యవహారాన్ని పాలకమండలి దృష్టికి తీసుకెళ్లటంలో అప్పటి ఈవో ధర్మారెడ్డి విఫలమయ్యారు. బీటా సిటోస్టెరాల్ పరీక్షను తప్పనిసరి చేస్తూ 2022 జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధన గురించి పాలకమండలి దృష్టికి తీసుకెళ్లలేదు. 2022 ఆగస్టులో రెండు డెయిరీలతో నెయ్యి సరఫరా ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు బీటా సిటోస్టెరాల్ పరీక్ష నిబంధన చేర్చకుండా వాటికి ఆమోదం తెలిపారు. కల్తీ నెయ్యి సరఫరా జరుగుతోందంటూ మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ సంస్థ నిగ్గు తేల్చిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. 2022 జులై 1 నుంచే బీటా సిటోస్టెరాల్ పరీక్ష తప్పనిసరైనా.. 2023 నవంబరు 14 వరకూ ఆ నిబంధనను నెయ్యి సరఫరా టెండరు షరతుల్లో చేర్చలేదు.

● బీటా సిటోస్టెరాల్ పరీక్షలు చేసేలా తితిదే ల్యాబ్ సామర్థ్యాన్ని అప్‌గ్రేడ్ చేయటంలో విఫలమయ్యారు. కల్తీ నెయ్యి సరఫరా జరుగుతోందంటూ సీఎఫ్‌టీఆర్ఐ ఇచ్చిన నివేదిక ఆధారంగా సంబంధిత సంస్థలపై ధర్మారెడ్డి చర్యలు తీసుకోలేదు. బీటా సిటోస్టెరాల్ పరీక్షను తప్పనిసరి చేస్తూ ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన మార్గదర్శకాలు అమలు చేయలేదు.

బాధ్యులు వీరు.. క్రమశిక్షణ చర్యలు తీసుకోండి



పి.జగదీశ్వర్‌రెడ్డి: 2018 మే 17 నుంచి 2020 మే 13 వరకూ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్‌గా పనిచేసిన పి.జగదీశ్వర్‌రెడ్డి నెయ్యి సరఫరా టెండరు నిబంధనలు సడలించిన కమిటీలో సభ్యుడు. తగిన కారణాలు లేకుండానే టెండరు నిబంధనలు సడలించాలని సిఫార్సు చేశారు. ఆ ప్రతిపాదనను ఈవో ఆమోదానికి పంపించారు.



ఆర్ఎస్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం: 2020 మే 13 నుంచి 2023 మే 1 వరకూ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎంగా పనిచేశారు. తితిదేకు కల్తీ నెయ్యి సరఫరా జరుగుతోందని సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలో వెల్లడైనా దాన్ని ఈవో, పాలకమండలి దృష్టికి తీసుకురాలేదు. ఫైలును దాచిపెట్టారు. భోలేబాబా, ప్రీమియర్, వైష్ణవి డెయిరీలు సరఫరా చేస్తున్న నెయ్యిలో కల్తీ ఉన్నట్లు సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలో నిగ్గుతేలిన తర్వాత కూడా వాటిపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆయన తీవ్రమైన దుష్ప్రవర్తనకు సంబంధించిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

బి.సురేంద్రనాథ్ (నెయ్యి నిపుణుడు): నెయ్యి సరఫరా టెండరు నిబంధనలను పటిష్ఠం చేయటంలోనూ, తర్వాత వాటిని పూర్తిగా సడలించటంలోనూ సురేంద్రనాథ్ పాత్ర ఉంది. కల్తీ నెయ్యి సరఫరాదారులతో చేతులు కలిపి, వారి వినతి మేరకు బీటా సిటోస్టెరాల్ పరీక్షకు మినహాయింపు ఇవ్వాలని సిఫార్సు చేశారు. తద్వారా కల్తీ నెయ్యి సరఫరా కొనసాగటానికి దోహదపడ్డారు. ప్లాంట్ తనిఖీ బృందం సభ్యుడిగా తన బాధ్యతల్ని నిష్పక్షపాతంగా నిర్వహించలేదు. సురేంద్రనాథ్‌పై తితిదే తగిన చర్యలు తీసుకోవాలి.

ఎం.విజయభాస్కరరెడ్డి (డెయిరీ నిపుణుడు): బీటా సిటోస్టెరాల్ పరీక్ష తప్పనిసరి అన్న నిబంధన అమలు చేయటంలో విఫలమయ్యారు. బీటా సిటోస్టెరాల్ పరీక్షకు సంబంధించిన ల్యాబ్ ఏర్పాటు చేయాలని తితిదేకు సలహా ఇవ్వలేదు. ప్లాంట్ తనిఖీ బృంద సభ్యుడిగా తన బాధ్యతల్ని నిష్పక్షపాతంగా నిర్వహించలేదు. విజయభాస్కరరెడ్డిపై తితిదే తగిన చర్యలు తీసుకోవాలి.

● ప్రొక్యూర్‌మెంట్ జీఎంల కంటే కింది స్థాయి అధికారుల పాత్రపై సిట్ అభియోగపత్రంలో వివరించింది. దాని ఆధారంగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

ప్రతికూలతలు అంచనా వేయకుండానే ఆమోదించేశారు..



అనిల్‌కుమార్ సింఘాల్: నెయ్యి సరఫరా టెండరు నిబంధనల సడలింపుతో తలెత్తే ప్రతికూల ప్రభావాలను అంచనా వేయకుండా ఆ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. తర్వాత పాలకమండలి ముందు ఆ ప్రతిపాదనను పెట్టటంతో అక్కడా ఆమోదం పొందింది. టెండరు నిబంధనల సడలింపు ప్రతిపాదనలు ఆమోదించేటప్పుడు తగిన జాగ్రత్త తీసుకోలేదు. ఫలితంగా కల్తీ నెయ్యి సరఫరాకు అవకాశం కలిగింది.

కల్తీ నెయ్యి సరఫరా సంస్థల చొరబాటుకు కారకుడు



ఓ.బాలాజీ: నెయ్యి సరఫరా టెండరు నిబంధనలు సడలింపుతో తలెత్తే ప్రతికూల ప్రభావాలను అంచనా వేయలేదు. బీటా సిటోస్టెరాల్ పరీక్షను తప్పనిసరి చేస్తూ 2022 జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనను టెండరు షరతుల్లో చేర్చకుండా జాప్యం చేశారు. ఆ నిబంధన చేర్చకుండానే రెండు డెయిరీలతో ఒప్పందానికి సిఫార్సు చేశారు. రివర్స్ ఆక్షన్ తర్వాత లేఖల ద్వారా ధరలు తగ్గించినా.. అలాంటి టెండర్లను తిరస్కరించకుండా టెండర్లు ఆమోదించాలని సిఫార్సు చేశారు. ఉల్లంఘనకు సహకరించారు. అతి తక్కువ ధరకు నెయ్యి సరఫరా చేస్తామంటూ వచ్చిన బిడ్లను పక్కాగా పరిశీలించకుండా ఆమోదించారు. తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాలాజీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

బాధ్యత మరిచిన సుబ్బారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సమాచారమేదీ ఇవ్వలేదంటూ సుబ్బారెడ్డి తప్పించుకోవాలని చూశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ నివేదిక విశ్లేషిస్తే ఇదే విషయం స్పష్టమవుతోంది. నెయ్యి నమూనాల నాణ్యత పరీక్షల కోసం ఆదేశాలిచ్చిన సుబ్బారెడ్డిపైనే.. వాటి ఫలితాలు ఏమయ్యాయో తెలుసుకోవాల్సిన బాధ్యత, విధి ఉందని కమిషన్ స్పష్టం చేసింది. అయితే దాన్ని ఆయన పూర్తిగా విస్మరించారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన ఇలా చేశారా? దీని వెనక ఏమైనా కుట్ర ఉందా అనే అంశాలపై కమిషన్ ఏమీ తేల్చకుండా వదిలేసింది. అయితే అప్పట్లో సుబ్బారెడ్డి నేతృత్వంలోని పాలకమండలి నిర్ణయాలు, చర్యలు కల్తీ నెయ్యి సరఫరాకు ఎలా కారణమయ్యాయో నివేదికలో ప్రస్తావించింది. ప్రధానాంశాలివీ.

కారణాలు అడగకుండానే నిబంధనల సడలింపునకు పచ్చజెండా

● నెయ్యి సరఫరా టెండరు నిబంధనలు సడలించాలంటూ కొనుగోలు కమిటీ సిఫార్సు చేయగా కారణాలు చూపాలని అడగకుండానే పాలకమండలి ఆ సిఫార్సులు ఆమోదించింది. నిబంధనల సడలింపు వల్ల నాణ్యతపై ఎలాంటి ప్రభావం పడుతుందనేదానిపై కనీసం మదింపు చేయలేదు.

● లడ్డూ, నెయ్యి నాణ్యతపై అప్పట్లో అనేక ఫిర్యాదులొచ్చినా పాలకమండలి పట్టించుకోలేదు. నెయ్యి నాణ్యతను నిర్ధారించే పరీక్షల్లో ఒకటైన బీటా సిటోస్టెరాల్ పరీక్షను తప్పనిసరి చేస్తూ ఎఫ్ఎస్ఎస్ఏఐ విధించిన నిబంధన 2022 జులై 1 నుంచే అమల్లోకి వచ్చినా దానిపై పాలకమండలికి కనీస అవగాహన లేదు. తితిదే పరిపాలన ఎంత పేలవంగా సాగిందో చెప్పటానికి ఇదే ఉదాహరణ.

కల్తీ నెయ్యి సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టలేదు

● అప్పటి పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు 2022 మే నెలలో నెయ్యి నమూనాలను మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐకు పంపించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో కల్తీ నిర్ధారణైంది. ఈ విషయాన్ని సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు నాటి ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎం, గోదాముల విభాగం డిప్యూటీ ఈవోలు సిట్‌కు వాంగ్మూలమిచ్చారు. అయితే వైవీ దీన్ని ఖండించారు. వారు తనకు అలాంటి సమాచారం ఇవ్వలేదని చెప్పారు. సమాచారం లేకపోయినా సరే.. తానిచ్చిన ఆదేశాలపై నిర్వహించిన పరీక్షల ఫలితాల గురించి తెలుసుకోవటం సుబ్బారెడ్డి విధి, బాధ్యత.

● తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్న డెయిరీలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వాటిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా వదిలేశారు. ఆ కల్తీ నెయ్యితోనే శ్రీవారి లడ్డూలు తయారు చేయడంతో లక్షల మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. తితిదే ప్రతిష్ఠ మసకబారింది. సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలో కల్తీ నిర్ధారణైన తర్వాత కూడా సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకోకపోవటంతో కల్తీ నెయ్యి సరఫరా యథేచ్ఛగా కొనసాగింది.

● నెయ్యి నాణ్యత పరీక్షల కోసం తితిదే థర్డ్ పార్టీ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. తమ సొంత ల్యాబ్‌నైనా అన్ని పరీక్షలు చేయగలిగే స్థాయికి అభివృద్ధి చేయలేదు. దీంతో నాణ్యత పర్యవేక్షణ తూతూమంత్రమైపోయింది.

● 2019 అక్టోబరు 23న జరిగిన పాలకమండలి సమావేశంలో సుబ్బారెడ్డి ఇద్దరు వ్యక్తులను ప్రత్యేక ఆహ్వానితులుగా చేర్చారు. ఇది అసాధారణ జోక్యం. 2020 మే 28న జరిగిన సమావేశంలో నాటి ఛైర్మన్ సుబ్బారెడ్డి ఆ ఆదేశాన్ని ఎవరికీ, ఏ కారణం చెప్పకుండానే రద్దు చేశారు.



క్యూట్ కుషన్ కుట్టేద్దామా..?



రోజంతా ఆడుకోవడం, కథల పుస్తకాలు చదవడం, నచ్చిన కార్టూన్లు చూడటంతో టైం ఎంత వేగంగా గడిచిపోతోందో! మరి ఈ సమయంలో మనకోసం ఓ మంచి వస్తువును తయారుచేసుకుందామా? మామూలుగా టీ-షర్టు చిన్నదైపోతే ఏం చేస్తాం? కబోర్డ్‌లో ఓ మూలన పడేస్తాం. కానీ, దాంతోనే మనకు ఎంచక్కా హత్తుకోవాలి అనిపించే ఓ బుజ్జి సోఫా కుషన్‌ను కుడితే బావుంటుంది కదా!

సెలవుల్లో సరదాగా!

దీన్ని తయారు చేయడానికి మనకు మిషన్లు అక్కర్లేదు. చిట్టి చేతులతో, అమ్మనాన్నల సాయంతో ఎంచక్కా తయారుచేయొచ్చు.

● టీషర్టు లోపల దూదిని లేదా పాత కాటన్ దుస్తుల్ని నింపాలి. గుండ్రటి ఆకారం వచ్చేలా దాన్ని అడ్జస్ట్ చేయాలి.

● టీ షర్టు చుట్టూ చిన్న చిన్న పాయలుగా ఒక మూడు అంగుళాల వరకు కత్తెరతో కట్ చెయ్యాలి. ఇక్కడ అమ్మ/నాన్న సాయం తీసుకోవచ్చు.

● ఇప్పుడు ఆ కట్ చేసిన పాయలను రెండు రెండుగా తీసుకొని, గట్టిగా ముడులు వేయాలి. టీ షర్టు చేతుల్ని లోపలికి తోసేసి ముడి వేయొచ్చు. లేదా అవి కూడా కుషన్‌పైన డిజైన్‌లాగా ఉంచుకోవచ్చు.

● ఇప్పుడు, ఆ కుషన్ మీద మన పేరును గానీ, నచ్చిన బొమ్మలు గానీ కుడితే సరి.

పూల నగలు

బయట పార్కుల్లో, ఇంటి ఆవరణలో రంగురంగుల పూలు చూస్తుంటే భలే ఉంటుంది కదూ.. ఆ పూలతో మనమే సొంతంగా అందమైన నగలు తయారు చేసుకుందామా? కిరీటాలు, గాజులు, చెవి దిద్దులు చేసుకుని మురిసిపోదామా..



■ మీ దగ్గర్లో ఉన్న రకరకాల పూలను సేకరించి ఒకదానితో ఒకటి అల్లండి. రాకపోతే దారంతో అయినా మాలగా కట్టవచ్చు. ఇప్పుడు మీ తలకు సరిపడా చూసి, మాల రెండు చివర్లు ముడి వేస్తే అందమైన 'ఫ్లవర్ క్రౌన్' రెడీ. ■ ఇదే విధంగా చేతికి సరిపోయేలా గాజులూ చేసుకోవచ్చు. ■ చిన్న చిన్న పూలను చెవి కమ్మల్లా పెట్టుకోవచ్చు. నగలు తయారయ్యాక ఫ్రెండ్స్‌కి చూపిస్తే భలే సరదా పడతారు!





శ్రామికులతో మమేకమై..!

4 కి.మీ. రిక్షా తొక్కిన మంత్రి నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: మే డే సందర్భంగా జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో శ్రామికులతో మమేకమయ్యారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో మండుటెండలో 4 కిలోమీటర్లు రిక్షా తొక్కారు. కార్మికులు, శ్రామికులే తన అభిమానులు అని మంత్రి పేర్కొన్నారు. వారికి టీషర్టులు పంపిణీ చేసి కార్మిక నాయకులను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఈల వేసి.. సభకు వచ్చిన వారిని ఉత్సాహపరిచారు.

వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలకు 87 సెలవులు

- మొత్తం పని దినాలు 229 రోజులు
- 2026-27 అకడమిక్ క్యాలెండర్‌ను సిద్ధం చేసిన పాఠశాల విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో పాఠశాలలకు 87 సెలవులు రానున్నాయి. ఐచ్ఛిక సెలవులు ఐదు, స్థానిక పండుగలు, జాతరలకు ఇచ్చుకునే స్థానిక సెలవులు మూడు ఉండనున్నాయి. విద్యా సంవత్సరంలో పాఠశాలలు 229 రోజులు పనిచేస్తాయి. వచ్చే ఏడాది అకడమిక్ క్యాలెండర్ రూపకల్పనకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో పాఠశాల విద్యాశాఖ సలహాలు, సూచనలు ఆహ్వానించింది. ప్రతి ఉపాధ్యాయుడికి వారానికి కనీసం 24 బోధనా పీరియడ్లు, గరిష్ఠంగా 30 పీరియడ్లు మించకూడదని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. పనిభారాన్ని సమతుల్యం చేసేందుకు భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు అవసరమైతే గణితాన్నీ బోధించాలి. ఏడో తరగతికి బోధన చేయాలి. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ప్రవేశాలకు ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తారు. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' ఉంటుంది.

తరగతి సంసిద్ధత కార్యక్రమం

పైతరగతికి వచ్చిన విద్యార్థులను ఆయా తరగతులకు సిద్ధం చేసేందుకు తరగతి సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 1, 2, 6 తరగతులకు జూన్ 12 నుంచి ఆగస్టు 3 వరకు 36 రోజుల పాటు, 3,4,5,7,8 తరగతులకు జూన్ 12 నుంచి 30 వరకు 13 రోజులపాటు బోధన ఉంటుంది.

సెలవులు ఇలా..: ● సాధారణ పాఠశాలలకు అక్టోబరు 12 నుంచి 21 వరకు దసరా సెలవులు. ● మైనారిటీ పాఠశాలలకు 15 నుంచి ఇస్తారు. ● క్రిస్మస్ సెలవులు మైనారిటీ విద్యా సంస్థలకు డిసెంబరు 20 నుంచి 27 వరకు ఉంటాయి. ● సాధారణ పాఠశాలలకు డిసెంబరు 25 ఒక్కరోజే క్రిస్మస్ సెలవు. ● సంక్రాంతి సెలవులు 2027 జనవరి 11 నుంచి 17 వరకు ఇస్తారు. మైనారిటీ విద్యా సంస్థలకు జనవరి 13 నుంచి 17 వరకు ఉంటాయి.

ఆగస్టు నుంచి పరీక్షలు..: ▾ ఫార్మెటివ్-1 ఆగస్టు 3-6 వరకు నిర్వహిస్తారు. ▾ ఫార్మెటివ్-2 అక్టోబరు 5-8 వరకు ఉంటాయి. ▾ సమ్మెటివ్ పరీక్షలు నవంబరు 9-20, ఫార్మెటివ్-3 జనవరి 4-7 వరకు నిర్వహిస్తారు. ▾ ఫార్మెటివ్-4 ఫిబ్రవరి 8-11 వరకు ఉంటాయి. ▾ పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ ఫిబ్రవరి 8-18, పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్, తొమ్మిదో తరగతికి సమ్మెటివ్-2 పరీక్షలు ఫిబ్రవరి 24-మార్చి 9వరకు ఉంటాయి. ▾ సమ్మెటివ్-2 పరీక్షలు(ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు) 2027 ఏప్రిల్ 3-17, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 15-31 వరకు నిర్వహిస్తారు.



20 ఏళ్ల వయసు..జీవితంలో బంగారు దశ

జీవితంలోని బంగారు దశల్లో 20 ఏళ్ల వయసు దశ ఒకటి. ఎందుకంటే కొత్త స్నేహితులు దొరుకుతారు. కొందరిని కోల్పోతారు. తప్పులు చేస్తారు. వాటిని సరిదిద్దుకుంటారు. కిందపడతారు.. ఓడిపోతారు..వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటారు. వాస్తవాలను గ్రహిస్తారు. జీవితం అంటే ఏంటో తెలుసుకుంటారు. మానసికంగా దృఢంగా తయారవుతారు.

– వెరుయియోస్క్స్, ఫైనాన్స్ నిపుణుడు

5 నగరాల్లో ఈ-వాహనాలు

రయ్ రయ్



మౌలిక సదుపాయాలకు రూ.250 కోట్లతో ప్రత్యేక నిధి | **ఒక్కో నగరంలో రూ.50 కోట్ల వ్యయం**

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూ.250 కోట్లతో ప్రభుత్వం ప్రత్యేకనిధి ఏర్పాటుచేసింది. ఇందుకోసం ప్రాథమికంగా ఎంపిక చేసిన ఐదు నగరాల్లో ఒక్కోచోట రూ.50 కోట్ల చొప్పున ఖర్చు చేయనుంది. ఆయాచోట్ల ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, మౌలిక వసతుల అభివృద్ధి, హరిత రవాణావ్యవస్థలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో 2047 నాటికి రవాణా రంగంలో కర్బన ఉద్గారాలను తగ్గించి.. కార్బన్ న్యూట్రాలిటీ సాధించే దిశగా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో దశలవారీగా ఇందుకు ప్రణాళికలు అమలు చేయనుంది. ఈ మార్గదర్శకాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శుక్రవారం విడుదల చేసింది.

ఈ-నగరాల్లో అభివృద్ధి లక్ష్యాలివీ..

■ అధిక సామర్థ్యం ఉన్న ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ■ గ్రీన్ రహదారులు, ఛానెళ్లు, సున్నా ఉద్గారాల జోన్ల అభివృద్ధి ■ ప్రతి 9 కిలోమీటర్ల పరిధిలో ఓ ఛార్జింగ్ స్టేషన్ ■ ఇంటర్‌సిటీ రోడ్లపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్

ప్రత్యేక నిధి వినియోగం ఇలా..

▾ ఛార్జింగ్ కోసం మౌలిక వసతులు ▾ విద్యుత్తు గ్రిడ్ బలోపేతం ▾ బ్యాటరీ మార్పిడి సదుపాయం ▾ ఈవీలకు ప్రోత్సాహం ▾ కొత్త సాంకేతిక ప్రయోగాలు ▾ వినియోగదారులకు ప్రోత్సాహక కార్యక్రమాలు

కీలక మలుపు

'ప్రభుత్వ నిర్ణయం రాష్ట్ర పట్టణ రవాణా వ్యవస్థలో కీలక పరిణామం కానుంది. ప్రస్తుతం పెనుసవాలుగా మారుతున్న పర్యావరణ సమస్యలకు ఈవీల వినియోగంతో పరిష్కారం లభించనుంది. గ్రీన్ గ్రోత్, భవిష్యత్తు ఈ-మొబిలిటీ రంగంలో రాష్ట్రం అగ్రగామిగా నిలవనుంది' అని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

నగరాల వారీగా ప్రత్యేక ప్రణాళికలు

విశాఖపట్నం: గ్రీన్ పర్యాటక మొబిలిటీ, ఎలక్ట్రిక్ బీఆర్‌టీఎస్, సరకు రవాణా కారిడార్ల అభివృద్ధి
విజయవాడ: బీఆర్‌టీఎస్ మార్గాల్లో గ్రీన్ రూట్లు, లాజిస్టిక్, ఈవీ మౌలిక వసతులు
రాజమహేంద్రవరం: విద్యుత్తుతో నడిచే నదీ రవాణా వ్యవస్థ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా మార్గాలు
నెల్లూరు: చేపల రవాణాకు ఈవీ లాజిస్టిక్ ఏర్పాటు
తిరుపతి: తిరుమలలో షటిల్ వ్యవస్థ విద్యుదీకరణ, సున్నా కర్బన ఉద్గారాల యాత్రికుల జోన్ల అభివృద్ధి.

పిఠాపురంలో జోరుగా అభివృద్ధి పనులు

- పవన్‌కల్యాణ్ కృషితో మారుతున్న నియోజకవర్గ రూపురేఖలు
- వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు




పిఠాపురంలో కొనసాగుతున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ★ నియోజకవర్గంలో నిర్మాణం పూర్తయిన ఓ రోడ్డు

ఈనాడు, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ రూపురేఖలు వేగంగా మారుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం, ఆధ్యాత్మిక, పారిశ్రామికాభివృద్ధిపై రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొంది. 'అమృత్‌భారత్ పథకంలో రూ.37.25 కోట్ల నిధులతో పిఠాపురం రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండులో అభివృద్ధి పనులు చేపట్టారు. పిఠాపురం మున్సిపాలిటీని సెలక్షన్ గ్రేడ్ స్థాయికి, గొల్లప్రోలు నగర పంచాయతీని గ్రేడ్-3 మున్సిపాలిటీగా మార్చారు. అధిక నిధులు పొందేందుకు ఈ నిర్ణయాలు ఆస్కారం కల్పిస్తున్నాయి. ఉప్పాడ తీరంలో సముద్రకోత నివారణకు రూ.323 కోట్ల వ్యయంతో త్వరలో రక్షణ గోడ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. పిఠాపురం కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా మార్పు చేయించి, రూ.34 కోట్ల వ్యయంతో అధునాతన వసతులు కల్పిస్తున్నారు' అని వెల్లడించింది. 'పవన్ కల్యాణ్ ఒక్క కాకినాడ జిల్లాలోనే రూ.800 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులకు అవకాశం కల్పించారు. పిఠాపురం నియోజకవర్గంలో రూ.234 కోట్ల అంచనా వ్యయంతో 409 రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద నియోజకవర్గంలో రూ.376 కోట్లు వ్యయం చేస్తున్నారు. తీవ్ర నీటిఎద్దడి ఎదుర్కొంటున్న ఏడు గ్రామాల్లో ప్రత్యేకంగా రూ.17.67 కోట్లు ఖర్చుచేస్తున్నారు. ఎంఎస్ఎంఈ పార్కు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు పనుల కోసం రూ.9.60 కోట్లు మంజూరయ్యాయి. ఉద్యోగమేళాలు నిర్వహించి 487 మందికి ఉపాధి కల్పించారు. స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేసి, యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. రూ.కోటితో ఇండోర్ స్టేడియాన్ని ఆధునికీకరిస్తున్నారు. ఉప్పాడలో ప్రతిష్ఠాత్మక స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఏర్పాటుచేస్తున్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికహబ్‌గా మార్చాలనే సంకల్పంతో ఉప ముఖ్యమంత్రి 18 నెలల్లో దాదాపు రూ.34,853 కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చారు. వీటితో 5వేల మందికి ఉపాధి లభించనుంది. గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ ఫ్యాక్టరీ ఏర్పాటుకానుంది. రూ.20 కోట్ల నిధులతో నియోజకవర్గంలోని 19 ప్రధాన దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారు' అని వివరించింది.

రాజధాని ప్రాంత భూసమీకరణ పథకం నిబంధనలకు సవరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు-118 (ఎంఏయూడీ) ప్రకారం జారీ చేసిన రాజధాని ప్రాంత భూ సమీకరణ పథకం-2025 నిబంధనల సవరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీసీఆర్‌డీఏ అథారిటీ 60వ సమావేశంలో చేసిన తీర్మానాన్ని పరిశీలించి, సవరణకు అనుమతించింది.

● **నిబంధన:** మొదటి సంవత్సర వార్షిక కౌలు చెల్లింపు ఒక ఎకరం మెట్ట భూమికి రూ.30,000, జరీబు భూమికి రూ.50,000.
సవరణ: మొదటి సంవత్సరం మెట్ట భూమికి రూ.40,000, జరీబు భూమికి రూ.60,000

● **నిబంధన:** వ్యవసాయం చేస్తూ, పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్‌డీడ్ ఉన్న రైతులకు నిబంధనలు అమల్లోకి రాక ముందున్న రుణాలపై కుటుంబానికి గరిష్ఠంగా రూ.1,50,000 రుణమాఫీ.
సవరణ: పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్‌డీడ్ ఉన్న రైతులకు 2025 డిసెంబరు 2వ తేదీ కంటే ముందున్న రుణాలపై కుటుంబానికి గరిష్ఠంగా రూ.1,50,000 వ్యవసాయ రుణమాఫీ.

● **నిబంధన:** భూమి యజమానికి కేటాయించాల్సిన ప్లాటు (ఉమ్మడి ఆస్తి విషయంలో విడివిడిగా ప్లాటు కావాలా..లేక ఉమ్మడిగా ప్లాటు కావాలా అని తెలపాలి).
సవరణ: ప్లాట్ల ప్రాధాన్యాన్ని ఫారమ్-5 ఒప్పందం తర్వాత విడిగా తెలిపే అవకాశం.

అమరావతిలో రూ.6,750 కోట్ల పనులకు అనుమతులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో రూ.6,750.21 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ శుక్రవారం వేర్వేరుగా ఆరు జీవోలు విడుదల చేసింది. రాజధానిలో అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు సీఎం అధ్యక్షతన గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ)ని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఆదేశించింది.

రెవెన్యూశాఖకు కేటాయించిన భూములు వెనక్కి

రాజధాని ప్రాంతంలోని ఆర్5లో రెవెన్యూశాఖకు కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సీఆర్‌డీఏకి ప్రభుత్వం అనుమతించింది. ఇళ్ల స్థలాల కోసం వీటిని రెవెన్యూశాఖకు సీఆర్‌డీఏ గతంలో కేటాయించింది. నిబంధనల ప్రకారం నిర్ణయించిన విలువ మేరకు రెవెన్యూశాఖ సీఆర్‌డీఏకి డబ్బు చెల్లించాలి. నిర్దేశించిన గడువులోగా చెల్లించని కారణంగా ఆర్5లో భూములు వెనక్కి తీసుకోనున్నారు.

9 పంచాయతీలకు ఏ+, ఏ గ్రేడ్లు

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ అభివృద్ధి సూచిక (పీఏఐ) 2.0 (2023-24) నివేదిక ప్రకారం రాష్ట్రంలో తొమ్మిది గ్రామ పంచాయతీలు వివిధ విభాగాల్లో (థీమ్స్) 90కి పైగా స్కోర్‌తో ఏ+, ఏ గ్రేడ్లు సాధించాయి. వీటిలో 8 ఏ+, ఒక పంచాయతీ ఏ గ్రేడ్ పొందాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ శుక్రవారం వెల్లడించింది. గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధనే లక్ష్యంగా మంచి పనితీరు కనబరిచిన పంచాయతీలకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఏటా గ్రేడ్లు ఇచ్చి అడ్వాన్స్‌మెంట్ అభివృద్ధి సూచికను ప్రకటిస్తోంది.

ఏ +, ఏ గ్రేడ్లు సాధించిన పంచాయతీలు

విభాగం	పంచాయతీ	జిల్లా	గ్రేడ్
పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనోపాధి	చెముళ్లపల్లి	వైఎస్సార్ కడప	ఏ+
ఆరోగ్యకరమైన పంచాయతీ	పొండ్రపాడు	గుంటూరు	ఏ+
బాలల స్నేహపూర్వకం	కాచవరం	పల్నాడు	ఏ+
నీటి సమృద్ధి	ఏపిలగుంట	నెల్లూరు	ఏ+
పరిశుభ్రత, పచ్చదనం	తూపల్లి	శ్రీసత్యసాయి	ఏ+
మౌలిక సదుపాయాలు	గుండమాల	ప్రకాశం	ఏ+
సుపరిపాలన	సి.రెడ్డిగారిపల్లె	చిత్తూరు	ఏ+
మహిళా స్నేహపూర్వక	దుర్గి	పల్నాడు	ఏ+
సామాజిక న్యాయం, సామాజిక భద్రత	నవరగూడెం	కృష్ణా	ఏ

పెను గాలులతో హడలెత్తించిన వర్షం

- పలుచోట్ల కూలిన వృక్షాలు, నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలు



విశాఖ నగరంలో జలమయమైన పెందుర్తి ప్రధాన మార్గం



పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలంలో రహదారిపై కూలిన వృక్షం

ఈనాడు, విశాఖపట్నం, పార్వతీపురం-న్యూస్‌టుడే: విశాఖ నగరంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం తరువాత భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. విశాఖపట్నంలో ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్ర ఎండ, ఉక్కపోతకు జనం అల్లాడారు. తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. నగరంపై కరిమబ్బులు ఆవరించాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రజలను వణికించింది. కొన్నిచోట్ల వడగళ్ల వాన కురిసింది. రాత్రి ఎనిమిది గంటల వరకు అప్పుడప్పుడు వర్షం పడుతూనే ఉంది. విద్యుత్తు తీగలపై చెట్లు పడి కొన్నిచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు పార్వతీపురం మన్యం జిల్లాలో తీవ్రంగా వీచిన గాలులకు పలుచోట్ల చెట్లు కూలి రహదారులపై పడ్డాయి. విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. పాలకొండ పట్టణంతో పాటు పాలకొండ మండలం, మక్కువ ప్రాంతంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొమరాడ మండలం ఇందిరానగర్ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై భారీ వృక్షం కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎం.సింగుపురంలో 11 విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. పలుచోట్ల మామిడి, జీడి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది.

మున్సిపల్ ఆస్తుల అద్దెలకు కొత్త నిబంధనలు

ఈనాడు, అమరావతి: మున్సిపల్ షాపులు, స్థిరాస్తుల అద్దెలు, లీజుల నిర్ణయంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. కొత్త విధానంలో షాపులకు అవసరమయ్యే గదుల లీజు, అద్దె మొత్తంపై ఇకనుంచి ఏటా 7% పెంచనున్నారు. ఇప్పటివరకు మూడేళ్లకోసారి 33.50% పెంచేవారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు చెందిన అద్దె గదులు, ఇతర ఆస్తుల లీజుల విషయంలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానం లేదు. పాలకవర్గాల్లోని వ్యక్తులు, అధికారులు తోచినట్లు నిర్ణయాలు తీసుకునేవారు. దీంతో వివాదాలు, కోర్టు కేసులు తలెత్తేవి. 18 పుర, నగరపాలక సంస్థల్లో 584 మంది లీజుదారులు కోర్టులను ఆశ్రయించారు. దాదాపు రూ.కోటి లీజు, అద్దె బకాయిలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇతర రాష్ట్రాల విధానాలను పరిశీలించిన పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఏటా కొంత పెంచితే లీజుదారులపై భారం తగ్గి, వివాదాలకు తావుండదని ప్రభుత్వానికి నివేదించింది.

నూతన విధానం ఇలా....: ■ వాణిజ్య అవసరాలకు అవసరమయ్యే గదుల అప్‌సెట్ ధరను ప్రస్తుత మార్కెట్ విలువలో 10%, సమీప ప్రాంతాల్లో అద్దె ఆధారంగా నిర్ణయిస్తారు. ■ తదుపరి వేలాల్లో గత అద్దెపై 7% పెంపును పరిగణనలోకి తీసుకుంటారు. ■ ఫస్ట్ ఫ్లోర్ షాపులకు గ్రౌండ్ ఫ్లోర్ కంటే 20% తక్కువ, పై అంతస్తులకు 30% తక్కువగా అద్దె నిర్ణయిస్తారు. ■ ప్రస్తుత లీజుదారులు ఏటా 7% అద్దె పెంపునకు అంగీకరిస్తే, పబ్లిక్ వేలం నిర్వహించకుండా లీజును పొడిగించే అవకాశం కల్పిస్తారు. ■ ఒకేసారి మూడేళ్లపాటు, అవసరమైతే ప్రభుత్వ అనుమతితో గరిష్ఠంగా 25 ఏళ్ల వరకు లీజు పొడిగించొచ్చు.

శ్రీహరికి నోటీసు ఇచ్చి వివరణ తీసుకోండి

నల్లపాడు పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన ఘటనలో వైకాపా మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇదే ఘటనలో గుంటూరు కొత్తపేట పోలీసులు నమోదు చేసిన కేసులో శ్రీహరిని ఇప్పటికే అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన నేపథ్యంలో ఫిర్యాదుదారుకు నోటీసులిచ్చింది. వ్యాజ్యాలను మే 6కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. నల్లపాడు, గుంటూరు-కొత్తపేట పోలీసులు తనపై నమోదుచేసిన కేసులను కొట్టేయాలంటూ పూడి శ్రీహరి హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఒకే ఘటనపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. కుప్పం కోర్టు.. నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించిందన్నారు. కోర్టు నుంచి బయటకు రాగానే కొత్తపేట పోలీసులు శ్రీహరిని అరెస్టు చేశారని తెలిపారు. పోలీసుల తరఫున పీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ శ్రీహరి దర్యాప్తునకు సహకరించడం లేదన్నారు. నోటీసు ఇచ్చేందుకు తాడేపల్లి, అనకాపల్లిలో ఆయన చిరునామాలకు వెళ్లగా అందుబాటులో లేరన్నారు. కొత్తపేట పోలీసులు శ్రీహరిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టినట్లు కోర్టు దృష్టికి తెచ్చారు.

దేశం విడిచి వెళ్లొద్దని ఆదేశం

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: పూడి శ్రీహరి రిమాండ్‌ను తిరస్కరిస్తూ గుంటూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానం జడ్జి ఎం.శోభారాణి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీహరి తన పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించాలని, దేశం విడిచి వెళ్లరాదని, భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడకూడదని, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని షరతులు విధించారు.

ఈ దశలో కేసును కొట్టేసే ప్రశ్నే ఉత్పన్నం కాదు

పెద్ద దస్తగిరి హత్య కేసులో నిత్యానందరెడ్డికి తేల్చిచెప్పిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: కడప సమీపంలోని ఆలంఖాన్‌పల్లెకు చెందిన స్థిరాస్తి వ్యాపారి పెద్ద దస్తగిరి హత్య కేసులో నిందితుడు, వైకాపా నేత, మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదుచేసిన కేసును కొట్టేయాలంటూ నిత్యానందరెడ్డి(ఏ13) వేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. కేసు విచారణ ప్రాథమిక దశలో ఉందని గుర్తుచేసింది. ఈ దశలో కేసును కొట్టేసే ప్రశ్నే ఉత్పన్నం కాదని స్పష్టం చేసింది. అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. నిత్యానందరెడ్డిపై నమోదుచేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్నవి అయితే బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని, ఏడేళ్ల కంటే ఎక్కువ శిక్షకు వీలున్నవైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని నిత్యానందరెడ్డికి స్పష్టంచేసింది. వేసవి సెలవుల తర్వాత తదుపరి విచారణ చేపడతామంటూ వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. పెద్ద దస్తగిరి హత్యకు సంబంధించి కడప రిమ్స్ పోలీసులు తనపై నమోదుచేసిన కేసును కొట్టేయాలంటూ నిత్యానందరెడ్డి వేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ విచారణ జరిపింది.

ఏపీకి జీఎస్టీ ఆదాయం రూ.3,797 కోట్లు

ఈనాడు, దిల్లీ: ఎస్‌జీఎస్టీ సెటిల్‌మెంట్ తర్వాత ఏప్రిల్ నెలలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.3,797 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 38% మేర ఆదాయవృద్ధి నమోదుచేసింది. ఎస్‌జీఎస్టీ సెటిల్‌మెంట్‌కు ముందు ఏపీ ఆదాయం రూ.1,602 కోట్లుగా ఉంది. సెటిల్‌మెంట్ తర్వాత ఏపీ ఆదాయం రూ.2,195 కోట్లు. ఎస్‌జీఎస్టీ సెటిల్‌మెంట్ తర్వాత అన్ని రాష్ట్రాల ఆదాయం సగటున 40% పెరగ్గా, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఆలోపే ఉంది. ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా జీఎస్టీ స్థూలవసూళ్లు రూ.2,42,702కి చేరాయి. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఇది 8.7% అధికం. రిఫండ్ల (రూ.31,793 కోట్లు) తర్వాత నికర జీఎస్టీ వసూళ్లు రూ.2,10,909 కోట్లుగా తేలింది. గత ఏడాది కంటే ఇది 7.3% ఎక్కువ.

ఎన్ఐఏ పోలీసుస్టేషన్‌గా విశాఖ బ్రాంచ్ కార్యాలయం

రాష్ట్రమంతటా పరిధి... గెజిట్ నోటిఫికేషన్ జారీ

ఈనాడు, అమరావతి: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విశాఖపట్నం బ్రాంచ్ కార్యాలయాన్ని ఎన్ఐఏ పోలీసుస్టేషన్‌గా గుర్తిస్తూ, రాష్ట్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పోలీసుస్టేషన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా పరిధి (జ్యూరిస్‌డిక్షన్) కల్పించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీచేశారు. విశాఖపట్నం రుషికొండ స్వర్ణభారతి నగర్‌లోని హ్యాపీహోమ్స్‌లో ఈ పోలీసుస్టేషన్ ఉంది.

పర్యావరణ, అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా మహ్మద్ దివాన్ మైదీన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారుల బదిలీ, పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నంలో సీసీఎఫ్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ దివాన్ మైదీన్‌ను పర్యావరణ, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించింది. పీసీసీఎఫ్ కార్యాలయంలో వైల్డ్‌లైఫ్, హెచ్ఆర్‌డీ అదనపు పీసీసీఎఫ్ శాంతిప్రియ పాండేను తదుపరి పోస్టింగ్ ఇచ్చేవరకు సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీల వివరాలు www.eenadu.net లో

సెలవుల్లో సరదాగా!

ఇంట్లోనే హంటింగ్

హాయ్ ఫ్రెండ్స్..! హంటింగ్ చేయడం అంటే మీలో చాలా మందికి ఇంట్రెస్ట్ కదా.. అలా అని ఎండల్లో బయటకు వెళ్లలేరు. అందుకే ఇంట్లోనే చేస్తారా..!



ఇందుకోసం ఫ్రెండ్స్ అందరూ కలిసి ఓ గ్రూప్‌లా అవ్వండి. తర్వాత సమయం గడువు పెట్టుకుని కొన్ని కలర్స్ పేర్లు గానీ.. వస్తువుల పేర్లు, ఏవైనా కొన్ని ఆకారాలు అనుకొని కూర్చోండి. మీలో ఒకరు లీడర్ అన్నమాట. వాళ్లు ఈ గేమ్ అంతా చూసుకుంటారు.. ఒక్కొక్కరికీ ఒక్కోళ్ళ వస్తువు తీసుకు రమ్మని చెప్తారు.

ఉదాహరణకి ఏదైనా ఒక కలర్ పేరు చెప్పారనుకోండి, ఆ కలర్‌కి సంబంధించి ఏదో ఒక ఐటమ్ తీసుకొచ్చి అక్కడ పెట్టాలి. రంగు అనే కాకుండా ఏదైనా వస్తువు కావొచ్చు, ఆకారం కావొచ్చు.. లేకుంటే ఇంట్లో ఉన్న ఏదైనా వస్తువు పేరు సూటిగా చెప్పకుండా పొడుపుకథలా చెప్పి.. చిన్న క్లూ ఇవ్వొచ్చు.

అప్పుడు ఇంకాస్త వెతకాలని ఉత్సాహంగా అనిపిస్తుంది. ఇలా ఎవరైతే అనుకున్న సమయానికి వస్తువులను తెచ్చి పెడతారో వాళ్లే ఈ గేమ్ గెలిచినట్లు..! ఆడుతుంటే భలే థ్రిల్లింగ్‌గా ఉంటుంది. మీకూ నచ్చిందా!

ఏ బెలూన్ ఎంత దూరం..


మనకు బెలూన్స్ అంటే భలే ఇష్టం కదా! రంగు రంగుల బుడగలతో చక్కగా ఆడుకుంటాం. ఆ బెలూన్స్‌తో ఓ వెరైటీ గేమ్ ఆడుదాం.



- దీనికోసం ఒక ఐదు లేదా ఆరు బెలూన్స్ తీసుకోండి.
- ఒక దానిలో వీలైనంత ఎక్కువ గాలి నింపి పెద్దగా ఊదాలి. మరో దాంట్లో కొంచెం తక్కువగా.. ఇంకో దాంట్లో మరింత తక్కువగా.. అలా అలా తక్కువ తక్కువ గాలి నింపుతూ అన్నింటినీ ఊది గట్టిగా కట్టేయాలి.
- ఇప్పుడు వీటిని ఒకే సారి పైకి ఎగరేయాలి.
- ఏ బెలూన్ ఎక్కువ ఎత్తుకు, దూరానికి వెళ్తుందో గమనించాలి.
- గాలి ఎక్కువగా ఉన్న బెలూన్ ఎందుకు ఎత్తుకు వెళ్తుందో, అన్నింటి కంటే చిన్నది ఎందుకు సరిగ్గా ఎగరడం లేదో తెలుసుకుంటే.. ఇందులోని సైన్స్ అర్థం అవుతుంది!


రాజుల రహస్య భాష..
800 ఏళ్ల నాటి మోడీ లిపి

రాజులు, చక్రవర్తుల కాలం నాటి రాచరిక పాలనలో అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాల గోప్యతను కాపాడటానికి ఉపయోగించిన 800 ఏళ్లనాటి 'మోడీ లిపి' మళ్లీ వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం గ్వాలియర్ మరాఠా రాణి అహిల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని పురస్కరించుకుని ఈ లిపిని నేర్చుకునేందుకు ప్రోత్సహిస్తోంది. జబల్‌పూర్‌లోని రాణీదుర్గావతి మ్యూజియంలో ఏప్రిల్ 28న ప్రారంభమైన శిక్షణ శిబిరం మే 7 వరకు కొనసాగనుంది. కొన్ని



శతాబ్దాల క్రితం.. మరాఠాల పాలనలో దేశంలోని చాలా ప్రాంతాల్లో ఈ లిపిని వినియోగించేవారు. ఛత్రపతి శివాజీ మహారాజ్, పీష్వాల పాలనలో ఇది ప్రధాన లిపిగా ఉండేది. 13వ శతాబ్దంలో హేమాద్రి పండిట్ దీన్ని అభివృద్ధి చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో 1960 వరకు వాడుకలో ఉండేది. ఈ లిపి రాసేటప్పుడు చేతిని కాగితం పైనుంచి పైకి లేపాల్సిన అవసరం ఉండదని ముంబయి నుంచి వచ్చిన భాషా నిపుణులు మనోజ్ మరాస్కోల్కే, అమోల్ మోహల్కర్ తెలిపారు. వీరే ఈ ప్రాచీన లిపిని నేర్పుతున్నారు. దీనిని నేర్చుకుంటే రాజులు రహస్య భాషలో లిఖించిన లక్షలాది పత్రాలను సమీప భవిష్యత్తులో అందరూ చదవగలిగే అవకాశం ఉంటుందన్నది వారి అభిప్రాయం. -ఈటీవీ భారత్

కరవు తీరింది.. నేల నవ్వింది



ఈ చిత్రం అన్నమయ్య జిల్లాలోని గాలివీడు మండలంలోనిది. కరవుతో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడి రైతులు ప్రస్తుతం కూరగాయల సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. జలదారులో భాగంగా హంద్రీనీవా నీటిని వెలిగల్లు జలాశయానికి మళ్లించడంతో పాటు చెరువులు నింపడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో సుమారు 900 ఎకరాల్లో మల్చింగ్ విధానంలో టమాటా, ఇతర కూరగాయలు పండిస్తున్నారు. డ్రోన్‌తో ఫొటో తీసిన క్రమంలో మల్చింగ్ షీట్లతో ఆ ప్రాంతమంతా ఈ విధంగా కనిపించింది. - ఈనాడు, అన్నమయ్య

పెట్టుబడులతోనే సంపద సృష్టి



బ్యాంకుల్లో దాచుకోవడం వల్ల డబ్బు గొప్ప సంపదగా మారదనేది సుస్పష్టం. పెట్టుబడుల ద్వారానే వ్యక్తులు సంపన్నులుగా మారే అవకాశం ఉంది. అయితే మదుపు చేసేందుకు గల మంచి, లాభదాయకత అవకాశాలు అత్యధికంగా ఉన్న రంగాలను మీరు గుర్తించి ముందుకుసాగాలి. - బెంజమిన్ డానియల్, డిజిటల్ క్రియేటర్

కొండచింత.. బారెడంత!

ప్రొటీన్ కుటుంబానికి చెందిన అరుదైన తీగ జాతి చెట్టు నుంచి వచ్చిన కొండ చింతకాయ ఇది. ఈ తీగజాతి చెట్టు ఎక్కువగా తలకోన, అరకు ప్రాంతాల్లో ఉంటాయి. వీటికి కాసే చింతకాయలు మూడు అడుగులకుపైగా పెరగడం విశేషం. అనంతపురం జిల్లా గుంతకల్లులోని డిగ్రీ కళాశాల విద్యార్థులు, వృక్షశాస్త్ర అధ్యాపకులు 2010లో విహారయాత్ర కోసం తలకోన అడవులకు వెళ్లినప్పుడు దీన్ని సేకరించారు. ప్రస్తుతం కళాశాలలో ఉంచి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 'ఈ రకం తీగజాతి చెట్టు తలకోనలో 4.5 కి.మీ. మేర విస్తరించి ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల్లో ఈ మొక్క వివిధ భాగాలను ఔషధంగా ఉపయోగిస్తారు. వీటి విత్తనాలను జీర్ణసమస్యల నివారణలో వినియోగిస్తారు. ఆయలప కీళ్లనొప్పులు తగ్గించే శక్తి ఉంది' అని వృక్షశాస్త్ర అధ్యాపకుడు జె.భీమలింగయ్య వివరించారు. - ఈనాడు, అనంతపురం



బంగారు బుల్లెట్






తమిళనాడుకు చెందిన ఓ బంగారు వ్యాపారి సూక్ష్మకళలో తన ప్రతిభ చాటుతున్నారు. పుత్తడితో వివిధ ఆకృతులు రూపొందిస్తూ ప్రత్యేకంగా నిలుస్తున్నారు. వేలూరు జిల్లా సైదాపేట్టై బీసీ వీధికి చెందిన ఉదయకుమార్ తన 15వ ఏట నుంచే తండ్రి రాధాకృష్ణన్ వద్ద ఈ కళ నేర్చుకున్నారు. తాజాగా 22 క్యారెట్ల బంగారంతో బుల్లెట్ బైక్ నమూనాను తయారుచేశారు. ఇందులోని చిన్న చిన్న భాగాలైన చక్రాలు, హ్యాండిల్, ఇంజిన్ ఆకృతి వరకు మొత్తం బంగారంతో చేసిందే. హెడ్‌లైట్ కోసం చిన్న తెల్లటి రాయి అమర్చారు. దీంతో పాటు మినీ హెల్మెట్‌నూ రూపొందించారు. - న్యూస్‌టుడే, చెన్నై (వేలూరు)

తాంపా 107 ఏళ్లకు దొరికింది

ఇక్కడ కనిపిస్తున్న నౌక మొదటి ప్రపంచ యుద్ధం నాటిది. 107 ఏళ్ల తర్వాత బ్రిటన్‌లోని కార్న్‌వాల్ తీరానికి 80 కిలోమీటర్ల దూరంలో... అట్లాంటిక్ సముద్రం అడుగున 300 అడుగుల లోతులో బ్రిటిష్ గజ ఈతగాళ్లు ఈ నౌక శిథిలాలు గుర్తించారు. ఎవరిదీ నౌకా ఎలా మునిగింది అని ఒక్కసారి చరిత్రలోకి వెళ్తే... మొదటి ప్రపంచ యుద్ధం జోరుగా సాగుతున్న 1918 సెప్టెంబరు 17న అమెరికా కోస్ట్‌గార్డ్ కట్టర్ నౌక 'తాంపా' అట్లాంటిక్ జలాల్లో ప్రయాణం ప్రారంభించింది. నౌక బాయిలర్లకు శక్తిని అందించే బొగ్గు 26వ తేదీ నాటికి దాదాపు అయిపోవచ్చింది. బొగ్గును మళ్లీ నింపుకోవడం కోసం నౌకను కాన్వాయ్ నుంచి బయటికి తీసుకువెళతానని కెప్టెన్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తిచేశారు. అందుకు కమాండర్లు అనుమతించడంతో నౌకను వేల్స్‌లోని ఒక రేవు వైపు కెప్టెన్ వేగంగా



తాంపా నౌక ♦ సముద్ర గర్భంలో గుర్తించిన శిథిలాలు (అంతర చిత్రంలో)

నడుపుతున్నారు. దాన్ని అదేరోజు రాత్రి 8.15 గంటల సమయంలో జర్మనీ జలాంతర్గామి యూబీ-41 గమనించింది. జలాంతర్గామి కెప్టెన్ టార్పెడోతో పేల్చివేతకు మీట నొక్కారు. ఈ పేలుడుకు తోడు, బొగ్గు ధూళి కూడా మండటంతో నౌక మునిగింది. అందులోని 131 మంది సైనికులు, సిబ్బంది నీట మునిగిపోయారు. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికాకు జరిగిన అతిపెద్ద నౌకాదళ నష్టం ఇది. నౌక శిథిలాల కోసం అన్వేషణ బృందాలు శోధిస్తూనే ఉన్నాయి. ఆ కృషి ఇప్పటికి ఫలించిందని గ్యాస్ పెరడోస్ డైవింగ్ బృందం లీడర్ స్టీవ్ మోరిటైమర్ తాజాగా ఫేస్‌బుక్ పోస్టు ద్వారా వెల్లడించారు. -ఈనాడు ప్రత్యేక విభాగం

చిక్కింది అతిచిన్న నక్క!



గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో గల ఉప్పు చిత్తడి నేల 'లిటిల్ రణ్ ఆఫ్ కచ్'లో ప్రపంచంలోనే అతిచిన్న ఫెన్నెక్ జాతి నక్కను గుర్తించారు. ఇది గుజరాత్ అడవుల్లో చాలా అరుదుగా కనిపించే జీవి. వీటిని అంతరించిపోతున్న జాతిగా ప్రభుత్వం ప్రకటించింది. అటవీశాఖ ఏర్పాటు చేసిన కెమెరాలో ఈ నక్క ఫొటోలు రికార్డయ్యాయి. ఇది సుమారు 1-1.5 కిలోల బరువు, అడుగు పొడవు ఉంటుందని, సుమారు ఆరంగుళాల పొడవైన చెవులు ఉంటాయని ఘుడ్‌ఖర్ అభయారణ్యం అటవీ అధికారి టీఎం పటేల్ తెలిపారు. దేహంపై రోమాలు సాధారణంగా లేత పసుపు లేదా గోధుమ రంగులో ఉంటాయన్నారు. ఇది ఎలుకలు, పక్షుల గుడ్లు, బల్లులు, చిన్న కీటకాలను తింటూ ఏకాంతంగా ఎడారి జీవితాన్ని గడుపుతుందని వివరించారు. ఈ జాతి నక్కలు ప్రధానంగా ఉత్తర ఆఫ్రికాలోని సహారా ఎడారిలో కనిపిస్తాయి. ఇవి రాత్రిపూట సంచరించే జంతువులు. పగటి పూట ఎండ వేడికి దూరంగా బొరియల్లో విశ్రాంతి తీసుకుంటాయి. -ఈటీవీ భారత్

ఆధ్యాత్మిక నగరి.. లేదాయె సవారీ

- తిరుపతిలో సిటీ బస్సుల్లేక భక్తుల అవస్థలు
- రాత్రి వేళల్లో పరిస్థితి మరీ దుర్భరం
- అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ఆటోవాలాలు
- మినీ బస్సులైనా నడపాలని డిమాండ్



తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద దూరప్రాంతాల నుంచి రైళ్లలో వచ్చిన భక్తులతో బాడుగ మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

ఈనాడు డిజిటల్, తిరుపతి: నిత్యం లక్ష మందికి పైగా రాకపోకలు సాగించే ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల నుంచి శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి, కపిల తీర్థం, శ్రీనివాస మంగాపురం, శ్రీవారిమెట్టు వంటి చోట్లకు సిటీ బస్సులు అందుబాటులో లేవు. రాత్రి పది దాటితే.. ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరమే. దీంతో ప్రైవేటు వాహనాల నిర్వాహకులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. తిరుపతి బస్టాండుకు రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల మధ్య వేర్వేరు ప్రాంతాల నుంచి 220కి పైగా బస్సులు వేరుకుంటాయి. ఇదే సమయంలో రైల్వేస్టేషన్‌కు 6 ప్యాసింజర్, 14 ఎక్స్‌ప్రెస్‌లతో పాటు పలు వారాంతపు రైళ్లు వస్తాయి. వీటిల్లో నగరానికి సాధారణ దినాల్లో సగటున 20 వేల మంది, వారాంతాలు, ప్రత్యేక పర్వదినాల్లో 35-40 వేల మంది వస్తుంటారు. వీరిలో అధికశాతం మంది అలిపిరి, శ్రీవారి మెట్టు, దర్శన టోకెన్ల కేంద్రాలు, తిరుచానూరు వంటి ప్రాంతాలకు వెళ్తారు. ఇంత రద్దీ ఉన్నప్పటికీ ఆర్టీసీ సిటీ బస్సులు తిప్పడం లేదు. తిరుమలకు నడుపుతున్నా... అవి ఖాళీగా ఉంటేనే అలిపిరికి వెళ్లేవారిని ఎక్కనిస్తారు. ఈ పరిస్థితుల్లో బస్టాండు, రైల్వేస్టేషన్‌ల నుంచి 24 గంటలూ అలిపిరి, శ్రీవారి మెట్టు, దర్శన టోకెన్ల కేంద్రాలు, వసతి సముదాయాల వద్దకు మినీ బస్సులు తిప్పితే భక్తులకు ఊరట లభిస్తుంది. స్థానికుల కోసం లీలామహల్, ముత్యాలరెడ్డిపల్లి, కరకంబాడి, తిరుచానూరు, చంద్రగిరి, రేణిగుంట మధ్య నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇరుకుగా ఉండే రహదారుల్లో పెద్ద బస్సులు తిరగలేని పరిస్థితి ఉంటే, కనీసం మినీ బస్సులైనా నడపాలని భక్తులు కోరుతున్నారు.

ఆటోల్లో నిలువు దోపిడీ

- తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండుల నుంచి 3 కి.మీ.ల దూరంలోని అలిపిరికి రాత్రి వేళలో ఆటోవాలాలు కనీసం రూ.200 డిమాండ్ చేస్తున్నారని. అంటే కిలోమీటరుకు రూ.66 కంటే ఎక్కువే వసూలు చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు.
- రైల్వేస్టేషన్ నుంచి కేవలం అర కిలోమీటరు దూరంలో ఉన్న 'శ్రీనివాసం' సముదాయానికి రూ.100 అడుగుతున్నారంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని విజయవాడకు చెందిన భక్తుడు కాంతారావు పేర్కొన్నారు.
- కర్ణాటకలోని విజయపుర నుంచి నుంచి తాను వేకువజామున 4.15కు తిరుపతి చేరుకున్నానని.. బస్సు కోసం గంటసేపు వేచి చూసినా రాలేదని విరూపాక్ష అనే భక్తుడు తెలిపారు. దీంతో తిరుచానూరుకు ఆటోవాళ్లు రూ.300 అడిగారని, బేరమాడి రూ.275 ఇచ్చి వెళ్లానని ఆయన చెప్పారు.



అర్ధరాత్రి శ్రీహరి బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

తిరుపతిలో ఆటో ఛార్జీల దందా ఇలా..
(రూపాయల్లో ఒక్కొక్కరికి)

ఎక్కడి నుంచి – ఎక్కడికి	పగలు	రాత్రి	ఆర్టీసీ
బస్టాండు – రైల్వేస్టేషన్	30	50	20 (బేసిక్)
బస్టాండు/రైల్వేస్టేషన్ – అలిపిరి	100	120	20
రైల్వేస్టేషన్ – శ్రీనివాసం	50	80	20
రైల్వేస్టేషన్ – శ్రీవారిమెట్టు	200	500	40 (మంగాపురం వరకు)
రైల్వేస్టేషన్ – రేణిగుంట	150	300	50
బస్టాండు – ఎయిర్ పోర్ట్	250	500	50
బస్టాండు – స్విమ్స్ ఆస్పత్రి	100	150	20
రైల్వేస్టేషన్ – లీలామహల్	50	100	==

బస్సులోనే ఆదా..

నలుగురు సభ్యులున్న కుటుంబం రాత్రి వేళ రైల్వే స్టేషన్ లేదా బస్టాండు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే.. బస్సు ఛార్జీల కంటే ఆటోలకు వెచ్చించే అదనపు భారం ఎలా ఉందో చూద్దాం..

ప్రయాణ మార్గం (రాత్రి వేళ)	బస్సులో వెళ్తే (నలుగురికి రూ.)	ఆటోలో వెళ్తే (రూ.)	బస్సులో ఆదా (రూ.)
రైల్వేస్టేషన్/బస్టాండు–అలిపిరి	80 (4x20)	480	400
రైల్వేస్టేషన్–శ్రీవారిమెట్టు	160 (4x40)	2000	1840
రైల్వేస్టేషన్–రేణిగుంట	200 (4x50)	1200	1000
బస్టాండు–ఎయిర్‌పోర్టు	200 (4x50)	2000	1800

ఆర్జీయూకేటీలో ప్రవేశాలకు ప్రకటన విడుదల

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఒంగోలు, ఆర్‌కే వ్యాలీ (ఇడుపులపాయ), శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు శుక్రవారం ప్రకటన విడుదలైంది. పదోతరగతి ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేస్తూ అడ్మిషన్ల ఛైర్మన్, యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొ. కె.మధుమూర్తి సౌజన్యంతో అడ్మిషన్ల కన్వీనర్ డా. సంద్ర అమరేంద్రకుమార్ ఈ షెడ్యూల్‌ను ప్రకటించారు. మే 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరిస్తారు. ఎంపిక జాబితా జూన్ 12న విడుదల చేస్తారు. జులై 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. గత విద్యా సంవత్సరంలో జులై 15 నుంచి తరగతులు ప్రారంభమైనా ఈ సారి 15 రోజుల ముందుగానే పీయూసీ-1 తరగతులు మొదలు పెడతారు. పాత విద్యార్థులకు జూన్ 29 నుంచే ఈ విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. కొత్త విద్యార్థులు వారితో కలిసి చదువుకునే లా ఈ మార్పు చేశామని, ఆసక్తి గల విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆర్జీయూకేటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రవేశాల కన్వీనర్ అమరేంద్ర కుమార్ సూచించారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

- సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సర్వదర్శనానికి శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు, తమిళనాడులో ఎన్నికలు ముగియడంతో భక్తులు పెద్దఎత్తున తిరుమల తరలివస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి టోకెన్లు లేని భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఇంకా వస్తున్న భక్తులు రింగ్ రోడ్డు మీదుగా బాటగంగమ్మ ఆలయం వద్ద క్యూలైన్‌లోకి ప్రవేశిస్తున్నారు. వీరు స్వామివారిని దర్శించుకునేందుకు 14 గంటలు పట్టనుంది.

6న కీలక నిర్ణయాలు

వీఐపీ బ్రేక్ దర్శనాలు, తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనాల(ఎస్ఎస్‌డీ) టోకెన్లు రద్దుచేసి నేరుగా తిరుమలలోనే సర్వదర్శనానికి అనుమతించడంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ నెల 6న నిర్వహించనున్న తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో దీనిపై చర్చించి, నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రద్దీ నేపథ్యంలో ఇతర ప్రివిలేజ్ దర్శనాలు రద్దుచేసి నేరుగా వచ్చే వీవీఐపీలకే బ్రేక్‌దర్శనం కల్పించాలని అధికారులు ప్రతిపాదించారు.

నేడు దేశవ్యాప్తంగా సెల్ బ్రాడ్‌కాస్ట్ పరీక్ష

- పౌరుల మొబైల్‌ఫోన్లకు అలర్ట్ నోటిఫికేషన్ వచ్చే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ(ఎన్‌డీఎంఏ) ఆధ్వర్యంలో శనివారం దేశవ్యాప్తంగా సెల్‌బ్రాడ్‌కాస్ట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందనశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. దేశసరిహద్దు ప్రాంతాలతోపాటు ఎన్నికలు జరిగిన రాష్ట్రాలు మినహా దేశరాజధాని దిల్లీ సహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. 'ఈ పరీక్ష సమయంలో పౌరుల సెల్‌ఫోన్‌కు అత్యవసర అలర్ట్ నోటిఫికేషన్ వచ్చే అవకాశముంది. ఇది గట్టిగా శబ్దం లేదా వైబ్రేషన్‌తో రావొచ్చు. ఇది అలర్ట్ వ్యవస్థ సమర్థతను పరీక్షించేందుకు పంపే సందేశం మాత్రమే అని పౌరులు గుర్తించాలి. ఈ అలర్ట్ అందుకున్నప్పుడు పౌరులు ఎలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేసేందుకు ఉద్దేశించిన వ్యవస్థను బలోపేతం చేయడం కోసమే అని గ్రహించాలి' అని ఆ శాఖ వెల్లడించింది.

కల్తీ నెయ్యి సరఫరాకు అనువైన పరిస్థితులు సృష్టించింది కొనుగోలు కమిటీయే

- దినేష్‌కుమార్ కమిషన్ వెల్లడి

ఈనాడు, అమరావతి: తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకు అవసరమైన పరిస్థితులను అప్పటి కొనుగోలు కమిటీయే కల్పించిందని విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్ కమిషన్ పేర్కొంది. "కొనుగోలు కమిటీ సమస్యను గుర్తించడంలో విఫలం కావడం కాదు.. ఆ సమస్య తలెత్తేందుకు దారితీసిన పరిస్థితుల్ని తానే సృష్టించింది. తితిదేకి నాణ్యమైన సరకులు సరఫరా అయ్యేలా చూడటంలో కొనుగోలు కమిటీ పాత్ర కీలకం, నిర్ణయాత్మకం. తితిదేకి కల్తీనెయ్యి సరఫరా, విని యోగం సరఫరాదారుల తప్పిదమే కాదు. నిబంధనల రూపకల్పన, మదింపుదశలో పరిపాలనాపరమైన వైఫల్యాన్ని సూచిస్తోంది" అని నివేదికలో పేర్కొంది. టెండర్ నిబంధనల్ని సడలించేందుకు కొనుగోలు కమిటీ ఏకపక్షంగా ఆమోదం తెలిపిందని, దానివల్ల తలెత్తే అనర్థాల్ని దృష్టిలో పెట్టుకోలేదని తెలిపింది. కొనుగోలు కమిటీ సభ్యులైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, ఎం.రాములు, తితిదే చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ ఓ.బాలాజీ సమావేశమై... టెండర్ నిబంధనల సవరణకు ఆమోదముద్ర వేశారని తెలిపింది. టెండర్ నిబంధనలు సవరించేందుకు వేసిన కమిటీలోని సభ్యులు గానీ, కొనుగోలు కమిటీ కన్వీనరైన జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్)గానీ లేకుండానే ఆ నలుగురు సభ్యులు కూర్చుని నిర్ణయం తీసేసుకున్నారని వెల్లడించింది.

నిబంధనల అమల్లో వైఫల్యం

- నెయ్యి కొనుగోళ్లకు కొన్ని టెండర్లలో రివర్స్ ఆక్షన్‌లో ఎల్1గా నిర్ణయించిన ధరను... సదరు డెయిరీ ఆ తర్వాత ఒక లేఖ ద్వారా తగ్గించినప్పుడూ కొనుగోలు కమిటీ కాంట్రాక్ట్ ఖరారు చేయాలని సిఫారసు చేసిందని తెలిపింది. అది సంప్రదింపుల కిందకు వస్తుందని, టెండర్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. టెండర్ నిబంధనల్ని పక్కాగా అమలుచేయడంలో కొనుగోలు కమిటీ విఫలమైందని తెలిపింది.
- కొన్ని సందర్భాల్లో అసాధారణంగా తక్కువ ధరలకు దాఖలైన బిడ్‌లను తగిన పరిశీలన లేకుండానే కొనుగోలు కమిటీ ఆమోదించినట్లు తెలిపింది. అంత తక్కువ ధరకు నెయ్యి సరఫరా ఎలా సాధ్యమని అనుమానాలు వ్యక్తం చేయాల్సింది పోయి, దాన్ని గుడ్డిగా ఆమోదించడం కల్తీ నెయ్యి సరఫరాకు దారితీసిందని తెలిపింది.

నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.501 కోట్ల చెల్లింపు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పరిధిలోని 278 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఇప్పటివరకు రూ.501 కోట్లు చెల్లించినట్లు ట్రస్ట్ ఇన్‌ఛార్జి సీఈవో చక్రధర్‌బాబు తెలిపారు. ట్రైపార్టీ బిల్ డిస్కౌంట్ అగ్రిమెంట్ (టీబీడీఏ) విధానంలో రూ.వెయ్యి కోట్లు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిన మేరకు చెల్లింపులు జరుగుతున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్, ఆసుపత్రుల యాజమాన్యాల మధ్య కుదిరిన ఒప్పందాల మేరకు ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. 873 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో బిల్ డిస్కౌంట్ విధానంలో బకాయిలు పొందేందుకు ఇప్పటివరకు 591 ఆసుపత్రుల యాజమాన్యాలు దరఖాస్తు చేశాయని, వీటిలో 336 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని వెల్లడించారు.

EENADU Vol: 31, Issue: 26 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh and M/s. Kalajyothi Process Private Limited, Survey No. 94 B, C & D, Nidumukkala Village, Tadikonda Mandal, Guntur District - 522 016, Andhra Pradesh and Published at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh. Editor: M Nageswara Rao. RNI No. 63819/1996. Regd. No. GTR/21/2024-26, Phones: 0863-2512142. Mobile No. 9959021812. Air Surcharge. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

పెద్ది లాంటి భావోద్వేగభరిత సినిమా ఈమధ్య రాలేదు

జూన్ 4న విడుదల.. 3న ప్రీమియర్లు

- సుకుమార్


రామ్ చరణ్

పట్టుదలే అతని గాథ.. సంకల్పమే తన ఆయుధం.. మరి ఆ జోడింట్ తెలియాలంటే 'పెద్ది' చూడాల్సిందే. రామ్‌చరణ్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మించారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని జూన్ 4న తెరపైకి తీసుకొస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిత్ర సమర్పకుడు, ప్రముఖ దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ.. "బుచ్చిబాబు నా లిటిల్ స్టార్ డైరెక్టర్. తన 'ఉప్పెన' చిత్ర క్లైమాక్స్ చూసినప్పుడు.. 'ఇలాంటి క్లైమాక్స్ చేసిన దర్శకుడు ఎలాంటి సినిమా అయినా తీయగలడని అనుకున్నా. 'పెద్ది' చాలా పెద్ద స్క్రిప్ట్. చాలా మంచి కమర్షియల్ సినిమా. భావోద్వేగాల్ని, వాణిజ్యాంశాల్ని చక్కగా బ్యాలెన్స్ చేస్తూ అద్భుతమైన చిత్రం రూపొందించాడు. ఇలాంటి ఎమోషనల్ రైడ్ సినిమా ఈమధ్య కాలంలో రాలేదు. రత్నవేలు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. రామ్‌చరణ్‌ని అద్భుతంగా చూపించారు. 'రై రై రా' పాటలో చరణ్ ఎనర్జీని చూడటానికి రెండు కళ్లు సరిపో లేదు. నా 'రంగస్థలం'తో సహా ఇప్పటి వరకు తను చేసిన సినిమాల్లో దేంట్లోనూ ఇంత అద్భుతమైన నటనను చూసుండరు" అన్నారు. "రామ్‌చరణ్ జీవితాంతం రుణపడి ఉంటా. నేనెంతో తెలియకుండానే వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై ఇంత పెద్ద చిత్రాన్ని నిర్మించే అవకాశం ఇచ్చారు. దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమాని అద్భుతంగా చేసిచ్చారు. ప్రేక్షకులందరికీ గుర్తుండిపోయే చిత్రమిది. తప్పకుండా దీన్ని థియేటర్‌కే వచ్చి చూడండి. జూన్ 4న సాయంత్రం నుంచే ప్రీమియర్లతో ఈ సినిమా సందడి మొదలవుతుంది" అన్నారు నిర్మాత వెంకట సతీశ్ కిలారు. దర్శకుడు బుచ్చిబాబు సానా మాట్లాడుతూ.. "ఏప్రిల్ 30న రానందుకు క్షమించండి. జూన్ 4న రాబోతున్నందుకు ఆశీర్వదించండి. ఇది అన్ని రకాల వాణిజ్యాంశాలతో నిండిన మంచి ఎమోషనల్ రైడ్. మా పెద్ది అందరి హృదయాలకు దగ్గరగా ఉంటాడు. తనని మనసులో నుంచి తీసేయడం అంత తేలిక కాదు" అన్నారు. ఈ కార్యక్రమంలో రత్నవేలు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బెల్లంకొండ శ్రీనివాస్ వివాహ విందు


కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్న చిరంజీవి


కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఇటీవలే కావ్య రెడ్డి మెడలో మూడుముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. వీరి వివాహ విందు వేడుక శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. సినీ ప్రముఖులు చిరంజీవి, మోహన్‌బాబు, నాగార్జున, వి.వి.వినాయక్, మెహర్ రమేశ్, ఆయుసుధ, కాజల్, బోయపాటి శ్రీను, నాగచైతన్య, శ్రీకాంత్, గోపీచంద్, అల్లరి నరేశ్, విశ్వక్, శర్వా, సుధీర్ నారంగ్, బీవీఎస్ఎన్ ప్రసాద్, డీవీవీ దానయ్య, నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, సాహు గారపాటి, సి.కల్యాణ్, రాజకీయ ప్రముఖులు తలసాని శ్రీనివాస్ యాదవ్, దానం నాగేందర్ తదితరులు ఈ వేడుకకు హాజరై కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంకొండ శ్రీనివాస్ ప్రస్తుతం 'టైసన్ నాయుడు', 'హైందవ' చిత్రాల్లో నటిస్తున్నారు.

అధికారానికి ఆశయం తోడైతే!


బాలకృష్ణ

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ 112వ చిత్రం ఖరారైంది. కొరటాల శివ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమాని శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. "అధికారానికి ఓ ఆశయం తోడైతే.. అదో ఉద్యమంగా మారుతుంది" అనే ట్యాగ్‌లైన్‌తో ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఆ వ్యాఖ్యను బట్టి ఈ సినిమా బలమైన సామాజిక అంశాలతో మిళితమైన కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్నట్లు అర్థమవుతోంది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పూర్తయింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతికి థియేటర్లలోకి వచ్చే అవకాశముంది. ఈ సినిమాకి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. ఇక బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తన 111వ చిత్రాన్ని చేస్తున్నారు. ఇది ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది.

త్వరలో సెట్స్‌పైకి సూపర్ హీరో?


సల్మాన్ ఖాన్

అగ్ర హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో ఓ చిత్రాన్ని తెరకెక్కించాలని... దర్శక ద్వయం రాజ్ అండ్ డీకే ఎప్పట్నుంచో సన్నాహాలు చేస్తున్నారన్న సంగతి తెలిసిందే. అయితే ఈ కథలో సల్మాన్ కొన్ని మార్పులు కోరారని చిత్రబృందం దానిపై పనిచేస్తుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ నడిచింది. తాజాగా ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమాని ప్రారంభించబోతున్నట్లు తెలుస్తోంది. "సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో భారీ బడ్జెట్‌తో ఓ సూపర్ హీరో చిత్రం రూపొందనుంది. రాజ్ అండ్ డీకే ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని లక్ష్యంగా చేసుకుని తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రీ విజువలైజేషన్, ఇతర సన్నాహక పనులన్నీ పూర్తయ్యాక అక్టోబరులో చిత్రీకరణ ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకుంది సినిమా బృందం. ఇందులో సమంత కథానాయిక అని వస్తున్న వార్తల్లో నిజం లేదు. చిత్రబృందం ఇంకా నాయిక ఎంపికలోనే ఉంద'ని చిత్ర వర్గాలు చెప్పినట్లు సమాచారం.

దర్శకుడు సింగీతం కొత్త చిత్రం.. 'సింగ్ గీతం'


అయాన్, అహల్యా

ప్రయోగాలకు పెట్టింది పేరు ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు. ఇప్పుడాయన 94ఏళ్ల వయసులో తన 61వ చిత్రంతో మరో ప్రయోగానికి సిద్ధమయ్యారు. భారతదేశపు తొలి మ్యూజికల్ ఫాంటసీగా 'సింగ్ గీతం' అనే సినిమాని రూపొందించారు. దీన్ని సి.అశ్వినిదత్ సమర్పణలో దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మించారు. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను శుక్రవారం విడుదల చేశారు. "కుబేరపురం.. అసలు ఎందుకు వదిలేసి వెళ్లిపోయారు అంకుల్ మా నాన్న ఈ ఊరిని. రాజా ట్రీట్‌మెంట్ ఇక్కడ" అంటూ హీరో చెప్పే డైలాగ్‌తో మొదలైన టీజర్ అద్యంతం ఆసక్తిరేకెత్తిస్తూ సాగింది. ఈ ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరును బట్టి.. కుబేరపురం అనే ఓ రహస్య గ్రామం.. అందులోని ప్రతాప్ అనే దగ్రాడి చుట్టూ ఈ చిత్ర కథ తిరగనున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా జూన్ 11న థియేటర్లలోకి రానుంది. ఇందులో అయాన్, అహల్యా బమ్రూ ప్రధాన పాత్రధారులుగా నటించగా.. తులసి, బెనర్జీ, శివనారాయణ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతమందిస్తుండగా.. సి అంకుర్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

బాధితుడా.. దోపిడీదారుడా?


పృథ్వీరాజ్ సుకుమారన్

భార్య, ఒక్కగానొక్క ముద్దుల కూతురితో ప్రశాంతంగా ఉండే ఓ వ్యక్తి జీవితంలోకి పెను తుపానులా ఒక బ్యాంకు దోపిడీ ఆరోపణ వచ్చి పడుతుంది. మరి ఆ వ్యక్తి ఆలాంటి సమస్య నుంచి ఎలా తప్పించుకున్నాడు? అతను బాధితుడా లేక నిజంగానే దోపిడీ చేశాడా లాంటి ప్రశ్నలతో సాగుతోంది 'ఐ, నోబడీ' సినిమా టీజర్. మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతీ తిరువోతు జంటగా నటిస్తున్న చిత్రమిది. జులైలో థియేటర్లలో విడుదల కానుంది. నిసామ్ బషీర్ దర్శకత్వం వహిస్తున్నారు. సుప్రియా మేనన్, ముఖేశ్ ఆర్ మెహతా, సీవీ సారథి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ఫస్ట్ టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా ఆవిష్కరించింది. 'నాన్న.. నాకు కుందేలు కథ కావాలి. కానీ అందులో పందెం గురించి ఉండకూడదు' అని కూతురు చెబుతున్న కబుర్లతో ప్రారంభమైన టీజర్ ఆకస్మాత్తుగా వచ్చిన బ్యాంకు దోపిడీ సన్నివేశాలతో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. 2018లో 'కూడే' చిత్రం తర్వాత పార్వతి, పృథ్వీ కలయికలో వస్తున్న చిత్రమిది.

ప్రతిసారి తను పోషించే పాత్ర.. కథను ముందుకు నడిపించేదిగా ఉండాల్సిన అవసరం లేదని అంటోంది అందాల తార రుక్మిణీ వసంత్. అందం, అభినయంతో పాటు వైవిధ్యమైన కథలతో కుర్రకారుని కట్టిపడేస్తున్న భామ ఈమె. గతేడాది 'కాంతార: చాప్టర్ 1' లాంటి మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకొని ఈ ఏడాది మరిన్ని అదిరిపోయే కథలతో తెరపై మెరవడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం 'టాక్సిక్'తో బిజీగా ఉన్న ఈ నాయిక.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీ ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

నేనే కీలకం కానక్కర్లేదు

"నేను సినిమాల్ని కేవలం ఒక్క అంశంపైనే ఆధారపడి ఎంపిక చేసుకోను. ఎన్నో విషయాల్ని పరిగణనలోకి తీసుకొని.. సమగ్రమైన నిర్ణయం తీసుకుంటాను. ఇందులో మొదటి అంశం కథ. అంటే మనం చెప్పబోయే కథ ప్రేక్షకులకు మరో ప్రపంచాన్ని పరిచయం చేసేలా ఉండాలి. నేను ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే మరో అంశం నేను పోషించే పాత్ర.. అది ప్రయాణించే తీరు. అలాగని కథనానికి సంబంధించిన ప్రతి సందర్భంలోనూ నేను నటించే పాత్రనే కీలకంగా ఉండాలనే నియమాలు లేవు. కానీ ఆ పాత్రలో నటించాక నాకు మరో మంచి అవకాశం రావాలి".

అప్పుడే నిరూపించుకునే అవకాశం

"కాంతార 2లో నటించడానికి ముఖ్య కారణం.. ఆ సినిమా ప్రపంచమే ప్రధాన ఆకర్షణగా కనిపించింది. మొదటి భాగం సాధించిన విజయాన్ని కూడా దృష్టిలో పెట్టుకున్నాను. దీంతో పాటు ఈ సినిమాను దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు అద్భుతంగా ఆదరించారు. కరవళ్లి ప్రాంతానికి చెందిన ఆ ఆకర్షణీయమైన, వినూత్నమైన సంస్కృతి గురించి తెలుసుకుంటున్నప్పుడు ప్రజలు ఎంతగానో మంత్రముగ్ధులయ్యారు. ఆ ప్రపంచంలో, ఆ పౌరాణిక సృష్టిలో భాగం కావడం నా అదృష్టం. మరోవైపు ఇలాంటి సాంస్కృతిక మూలాలున్న ప్రాజెక్టులలో నటిస్తే మనమేంటో నిరూపించుకునే అవకాశం వస్తుంది".

అది నా అదృష్టం

"చిత్రపరిశ్రమకు వచ్చిన తక్కువ రోజుల్లోనే అగ్రతారలతో కలిసి పనిచేసే అవకాశం రావడం ఉత్సాహంగా అనిపిస్తుంది. ముఖ్యంగా ఇతరులకు అవకాశాలు కల్పించే వ్యక్తులతో వర్క్ చేయడం నా అదృష్టం. నేను కలిసి పనిచేసే ప్రతి హీరో ఏదో ఒక విషయంలో తమదైన ప్రత్యేకతను కలిగి ఉంటారని నాకు తెలుసు. వారు మీ ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం ఇస్తారు. 'కాంతార 2' సెట్‌లో రిషబ్ శెట్టి చాలా ప్రోత్సాహకరంగా ఉండేవారు".

మొదట్లో కొంచెం భయమే

"అగ్రతారలతో కలిసి పనిచేస్తున్నప్పుడు ఆరంభ క్షణాలు కాస్త ఉక్కిరిబిక్కిరి చేసేలా ఉంటాయి. భయంగానూ ఉంటుంది. నేను 'టాక్సిక్' కోసం యశ్‌ను మొదటిసారి కలిసినప్పుడు ఆయన చేసిన అద్భుతమైన సినిమాలు, కృషి తాలూకా గొప్పవారసత్వాన్ని మనసులో మోసుకుంటూనే ఆ గదిలోకి అడుగుపెట్టాను. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను కాబట్టి.. వాటన్నింటి గురించి నాకు పూర్తి అవగాహన ఉంది. కానీ ఆలాంటి తారలు వారు సృష్టించిన రికార్డులు, గౌరవాల్ని మనసులో పెట్టుకోకుండా ప్రతి సినిమాకు కొత్తగా, సహాయ నటులకు స్ఫూర్తిగా ఉండేలా పనిచేస్తారు. అలాగే వారితో పనిచేయడం ద్వారా ఎంతో విలువైన విషయాలను నేర్చుకునే అవకాశం లభిస్తుంది. పెద్ద తారలతో పనిచేయడంలో ఉన్న ప్రత్యేకత అదే. వారు తమ వృత్తిలో ఎంత బాధ్యతగా ఉంటున్నారో గమనించే అవకాశం వస్తుంది".


రుక్మిణీ వసంత్

నేను చనిపోయినా సినిమాని ఆపొద్దు


ఆమిర్ ఖాన్

సినిమా పట్ల తనకున్న ప్రేమతో చిత్రపరిశ్రమలో నటుడిగా, నిర్మాతగా ప్రయోగాత్మకమైన ప్రయత్నాలు చేస్తూనే ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతున్నారు బాలీవుడ్ అగ్రతార ఆమిర్ ఖాన్. ఇటీవల పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆయన సినిమాపై తనకున్న అభిమానాన్ని తెలిపే ఓ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. "ఏదైనా సినిమా షూటింగ్ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నప్పుడు నేను విమాన ప్రయాణం చేయాల్సి వస్తే కచ్చితంగా నేను మన్సూర్ ఖాన్‌కు ఒక నోట్ రాస్తాను. నేనెప్పుడూ.. 'ఒకవేళ నా విమానం కూలిపోయి.. నేను చనిపోతే..?' అనే విషయం గురించి ఆలోచిస్తూ ఒత్తిడికి గురవుతాను. అందుకే ఆ సినిమా పనులు నువ్వు చూసుకో అని మన్సూర్‌కు తెలియజేసేలా నోట్ రాస్తాను. అలాగే దర్శకులకు ఇదే విషయాన్ని చెబుతాను. నాకు ఏమైనా అయినా సినిమాను ఆపేయొద్దని.. మన్సూర్ సలహాలతో దాన్ని పూర్తి చేసి విడుదల చేయాలని కోరతాను. నేను పూర్తిగా నమ్మే వ్యక్తి అతను"ని చెప్పారు. ప్రముఖ దర్శకుడు మన్సూర్ ఖాన్.. ఆమిర్ ఖాన్ బంధువు. గతంలో వీరిద్దరి కాంబోలో 'ఖయామత్ సే ఖయామత్ తక్', 'జో జీతా వహీ సికందర్' లాంటి హిట్ చిత్రాలొచ్చాయి.


కంగనా రనౌత్

'క్వీన్' సినిమాలో పెళ్లి ఆగిపోయి.. ఒంటరిగా హనీమూన్‌కు వెళ్లిన రాణీ మెహ్రా అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించి బాక్సాఫీస్ వద్ద మంచి హిట్‌ని సొంతం చేసుకుంది బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్. ఎప్పట్నుంచో ఈ సినిమా సీక్వెల్‌ని తెరకెక్కించడానికి చిత్రబృందం ప్రణాళికలు రచిస్తుందని

అప్పుడు విదేశంలో... ఇప్పుడు స్వదేశంలో

ఇండస్ట్రీలో జోరుగా వార్తలు వచ్చాయి. తాజాగా కంగన.. ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించిందని సమాచారం. "ఏప్రిల్ నెల కంగనకు చాలా బిజీగా గడిచింది. 'భారత్ భాగ్య విధాత' షూటింగ్ పూర్తి చేసిన వెంటనే ఆమె 'క్వీన్ 2' సన్నాహాల్లోకి దిగారు. దర్శకుడు వికాస్ బహల్‌తో కలిసి దక్షిణ ముంబయిలో ఈ సీక్వెల్ చిత్రీకరణ ప్రారంభించారు. ప్రస్తుతం ముంబయి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నారు. ఈ సినిమాని మూడు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని భావిస్తున్నారు"ని కంగన సన్నిహితులు చెప్పినట్లు తెలిసింది. 'క్వీన్'లో కంగన ప్రయాణమంతా విదేశాలలోనే జరిగిందని.. ఇప్పుడీ సీక్వెల్‌లో మాత్రం ఆమె తన పాత్రతో ప్రేక్షకులకు పూర్తిగా ఇండియాలోని అనేక ప్రదేశాలను చూపించేలా తెరకెక్కించనున్నారట.

శ్రమ జీవుల బతుకు పాట


తిరువీర్, ఫరియ

'భగవంతుడు' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు హీరో తిరువీర్. ఆయన.. ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ చిత్రాన్ని జీజీ విహారి తెరకెక్కించారు. రవి పనస నిర్మాత. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కార్మికుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. శ్రామిక శక్తికి నమస్కరిస్తూ "శరణమన్న శరణం" అంటూ హాయ్ జేపీ స్వరపరిచిన ఈ గీతాన్ని కుమార వాగ్దేవి ఆలపించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ.. "శ్రమజీవుల గుండె చప్పుడు ఈ పాట. శ్రమను, తల్లిని ప్రేమించి, పూజించే వారి బతుకు గీతమిది" అన్నారు. ఈ చిత్రానికి కూర్పు: ప్రవీణ్ పూడి.

జెట్లీనీ ఆపడం సరైంది కాదు

తమ జెట్లీ మూవీని తెలంగాణలోని కొన్ని మల్టీప్లెక్స్‌ల్లో ప్రదర్శించకుండా అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ప్రతినిధి శశిధర్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. పర్సంటేజ్ విధానంపై సింగిల్ థియేటర్ యాజమాన్యాలకు ఈ నిర్మాతలకు మధ్య కొన్నాళ్లుగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ గొడవను సాకుగా చూపి, అసలు సంబంధం లేని మల్టీప్లెక్స్‌ల్లో కూడా 'జెట్లీ' సినిమాను ప్రదర్శించకుండా అడ్డుకుంటున్నారని, సింగిల్ స్క్రీన్‌లలో గొడవ ఉంటే దాన్ని అక్కడే తేల్చుకోవాలి కానీ, మల్టీప్లెక్స్ స్క్రీన్లను అడ్డుపెట్టుకుని ఒత్తిడి తీసుకురావడం ఏంటని శశి ప్రశ్నించారు. మల్టీప్లెక్స్ అగ్రిమెంట్లకు, సింగిల్ స్క్రీన్ చర్చలకు ఎలాంటి సంబంధం లేకపోయినా, కావాలని తమ సినిమాను ఆపేయడం సరైన పద్ధతి కాదని.. ఇదిలా కొనసాగితే ఇండస్ట్రీలో తప్పుడు సంప్రదాయాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. దీనిపై సామరస్య పద్ధతిలో చర్చలు జరపడానికి తాము ఎప్పుడూ సిద్ధమని, కానీ ఇలా బ్లాక్ మెయిల్ చేసేలా ప్రవర్తించడం సరికాదని స్పష్టం చేశారు. ఇలా సినిమా ప్రదర్శన నిలిచిపోవడం వల్ల ఆ ప్రభావం కలెక్షన్ల మీద పడే అవకాశం ఉందని.. మల్టీప్లెక్స్ యాజమాన్యాలు తమ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని, సినిమాను వెంటనే స్క్రీనింగ్ చేయడానికి అనుమతించాలని కోరారు. మరోవైపు మైత్రీ డిస్ట్రిబ్యూటర్ల లేఖకు ఎగ్జిబిటర్ల సంఘం ఘాటుగానే బదులు ఇచ్చింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఇప్పుడు ఉన్న 'రెంట్-ఆర్-పర్సంటేజ్' సిస్టమ్ వల్ల చాలా నష్టపోతున్నాయని, అవి మూతపడే పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైత్రీ డిస్ట్రిబ్యూటర్లు చర్చలకు సిద్ధంగా ఉన్నాం అని చెప్తున్నా, నిజానికి ఛాంబర్ పిలిచిన మీటింగులకు వాళ్ళు హాజరు కావడం లేదని ఎగ్జిబిటర్లు ఆరోపించారు.

విమాన ఇంధన ధర పెరిగింది

● అంతర్జాతీయ సర్వీసులకు మాత్రమే
● దేశీయ విమానాలు /ప్రయాణికులకు ఊరట



ముడిచమురు అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా విమాన ఇంధన (ఏటీఎఫ్‌) ధరలను శుక్రవారం మళ్లీ సవరించారు. అయితే దేశీయ విమాన సర్వీసులకు మాత్రం ఈ పెరుగుదల వర్తించదు. దీనివల్ల దేశీయ విమాన మార్గాల్లో ప్రయాణించే వారికి టికెట్‌ ధరల పెంపు భారం నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు మాత్రమే ఏటీఎఫ్‌ ధరలను పెంచారు. అందువల్ల విదేశాలకు వెళ్లి, వచ్చే వారికి మాత్రం టికెట్‌ ధరలు మరింత భారం కానున్నాయి.

✦ అంతర్జాతీయ సర్వీసులకు ఏటీఎఫ్‌ కిలోలీటరు ధరను 1,435.31 డాలర్ల నుంచి 76.55 డాలర్లు (5.33%) పెంచి 1511.86 డాలర్లు (రూ.1,43,385) చేస్తున్నట్లు ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్‌ సంస్థలు శుక్రవారం ప్రకటించాయి. దేశీయ విమాన సర్వీసులకు మాత్రం కిలోలీటరు ఏటీఎఫ్‌ ధర మార్పు లేకుండా రూ.1,04,927.18గానే ఉంటుంది. 'దేశీయ విమానయాన సంస్థలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్నాయని, ఏటీఎఫ్‌ ధరల రూపేణ ఉపశమనం కల్పించాలని' ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ ఎయిర్‌లైన్స్‌ (ఎఫ్‌ఐఏ) ప్రభుత్వానికి ఇప్పటికే విజ్ఞప్తి చేసింది కూడా. ఏటీఎఫ్‌ ధర వ్యాట్‌ ఆధారంగా వేర్వేరు రాష్ట్రాల్లో భిన్నంగా ఉంటోంది.

ఏప్రిల్‌ 1న కూడా

అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఏటీఎఫ్‌ ధరను ఏప్రిల్‌ 1న రెట్టింపు చేసి 1435.31 డాలర్లుగా చమురు సంస్థలు ప్రకటించాయి. అప్పుడు కూడా దేశీయ సంస్థలకు మాత్రం ఈ పెంపును 25 శాతానికే పరిమితం చేశాయి. ఇందువల్ల దేశీయంగా సర్వీసులను నిర్వహించే ఇండిగో, ఎయిర్‌ ఇండియా, స్పైస్‌జెట్‌, ఆకాశ ఎయిర్‌ వంటి సంస్థలకు కొంత ఊరట కలిగింది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో దాదాపు 40% వాటా ఏటీఎఫ్‌దే కావడం ఇందుకు నేపథ్యం.

అంతర్జాతీయంగా సరఫరా సమస్యలు

ప్రపంచవ్యాప్తంగా ఏటీఎఫ్‌ సరఫరా సమస్యను విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ చమురు సరఫరాలో 20% జరిగే హర్మూజ్‌ జలసంధిలో, చమురు ట్యాంకర్ల రవాణాకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతుండటం ఇందుకు నేపథ్యం. దేశీయంగా ఏటీఎఫ్‌ ధరలను రెండు దశాబ్దాల క్రితమే నియంత్రణ పరిధి నుంచి తప్పించి, అంతర్జాతీయ ముడిచమురు ధరలకు అనుగుణంగా నిర్ణయిస్తున్నారు. అయితే పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ముడిచమురు బ్యారెల్‌ ధర 70 డాలర్ల నుంచి 125 డాలర్లకు చేరడం, ఈ పెరుగుదల భారాన్ని ఏటీఎఫ్‌కు బదిలీ చేస్తే దేశీయ విమానయాన సంస్థలు - ప్రయాణికులు కూడా తీవ్రంగా ఇబ్బంది పడతారు కనుక.. తదనుగుణంగా ధరల పెంపులో జాగరూకతతో వ్యవహరించాలని ప్రభుత్వం, ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్‌ సంస్థలు నిర్ణయించాయి.

సంస్థలకు నష్టాలే

పెట్రోల్‌-డీజిల్‌ రిటెయిల్‌ ధరలతో పాటు దేశీయ విమాన ప్రయాణానికి ఏటీఎఫ్‌ ధరను సవరించనందున.. ప్రభుత్వరంగ ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ (ఐఓసీ), భారత్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ (బీపీసీఎల్‌), హిందుస్థాన్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ (హెచ్‌పీసీఎల్‌)కు నష్టాలు తప్పవు.

బల్క్‌ డీజిల్‌ కూడా ప్రియం

టెలికాం సిగ్నల్‌ టవర్ల వంటి పారిశ్రామిక అవసరాలకు వినియోగించే బల్క్‌ డీజిల్‌ లీటరు ధరను రూ.137 నుంచి రూ.149 చేశారు. వాహన వినియోగదారులకు పెట్రోల్‌ బంకుల్లో రిటెయిల్‌గా లీటరు డీజిల్‌ను రూ.95కే విక్రయిస్తుండటం గమనార్హం. దేశంలోని డీజిల్‌ వినియోగంలో బల్క్‌ డీజిల్‌ వాటా 1% లోపే ఉంటుందని ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ తెలిపింది.

ఎగుమతులపై సుంకం తగ్గింపు

డీజిల్‌ ఎగుమతులపై సుంకాన్ని లీటరుకు రూ.55.50 నుంచి రూ.23కు, ఏటీఎఫ్‌పై లీటరుకు రూ.42 నుంచి రూ.33కు తగ్గిస్తున్నట్లు ఆర్థిక శాఖ శుక్రవారం తెలిపింది.

ఈనాడు బిజినెస్

యాపిల్‌ త్రైమాసిక లాభం రూ.2.78 లక్షల కోట్లు



అమెరికాకు చెందిన ఐఫోన్‌ తయారీ సంస్థ యాపిల్‌, ఈ ఏడాది జనవరి-మార్చిలో 29.57 బిలియన్‌ డాలర్ల (దాదాపు రూ.2.78 లక్షల కోట్ల) లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే కాల లాభం 24.78 బి.డాలర్ల (సుమారు రూ.2.33 లక్షల కోట్ల)తో పోలిస్తే ఇది 19.36% ఎక్కువ. ఇదే సమయంలో ఆదాయం 95.35 బి.డాలర్ల నుంచి 17% వృద్ధి చెంది 111.2 బి.డాలర్లకు చేరింది. ఐఫోన్‌ విక్రయాలపై వచ్చే ఆదాయం 22% పెరిగి 57 బి.డాలర్లుగా నమోదైంది.

భారత్‌లో భారీ అవకాశం.. టిమ్‌ కుక్‌: భారత మార్కెట్‌లో యాపిల్‌ స్థిరంగా రెండంకెల వృద్ధి నమోదు చేస్తోందని, ఈ ఫలితాలపై చాలా సంతోషంగా ఉన్నట్లు యాపిల్‌ సీఈఓ టిమ్‌ కుక్‌ తెలిపారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్‌ మార్కెట్‌, మూడో అతిపెద్ద పీసీ మార్కెట్‌గా ఉన్న భారత్‌లో యాపిల్‌కు ప్రస్తుతం తక్కువ మార్కెట్‌ వాటా ఉందని.. భవిష్యత్తులో తమకు గొప్ప అవకాశాలు ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. దేశంలో మధ్యతరగతి ప్రజల సంఖ్య వేగంగా పెరుగుతోందని.. ప్రస్తుతం ఐఫోన్‌, మ్యాక్‌, ఐప్యాడ్‌, వాచ్‌ కొనుగోలు చేస్తున్న వారిలో ఎక్కువ మంది మొదటిసారి ఈ ఉత్పత్తులను వాడుతున్న వారేనని వెల్లడించారు.

✦ యాపిల్‌ సీఈఓగా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన టిమ్‌ కుక్‌, ఈ ఏడాది సెప్టెంబరు 1న ఈ బాధ్యతల నుంచి వైదొలగి, సంస్థకు ఎగ్జిక్యూటివ్‌ ఛైర్మన్‌గా మారతారు. సీఈఓగా జాన్‌ టెర్నస్‌ బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రపంచంలోనే అత్యంత వెడల్పైన సొరంగం

నవయుగ ఇంజినీరింగ్‌కు గిన్నిస్‌ ఖ్యాతి



ఈనాడు, హైదరాబాద్‌: మహారాష్ట్రలోని ప్రతిష్ఠాత్మక ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్‌ వే 'మిస్సింగ్‌ లింక్‌' ప్రాజెక్టులో భాగంగా, ప్రపంచంలోనే అత్యంత వెడల్పైన భూగర్భ సొరంగాన్ని నిర్మించిన ఘనతను హైదరాబాద్‌ సంస్థ నవయుగ ఇంజినీరింగ్‌ దక్కించుకుంది. గిన్నిస్‌ వరల్డ్‌ రికార్డ్స్‌లోనూ చోటు సంపాదించుకుంది. ఈ నూతన మార్గం అందుబాటులోకి రావడంతో ముంబయి-పుణె ప్రయాణ సమయంలో 30 నిమిషాలు ఆదా అవడమే కాకుండా, ఖండాలా మాట్లలోని విపరీతమైన ట్రాఫిక్‌ రద్దీని తప్పించుకోవచ్చు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ ఆలోచనతో, మహారాష్ట్ర స్టేట్‌ రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో 13.3 కిలోమీటర్ల మిస్సింగ్‌ లింక్‌ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దాన్ని నవయుగ ఇంజినీరింగ్‌ సాకారం చేసింది. మహారాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవేంద్ర ఫడణవీస్‌, ఉపముఖ్యమంత్రులు ఏక్‌నాథ్‌ శిందే, సునేత్రా పవార్‌, నవయుగ ఎండీ చింతా శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. చింతా శ్రీధర్‌ మాట్లాడుతూ.. సహ్యాద్రిలోని అత్యంత కఠినమైన బసాల్ట్‌ శిలల్లో క్లిష్టమైన సొరంగాన్ని నిర్మించడం, ప్రపంచ స్థాయిలో తమ ఇంజినీరింగ్‌ సత్తాకు నిదర్శనమన్నారు. ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడంపై నవయుగ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ రమేష్‌ సింగరాజు హర్షం వ్యక్తం చేశారు.

విశేషాలు ఇవీ..

✦ 13.3 కిలోమీటర్ల మిస్సింగ్‌ లింక్‌ ప్రాజెక్టులో 10.67 కిలోమీటర్ల మేర 5 వరుసలతో కూడిన అత్యాధునిక జంట సొరంగ మార్గాలను నవయుగ నిర్మించింది. వీటి వెడల్పు 22.33 మీటర్లు. ఈ భారీ ప్రాజెక్టు కోసం సహ్యాద్రి పర్వతాల్లో 85 లక్షల టన్నుల రాతిని తవ్వితీశారు. 7,600 టన్నుల ఉక్కును, 1.1 లక్షల క్యూబిక్‌ మీటర్ల షాట్‌క్రీట్‌ కాంక్రీట్‌ను వినియోగించారు. ఇంజినీర్లు, కార్మికులు 90 లక్షల పనిగంటలు వెచ్చించారు.

వాహనాలకు శుభారంభం

కొత్త ఆర్థిక సంవత్సరాన్ని బలంగా ఆరంభించిన కంపెనీలు



ఏప్రిల్‌ 1తో మొదలైన కొత్త ఆర్థిక సంవత్సరాన్ని (2026-27) వాహన తయారీ సంస్థలు ఉత్సాహంగా ఆరంభించాయి. గత నెలలో ఈ సంస్థలన్నీ కలిపి 4.5 లక్షల కార్లను తమ డీలర్లకు సరఫరా చేశాయన్నది అంచనా. 2025 ఏప్రిల్‌లో కంపెనీలు టోకుగా విక్రయించిన 3.54 లక్షల వాహనాలతో పోలిస్తే, ఈసారి 27% అధికంగా సరఫరా చేశాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్‌, కియా రికార్డు స్థాయి అమ్మకాలు నమోదుచేయడం ఇందుకు తోడ్పడింది. జీఎస్‌టీ - ఆదాయపు పన్ను రేట్ల కోత, కీలక వడ్డీ రేట్ల తగ్గింపు వల్ల, అమ్మకాల పరంగా వాహన పరిశ్రమపై సానుకూల ప్రభావం కొనసాగుతోందని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్‌ ఎగ్జిక్యూటివ్‌ అధికారి (మార్కెటింగ్‌, విక్రయాలు) పార్థో బెనర్జీ తెలిపారు. ఏప్రిల్‌లో మారుతీ సుజుకీ దేశీయంగా 1,91,122 వాహనాలను విక్రయించింది. ఒక నెలలో దేశీయ విక్రయాలపరంగా కంపెనీకి ఇదే అత్యధికం. 2025 డిసెంబరులో అమ్మిన 1,82,165 వాహనాలే ఇప్పటివరకు అత్యధికంగా ఉన్నాయి.

ఏప్రిల్‌లో వాహనాల మొత్తం విక్రయాలు


కంపెనీ	2026	2025	వృద్ధి/(క్షీణత)%లో
మారుతీ సుజుకీ	2,39,646	1,79,791	33.29
టాటా మోటార్స్‌ ప్యాసింజర్‌	59,701	45,532	31.12
హ్యుందాయ్‌ మోటార్‌ ఇండియా	65,610	60,774	7.96
మహీంద్రా అండ్‌ మహీంద్రా	94,627	84,170	14
కియా ఇండియా	27,286	23,623	16
రెనో ఇండియా	5,413	2,602	108
టయోటా కిర్లోస్కర్‌	32,086	27,329	17
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్‌	6,018	5,829	3.24
నిస్సాన్‌ మోటార్‌	5,388	---	75
వీఈ కమర్షియల్‌ వెహికల్స్‌	7,318	6,846	6.9
టాటా మోటార్స్‌ కమర్షియల్‌	34,833	27,321	28
ద్విచక్ర వాహనాలు			
హోండా మోటార్‌సైకిల్‌	5,63,000	4,84,000	17
హీరో మోటోకార్ప్‌	5,66,086	3,05,406	85
రాయల్‌ ఎన్‌ఫీల్డ్‌	1,13,164	86,559	31
సుజుకీ మోటార్‌సైకిల్‌	1,17,514	1,12,948	4

సీయూబీ ఎండీ విజయ్‌ బాధ్యతల స్వీకరణ



సిటీ యూనియన్‌ బ్యాంక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌, ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా విజయ్‌ ఆనంద్‌ శుక్రవారం బాధ్యతలు చేపట్టారని బ్యాంక్‌ తెలిపింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న ఎన్‌.కామకోటి సీయూబీ ఫౌండేషన్‌ ఛైర్మన్‌ అవుతున్నారు.

కృష్ణమూర్తి సుబ్రమణియన్‌కు యూనివర్సిటీ ఆఫ్‌ షికాగో పురస్కారం



దిల్లీ: యూనివర్సిటీ ఆఫ్‌ షికాగో తమ ప్రతిష్ఠాత్మక 'ప్రొఫెషనల్‌ ఎచీవ్‌మెంట్‌ అలైమ్ని' అవార్డును భారత మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి వి సుబ్రమణియన్‌కు ప్రదానం చేసింది. 1941లో ఈ అవార్డు ప్రారంభం కాగా, ఈ గౌరవాన్ని అందుకున్న తొలి భారతీయ ఆర్థికవేత్తగా సుబ్రమణియన్‌ నిలిచారు. తద్వారా పాల్‌ శామ్యూల్‌సన్‌, గ్యారీ బెకర్‌, క్లాడియా గోల్డిన్‌ (నోబెల్‌ విజేతలు), కార్ల్‌ సాగన్‌, ఫిలిప్‌ కోట్లర్‌ వంటి మేధావుల సరసన ఆయన స్థానం దక్కించుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం గొప్ప గౌరవమని, సీవీ రామన్‌, హోమీ బాబా, విక్రమ్‌ సారాభాయ్‌ వంటి దిగ్గజాల బాటలో తాను సాగడం గర్వకారణమని సుబ్రమణియన్‌ తెలిపారు.

కోడి గుడ్లు

2న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్‌)
(100కు రూపాయలలో)

హైదరాబాద్‌	525
వరంగల్‌	527
విజయవాడ	525
తూ/వ గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	593

ఏప్రిల్‌లో నియామకాలు 6% పెరిగాయ్‌

అత్యధికం బీమా రంగంలోనే: నివేదిక



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల (ఏప్రిల్‌)లో దేశీయంగా కార్యాలయ ఉద్యోగ (వైట్‌ కాలర్‌) నియామకాలు 6% పెరిగాయని నౌకరీ జాబ్‌స్పీక్‌ ఇండెక్స్‌ నివేదిక తెలిపింది. బీమా రంగంలో అత్యధిక నియామకాల వృద్ధి నమోదైంది. 2025 ఏప్రిల్‌తో పోలిస్తే, గతనెలలో బీమా రంగంలో నియామకాలు 21% పెరిగాయి. ఆ తర్వాతి స్థానంలో బీపీఓ/ ఐటీఈఎస్‌ (15%), స్థిరాస్తి (12%), ఆరోగ్య సంరక్షణ (11%), విద్య (9%) ఉన్నాయి. టెలికాం, బ్యాంకింగ్‌ రంగాల్లో నియామకాలు 4 నెలల కనిష్ఠానికి పడిపోయాయి. ఈ రెండు రంగాల్లో నియామకాలు వరుసగా 11%; 10 శాతానికి తగ్గాయి. ఐటీ, ఔషధం, వాహన రంగ నియామకాల్లో పెద్దగా మార్పులేదు. గ్లోబల్‌ కేపబిలిటీ సెంటర్‌ (జీసీసీ)లలో నియామకాలు 4% తగ్గడం గమనార్హం. నెలవారీగా భారత్‌లో ఉద్యోగ విపణి, నియామకాల ధోరణిలో వస్తున్న మార్పులను గమనిస్తూ నౌకరీ జాబ్‌స్పీక్‌ ఇండెక్స్‌ నివేదిక రూపొందిస్తోంది.

హైదరాబాద్‌కు అగ్రస్థానం: నియామకాల్లో 12% వృద్ధి అంచనాతో హైదరాబాద్‌ అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో బెంగళూరు (7%), చెన్నై (6%) ఉన్నాయి. దిల్లీ (3%), కోల్‌కతాలో (1%) నియామకాలు ఓ మోస్తరుగా పెరగ్గా, ముంబయిలో 3% తగ్గాయి.

వసుధ ఫార్మాకు అమెరికాలో ఊరట

ఈనాడు, హైదరాబాద్‌: ఫెంటానిల్‌ (ప్రయోగశాలల్లో రూపొందించే సింథటిక్‌ ఒపియాయిడ్‌) తయారీకి ఉపయోగించే రసాయనాలను అమెరికాలోకి చట్టవ్యతిరేకంగా దిగుమతి చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్న హైదరాబాద్‌ సంస్థ వసుధ ఫార్మా కెమ్‌ లిమిటెడ్‌కు ఊరట లభించింది. ఈ సంస్థపై మోపిన అన్ని అభియోగాలను అమెరికా న్యాయ శాఖ (డీఓజే) ఉపసంహరించుకుంటూ, కేసును పూర్తిగా కొట్టివేసింది. సంస్థ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్లు ఎం.అశోక్‌ శ్రీనివాస్‌ రాజు, ఆనంద్‌ మంతెన మాట్లాడుతూ.. అమెరికా న్యాయశాఖ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. యథావిధిగా అత్యున్నత ప్రమాణాలతో సేవలు కొనసాగిస్తామని తెలిపారు.

ఐపీ హక్కుల పరిరక్షణకు

ప్రాధాన్య పర్యవేక్షణ జాబితాలో భారత్‌

వియత్నాంపై కఠిన నిఘా: యూఎస్‌టీఆర్‌



వాషింగ్టన్‌: మేధో సంపత్తి (ఐపీ) హక్కుల పరిరక్షణ, అమలు విషయంలో తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న దేశాల్లో భారత్‌ ఒకటని యూఎస్‌ ట్రేడ్‌ రిప్రజెంటేటివ్‌ (యూఎస్‌టీఆర్‌) ప్రకటించింది. 6 దేశాలతో 'ప్రాధాన్య పర్యవేక్షణ జాబితా'ను యూఎస్‌టీఆర్‌ విడుదల చేసిన ప్రత్యేక నివేదికలో వెల్లడించింది. ఇందులో భారత్‌, చైనా, ఇండొనేషియా, చిలీ, రష్యా, వెనెజువెలా ఉన్నాయి. ప్రాధాన్య దేశం (పీఎఫ్‌సీ)గా వియత్నాంను పేర్కొంది. దీని ప్రకారం.. ఐపీల విషయంలో వియత్నాంపై కఠిన నిఘాను యూఎస్‌ పెట్టనుంది. పీఎఫ్‌సీ విభాగంలో గత 13 ఏళ్లలో ఒక దేశానికి చోటు దక్కడం ఇదే తొలిసారి. అమెరికా ఉత్పత్తులపై అత్యంత ప్రతికూల ప్రభావం చూపేలా ఐపీ సంబంధిత చర్యలు, విధానాలు, పద్ధతులు ఉన్న దేశాల కోసం పీఎఫ్‌సీ గుర్తింపు కేటాయించినట్లు యూఎస్‌టీఆర్‌ తెలిపింది. ఐపీ హక్కుల పరిరక్షణ విషయంలో చర్యలు జరిపేందుకు, చర్చల్లో గణనీయ పురోగతి సాధించేందుకు వియత్నాం నుంచి సరైన స్పందన ఉండటం లేదని వెల్లడించింది. కృత్రిమ మేధ పరిరక్షణ, అమలు విషయంలో అమెరికాలోని వ్యక్తులకు సమస్యలు ఎదురవుతున్న దేశాలను ప్రాధాన్య పర్యవేక్షణ జాబితాలో యూఎస్‌టీఆర్‌ చేరుస్తుంది. అనైతిక వాణిజ్య విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని రకాల ఆయుధాలను ఉపయోగించడమే తమకు అత్యంత ప్రాధాన్యమని యూఎస్‌టీఆర్‌ తెలిపింది.

విద్యుత్‌ వినియోగం పైకి.. బొగ్గు ఉత్పత్తి కిందకు



ఏప్రిల్‌ గణాంకాలు

వేసవి ఎండలు మండుతున్నందున, ఫ్యాన్లు- ఏసీల వాడకం తీవ్రమైంది. ఫలితంగా విద్యుత్‌ వినియోగం పెరుగుతుండగా, బొగ్గు ఉత్పత్తి తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్‌లో బొగ్గు ఉత్పత్తి 9.7% తగ్గి 56.1 మిలియన్‌ టన్నులకు పరిమితమైందని దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు, ప్రభుత్వ రంగ సంస్థ కోల్‌ ఇండియా తెలిపింది. దేశంలో 70% పైగా విద్యుదుత్పత్తికి బొగ్గే ఆధారం. బొగ్గు ఉత్పత్తి తగ్గడం వల్ల థర్మల్‌ ప్లాంట్లు, పరిశ్రమలకు సరఫరాలో కోత పడే అవకాశం ఉంది. ఇది కాస్తా బొగ్గు దిగుమతి వ్యయాలను పెంచుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దేశీయ బొగ్గు ఉత్పత్తిలో 80% వాటా ఉన్న ఈ కంపెనీ, ఉత్పత్తి తగ్గడానికి గల కారణాలను తెలపలేదు. 2025-26లో ఈ కంపెనీ బొగ్గు ఉత్పత్తి 1.7% తగ్గి 768.1 మి. టన్నులకు పరిమితమైంది.

✦ ఏప్రిల్‌లో విద్యుత్‌ వినియోగం 4.04% పెరిగి 153.99 బి. యూనిట్ల (బీయూ)కు చేరడం గమనార్హం. 2025 ఏప్రిల్‌లో మొత్తం విద్యుత్‌ వినియోగం 148.01 బీయూగా ఉంది. ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండొచ్చని ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసింది.

విమానయాన సంస్థలకు ఎఫ్‌డీటీఎల్‌ సడలింపులు వద్దు

పైలట్ల హఠాన్మరణాల నేపథ్యంలో ఆల్పా ఇండియా



పైలట్లు విధి నిర్వహణలో తీవ్ర అలసటకు గురికాకుండా చూసేందుకు రూపొందించిన 'అలసట నిర్వహణ నిబంధన (ఎఫ్‌డీటీఎల్‌)'ల నుంచి, విమానయాన సంస్థలకు ఇచ్చిన తాత్కాలిక సడలింపులను ఎత్తివేయాలని నియంత్రణ సంస్థ డీజీసీఏను పైలట్ల సంఘం ఆల్పా ఇండియా కోరుతోంది. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు పైలట్లు గుండెపోటుతో మరణించడం ఇందుకు నేపథ్యం. పూర్తి స్థాయిలో ఎఫ్‌డీటీఎల్‌ నిబంధనల అమలుకు ఒక కాల పరిమితితో కూడి ప్రణాళికను డీజీసీఏ తీసుకురావాలని కోరింది. పైలట్లకు సంబంధించిన బాధ్యతాయుత, పారదర్శక అలసట నివేదిక వ్యవస్థను తీసుకురావాలని సూచించింది. త్రైమాసికం వారీగా ఈ వివరాలను ప్రజలకు వెల్లడించాలనీ విజ్ఞప్తి చేసింది. ఎయిరిండియా పైలట్‌ ఒకరు, ఆకాశ ఎయిర్‌కు చెందిన మరొక పైలట్‌ హఠాత్తుగా గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ విధుల్లో లేని సమయంలో మృతి చెందారు. ఎయిరిండియా పైలట్‌ బాలిలో షెడ్యూల్డ్‌ రెస్ట్‌లో ఉండగా, ఆకాశ ఎయిర్‌ పైలట్‌ ఒకరు శిక్షణలో ఉండగా చనిపోయారు.

✦ సవరించిన నిబంధనల ప్రకారం, పైలట్లకు ఎక్కువ సమయం విశ్రాంతి తీసుకోవడానికి వీలవుతుంది. ఈ నిబంధనల అమల్లో ఎదురవుతున్న సవాళ్లు, పశ్చిమాసియా యుద్ధం ఆవాంతరాల నడుమ.. విమానయాన సంస్థలకు మరింత సమయాన్ని డీజీసీఏ ఇచ్చింది.

బీమా.. సామాన్యులకూ

అందుబాటులో ఉండాలి

శ్రీరామ్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ ఎండీ, సీఈఓ కాస్పరస్‌



ఈనాడు, హైదరాబాద్‌: 'జీవిత బీమా అధిక ఆదాయ వర్గాలకే పరిమితం అనే భావన ఉంది. 2047 నాటికి అందరికీ బీమా పాలసీలుండాలనే భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) లక్ష్యం నెరవేరాలంటే.. గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకూ బీమా కల్పించాల్సిన అవసరం ఉంది' అని శ్రీరామ్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌, సీఈఓ కాస్పరస్‌ జె. హెచ్‌.క్రోమ్‌హౌట్‌ తెలిపారు. దేశంలో జీవిత బీమా పరిశ్రమ 14-15% వార్షిక వృద్ధి రేటుతో సాగుతోందని వివరించారు. 'పరిశ్రమ ప్రధానంగా అధిక ఆదాయ వర్గాలపైనే దృష్టి సారిస్తుండటంతో, సగటు ప్రీమియం రూ.97,000గా నమోదవుతోంది. దేశంలో కేవలం 2.7 శాతంగా ఉన్న బీమా వ్యాప్తిని పెంచేందుకు, ఈ రంగంలోకి 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు అవకాశం కల్పించినా, గ్రామీణ ప్రాంతాల నుంచి పరిశ్రమకు వస్తున్న వ్యాపారం 20 శాతమే. సులభంగా అర్థమయ్యే మ్యూచువల్‌ ఫండ్స్‌ వంటి పెట్టుబడి సాధనాలపై చూపిస్తున్న ఆసక్తిని, విపత్కర పరిస్థితుల్లో ఆర్థిక రక్షణ కల్పించే బీమాపై ప్రజలు చూపకపోవడమే సవాలుగా ఉంది' అని విశ్లేషించారు. ఇటీవల అమల్లోకి వచ్చిన స్పెషల్‌ సరెండర్‌ వాల్యూ (ఎస్‌ఎస్‌వీ), జీఎస్‌టీ నిబంధనల మార్పులు బీమా రంగం లాభదాయకతపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున, బీమా సంస్థలు ఇప్పుడు టర్మ్‌ పాలసీల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయన్నారు. మధ్యతరగతి వారిపైనే తమ సంస్థ దృష్టి పెట్టిందని, సగటు ప్రీమియం రూ.27,000 వరకే ఉందని చెప్పారు. రూ.15 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారి నుంచే 60% వ్యాపారం వస్తోందన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుంటూ, 98.57% క్లెయిం సెటిల్‌మెంట్‌ నిష్పత్తితో సాగుతున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నా

మూలధన వ్యయాలు తగ్గవు

స్పష్టం చేసిన ఆర్థిక శాఖ



దిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, దేశ వృద్ధిరేటు జోరును కొనసాగించడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన రూ.12.22 లక్షల కోట్ల మూలధన వ్యయాలను తగ్గించబోమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రాబోయే త్రైమాసికాల్లో, ఏడాది కాలంలో చాలా ఒత్తిళ్లు ఎదురుకావొచ్చని వ్యయ కార్యదర్శి వి.వుల్నామ్‌ తెలిపారు. చమురు ధరలు పెరగడం, పెట్రోల్‌, డీజిల్‌పై ఎక్సైజ్‌ సుంకాలు తగ్గించడం వల్ల ప్రభుత్వానికి పన్ను రాబడిపై ప్రభావం పడొచ్చన్నారు. 2026-27 మూలధన వ్యయాల్లో జాతీయ రహదారులు, రైల్వేలు, షిప్పింగ్‌, పోర్టులు, పట్టణాభివృద్ధి రంగాలపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు.

అంతర్జాతీయ సవాళ్లతో ఇబ్బందే: ప్రస్తుత అంతర్జాతీయ అనిశ్చితులు, మన దేశానికి సవాళ్లు విసురుతున్నాయని, ప్రభుత్వం వీటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వుల్నామ్‌ స్పష్టం చేశారు. ఇటువంటి కఠిన సమయాన్ని ఎదుర్కొనేందుకు భారత ఆర్థిక స్థిరత్వం దోహదపడుతుందని తెలిపారు. ఇరాన్‌పై అమెరికా - ఇజ్రాయెల్‌ యుద్ధం ప్రారంభమయ్యాక, బ్యారెల్‌ ముడి చమురు ధర 73 డాలర్ల నుంచి నాలుగేళ్ల గరిష్ఠమైన 126 డాలర్లకు చేరింది. కొత్త సిరీస్‌ కింద సవరణ కారణంగా, జీడీపీలో 4.3 శాతంగా అంచనా వేసిన ద్రవ్యలోటు, ఇప్పుడు 4.5 శాతానికి పెరిగే అవకాశం ఉంది.

అదానీ గ్రూప్‌లో నిర్ణయాలు ఇక వేగంగా

అంతర్గత పరివర్తన ప్రణాళిక ప్రకటించిన గౌతమ్‌ అదానీ



దిల్లీ: అదానీ గ్రూప్‌ కోసం ఒక అంతర్గత పరివర్తన ప్రణాళికను గ్రూప్‌ ఛైర్మన్‌ గౌతమ్‌ అదానీ ప్రకటించారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా తమ ఉద్యోగులతో అదానీ మాట్లాడుతూ 'నిర్ణయాలు వేగంగా తీసుకోవడానికి, బలమైన కాంట్రాక్ట్‌ భాగస్వామ్యాలకు, భారీ స్థాయి సిబ్బంది నైపుణ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రూప్‌లో 3 మార్పులు చేపట్టనున్న'ట్లు తెలిపారు. తద్వారా అధికార శ్రేణిని సరళీకరించి, నిర్ణయాల అమలును వేగవంతం చేయొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 3 రోజులు పడుతున్న నిర్ణయాలను, ఇక 3 గంటల్లోనే తీసుకోవాలనుకుంటున్నామన్నారు. వెండర్లు, కాంట్రాక్టర్లను చిన్న పాటి బాధ్యతాయుత భాగస్వాములతో సమన్వయం చేయనున్నారు. శిక్షణ, వృత్తిపర ప్రగతి నిమిత్తం అదానీ ట్రైనింగ్‌ అకాడమీ వంటి చర్యలనూ ప్రతిపాదించారు.

మూడు స్తంభాలివీ..: 'సంస్థలు పెద్దగా మారే కొద్దీ నిర్ణయాలు ఆలస్యమవుతూ వస్తుంటాయి. ఒక స్థాయి నుంచి మరొక స్థాయికి వెళ్లడానికి ఎక్కువ సమయం పడుతోంది. ఇది జరగకూడదని భావిస్తున్నాం. మూడంచెల నమూనా మా మొదటి స్తంభం (మార్పు). ఇక రెండో స్తంభం భాగస్వామ్య నమూనా. మా ఉద్యోగులు పని ఎలా జరగాలన్న దానిని దిశానిర్దేశం చేస్తారు. మా భాగస్వాములు(కాంట్రాక్టర్లు, సరఫరాదార్లు, వెండర్లు) క్షేత్ర స్థాయిలో ఆ పనిని అమలు చేస్తారు. భారీ స్థాయిలో ఉన్న వీరి మధ్య సమన్వయానికి అదనపు అధికార శ్రేణులను నియమించాం. దీంతో నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయి. దీనిని మార్చనున్నాం. ప్రాజెక్టులను పూర్తి చేయడమే కాదు, సిబ్బంది సాధికారికంగా ముందడుగు వేయడమే ఈ భాగసామ్య నమూనా ముఖ్య ఉద్దేశం. మూడో స్తంభం నేర్చుకోవడం-అభివృద్ధి చెందడం. నైపుణ్యం లేని వారు.. పాక్షికంగా, పాక్షిక నైపుణ్యం ఉన్న వారు నిపుణులుగా మారాల్సి ఉంది. కార్మికుల నుంచి సూపర్‌వైజర్‌గా, మేనేజర్‌గా, లీడర్‌గా మారాలి. ఇందుకోసం అదానీ ట్రైనింగ్‌ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామ'న్నారు.

ఈతరం

youthpage@eenadu.in

ఆర్థిక అంశాలకూ ఏఐ

మీకు తెలుసా?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చిన తర్వాత ప్రతి విషయానికీ దాన్నే అడగడం మొదలుపెట్టారు మన యూత్ జనాలు. చివరికి ఆర్థిక సలహాల కోసం కూడా ఏఐ పైనే ఆధారపడుతున్నారు. దీనికి సంబంధించి తాజాగా ఓ సర్వే విడుదలైంది. 14-29 ఏళ్ల వారిలో సుమారు 68శాతం మంది, మిలీనియల్స్ (30-40)లో 65శాతం ఏదో ఒక రూపంలో ఆర్థిక నిర్వహణ కోసం ఏఐను వాడుతున్నారు. జెన్‌జీల్లో అయితే 46.79శాతం మంది ఆర్థిక సలహాదారుల సూచనల కంటే ఏఐ ఆధారిత సలహాలనే ఎక్కువగా ఇష్టపడుతున్నారట. పొదుపు, పెట్టుబడికి సంబంధించిన విషయాల గురించి సుమారు 90శాతం మంది ఏఐని ఉపయోగించి నిర్ణయాలు తీసుకుంటున్నారట.



అల్లుడు గారు

90లోకి వెళ్దామా..



నేను కాకినాడలో బీకాం చదివే రోజుల్లో జరిగిన సంఘటన తలుచుకుంటే ఇప్పటికీ నవ్వొస్తుంది. క్లాసులు కొత్తగా మొదలైన రోజులు అవి. ఒక రోజు లెక్చరర్లు ఎవరూ క్లాసుకు రాకపోవడంతో అందరూ కబుర్లు చెప్పుకొంటూ టైమ్ పాస్ చేస్తున్నారు. అప్పుడు హఠాత్తుగా ప్రిన్సిపాల్ క్లాస్‌కి వచ్చారు. 'ఇప్పుడు మీకు ఎవరి క్లాస్.. ఎందుకు ఖాళీగా ఉంది' అని గంభీరంగా అడిగారు. వెంటనే ఒక స్టూడెంట్ లేచి, 'ఇప్పుడు అల్లుడు గారి క్లాస్ సర్' అని చెప్పాడు. ఆ మాట విని ప్రిన్సిపాల్ ముసిముసిగా నవ్వుకుంటూ సైలెంట్‌గా వెళ్లిపోయారు. ఇంతకీ అసలు సంగతి ఏంటంటే మాకు అప్పుడు కామర్స్ క్లాస్. ఆ కామర్స్ లెక్చరర్, మా కాలేజీ ప్రిన్సిపాల్‌కు అల్లుడు. మేమేమో కొత్తగా కాలేజీలో చేరిన రోజులాయె. అప్పటికి ఇంకా లెక్చరర్ల పేర్లు తెలియవు. మా సీనియర్లు, కామర్స్ లెక్చరర్ పేరు 'అల్లుడు గారు' అని చెప్పారు. అదే మాట ఆ స్టూడెంట్ చెప్పాడు. ప్రిన్సిపాల్‌కు అల్లుడు అయినా అందరూ అలాగే పిలవడంతో ఆయన కాలేజీకే అల్లుడు అయ్యారు.

– సత్యరామం, కాకినాడ

బీచ్‌కి వెళ్తుంటే..



సమ్మర్‌లో టూర్లు ప్లాన్ చేయని కుర్రకారు ఉంటారా! అందులోనూ సముద్రతీర ప్రాంతాలంటే ఇంకా ఇష్టపడతారు. మరి అలా వెళ్లినప్పుడు సాదాసీదాగా కనిపిస్తే బావుండదు కదా! అందుకే 'కోస్టల్ గ్రామ్ ట్రెండ్'ను ఫాలో అవుతూ అందంగా మెరిసిపోతున్నారు. మనసుకు హాయిగొలిపే రంగులు, తేలికైన ఫ్యాబ్రిక్, సింపుల్‌గా అందంగా ఉండటం.. ఇదే దీని ప్రధాన ఉద్దేశం. పాజిటివిటీను పెంచుతూ.. మరీ కొట్టొచ్చినట్టు కనపడకుండా, నేచర్‌లో కలిసిపోయే లాంటి రంగులకు ఇందులో ప్రాధాన్యం ఇస్తున్నారు. అమ్మాయిలైతే క్రోచెట్, మాక్సీ డ్రెస్సులు.. అబ్బాయిలేమో చక్కని కాటన్ బీచ్‌వేర్‌లో సందడి చేస్తున్నారు. దీంతో కోస్టల్ గ్రామ్ పేరుతో ఈ ఫ్యాషన్ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది.

లావెండర్ వెడ్డింగ్ అది..



మీరు చూసే రీల్స్‌లోనో, పోస్ట్‌లోనో 'లావెండర్ వెడ్డింగ్' అని కనిపించే ఉంటుంది. అంటే ఏంటో తెలుసా.. ఇద్దరికీ సౌకర్యవంతంగా ఉండే ఓ బంధం. నిజానికి ఇది పెళ్లిలాంటిది కాదు, కానీ పెళ్లి చేసుకుంటారు. ముందు ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీకి చెందిన యువతీయువకులు సామాజికంగా ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక ఇలాంటి బంధాల్లోకి వెళ్లడం మొదలుపెట్టారు. అంటే పెళ్లి చేసుకునే అమ్మాయి, అబ్బాయి మధ్య భార్యాభర్తల బంధం ఉండదు. ఇద్దరికీ తమకు నచ్చిన స్వలింగ వ్యక్తులతో వేర్వేరు జీవితాలు ఉంటాయి. కేవలం సొసైటీ కోసం పెళ్లి చేసుకుంటారు. తర్వాత ఇది మామూలు వారికీ పాకింది. ఆర్థిక భద్రత, తోడు, కెరియర్ ప్రాధాన్యాలు.. ఇలా ఇద్దరికీ ఉన్న అవసరాల కోసం వివాహ బంధంలోకి అడుగు పెడుతున్నారు. వాస్తవంగా ఇద్దరికీ వేర్వేరు లవ్‌లైఫ్స్ ఉంటున్నాయి.

ఈ శాస్త్రవేత్త నాన్న..
ఓ జీప్ డ్రైవర్

అమెరికా వెళ్లాలన్నది చాలా మంది యువత కల. అలాంటి దేశం పిలిచి మరీ శాస్త్రవేత్తగా అవకాశం ఇచ్చింది. మంచి వేతనమూ దొరుకుతుంది. అలాంటి సమయంలో ఎవరైనా అక్కడే స్థిరపడిపోవాలని కోరుకుంటారు. కానీ మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన **నేరెళ్ల శ్రీధర్‌గౌడ్** అలా అనుకోలేదు. తను ఏ పరిశోధన చేసినా అది మన దేశానికే ముందు ఉపయోగపడాలనుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో శాస్త్రవేత్తగా ఎంపికయ్యాడు.

మందమర్రి సినిమాహాల్ ప్రాంతానికి చెందిన నేరెళ్ల యాదగిరి గౌడ్ - సుగుణ దంపతులకు ముగ్గురు కొడుకులు. యాదగిరి జీప్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని సాకారు. సంతానంలో శ్రీధర్ చివరివాడు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది, ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి రంగారెడ్డి జిల్లాలోని పీఆర్ఆర్ఎం కళాశాలలో బీఫార్మసీలో ఉచిత సీటు సాధించాడు. అక్కడ బాగా చదివి టాపర్‌గా నిలిచాడు.



క్యాన్సర్‌పై పరిశోధన చేస్తూనే..

2012లో గేట్ రాసి 792 ఆల్ ఇండియా ర్యాంకుతో కేయూలో ఎం.ఫార్మసీలో ఉచిత ప్రవేశం పొందాడు. నెలకు రూ.10 వేల ఉపకార వేతనంతో చదువుకుని ఉత్తమ మార్కులతో బంగారు పతకం సాధించాడు. అనంతరం పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల్లో ఆల్ ఇండియాలో 2వ ర్యాంకు సాధించి రీసెర్చ్ స్కాలర్‌గా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్)లో చోటు సంపాదించి క్యాన్సర్‌పై పరిశోధనకు అడుగులు వేశాడు. పీహెచ్‌డీ అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్)లో జూనియర్ శాస్త్రవేత్తగా ఏడాదిన్నర పని చేశాడు.

అమెరికా నుంచి ఆహ్వానం

అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) రీసెర్చ్ సంస్థలో పనిచేసేందుకు 2020లో ఆహ్వానం అందుకున్నాడు. అరుదైన అవకాశం దక్కడంతో ప్రపంచంలోనే దిగ్గజ శాస్త్రవేత్తలతో కలిసి పరిశోధనలు కొనసాగించాడు. 50కి పైగా అతడి వర్క్స్ వివిధ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. మరింత లోతుగా పరిశోధనలకు ఉపయోగపడే విధంగా వాటిని ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో ఉంచారు. శ్రీధర్ ఈ స్థాయికి చేరుకోవడానికి నిత్యం 10-12 గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది.

అమెరికాలోని ఎన్ఐహెచ్‌లో ఐదేళ్లపాటు శాస్త్రవేత్తగా పని చేసి అనుభవం సంపాదించాడు. అంతకుముందు నుంచే మాతృ దేశానికి ఏదైనా చేయాలనే తాపత్రయం ఉండేది. తిరిగి భారత్ వచ్చే ప్రయత్నంలోనే హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో శాస్త్రవేత్త (గ్రూపు-ఏ గెజిటెడ్ పోస్ట్)గా ఎంపికయ్యాడు. ఈ ఉద్యోగానికి భారత సంతతికి చెంది, వివిధ దేశాల్లో పనిచేస్తున్న చాలామంది శాస్త్రవేత్తలు తీవ్రంగా పోటీపడ్డారు. కానీ చివరకు శ్రీధర్‌గౌడ్ తన నైపుణ్యంతో సత్తా చాటి ఉద్యోగానికి ఎంపికై రెండు నెలలుగా పరిశోధన కొనసాగిస్తున్నాడు. క్యాన్సర్ వ్యాధికి అతి తక్కువ ధరకు మందు కనుగొనాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్న తనకు మనమూ ఆల్ ది బెస్ట్ చెప్పేద్దాం.

– సారం సతీష్‌కుమార్, న్యూస్‌టుడే – మందమర్రి పట్టణం

ఆ కానిస్టేబుల్ కొడుకే..
ఈ ఐఏఎస్

జీవితం ఎప్పుడూ వడ్డించిన విస్తరి కాదు. అది ఎన్నో ఆటుపోట్లు, ఎత్తుపల్లాల సమాహారం. ఉన్నత స్థానానికి క్షణాల్లో చేరుకునేలా చేసే మంత్రదండమేదీ ఉండదు. నిరంతర సాధన ఒక్కటే మార్గం. ఆదిలాబాద్ జిల్లాలోని ఓ మారుమూల తండాలో పుట్టి, ఓ పోలీసు హెడ్‌కానిస్టేబుల్ కొడుకు కలెక్టర్‌గా ఎదిగిన కథ మనకు ఇదే చెబుతోంది. **జాదవ్ సాయి చైతన్య** ప్రయాణం గురించి మనమూ తెలుసుకుందాం.

సాయిచైతన్య తల్లి కవిత ప్రభుత్వ టీచర్. తండ్రి జాదవ్ గోవిందరావు ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ పోలీసు ఠాణాలో హెడ్ కానిస్టేబుల్. వీరి స్వస్థలం తలమడుగు మండలంలో మారుమూలన విసిరేసినట్లుండే పల్సి(బి)తండా. ఉద్యోగాలరీత్యా ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూర్‌లో స్థిరపడ్డారు. ఇద్దరు పిల్లల్లో సాయి చైతన్య మొదటివాడు. ప్రాథమిక విద్య ఉట్నూర్‌లోనే సాగింది. ఆరోతరగతిలో కాగజ్‌నగర్ నవోదయలో చేరాడు. హైదరాబాద్‌లో ఇంటర్, ఆపైన ఎన్ఐటీ తిరుచ్చిలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. అక్కడి నుంచే యూపీఎస్సీపై దృష్టిపెట్టి ఆరోసారికి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు.

మలుపు తిప్పిన ఘటనలు



ఇంజినీరింగ్ తర్వాత ప్లేస్‌మెంట్ వస్తే చాలనుకున్న తన ఆలోచన.. ఐఏఎస్ వైపు మలుపు తిరగడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. తిరుచ్చిలో బీటెక్ మూడోసంవత్సరం చదువుతుండగా కాన్వొకేషన్ జరిగింది. దానికి ఐఏఎస్ సాధించిన వాళ్ల సీనియర్ కీర్తి వాసన్ అతిథిగా వచ్చారు. యూపీఎస్సీ- ఇండియన్ సర్వీసు ఉద్యోగాల ప్రాధాన్యం గురించి ఆయన చేసిన ప్రసంగం సాయిలో స్ఫూర్తి నింపింది. అంతకంటే ముందే మరో సంఘటన జరిగింది. నవోదయలో చదువుతుండగా.. ఓరోజు క్లాస్‌లో టాపర్‌గా వచ్చిన విద్యార్థులకు కలెక్టర్‌తో ప్రశంసాపత్రాలు ఇప్పించారు. అప్పుడు తను టాపర్ కాదని సాయికి బాధేసింది.

'ఎందులోనైనా టాపర్‌గా నిలిచి కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు తీసుకుంటే బాగుంటుంది కదరా' అని క్లాస్‌మేట్స్‌తో అంటుంటే, అది విన్న ఓ టీచర్ వచ్చి 'కలెక్టర్ చేతుల మీదుగా పత్రాలు తీసుకోవడం ఎందుకు, నువ్వే కలెక్టర్ అయ్యి పిల్లలకు ప్రశంసాపత్రాలు ఇవ్వొచ్చుగా' అని భుజం తట్టారు. ఆ రెండు ఘటనలే తనను పట్టువదలకుండా ఆరుసార్లు యూపీఎస్సీ రాసేలా చేశాయంటాడు సాయి చైతన్య.

2019లో రాస్తే క్వాలిఫై కాలేదు. 2020లో ప్రిలిమ్స్ పాసైనా మెయిన్స్‌లో పరీక్ష పోయింది. 2021, 2022లో రెండింటిలో రాణించినా ఇంటర్వ్యూలో నెగ్గలేదు. 2023లో పరీక్షల్లో ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌కి ఎంపికయ్యాడు. అందులో చేరి, మరోసారి 2024లో యూపీఎస్సీ రాయగా 2025 ఏప్రిల్‌లో విడుదలైన ఫలితాల్లో ఆలిండియా 68వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యాడు. తాజాగా తమిళనాడు కేడర్‌లో కృష్ణగిరి జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా నియమితుడయ్యాడు. ఆరోసారికిగానీ కోరుకున్న కొలువు దక్కని తన ప్రస్థానం గురించి చెబుతూ.. 'ఓటమి ఎప్పుడూ వృథా పోదు. అదో మంచి అనుభవం. అందులోంచి పాఠాలు నేర్చుకోవాలి' అంటున్నాడు. నిజమేగా మరి!

– ఎం.మణికేశ్వర్, ఈనాడు, ఆదిలాబాద్

నిజాలే చెబుతాం

ఇతరులను ఆకర్షించేందుకు ఏవో లేనిపోనివి చెప్పి ప్రేమలో దింపేయడాన్ని 'క్యాట్‌ఫిషింగ్' అంటారని మనకు తెలుసు. కానీ అటువంటి అబద్ధాలకు చోటు లేకుండా వందకు వందశాతం నిజాయతీగా ఉంటూ ఉన్న విషయాలనే చెప్పడాన్ని 'ట్రూకాస్టింగ్' అంటున్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది పాటిస్తున్న డేటింగ్ ట్రెండ్ కూడా ఇదేనట. అందమైన ఫొటోలు, కళ్లు చెదిరే క్యాప్షన్లు, పన్నీ ఫ్లర్టింగ్‌లకు కాలం చెల్లింది. 'ఈ గేమ్స్ ఇక ఆడలేం' అనేస్తున్నారు కుర్రకారు. ఓ స్థిరమైన, స్వచ్ఛమైన బంధం కోసం వెతుకుతున్నారు. అందుకే మొదటి డేట్ నుంచే దీర్ఘకాలిక బంధం కోసం చూస్తున్నారు. ఇతరులను ఆకర్షించేందుకు కాకుండా నిజమైన అభిరుచులను, వ్యక్తిత్వాన్ని తెలిపే ప్రొఫైల్స్‌ను పెట్టుకుంటున్నారు. అవసరాలు, ఉద్దేశాలను నేరుగానే తెలియజేస్తున్నారు.

కొంటె కొటేషన్



1. బయట చూస్తే ఉక్క.. ఫ్రిజ్‌లో వేశాడు పక్క.
– రావు, చూసి

2. వేసవి తాపం తాళలేక.. ఫ్రిజ్‌లో దూరాడు విధిలేక.
– హనుమదసూరి

3. తాపం తీర్చేవరకు ఫ్రిజ్.. ఆదమరిచావా నువ్వు ఫ్రీజ్.
– శ్రీధర్

4. బయట ఉంది ఉక్కపోత.. నేను ఫ్రిజ్‌లోనే నిద్రపోతా!
– మమత, హన్మకొండ

5. కోకిలో కొన్న ఫ్రిజ్ ఉండగా.. ఊటీకి వెళ్లడం ఎందుకు దండగ..
– సాయి హారిణి, హైదరాబాద్



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

అమ్మాయే మాట వినాలట



'జెన్‌జీలు బాగా ప్రోగ్రెసివ్. వారిలో అసలు లింగ అసమానతలకు చోటే లేదు..' అని అనుకుంటూ ఉంటారంతా. కానీ స్త్రీ, పురుష సమానత్వం విషయంలో వారు తమ ముందు తరాలకంటే వెనకబడి ఉన్నారని తాజాగా ఓ అధ్యయనం సూచిస్తోంది. ఇప్సోస్ - గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ విమెన్ లీడర్‌షిప్ (కింగ్స్ కాలేజ్, లండన్) 29 దేశాలకు చెందిన 23,000 మంది అబ్బాయిల మీద చేసిన పరిశోధనలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. 31 శాతం మంది జెన్‌జీ కుర్రాళ్లు తమకు కాబోయే భార్య తమ మాటే వినాలని చెబుతున్నారు! 33శాతం మంది ఏ విషయమైనా తమదే అంతిమ నిర్ణయం కావాలని కోరుకుంటున్నారు. బేబీ బూమర్స్‌లో కేవలం 13శాతం, 17శాతం మందిలో మాత్రమే ఇలాంటి ఆలోచనలు ఉన్నాయి! అలాగే అబ్బాయిలు సక్సెస్‌ఫుల్ అయిన అమ్మాయి భార్యగా రావాలని కోరుకుంటున్నారు. 41శాతం మందికి మంచి కెరియర్ ఉన్న భార్య కావాలట. 21శాతం మంది పిల్లల కేర్‌లో పాలుపంచుకోవడానికి ఇష్టపడటం లేదు.

నవ్వు బ్రో



'నాన్నా.. నేను ర్యాంక్ కొడితే కొత్త బైక్ కొనిస్తా అన్నావ్ కదా!'
'ఆ, రిజల్ట్స్ వచ్చాయా.. ర్యాంక్ తెలిసిందా?!'
'తెలిసింది నాన్నా.. నాకు డబ్బులు వేస్ట్ చేయడం అస్సలు నచ్చదని!'

'తనకు నేను లేకపోతే ఒక్క పనీ అవ్వదు తెలుసా.. ఒక్కరోజు కూడా కనపడకపోతే ఉండలేడు, ఏం చేయాలన్నా నన్నే అడుగుతాడు'.
'అబ్బ.. ఎవరే బాయ్‌ఫ్రెండా?'
'కాదు, ఆఫీసులో మేనేజర్'.

'గోవా వెళ్దాం అనుకుంటున్నారా. బెస్ట్ టైమ్ ఎప్పుడంటావ్?'
'నీ దగ్గర డబ్బులున్నప్పుడు!'

'ఒరేయ్ అజయ్.. నేను ఫిట్‌నెస్ మోడల్ అయ్యాను తెలుసా?'
'నిజమా.. అదెలారా?'
'చాలా ఈజీ. బిఫోర్, ఆఫ్టర్ పిక్చర్స్ ఉంటాయి కదా.. బిఫోర్‌కి ఎంచుకున్నారు'

మెయిల్ పంపండి

ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు పంపండి. మా మెయిల్ అడ్రస్ youthpage @eenadu.in

పంచుకుందాం

విఫలం

ఎన్ని రాత్రులు
తెల్లారిపోయాయో
ఎన్ని ఉదయాలు
చీకటి పడిపోయాయో
ఏ సమాధానం రాకపోవడమూ
ఓ సమాధానమని ఆలస్యంగా
గ్రహించేలోపు!
చీకటి సహజమే
మరో పొద్దు మరలా
పొడుస్తుంది
మరో వెన్నెల నిలువెల్లా
కురుస్తుంది
నన్ను నేను
ప్రేమతో మేల్కొల్పడమే
ఇక ఆలస్యం.

– హరిరెడ్డి

నేనే లీడర్

అవ్వొద్దు.. అన్‌ప్రొఫెషనల్

అప్పటివరకూ కాలేజీలో ఉన్న అలవాట్లతో.. కొత్తగా ఉద్యోగాల్లోకి వెళ్లినప్పుడు మనలో కొందరు తడబడతారు. ఆ వాతావరణాన్ని అర్థం చేసుకోలేక అన్‌ప్రొఫెషనల్‌గా కనపడతారు. మన విషయంలో అలా జరగకుండా ఉండాలంటే.. ఇలా చేయాలంటున్నారు నిపుణులు.



తక్కువగా మాట్లాడటం: ఎక్కువగా మాట్లాడే అలవాటును మార్చుకోవాలి. ఆలోచనలను పంచుకోవడం ముఖ్యమే కానీ మరీ ఎక్కువగా మాట్లాడుతున్నట్లు కనిపించడం మంచిది కాదు. అంతేకాక ఇతరులు మాట్లాడేటప్పుడు మధ్యలో కల్పించుకోవడం అనేది మనపై తక్కువ అభిప్రాయాన్ని కలిగిస్తుంది. దానికి బదులుగా ఎక్కువగా వినడం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయి. విజయం సాధించేవారు ఎప్పుడూ శ్రద్ధగా వింటూ ప్రశ్నలు అడిగి తెలుసుకుంటారట.

అన్నింటికీ అవును అనడం: ప్రతిదానికీ సరేనని చెప్పడం సులభమైన విషయమే. కానీ తర్వాత అది మనల్ని ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉంటుంది. మన సామర్థ్యాన్ని మించి బాధ్యతలు తీసుకున్నప్పుడు అంత ఎఫెక్టివ్‌గా పని చేయలేం. అందుకే దేనికైనా ఎస్ చెప్పేటప్పుడు ఆలోచించాలి. టాస్క్ తీసుకుని, చేయలేక చేతులెత్తేస్తే.. మనపై ఒపీనియన్ తగ్గిపోతుంది.

కమ్యూనికేషన్: ఏ రంగంలో అయినా కమ్యూనికేషన్ స్కిల్ చాలా ముఖ్యమైనది. ఎవరితో ఏ విధంగా మాట్లాడాలనే విధానం తెలిసి ఉండాలి. సరైన కమ్యూనికేషన్ లేనట్లయితే దేనిలోనూ సరిగ్గా రాణించలేం. ప్రొఫెషనల్‌గా మారడానికి ఇది తొలిమెట్టు.

అతిగా పంచుకోవడం: పని చేసే చోట మంచి సంబంధాలు అవసరం. కానీ మన వ్యక్తిగత సమాచారాన్ని అతిగా పంచుకోకూడదు. హద్దులను మించి మాట్లాడినప్పుడు అవతలి వ్యక్తి భవిష్యత్‌లో మన బలహీనతలపై దెబ్బకొట్టే ప్రమాదం ఉంటుంది.

ఆలస్యంగా రావడం: ఎంత బాగా పని చేసినా, సరైన సమయానికి రాకపోతే నెగిటివ్ ప్రభావం పడుతుంది. సమావేశాలు, ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నప్పుడు ఆలస్యంగా రావడం వృత్తిపరంగా సరైంది కాదు. అది మనపై 'అన్‌ప్రొఫెషనల్' అనే ముద్ర వేయగలదు.

బ్యాక్‌పాక్‌పై.. త్రీడీ డిజైన్లు



కాలేజీ బ్యాక్‌పాక్‌లంటే ఒకే రంగులో అడపాదడపా డిజైన్లతో కనిపిస్తుంటాయి. అందులోనూ ఆధునిక పాటర్న్‌లకే చోటు ఎక్కువ. అలాంటిది భారతీయ సంప్రదాయ శైలిలో కనిపించే కాలేజ్ బ్యాగ్‌లను చూశారా! అందులోనూ త్రీడీ డిజైన్లతో.. అవే ఈ తాజా కలెక్షన్లు. నటరాజ, కృష్ణ.. ఇలాంటి చిత్రాలతో ఆకట్టుకునే ఆర్ట్ వర్క్‌తో వస్తున్నాయివి. డాన్స్, మ్యూజిక్ క్లాస్‌లకు వెళ్లేటప్పుడైతే ఇంకా బావుంటాయి. వీటిపైన మువ్వలు, పూసలు, ఎంబ్రాయిడరీ.. ఇలాంటి ఆకర్షణలు ఎన్నో ఉన్నాయి. మరి మీకూ నచ్చాయా!



యువ బంధాలు
బేబీ మీద జెలసీ వస్తోంది!



వారికి చాలా చిన్నవయసులోనే పెళ్లయిపోయింది. సరిగ్గా కుదురుకునేలోపే ఓ పాప పుట్టింది. ఆ తర్వాత ఇద్దరి మధ్యా చాలా దూరం పెరిగింది. మానసికంగా కుంగిపోతున్నారు. ఎవరి వాదన ఎలా ఉందంటే..

దీపక్ : పాప పుట్టకముందు నేను, తను చాలా సంతోషంగా ఉండేవాళ్లం. అన్నీ పంచుకునేవాళ్లం. చక్కగా మాట్లాడుకోవడం, బయటకు వెళ్లడం ఉండేది. కానీ డెలివరీ తర్వాత అంతా పాప చుట్టూనే తిరుగుతోంది. నాకు తెలుసు, ఈ సమయంలో బేబీకి కేర్ అవసరం. కానీ నేను అసలు కార్తిక జీవితంలోనే లేనట్టు అనిపిస్తోంది! ఒకే ఇంట్లో ఉన్నా దూరంగా ఉంటున్నాం. ఇలా చెప్పడం నాకు గిల్టీగా ఉంది కానీ.. నాకు నా సొంత కూతురి మీదనే జెలసీ వస్తోంది!

కార్తిక: అమ్మయ్యాక జీవితం చాలా మారిపోయింది. పాప ఫీడింగ్, హెల్త్, రోజంతా చూసుకోవడానికే నాకు టైమ్ సరిపోవడం లేదు. దీపక్ తనను పట్టించుకోవడం లేదు అంటుంటే నాకు ఇంకా ఒత్తిడి ఎక్కువ అవుతోంది, ఎందుకంటే అసలు నాకోసం నాకే టైమ్ ఉండటం లేదు. నాకు అర్థం అవుతుంది, తను బాధ పడుతున్నాడు.. ఒకప్పుడు భార్యాభర్తల్లా ఉండే మేం ఇప్పుడు కేవలం తల్లిదండ్రుల్లా ప్రవర్తిస్తున్నాం. కానీ నాకేం చేయాలో తెలియడం లేదు.

నిపుణులు : ఇది ప్రతి కపుల్ మధ్యా జరిగే అత్యంత సహజమైన పరిణామం. అలాగే చాలా తక్కువగా మాట్లాడుకునేది కూడా. దీపక్‌ది నిజంగా పాప పట్ల జెలసీ కాదు.. కేవలం తన భార్య మీద ఉన్న ప్రేమ! అంత చక్కని ప్రేమాభిమానాలు ఉన్న దంపతులను తల్లిదండ్రులుగా పొందడం పాప అదృష్టం. అయితే.. దీన్ని చక్కగా కొనసాగించడానికి ఇద్దరి నుంచి కొంత సర్దుబాటు అవసరం. పాప బాధ్యతలు ఇద్దరూ పంచుకోండి. ఎమోషనల్‌గా అలసిపోకుండా ఒకరి పట్ల ఒకరు జాగ్రత్త వహించండి. రోజుకు కనీసం పదిహేను నిమిషాలు పాప నిద్రపోయినప్పుడు, ఫోన్లు పక్కన పెట్టేసి మనసువిప్పి మాట్లాడుకోండి. సరకులు తేవడం, షాపింగ్ వంటి వాటికి ముగ్గురూ వెళ్లండి. నెమ్మదిగా పరిస్థితి చక్కబడుతుంది.



- అర్చన నందూరి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

(యువతీ యువకుల పేర్లు మార్చాం)

కరెంట్ అఫైర్స్



★ 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మ్యాటెల్ సంస్థ రూపొందించిన 'బార్బీ డ్రీమ్ టీమ్ 2026'లో ఏ భారత క్రీడాకారిణికి చోటు లభించింది?

జ: భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన. ('బార్బీ డ్రీమ్ టీమ్ 2026' ద్వారా అడ్డంకులను అధిగమించి, తమ తమ రంగాల్లో గణనీయమైన

మాదిరి ప్రశ్నలు

కృషి చేసిన మహిళల కథలను ప్రోత్సహించాలని మ్యాటెల్ లక్ష్యంగా పెట్టుకుంది. సెరెనా విలియమ్స్, కెల్లీ గెరార్డి (అమెరికా), రెజీనా సిర్వెంట్ అల్వరాడో (మెక్సికో), క్లోయీ కెల్లీ (యూకే), హెలెన్ ఫిషర్ (జర్మనీ), జోజా స్కుటిక్ (పోలాండ్), స్టెఫానీ గిల్మోర్ (ఆస్ట్రేలియా)లకు ఈ డ్రీమ్ టీమ్‌లో చోటు దక్కింది.)

మరింత సమాచారం

★ దేశంలోనే తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం ఏ నదిపై నదీతీర లైట్ హౌజ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?

జ: బ్రహ్మపుత్ర (రూ.84 కోట్ల పెట్టుబడితో బ్రహ్మపుత్ర (జాతీయ జల మార్గం-2)పై పాండు, జోగిఘోపా, సిల్ఘాట్, విశ్వనాథ్ ఘాట్‌ల వద్ద తొలి నదీతీరం లైట్‌హౌజ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్ ఈ లైట్ హౌజ్‌ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.)

మలుపులు తెలిస్తే మార్కులే!

నిలబడిన స్థానం నుంచి ఏదైనా గమ్యాన్ని చేరడానికి ఒక తార్కిక ప్రయాణం జరుగుతుంది. అందులో దిక్కులు, దూరాలు ఉంటాయి. కుడి ఎడమైనా, ముందు వెనుకలు మారిపోయినా దిశ తప్పుతుంది. గమ్యం చేరడం సాధ్యం కాదు. ఇది సక్రమంగా సాగాలంటే స్థల సంబంధిత అవగాహన ఉండాలి. దూరాన్ని లెక్కించగలిగే నైపుణ్యాన్ని కలిగి ఉండాలి. ఈ సామర్థ్యాలను అభ్యర్థుల్లో అంచనా వేయడానికి రీజనింగ్‌లో భాగంగా 'దిక్కులు' అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. అవి ఒక వ్యక్తి లేదా వస్తువు నిర్దిష్ట స్థానం నుంచి వివిధ దిశల్లో ప్రయాణించినప్పుడు ఆ వ్యక్తి లేదా ఆ వస్తువు స్థానాన్ని ప్రారంభ స్థానం నుంచి దిశ, దూరం లెక్కించడంపై ఉంటాయి. వాటికి తేలికగా జవాబులు గుర్తించాలంటే ప్రధాన దిక్కులు, మలుపులు, నాలుగు మూలల మధ్య ఉండే కోణాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రయాణిస్తున్న దిక్కునుబట్టి మలుపులను గందరగోళం లేకుండా గుర్తించడం ప్రాక్టీస్ చేయాలి.



దిక్కులు

ఒక వ్యక్తి వివిధ రకాల మలుపులు తిరిగి గమ్యస్థానం చేరినప్పుడు, ఆ వ్యక్తి ఏ దిశకు అభిముఖంగా ఉన్నాడు, అతడు బయలుదేరిన స్థానం దృష్ట్యా ఏ దిశకు అభిముఖంగా ఉన్నాడు, ప్రయాణించిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు. ఇలాంటి ప్రశ్నలు ఈ అధ్యాయం నుంచి అడిగే అవకాశం ఉంది. కాబట్టి పరీక్షార్థులు దిక్కులపైన అవగాహన పెంచుకోవడం అవసరం.


మనకు నాలుగు దిక్కులు, నాలుగు మూలలు ఉంటాయి.

దిక్కులు


1) ఉత్తరం (North)
2) తూర్పు (East)
3) దక్షిణం (South)
4) పడమర (West)

మూలలు

1) ఈశాన్యం (North - East)
2) ఆగ్నేయం (South - East)
3) నైరుతి (South - West)
4) వాయవ్యం (North - West)



★ సమస్యా సాధనలో కింది భావన ఉపయోగపడుతుంది. పైథాగరస్ సిద్ధాంతం నుంచి




$AC^2 = AB^2 + BC^2$

★ ప్రతి రెండు వరస దిక్కుల మధ్యకోణం = 90°

★ ఒక వ్యక్తి సవ్యదిశలో తిరగడం అంటే ఆ వ్యక్తి ఏ దిశలో ఉన్నప్పటికీ కుడి వైపునకు తిరగడం, అపసవ్య దిశలో తిరగడం అంటే ఎడమ వైపునకు తిరగడం అని అర్థం.

★ ఒక వ్యక్తి కుడి వైపు లేదా ఎడమ వైపు తిరిగాడు అంటే 90°ల కోణంతో తిరిగాడని అర్థం.



మాదిరి ప్రశ్నలు

1. ఒక వ్యక్తి తూర్పు దిశగా తన ప్రయాణాన్ని ప్రారంభించి మొదటగా ఎడమ వైపు, కుడి, ఎడమ, ఎడమ, కుడి, ఎడమ, ఎడమ వైపు మలుపులు తిరుగుతూ చివరగా కుడి వైపు తిరిగి గమ్యస్థానం చేరాడు. అయితే అతడు ప్రస్తుతం ఏ దిశకు అభిముఖంగా ఉన్నాడు?

1) ఉత్తరం 2) దక్షిణం 3) పడమర 4) తూర్పు

వివరణ: మొదటగా ప్రశ్నలో ఇచ్చిన కుడి, ఎడమలను రాసి ఒక కుడికి, ఒక ఎడమను తొలగించి, మిగిలిన కుడి లేదా ఎడమలను ప్రారంభంలో వ్యక్తి ప్రయాణిస్తున్న దిశకు అనువర్తింపజేయాలి.

~~ఎ~~, ~~కు~~, ఎ, ~~ఎ~~, ~~కు~~, ఎ, ~~ఎ~~, ~~కు~~

తూర్పు + ఎడమ + ఎడమ

తూర్పు + 180° (ఎడమ) = పడమర

జ: 3

2. ఒక వ్యక్తి ఆగ్నేయ దిశగా తన ప్రయాణాన్ని ప్రారంభించి మొదటగా కుడి వైపు, కుడి, ఎడమ, ఎడమ, కుడి, ఎడమ, కుడి, కుడి, కుడి, ఎడమ వైపు మలుపులు తిరుగుతూ చివరగా కుడి వైపు తిరిగి గమ్యస్థానం చేరాడు. అయితే అతడు ప్రస్తుతం ఏ దిశకు అభిముఖంగా ఉన్నాడు?

1) తూర్పు 2) నైరుతి 3) ఉత్తరం 4) ఈశాన్యం

వివరణ: ~~కు~~, ~~కు~~, ~~ఎ~~, ~~ఎ~~, ~~కు~~, ~~ఎ~~, ~~కు~~, కు, కు, ~~ఎ~~, కు

ఆగ్నేయం + కుడి + కుడి + కుడి

ఆగ్నేయం + 270° (కుడి) = ఈశాన్యం జ: 4


జనరల్ స్టడీస్

రీజనింగ్

3. ఒక వ్యక్తి పడమర దిశలో 20 మీ. ప్రయాణించి, కుడి వైపునకు తిరిగి 10 మీ., మళ్లీ కుడి వైపునకు తిరిగి 12 మీ. ఆ తర్వాత ఎడమ వైపునకు తిరిగి 6 మీ., చివరగా కుడి వైపునకు తిరిగి 8 మీ. ప్రయాణించాడు. అయితే అతడు బయలుదేరిన స్థానం నుంచి ఏ దిశలో, ఎంత దూరంలో ఉన్నాడు?

1) 20 మీ., దక్షిణ దిశ
2) 16 మీ., ఉత్తర దిశ
3) 20 మీ., ఉత్తర దిశ
4) 16 మీ., దక్షిణ దిశ

వివరణ: ప్రశ్నలో దూరం అడిగినప్పుడు కచ్చితమైన పటాన్ని నిర్మించాలి.




AB = 10 మీ. + 6 మీ. = 16 మీ.

బయలుదేరిన స్థానం నుంచి 16 మీ. దూరంలో ఉన్నాడు. బయలుదేరిన స్థానం దృష్ట్యా ఉత్తర దిశకు అభిముఖంగా ఉన్నాడు. జ: 2

4. మోహిత్ ఉత్తరం వైపు 18 కి.మీ. ప్రయాణించిన తర్వాత తూర్పు వైపు 6 కి.మీ., మళ్లీ దక్షిణం వైపు తిరిగి 14 కి.మీ.లు, తర్వాత పడమర వైపు 3 కి.మీ. ప్రయాణించి గమ్యస్థానం చేరాడు. అయితే అతడు బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

1) 6 కి.మీ. 2) 3 కి.మీ. 3) 5 కి.మీ. 4) 8 కి.మీ.

వివరణ:



AB = 4, BC = 14, CD = 6, DE = 14, EF = 3, BF = 6 − 3 = 3

ΔABF నుంచి పైథాగరస్ సూత్రం నుంచి


$AF^2 = AB^2 + BF^2$

$= 4^2 + 3^2 = 16 + 9$

$\Rightarrow AF^2 = 25 \Rightarrow AF = \sqrt{25}$

AF = 5 కి.మీ.

జ: 3



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

Metals and Non-Metals

10th Class Bridge Course — Physical Science

Elements are broadly classified into Metals and Non-metals based on their physical and chemical properties. Metals are generally electropositive (lose electrons), while non-metals are electronegative (gain electrons).

Physical properties of metals

- Hard (except sodium, potassium)
- Lustrous (shiny)
- Malleable (can be beaten into sheets)
- Ductile (can be drawn into wires)
- Good conductors of heat and electricity
- High melting and boiling points
- Sonorous (produce sound when struck)

Physical properties of non-metals

- Generally soft and dull (except diamond)
- Non-malleable and non-ductile
- Poor conductors of heat and electricity (except graphite)
- Low melting and boiling points
- Non-sonorous

Chemical Properties of Metals

i) Reaction with Oxygen

metals + Oxygen → metal oxide

metal oxides are basic in nature

Example: $2Mg + O_2 \longrightarrow 2MgO$



ii) Reaction with water

metals + water ⟶ metal Hydroxide + Hydrogen

Reactivity varies

Sodium reacts violently Iron reacts slowly

★ Copper does not react

iii) Reaction with Acids

metals + acid ⟶ salt + Hydrogen

Example:

$Zn + 2HCl \longrightarrow ZnCl_2 + H_2$

iv) Reaction with bases

Some metals (Al, Zn) react with bases ⟶ Hydrogen gas

For more Concepts

Chemical properties of non-metals

non-metals + Oxygen ⟶ non-metal oxides (acidic)


Do not react with acids

gain electrons ⟶ form anions

Writer: D.V. Subba Naidu

లోపల ఉంటే గ్రానైట్.. బయట పడితే బసాల్ట్!

భూమి ఉపరితలంపై ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన పర్వతాలు, పీఠభూములు, మైదానాలను ప్రధాన భూస్వరూపాలుగా వర్గీకరిస్తారు. భూ అంతర్భాగంలో జరిగే విరూపకారక ప్రక్రియలు, బాహ్య శక్తులైన నదులు, పవనాలు, హిమానీనదాలు, సముద్ర తరంగాల క్రమక్షయ, నిక్షేపణ చర్యల ఫలితంగా ఇవి రూపుదిద్దుకుంటాయి. పర్వతాల్లో పలు రకాలు ఉన్నాయి. ఖనిజాలకు నిలయాలైన పీఠభూములు, వ్యవసాయానికి అనువైన మైదానాలు మానవ జీవనానికి ఆధారంగా ఉన్నాయి. శిలల స్వభావం నుంచి ఎడారుల విస్తరణ వరకు, భూమిపై ఏర్పడే ప్రతి మార్పు వెనుక ఒక క్రమబద్ధమైన భౌగోళిక ప్రక్రియ దాగి ఉంటుందని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ప్రధాన భూస్వరూపాలు, అవి ఏర్పడిన తీరు, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ప్రాంతాలు, వాటి ప్రత్యేకతలపై అవగాహన పెంచుకోవాలి.



జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

ప్రధాన భూస్వరూపాలు - వర్గీకరణ

1. కింది వాక్యాల్లో పర్వతాలకు సంబంధించిన వాటిని సరిచూడండి.



ఎ) పర్వతాలు సాధారణంగా 600 మీటర్ల కంటే ఎత్తుగా ఉంటాయి. అంతకంటే ఎత్తు తక్కువగా ఉంటే 'కొండలు' అంటారు.
బి) పర్వతం అత్యున్నత స్థానాన్ని శిఖరాగ్రం అని, అందులో మానవుడు చేరుకోగలిగే స్థానాన్ని 'శిఖరం' అని పిలుస్తారు.
సి) భూ ఫలకలు ఒకదానితో మరొకటి అభిముఖంగా కదలడం వల్ల భూపటలంలోని రాతి పొరలు ఒత్తిడికి గురై ముడత పర్వతాలు ఏర్పడతాయి.
డి) కలిడోనియన్, హెర్సీనియన్, ఆల్పైన్ అనే కాలాల్లో ఈ రకమైన ముడత పర్వతాలు ఏర్పడ్డాయి.

1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
3) ఎ, బి, సి, డి సరైనవి
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు

2. కింది వాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

పర్వతాలు	దేశాలు/ ఖండం
ఎ) లారెన్షియన్	1) ఆఫ్రికా
బి) అల్టై	2) అమెరికా, కెనడా
సి) అల్‌గోమెన్	3) కెనడా
డి) అట్లాస్	4) చైనా, మంగోలియా

1) ఎ-3; బి-4; సి-2; డి-1 2) ఎ-4; బి-3; సి-2; డి-1
3) ఎ-1; బి-3; సి-2; డి-4 4) ఎ-1; బి-4; సి-3; డి-2

3. పర్వతాలకు సంబంధించిన వాక్యాలు సరిచూడండి.

ఎ) భూమి అంతర్భాగం నుంచి చొచ్చుకుని వచ్చిన శిలాద్రవం కలశాకార రూపంలో చల్లబడి, రాతి పొరలుగా మారి క్రమక్షయం చెందే క్రమంలో 'కలశ పర్వతాలు' ఏర్పడతాయి.
బి) భూపటలంలోని రాతి పొరలు పైకి ఉబుకుతున్న శిలాద్రవం కారణంగా వచ్చే ఒత్తిడిని తట్టుకోలేక పగిలిపోతాయి. ఆ పగుళ్లనే 'భ్రంశాలు' అంటారు.
సి) రెండు సాధారణ సమాంతర భ్రంశాల మధ్య ఉన్న భూభాగం అంతర్జ్వాలాల ప్రభావంతో పైకి వచ్చిన భూభాగాన్ని 'భ్రంశోన్నతి శిలావిన్యాసం' అంటారు.
డి) అమెరికాలోని ఆడిరాండిక్ పర్వతాలు బ్లాక్‌హిల్స్ కలశ పర్వతాల రకానికి చెందినవి.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.

4. కింది వాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

ముడత పర్వతాలు	ఖండాలు
ఎ) పైరనీస్	1) ఆసియా
బి) కార్డిలెరాస్	2) దక్షిణ అమెరికా
సి) ఆండీస్	3) ఆస్ట్రేలియా
డి) ఎల్బర్జ్	4) యూరప్



1) ఎ-4; బి-3; సి-2; డి-1 1) ఎ-4; బి-1; సి-3; డి-2
3) ఎ-1; బి-2; సి-3; డి-4 4) ఎ-1; బి-4; సి-3; డి-2

5. కింది వాటిలో సరికాని జతను గుర్తించండి.

ఎ) వాస్‌జెస్ పర్వతాలు - జర్మనీ
బి) బ్లాక్ ఫారెస్ట్ పర్వతాలు - ఫ్రాన్స్
సి) అపనైన్స్ పర్వతాలు - ఇటలీ
డి) సియెర్రా నెవెడా పర్వతాలు - యూఎస్ఏ

1) ఎ, సి 2) సి, డి 3) ఎ, డి 4) ఎ, బి

6. కింది వాటిలో పీఠభూములకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) పర్వత నిర్మాణ కారకాలైన విరూపకారక ప్రక్రియలే పీఠభూమి నిర్మాణానికి అవసరం అవుతాయి.
బి) కొన్ని సందర్భాల్లో నిలువుగా పనిచేసే భూచలనాలు భూపటలాన్ని వంపులకు గురిచేస్తాయి. ఈ సందర్భంలో భూపటలం ఉద్ధానం చెందగా పీఠభూములు ఏర్పడతాయి.
సి) లావా పీఠభూములు పెద్ద మొత్తంలో లావా, అగ్నిపర్వత భస్మం పైకి ఉబికి, అప్పటికే భూమి ఉపరితలంపై ఉన్న నిమ్నోన్నతాలను కప్పివేయడంతో ఏర్పడతాయి.
డి) సాధారణంగా పీఠభూములు 300 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉంటూ విభిన్న లక్షణాలు కలిగి ఉంటాయి. ఇవి ముఖ్యంగా ఖనిజ నిక్షేపాలకు ప్రసిద్ధి.



1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

7. కింది వాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

పీఠభూమి	ఖండం/దేశం
ఎ) ఒజార్క్ పీఠభూమి	1) కాంగో
బి) అబిసీనియా పీఠభూమి	2) తుర్కియే
సి) అనటోలియన్ పీఠభూమి	3) ఉత్తర అమెరికా
డి) కటంగా పీఠభూమి	4) ఆఫ్రికా

1) ఎ-4; బి-3; సి-2; డి-1 2) ఎ-3; బి-4; సి-2; డి-1
3) ఎ-1; బి-2; సి-3; డి-4 4) ఎ-1; బి-4; సి-3; డి-2

8. కింది వాటిలో సరికాని జతలను గుర్తించండి.

ఎ) లద్దాఖ్ పీఠభూమి - పర్వతాంతర పీఠభూమి
బి) మాళ్వా పీఠభూమి - గిరిపాద పీఠభూమి
సి) ద్వీపకల్ప పీఠభూమి - కలశ పీఠభూమి
డి) చోటానాగ్‌పూర్ పీఠభూమి - ఖండాతర్గత పీఠభూమి

1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి

9. కింది వాటిలో మైదానాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



ఎ) మైదానాలు సాధారణంగా సముద్ర మట్టం నుంచి 160 మీటర్లు ఎత్తు కలిగి విశాలంగా విస్తరించి ఉంటాయి.
బి) ఖండాంతర్గత మైదానాలు భూమిలో అంతర్గత శక్తుల వల్ల క్షితిజ సమాంతరంగా ఉన్న పొరలు ఖండాల మధ్య భాగంలో పైకి లేచి కొంత భాగం విస్తరించగా ఏర్పడతాయి.
సి) సముద్రతీర మైదానాలు సాధారణంగా ఖండాంతర అంచు కుంగిపోవడం వల్ల లేదా పై వైపునకు నెట్టివేతకు గురి కావడం వల్ల ఏర్పడతాయి.
డి) క్రమక్షయ మైదానాలు సాధారణంగా ఎత్తయిన ప్రాంతాలు దీర్ఘకాలంలో క్రమక్షయ చర్యల కారణంగా ఏర్పడతాయి.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

10. కింది వాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

మైదానాల రకాలు	క్రమక్షయ చర్యలు
ఎ) స్ట్రాండ్ ఫ్లాట్	1) అంతర్భూజల క్రమక్షయం
బి) పెడిప్లేన్స్	2) నదీ క్రమక్షయం
సి) పెనిప్లేన్స్	3) పవన క్రమక్షయం
డి) టెర్రారోసా	4) సముద్ర తరంగ క్రమక్షయం

1) ఎ-1; బి-3; సి-2; డి-4 1) ఎ-1; బి-4; సి-2; డి-3
3) ఎ-1; బి-2; సి-3; డి-4 4) ఎ-4; బి-3; సి-2; డి-1

11. కింది వాటిలో సరికాని జతను గుర్తించండి.

ఎ) బాహ్య అగ్నిశిలలు - బసాల్ట్ శిలలు
బి) అంతర్గత అగ్నిశిలలు - గ్రానైట్ శిలలు
సి) పాతాళ శిలలు - ఆండిసైట్ శిలలు
డి) ఉప పాతాళ శిలలు - డయోరైట్ శిలలు

1) ఎ, బి 2) బి, సి 3) ఎ, డి 4) సి, డి

12. కింది వాటిలో నదీ ఆధారిత భూస్వరూపాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) నది తన ప్రవాహంలో యౌవన దశలో వేగంగా ప్రవహించే క్రమంలో నదీ గర్భంలో గుండ్రని గుంటలను ఏర్పరుస్తుంది. వీటినే 'పాట్‌హోల్స్' అంటారు.
బి) నది తన ప్రవాహంలో ప్రౌఢ దశలో కొంచెం నెమ్మదిగా ప్రవహిస్తూ తాను ప్రవహించే లోయలను వెడల్పు చేసేక్రమంలో కూటాలను ఏర్పరుస్తుంది.
సి) నదీ నివేదికలు అనేవి నదికి ఇరువైపులా సన్నగా బల్లపరుపుగా ఉంటూ మెట్ల లాంటి ఆకారాన్ని పోలి ఉంటే వాటిని 'నదీ నివేదికలు' అంటారు.
డి) నదికి వరదలు వచ్చిన సందర్భంలో నదీ ప్రవాహ వేగం పెరిగి దాని వరద మైదానం బయట సన్నని రిడ్జ్‌ల రూపంలో నదీ భారం నిక్షేపించిన భాగాన్ని 'సహజ లేవీలు' అంటారు.



1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

13. కింది వాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

జాబితా - 1	జాబితా - 2
ఎ) వండలి వీణలు	1) హిమానీనద భూస్వరూపాలు
బి) పీఠాకృతి శిలలు	2) సముద్ర భూస్వరూపాలు
సి) బ్లోహోల్స్	3) పవన భూస్వరూపాలు
డి) ఎరిటే	4) నదీ భూస్వరూపాలు

1) ఎ-1; బి-4; సి-2; డి-3 2) ఎ-1; బి-2; సి-3; డి-4
3) ఎ-4; బి-3; సి-2; డి-1 4) ఎ-3; బి-4; సి-2; డి-1

14. కింది వాటిలో సరికాని జతను గుర్తించండి.

ఎ) కాల్ - హిమానీనద క్రమక్షయ భూస్వరూపాలు
బి) ఎస్కర్లు - హిమానీనద నిక్షేపణ భూస్వరూపాలు
సి) యువాలా - అంతర్భూజల నిక్షేపణ భూస్వరూపాలు
డి) స్టాలగ్‌మైట్ - అంతర్భూజల క్రమక్షయ భూస్వరూపాలు

1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) సి, డి



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-3; 2-1; 3-2; 4-1; 5-4; 6-1; 7-2; 8-3; 9-2; 10-4; 11-4; 12-2; 13-3; 14-4.

మార్పు కోరుతూ విడిపోయి.. దేశ రాజకీయాలను శాసించి!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం - భారతదేశ చరిత్ర

గాంధీజీ 1922లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అర్ధంతరంగా నిలిపివేయడం కాంగ్రెస్‌లోని పలువురికి నచ్చలేదు. జాతీయ నాయకులు నిరాశకు గురయ్యారు. సంధికాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాల్లో కాంగ్రెస్‌లో భేదాభిప్రాయాలు తలెత్తాయి. మహాత్మాగాంధీ, 1930లో రెండో ప్రజా ఉద్యమమైన శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభించారు. సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాల మధ్యకాలంలో జాతీయంగా చోటుచేసుకున్న పలు సంఘటనలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వాటిపై పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.

జాతీయోద్యమం - ముఖ్య సంఘటనలు (1922-1930)

- మార్పు కోరే వర్గం, మార్పు కోరని వర్గాలుగా నాయకులు విడిపోయారు. చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ, హకీం అజ్మల్‌ఖాన్, అలీ సోదరులను స్వరాజ్యవాదులుగా పేర్కొంటారు. వీరు శాసన మండళ్లలో ప్రవేశించాలని తలచారు. తద్వారా ప్రభుత్వ బలహీనతలను ఎత్తి చూపవచ్చని భావించారు.
- రాజేంద్రప్రసాద్, సి. రాజగోపాలాచారి, వల్లభ్‌భాయ్ పటేల్ లాంటి వారిని మార్పు కోరని వర్గంగా పిలుస్తారు. వీరు సహాయ నిరాకరణ, బహిష్కరణ లాంటి వాటిపై దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. మండళ్ల ప్రవేశాన్ని వ్యతిరేకించారు.
- అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మోతీలాల్ నెహ్రూ, ఎం.ఎ. అన్సారీ, సి. రాజగోపాలాచారితో ఉప కమిటీని నియమించింది. వీరు శాసనోల్లంఘన ఉద్యమంపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ కమిటీ సిఫార్సులు గాంధీ విధేయులు, గాంధీ వ్యతిరేక వర్గానికి మధ్య భేదాభిప్రాయాలకు దారితీశాయి.

స్వరాజ్ పార్టీ స్థాపన



కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకులైన చిత్తరంజన్ దాస్ (సి.ఆర్.దాస్), మోతీలాల్ నెహ్రూ కలిసి కాంగ్రెస్ ఖిలాఫత్ స్వరాజ్ పార్టీని (స్వరాజ్ పార్టీ) స్థాపించారు.

- 1922 డిసెంబరులో చిత్తరంజన్ దాస్ అధ్యక్షతన గయలో కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 1923లో జరిగే సాధారణ ఎన్నికలను బహిష్కరించాలని పార్టీ నిర్ణయించింది. ఇందుకు నిరసనగా సి.ఆర్.దాస్ తన అధ్యక్ష పదవికి రాజీనామా చేసి స్వరాజ్ పార్టీని ప్రకటించారు. ఈ పార్టీకి సి.ఆర్.దాస్ అధ్యక్షుడిగా, మోతీలాల్ నెహ్రూ జనరల్ సెక్రటరీగా కొనసాగారు. వీరు శాసన మండలిలో తమ బలాన్ని ప్రదర్శించడం ద్వారా ప్రభుత్వ కార్యకలాపాలను అడ్డుకోవాలని భావించారు.
- స్వరాజ్ పార్టీ 1923 నుంచి 1925 వరకు జాతీయ రాజకీయాలను శాసించింది.
- 1923లో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య సయోధ్యకు ప్రయత్నించారు. అదే ఏడాది మేలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్వరాజ్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆమోదం తెలిపింది.

ముఖ్య విజయాలు:

1923 ఎన్నికల్లో పాల్గొన్న స్వరాజ్ పార్టీ విజయఢంకా మోగించింది. కేంద్ర శాసనసభలోని 141 స్థానాలకు 42 స్థానాలను కైవసం చేసుకుంది.

- రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో సెంట్రల్ ప్రావిన్స్‌లో స్పష్టమైన మెజార్టీ సాధించింది. బెంగాల్‌లో అతిపెద్ద పార్టీగా అవతరించింది.
- పార్టీకి చెందిన విఠల్‌భాయ్ జె.పటేల్ (వల్లభ్‌భాయ్ పటేల్ సోదరుడు) కేంద్ర శాసనసభకు స్పీకర్‌గా ఎన్నికయ్యారు.
- 1924లో కేంద్ర శాసనసభలో ఆర్థిక బిల్లును వ్యతిరేకించింది.
- స్వరాజ్ పార్టీ ఒత్తిడితో ఆంగ్లేయులు ద్వంద్వపాలనను పునఃపరిశీలించడానికి సర్ అలెగ్జాండర్ ముడ్డిమాన్ అధ్యక్షుడిగా ముడ్డిమాన్ కమిటీని (1924-1925) నియమించారు. ఈ కమిటీలో తేజ్ బహదూర్ సప్రూ ఒక సభ్యుడిగా ఉన్నారు.
- స్వరాజ్ పార్టీ శాసనసభలో 'end or mend' విధానాన్ని అమలు చేసింది. భారత వ్యతిరేక చట్టాలను రద్దు చేయడం లేదా వాటిని భారతీయులకు అనుకూలంగా సవరించడం ఈ విధానం ప్రధాన లక్ష్యం.
- 1925లో సి.ఆర్.దాస్ మరణం పార్టీలో అంతర్గత కలహాలకు దారి తీసింది. దీంతో 1926 సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీ ఘోర పరాజయం చవిచూసి క్రమక్రమంగా అంతర్థానమైంది.

బట్లర్ కమిటీ (1927)

బ్రిటిష్ ప్రభుత్వం హార్‌కోర్ట్ బట్లర్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. దీని ఛైర్మన్ బట్లర్ కావడంతో దీన్ని బట్లర్ కమిషన్ అని కూడా అంటారు. అంతేకాకుండా ఇండియన్ స్టేట్స్ కమిషన్ అని కూడా పిలుస్తారు. దీనిలో హోల్ట్స్ వర్త్, ఎస్.సి.పీల్ సభ్యులుగా ఉన్నారు. కేంద్ర-రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను అధ్యయనం చేసేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. ఇది 16 స్వదేశీ సంస్థానాలను సందర్శించి, 1929లో బ్రిటిష్ ప్రభుత్వానికి తన నివేదికను అందించింది.

సైమన్ కమిషన్



బ్రిటిష్ ప్రభుత్వం 1927 నవంబరు 8న సర్ జాన్ సైమన్ అధ్యక్షతన ఇండియన్ స్టాట్యూటరీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి ఛైర్మన్ సైమన్ కావడంతో దీన్ని సైమన్ కమిషన్ అని కూడా అంటారు. ఈ కమిషన్‌ను కన్జర్వేటివ్ పార్టీకి చెందిన బ్రిటిష్ ప్రధాని Baldwin నియమించారు.

- 1919 చట్టం అమలు తీరును పరిశీలించి దీనికి మార్పులు, చేర్పులు సూచించడానికి ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.
- 1927 నవంబరులో ఈ కమిషన్‌ను ఏర్పాటు చేయగా, 1928 ఫిబ్రవరి 3న ఇది భారతదేశంలో అడుగు పెట్టింది.
- భారతదేశ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే అత్యంత ముఖ్యమైన సైమన్ కమిషన్‌లో భారతీయులకు చోటు కల్పించకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఈ కమిషన్‌ను తిరస్కరించింది.
- ఈ కమిషన్‌లోని ఛైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులు సైతం ఆంగ్లేయులే.
- 1927 డిసెంబరులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన మద్రాస్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సైమన్ కమిషన్‌ను అన్ని దశలు, అన్ని రూపాల్లో బహిష్కరించాలని తీర్మానించింది.
- 1928లో సైమన్ కమిషన్ భారతదేశంలో అడుగు పెట్టడంతోనే 'సైమన్ గో బ్యాక్' అనే నినాదాలతో ఆందోళన ప్రారంభమైంది.

ఉద్యమంలో ప్రధాన ఘట్టాలు:

లాహోర్‌లో జరిగిన సైమన్ వ్యతిరేక ఉద్యమానికి లాలా లజపతిరాయ్ నాయకత్వం వహించారు.

- ఇక్కడ జరిగిన లాఠీఛార్జ్‌లో తీవ్రంగా గాయపడి లజపతిరాయ్ 1928లోనే మరణించారు. దీనికి ప్రతీకారంగా భగత్‌సింగ్ శాండర్స్ అనే పోలీస్ అధికారిని అదే సంవత్సరంలో హత్య చేశారు. దీన్నే చరిత్రలో లాహోర్ కుట్ర కేసుగా అభివర్ణిస్తారు.
- లక్నోలో సైమన్ బహిష్కరణ ఉద్యమం జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో కొనసాగింది. నెహ్రూ, జి.బి.పంత్‌లపై సైతం లాఠీఛార్జ్ జరిగింది.
- మద్రాస్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంలో ప్రకాశం పంతులు చూపించిన ధైర్యసాహసాలకు ఆయనకు 'ఆంధ్రకేసరి' అనే బిరుదునిచ్చారు.
- కాంగ్రెస్ పార్టీ సైమన్ వ్యతిరేక ఉద్యమాన్ని కొనసాగిస్తుంటే కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం సైమన్‌కు మద్దతునిచ్చాయి.
- మద్రాస్‌లోని జస్టిస్ పార్టీ, పంజాబ్‌లోని పంజాబ్ యూనియనిస్ట్ పార్టీ సైమన్‌కు స్వాగతం పలికాయి. వీరి మద్దతుతో సైమన్ కమిషన్ విజయవంతంగా తన పని ముగించుకొని 1928లో నివేదికను ప్రభుత్వానికి అందజేసింది.
- దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించడాన్ని గమనించిన బ్రిటిష్ ప్రధానమంత్రి రామ్సే మెక్‌డొనాల్డ్ (లేబర్ పార్టీ) సైమన్ నివేదికపై ఏకాభిప్రాయాన్ని సాధించడానికి లండన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాలకు కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలను ఆహ్వానించారు.

నెహ్రూ రిపోర్ట్ (1928)

సెక్రటరీ ఆఫ్ స్టేట్ అయిన లార్డ్ బిర్కెన్ హెడ్ భారతీయులకు అన్ని పార్టీలు ఆమోదయోగ్యం తెలిపే రాజ్యాంగాన్ని రూపొందించుకునే సామర్థ్యం ఉందా అని సవాల్ విసిరారు. దీన్ని స్వీకరించి మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. సైమన్ నివేదికకు ప్రత్యామ్నాయంగా రూపొందించిన రాజ్యాంగ నివేదికను నెహ్రూ రిపోర్ట్ అంటారు. 1928 డిసెంబరులో కలకత్తాలో జరిగిన అఖిలపక్ష సమావేశం ముందు ఈ నివేదికను ఉంచారు.

ప్రధాన అంశాలు: భారతదేశానికి స్వయంప్రతిపత్తి ఇవ్వడం.

- ప్రతి పౌరుడికి 19 ప్రాథమిక హక్కులు కల్పించడం.
- భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడం.
- కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల్లో బాధ్యతాయుత పాలనను ప్రవేశపెట్టడం.
- కేంద్ర, రాష్ట్రాల్లో ద్విశాసనసభ పద్ధతిని ప్రవేశపెట్టడం.
- లౌకిక పరిపాలనను అందించి మైనార్టీలకు తగిన రక్షణ కల్పించడం.
- సమాఖ్య విధానాన్ని అమలు చేసి బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం. అవశిష్ట అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి కల్పించడం.
- రాష్ట్ర శాసనసభల్లో ముస్లింలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లను కల్పించడం. ఈ రిజర్వేషన్లు కేవలం ముస్లింలు మైనార్టీగా ఉన్న రాష్ట్రాలకు మాత్రమే వర్తిస్తాయి.
- ముస్లింలీగ్ అధ్యక్షుడైన మహమ్మద్ అలీ జిన్నా నెహ్రూ రిపోర్టుకు మూడు సవరణలను ప్రతిపాదించారు. అవి:

1. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలు బలంగా ఉండాలి. అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు ఇవ్వాలి.
2. ముస్లిం మెజార్టీ రాష్ట్రాలతో సహా అన్ని రాష్ట్రాల శాసనసభల్లో ముస్లింలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.
3. ముస్లిం జనాభా నిష్పత్తి ప్రకారం కేంద్ర శాసనసభలో 33% స్థానాలను ముస్లింలకు కేటాయించాలి.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

998 Word of the Day

Pique

Telugu meaning: ఆసక్తి రేకెత్తించటం, చిరాకు

English meaning: As a verb, the word pique (పీక్) describes the act of stimulating interest or curiosity. As a noun, it refers to a feeling of irritation or resentment.

Synonyms: Stimulate, Resentment; ***Antonyms:*** Deter, Satisfaction

Usage: **1. As a Verb:** The mysterious headline was enough to pique the curiosity of readers and draw them to the article.

2. As a Noun: He felt a sense of pique when his suggestions were ignored during the meeting.

కరెంట్ అఫైర్స్




ప్రస్తుతం దేశజనాభా 142.58 కోట్లు అని కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. వీరిలో పురుషులు 73.20 కోట్లు, మహిళలు 69.38 కోట్లు. జనాభా ఏటా కోటి మంది చొప్పున 2036 నాటికి మరో 10 కోట్లు పెరుగుతుందని అంచనా వేసింది. "భారతదేశంలో పురుషులు-మహిళలు-2025" అనే పేరుతో తాజాగా విడుదల చేసిన ఈ నివేదికలో ఈ విషయాలు తెలిపింది.



రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), భారత నౌకాదళం (ఐఎన్) ఒడిశా తీరం వెంట బంగాళాఖాతంలో నిర్వహించిన నేవల్ యాంటీషిప్ మిసైల్ షార్ట్ రేంజ్ ప్రయోగం విజయవంతమైందని నేవీ వర్గాలు 2026, ఏప్రిల్ 29న తెలిపాయి. రెండు క్షిపణులను నౌకాదళానికి చెందిన హెలికాప్టర్ నుంచి జారవిడిచి ప్రయోగించారు.



హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వపరమైంది. ఇన్నాళ్లూ ప్రైవేట్ సంస్థ ఎల్అండ్‌టీ అధీనంలో ఉండగా రూ.1,461.47 కోట్లతో వందశాతం ఈక్విటీని కొనుగోలు చేయడం ద్వారా మెట్రోని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 2026, ఏప్రిల్ 29న సచివాలయంలో జరిగిన సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్, ఎల్అండ్‌టీ, ఎల్అండ్‌టీఎంఆర్‌హెచ్ఎల్ మధ్య షేర్ల కొనుగోలు ఒప్పందం కుదిరింది.



జమ్మూ- శ్రీనగర్ మార్గంలో రాకపోకలు సాగించనున్న మొట్టమొదటి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ జెండా ఊపి 2026, ఏప్రిల్ 30న ప్రారంభించారు. పూంఛ్, రాజౌరి, ఉరీ లాంటి మారుమూల ప్రాంతాలను దేశవ్యాప్తంగా ఇతర రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించడంపై దృష్టి సారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. చినాబ్ వంతెనపై ఇది ప్రయాణిస్తుంది.

దేశంలో పప్పుధాన్యాల స్థితిగతులపై ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్ ఆధ్వర్యంలో రూపొందించిన అధ్యయన నివేదిక 2026, ఏప్రిల్ 30న విడుదలైంది. భారత్‌లో పప్పుధాన్యాల విప్లవం రావాల్సిన ఆవశ్యకత ఉందని, దేశం దిగుమతుల నుంచి ఎగుమతుల వైపు పురోగమించాలని హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్) నివేదిక సూచించింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ నాలెడ్జ్ - శాస్త్రవేత్తలు విశేషాలు

వెంకీ రామకృష్ణన్



ఈయన భారత సంతతికి చెందిన అమెరికన్ జీవరసాయన శాస్త్రవేత్త. జీవశాస్త్రంలోని వివిధ విభాగాల్లో పరిశోధనలు చేశారు. రైబోసోమ్‌ల నిర్మాణం, పనితీరుపై అధ్యయనం చేశారు. రైబోసోమ్‌లు అనేవి ఆర్ఎన్ఏ, ప్రోటీన్‌లతో తయారైన చిన్న కణాలు. ఇవి ప్రోటీన్ సంశ్లేషణలో ప్రత్యేకత కలిగి ఉంటాయి. ఆయన 30S రైబోసోమ్ సబ్‌యూనిట్ పరమాణు నిర్మాణాన్ని మ్యాపింగ్ చేశారు. ఇందుకుగానూ రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. ఈయన పరిశోధనలు విజ్ఞానశాస్త్ర అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి. పోటీపరీక్షల కోణంలో వెంకీ రామకృష్ణన్ జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం - వృత్తి జీవితం

పూర్తి పేరు వెంకటరమణన్ రామకృష్ణన్. 1952లో తమిళనాడులోని చిదంబరంలో జన్మించారు. పాఠశాల విద్యను బరోడాలోని కాన్వెంట్ ఆఫ్ జీసస్ అండ్ మేరీలో అభ్యసించారు.


- 1971లో భౌతికశాస్త్రంలో డిగ్రీ పట్టా అందుకున్నారు. తర్వాత ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి, అక్కడి ఓహియో యూనివర్సిటీలో 'ఫిజిక్స్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం'లో చేరారు. 1976లో భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.
- తర్వాత ఆయన జీవశాస్త్రంలో పరిశోధనలు చేయాలని భావించారు. 1976-78 వరకు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్ డియాగో (యూసీఎస్‌డీ)లో మాలిక్యులర్ బయాలజీలో గ్రాడ్యుయేట్ స్థాయి అధ్యయనాలు ప్రారంభించారు.
- 1983-95 వరకు న్యూయార్క్‌లోని బ్రూక్‌హెవెన్ నేషనల్ ల్యాబొరేటరీలో బయోఫిజిసిస్ట్‌గా పనిచేశారు.
- రైబోసోమ్‌పై మరింత ఉన్నత రిజొల్యూషన్ అధ్యయనాలు చేసేందుకు 1999లో ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న మెడికల్ రిసెర్చ్ కౌన్సిల్ (ఎంఆర్‌సీ) ల్యాబొరేటరీ ఆఫ్ మాలిక్యులర్ బయాలజీకి వెళ్లారు. అదే సమయంలో ఆయన కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కాలేజీలో ఫెలో అయ్యారు. ప్రస్తుతం (2026, మే 2 నాటికి) ఆయన ఎంఆర్‌సీలో గ్రూప్ లీడర్ పదవిలో ఉన్నారు.

వెంకీ చేసిన ముఖ్యమైన పరిశోధనలు, అవార్డులు - గౌరవాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు సహా పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

శరీరధర్మ శాస్త్రం - నాడీ వ్యవస్థ

శరీరంలో జరిగే పలు విధులు, అంతర్గత, బాహ్య ఉద్దీపనలు, ప్రతిస్పందనలను నియంత్రించడం లేదా వాటిని సమన్వయపర్చడంలో నాడీ వ్యవస్థ పాత్ర కీలకం. ఇందులో నాడీ వ్యవస్థ నిర్మాణం, న్యూరాన్లు ముఖ్యమైన భాగాలు. కేంద్ర, పరిధీయ నాడీ వ్యవస్థలు, న్యూరాన్లు ఎప్పటికప్పుడు తమ విధులను నిర్వర్తిస్తూ శరీరంలోని వివిధ భాగాల నుంచి మెదడుకి, మెదడు నుంచి శరీర భాగాలకు సమాచారాన్ని ప్రసారం చేస్తుంటాయి.



నాడీ వ్యవస్థ నిర్మాణం

- కేంద్ర నాడీ వ్యవస్థ
- పరిధీయ నాడీ వ్యవస్థ

న్యూరాన్లు - రకాలు

- సెన్సరీ న్యూరాన్లు (అఫెరెంట్)
- మోటార్ న్యూరాన్లు (ఎఫెరెంట్)
- ఇంటర్ న్యూరాన్‌లు

నాడీ ప్రచోదన వ్యాప్తి

- రెస్టింగ్ మెంబ్రేన్ పొటెన్షియల్
- యాక్షన్ పొటెన్షియల్
- డీపోలరైజేషన్
- రీపోలరైజేషన్
- ప్రచోదనాల ప్రసారం

న్యూరోట్రాన్స్‌మీటర్లు: న్యూరాన్‌ల మధ్య సినాప్స్‌ను అనుసంధానం చేసే రసాయన దూతలనే న్యూరోట్రాన్స్‌మీటర్లు అంటారు. ఉత్తేజకరమైన న్యూరోట్రాన్స్‌మీటర్లు (ఉదా: గ్లుటామేట్) పోస్ట్‌సినాప్టిక్ న్యూరాన్‌లో చర్యా సామర్థ్యాలను ప్రోత్సహిస్తాయి.

న్యూరాన్లు, న్యూరోప్లాస్టిసిటీ, రిఫ్లెక్స్ ఆర్క్, నాడీ వ్యవస్థలోని లోపాలు, మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

జనరల్ మేనేజర్ ఉద్యోగాలు

యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్), ఝార్ఖండ్ వివిధ విభాగాల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 19. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 2026 మే 22.

యూజీసీ - నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూన్ 2026

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూన్ 2026 (యూజీసీ - నెట్) పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ అవార్డు, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడేందుకు, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇది ఉపయుక్తం. ఈసారి పరీక్ష నిర్వహణ బాధ్యతను జాతీయ పరీక్షల మండలి (ఎన్‌టీఏ) చేపట్టనుంది. దరఖాస్తు రుసుము రూ.1150. అర్హులైన అభ్యర్థులు 2026, మే 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (మే 2) చివరి తేదీ

- వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో 45 ఉద్యోగాలు. పీజీ/పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్‌లో అర్హత సాధించినవారు అర్హులు.
- ఐఐఎస్ఈఆర్ తిరుపతిలో రిసెర్చ్ అసోసియేట్ ఉద్యోగాలు. పీహెచ్‌డీలో (లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- ఎయిమ్స్ జోధ్‌పూర్‌లో 24 ఉద్యోగాలు. డిగ్రీ/ఎమ్మెస్సీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams - Mathematics

Simple Interest

1. A man invested 15,000 for 3 years. The rate of simple interest for the first, second, and third years are 3%, 4%, and 5% respectively. What is the total interest earned at the end of 3 years?
A) 1,200 B) 1,500 C) 1,800 D) 2,100
2. The total simple interest on a sum for 2 years is 1,320. If the rate of interest for the first year is 5% and for the second year is 6%, find the original sum (Principal).
A) 10,000 B) 11,000 C) 12,000 D) 15,000
3. After making a down payment of Rs.50,000, a person pays the remaining balance in 5 equal annual installments of Rs.30,000 each. If the interest charged was a 25% lump sum on the balance, what was the original price of the item?
A) Rs.1,50,000 B) Rs.1,70,000 C) Rs.1,80,000 D) Rs.2,00,000
4. A sum of 3,600 is invested at 12.5% p.a. simple interest. In how many years will the interest earned be 1,800?
A) 3 years B) 4 years C) 5 years D) 6 years
5. In how many years will a sum of money triple itself if the rate of simple interest is 20% per annum?
A) 5 years B) 8 years C) 10 years D) 12 years
6. A person invested Rs.12,000 into two parts. One part was invested at 5% p.a. and the other at 11% p.a. simple interest. If the total annual interest from both parts is Rs.1,020, find the amount invested at 5%.
A) Rs.5,000 B) Rs.6,000 C) Rs.7,000 D) Rs.8,000
7. Rs.20,000 is lent in two parts such that the interest on the first part at 6% for 4 years is equal to the interest on the second part at 8% for 3 years. Find the second part.
A) Rs.10,000 B) Rs.8,000 C) Rs.12,000 D) Rs.15,000
8. The simple interest on a certain sum for 4 years at 8% p.a. is Rs.640 less than the simple interest on the same sum for 4 years at 12% p.a. Find the sum.
A) Rs.3,200 B) Rs.4,000 C) Rs.4,800 D) Rs.5,000
9. The simple interest on a sum of money at 15% p.a. for 3.5 years and 5 years differs by Rs.1,350. What is the sum?
A) Rs.5,000 B) Rs.6,000 C) Rs.7,500 D) Rs.8,000
10. A sum of 20,000 is lent in two parts, one at 10% p.a. and another at 12% p.a. If the total simple interest received after 2 years is 4,480, find the amount lent at 12% p.a.
A) 8,000 B) 10,000 C) 12,000 D) 14,000
11. 10,000 is divided into two parts such that if one part is invested at 6% p.a. and the other at 5% p.a., the total annual interest is 540. What is the ratio of the first part to the second part?
A) 1 : 4 B) 2 : 3 C) 3 : 2 D) 4 : 1
12. A certain sum of money amounts to Rs.12,100 in 2 years and to Rs.14,300 in 4 years at simple interest. What is the sum?
A) Rs.9,000 B) Rs.9,900 C) Rs.10,000 D) Rs.11,000
13. A sum of money amounts to Rs.2,240 in 2 years and Rs.2,600 in 5 years at simple interest. Find the rate of interest per annum.
A) 5% B) 6% C) 8% D) 10%
14. A sum of 12,000 amounts to 13,320 in 1 year 10 months at simple interest. What is the rate of interest per annum?
A) 5% B) 6% C) 8% D) 7.5%
15. A sum of 25,000 was lent from 1st January 2023 to 15th March 2023 at a certain rate of simple interest. If the interest earned was 350, find the rate of interest per annum. (Assume February has 28 days)
A) 5% B) 7% C) 8% D) 10%
16. A man lent Rs.10,000 to A for 3 years and Rs.15,000 to B for 4 years at the same rate of simple interest. If he received a total interest of Rs.4,500 from both, find the rate of interest per annum.
A) 4% B) 5% C) 6% D) 8%
17. Rs.6,000 is lent for 2 years and Rs.3,000 is lent for 4 years at the same rate of 6% p.a. simple interest. What is the total interest earned from both investments?
A) Rs.1,200 B) Rs.1,440 C) Rs.1,560 D) Rs.1,600
18. The simple interest on a certain sum of money at 12% per annum for 3 years and 5 years differs by Rs.1,080. Find the sum?
A) Rs.4,000 B) Rs.4,500 C) Rs.5,000 D) Rs.5,400

Scan the QR code for Key

These model questions were prepared by subject experts


జబల్‌పుర్‌లోని నర్మదా నదిలో మునిగిపోయిన పడవను బయటకు తీస్తున్న సహాయక సిబ్బంది

మధ్యప్రదేశ్ పడవ బోల్తా ఘటనలో తొమ్మిదికి చేరిన మృతులు

జబల్‌పుర్: మధ్యప్రదేశ్ జబల్‌పుర్ జిల్లాలో నర్మదా నదిపై ఉన్న బర్గీ జలాశయంలో పడవ బోల్తా పడిన ఘటనలో శుక్రవారం మరో ఐదు మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరుకుంది. మొత్తం 28 మందిని రక్షించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, గల్లంతైన మరో ఆరుగురి కోసం గాలింపు జరుగుతోందని అధికారులు తెలిపారు. ప్రయాణ సమయంలో సిబ్బంది ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించలేదని కొందరు బాధితులు ఆరోపించారు. లైఫ్ జాకెట్లు ముందే ఇవ్వకుండా పడవ మునిగిపోతున్న సమయంలో అందించారని వాపోయారు.

మరణంలోనూ ఆ తల్లి పోరాటం..

ఈ ప్రమాదంలో ఓ తల్లి తన బిడ్డను కాపాడుకునే ప్రయత్నంలో ఇద్దరూ మరణించిన తీరు అందరికీ కన్నీళ్లు తెప్పిస్తోంది. మృత్యువు సమీపిస్తున్నా.. కుమారుడిని రక్షించుకునేందుకు ఆ తల్లి చివరి క్షణం వరకూ పోరాడినట్లు తెలుస్తోంది. ఈ ప్రయత్నంలో బోల్తాపడ్డ పడవ కింద వారిద్దరూ ఇరుక్కుపోయారు. లైఫ్ జాకెట్ ధరించిన ఆ తల్లి.. బిడ్డను అలాగే పొదివిపట్టుకొని ప్రాణాలు వదిలింది. ఆ తల్లి చేతుల్లోనే నాలుగేళ్ల చిన్నారి ఊపిరి ఆగిపోయింది. నీళ్లలో బిడ్డను అలానే పట్టుకొని ప్రాణాలు వదిలిన తల్లీబిడ్డల మృతదేహాలు లభ్యమైన తీరుచూసి అక్కడున్న వారు చలించిపోయారు.

బ్రిట్నీ స్పియర్స్‌పై ఛార్జిషీట్



లాస్ ఏంజెలెస్: అమెరికా పాప్ గాయని బ్రిట్నీ స్పియర్స్‌పై మద్యం, మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించి ఛార్జిషీట్ నమోదు చేసినట్లు కాలిఫోర్నియాలోని వెంచూరా కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం గురువారం తెలిపింది. అయితే ఆమె ఏ మద్యం తాగారు.. ఎంత మోతాదులో డ్రగ్స్ తీసుకున్నారు అనే వివరాలు అందులో పేర్కొనలేదు. బ్రిట్నీ స్పియర్స్ కాలిఫోర్నియాలోని తన ఇంటి సమీపంలో మార్చి 4న బీఎండబ్ల్యూ కారును వేగంగా, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండటంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మద్యం, మాదకద్రవ్యాలు తీసుకుని ఆమె వాహనం నడుపుతున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం ఆమె బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ విషయంలో పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి మార్చి 25న నివేదిక సమర్పించారు. కోర్టులో ఈ కేసు విచారణ సోమవారం జరగనుందని అధికారులు తెలిపారు.

సీఎం మద్యం తాగి వచ్చారు

- పంజాబ్ అసెంబ్లీలో విపక్షాల ఆరోపణ
- విశ్వాస తీర్మానం నెగ్గిన పంజాబ్ సర్కార్



చండీగఢ్: పంజాబ్ శాసనసభలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం శుక్రవారం విశ్వాస పరీక్షలో నెగ్గింది. పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఇటీవల భాజపాలోకి చేరిన నేపథ్యంలో తమ ప్రభుత్వానికి అసెంబ్లీలో బలం ఉందని నిరూపించుకునేందుకు ఈ విశ్వాస తీర్మానాన్ని సీఎం సభలో ప్రవేశపెట్టారు. 117 సభ్యుల పంజాబ్ శాసనసభలో తీర్మానానికి అనుకూలంగా 94 మంది ఓటు వేశారు. "45 నుంచి 65 మంది ఎమ్మెల్యేలు మా పార్టీని వీడుతున్నారన్న వదంతులకు ఈ రోజుతో ముగింపు పలికాం" అని తీర్మానం నెగ్గిన అనంతరం మాన్ పేర్కొన్నారు. అంతకుముందు విశ్వాస తీర్మానంపై వాడి వేడిగా చర్చ జరిగింది. సీఎం భగవంత్ మాన్ మద్యం తాగి శాసనసభలోకి వచ్చారని విపక్షాలు ఆరోపించాయి. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాలని డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌ను స్పీకర్ తిరస్కరించడంతో కాంగ్రెస్ సభ నుంచి వాకౌట్ చేసింది.

పెట్రోలు కోసం క్యూలో శవం

మహరాజ్‌గంజ్ (యూపీ): పెట్రోలు కోసం శవం క్యూలో నిలవడమేమిటని ఆశ్చర్యపోతున్నారా? ఇరాన్ యుద్ధం పుణ్యమా అని ఉత్తరాదిలో తలెత్తిన తీవ్ర ఇంధన కొరత ఇలాంటి పరిస్థితినే సృష్టించింది. శవాన్ని తీసుకెళ్తున్న ఓ వాహనం పెట్రోల్ బంకు వద్ద రెండు గంటల పాటు క్యూలో నిలిచినా ఇంధనం దొరకని సంఘటనకు సంబంధించిన వైరల్ వీడియో ఒకటి పరిస్థితికి అద్దం పట్టింది. "శవాలూ గంటల కొద్దీ క్యూలో నిలబడాల్సిన దౌర్భాగ్యం వచ్చిపడింది కదా" అంటూ ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్య ఈ వీడియోలో హైలైట్. నిచ్లౌల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిదావే గ్రామానికి చెందిన సర్వేశ్ ఆసోధన్ అనే వ్యక్తి బుధవారం మరణించాడు. అతని శవాన్ని కుటుంబ సభ్యులు ఒక వాహనంలో శ్మశానానికి తరలిస్తుండగా వాహనంలో ఇంధనం అయిపోయింది. దీంతో డ్రైవర్ వాహనాన్ని పెట్రోల్ బంకు వద్ద నిలిపాడు. అక్కడ రద్దీ అధికంగా ఉండటంతో వాహనం రెండు గంటల పాటు క్యూలోనే నిలవాల్సి వచ్చింది. ఇంతా చేసి చివరికి స్టాక్ అయిపోయిందంటూ పెట్రోల్ బంకు మూసివేయడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలకు దారితీసింది.

దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు.. నలుగురి మృతి

టైర్ (లెబనాన్): దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ శుక్రవారం వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో నలుగురు మృతిచెందారు. మరోవైపు- ఉత్తర ఇజ్రాయెల్‌పై తాము రాకెట్లు, డ్రోన్లు ప్రయోగించామని హెజ్‌బొల్లా తెలిపింది. తమ దాడుల్లో ఇద్దరు ఇజ్రాయెలీ సైనికులు గాయపడ్డారని పేర్కొంది.

అక్రమార్కులపై పదునెక్కిన ఈడీ కొరడా

- ప్రధాని మోదీ జమానాలో దర్యాప్తు సంస్థ పరుగులు
- జప్తులు, అరెస్టులు, కేసుల నమోదులో భారీ పెరుగుదల


ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈడీ డైరెక్టర్ రాహుల్ నవీన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ

ఈనాడు, దిల్లీ: ఊసరవెల్లిలా రంగులు మారుస్తోన్న ఆర్థిక నేరగాళ్లను కట్టడి చేయడంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా సైబర్ మోసాలపై నిఘాను ఈ దర్యాప్తు సంస్థ తీవ్రతరం చేసింది. సంస్థ 70 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విడుదల చేసిన 2025-26 వార్షిక నివేదికలోని గణాంకాలు పలు ఆసక్తికరమైన విశేషాలను వెల్లడించింది. ప్రధాని మోదీ పాలనలో ఈడీ పనితీరులో చురుకుదనం, కరకుదనం విస్పష్టమవుతోంది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పాలనా కాలంతో పోలిస్తే మోదీ పాలనలోని మొదటి పదేళ్లలో ఎఫ్ఐఆర్ (ఈసీఐఆర్) నమోదులు, అరెస్టులు, జప్తులు, ఛార్జిషీట్ల దాఖలు, దోషులకు శిక్షలు గణనీయంగా పెరిగాయని తెలుస్తోంది.

- గత యూపీఏ పాలన(2005-14)తో పోలిస్తే ప్రధాని మోదీ హయాం(2014-24)లో ఏడాదికి సగటున కేసుల నమోదు 144%, జప్తులు 494%, జప్తుచేసిన ఆస్తుల విలువ 1977%, అరెస్టులు 3,900%, ఛార్జిషీట్ల దాఖలు 1,366%, అనుబంధ ఛార్జిషీట్ల దాఖలు 1,800%, సోదాలు 7,900% పెరిగాయి.
- నేర నిరూపణ జరిగి శిక్షలు పడిన వ్యక్తుల సంఖ్య మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద జప్తు మొత్తం గత యూపీఏ పాలనలో జీరోకి పరిమితం కాగా, మోదీ హయాంలో అది గణనీయంగా పెరిగింది.
- ఆర్థిక మోసాలకు గురైన బాధితులకు గతంలో పైసా కూడా తిరిగి చెల్లించలేదు. ప్రధాని మోదీ పాలనలో ఇప్పటి వరకూ రూ.63వేల కోట్లు చెల్లించారు.
- సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్దిష్ట గడువులోగా దర్యాప్తు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈడీ వెల్లడించింది. అన్ని కొలమానాల్లోనూ 2024-25, 2025-26లో గరిష్ఠ పనితీరును కనబరిచినట్లు పేర్కొంది.
- 2024-25తో పోలిస్తే 2025-26లో కేసుల నమోదు సంఖ్య 39% పెరిగింది.
- గత రెండేళ్లలో సగటున 900 కేసులు నమోదయ్యాయని, 2014-15 నుంచి 2023-24 మధ్య పదేళ్లతో పోలిస్తే ఈ సంఖ్య దాదాపు రెట్టింపు అని తెలిపింది.
- ఇదే సమయంలో ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు సగటున 600 దాఖలు చేశామని, అంతముందు పదేళ్లలో యేటా సగటున దాఖలైన 130తో పోలిస్తే ఇది నాలుగురెట్లు అధికమని ఈడీ వెల్లడించింది.
- ప్రస్తుతం కేసుల దర్యాప్తులో డేటా అనలిటిక్స్, అడ్వాన్స్‌డ్ సైబర్ ఫోరెన్సిక్ టూల్స్ ఉపయోగిస్తున్నట్లు ఈడీ వెల్లడించింది.
- సోదాలతో పాటు, వివిధ డేటాబేస్‌ల నుంచి వచ్చే ఆర్థిక నిఘా సమాచారాన్ని, కార్పొరేట్, వ్యక్తిగత ఆస్తుల రికార్డులను రియల్‌టైమ్‌లో విశ్లేషించడం వల్ల ఆధారాలు సంపాదించడం సులభమవుతోందని పేర్కొంది.
- ఈడీ కేసుల్లో శిక్షల శాతం 94% దాకా ఉందని, ప్రస్తుతం ట్రయల్ కోర్టుల ముందు పెండింగ్‌లో ఉన్న 2,400 కేసుల్లో నిందితులందరికీ శిక్షపడుతుందని బలంగా విశ్వసిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రాహుల్ నవీన్ పేర్కొన్నారు.

లావుగా కనిపిస్తా.. అందుకే బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించను

- ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఇంటర్నెట్ డెస్క్: బహిరంగ కార్యక్రమాల్లో తాను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ జాకెట్ వేసుకుంటే లావుగా కనిపిస్తానని, అందుకే దాన్ని ధరించేందుకు ఇష్టపడనని పేర్కొన్నారు. "బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకుంటే 20 పౌండ్లు బరువు పెరిగినట్లు కనిపిస్తా. అది నాకు ఇష్టం ఉండదు" అని ఓవల్ కార్యాలయంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానమిచ్చారు. అయితే రక్షణ కోసం కొన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం ముఖ్యమేనని ఆయన పేర్కొన్నారు. ట్రంప్‌పై గతంలో రెండుసార్లు హత్యా యత్నాలు జరిగాయి. ఇటీవల ఆయన పాల్గొన్న వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కూడా కాల్పులు చోటుచేసుకొన్నాయి. ఈ నేపథ్యంలో.. ఆయన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.


భారత్-పాక్ ఉద్రిక్తతలపై మళ్లీ ట్రంప్ పాత పాట

భారత్-పాకిస్థాన్ మధ్య నిరుడు తలెత్తిన ఉద్రిక్తతలను తానే పరిష్కరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చెప్పుకొన్నారు. సుంకాలను ఆయుధంగా ఉపయోగించి.. వాటి మధ్య యుద్ధాన్ని ఆపానని పేర్కొన్నారు. ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన పదవీకాలంలో ఇప్పటికే 8 యుద్ధాలను ఆపానని మరోసారి తెలిపారు. భారత్-పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల్లో 11 విమానాలు కూలిపోయాయని వ్యాఖ్యానించారు.

ఇరాన్‌లో 2 నెలల్లో 42 వేల మంది హత్య!

ఇరాన్‌లో పరిస్థితులపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ దేశంలో గత రెండు నెలల్లో 42 వేల మందిని హత్య చేశారని ఆరోపించారు. 8 మంది మహిళలను ఉరి తీసేందుకు టెహ్రాన్ సిద్ధమవుతోందని, అలా చేయొద్దని తాను ఫోన్ చేసి చెప్పానని పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులను యుద్ధంగా కాకుండా, సైనిక చర్యగా ట్రంప్ వ్యాఖ్యానించారు.

- ఇటలీ, స్పెయిన్ నుంచి తమ బలగాలను ఉపసంహరించుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌తో యుద్ధం వేళ ఈ రెండు దేశాల వైఖరి చాలా దారుణంగా ఉందంటూ మండిపడ్డారు.

స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలు భద్రమేనా..?

పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన ఈవీఎంల చుట్టూ రాజకీయం తిరుగుతోంది. స్ట్రాంగ్ రూంల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ప్రయత్నం జరుగుతోందన్నది పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపణ! ఎన్నిక సంఘం అధికారులు మాత్రం తాము నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నామని చెబుతున్నారు. అసలు స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలు భద్రమేనా? వాటిని తారుమారు చేయొచ్చా? నిబంధనలేం చెబుతున్నాయంటే...



ఒకటే ద్వారం

- స్ట్రాంగ్ రూంకు కేవలం ఒకే ఒక ప్రవేశ, నిష్క్రమణ ద్వారం ఉంటుంది. ఆ గదిలోని కిటికీలు, వెంటిలేటర్లు, ఇతర తలుపులను ఇటుకలు లేదా కాంక్రీటుతో మూసివేసి సీల్ చేస్తారు.
- ప్రధాన ద్వారానికి రెండు తాళాలు వేయాలి. ఓ తాళం రిటర్నింగ్ ఆఫీసర్ దగ్గర, రెండోది అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వద్ద ఉంటుంది.
- స్ట్రాంగ్ రూం వెలుపల 24 గంటల పాటు నిరంతరాయంగా పనిచేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.
- కెమెరాల ద్వారా వస్తున్న దృశ్యాలను బయట ఉన్న అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు ఓ స్క్రీన్ ద్వారా ఎప్పుడైనా చూసే అవకాశం కల్పించాలి.
- విద్యుత్ సరఫరా ఆగిపోకుండా ఇన్వర్టర్లు/ జనరేటర్ల సౌకర్యం ఉండాలి.

మూడంచెల భద్రత

లోపలి వలయం: స్ట్రాంగ్ రూం తలుపు వద్ద నేరుగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు 24 గంటలు పహారా కాస్తాయి.

మధ్య వలయం: రాష్ట్ర సాయుధ పోలీసులు కాపలాగా ఉంటారు.

బాహ్య వలయం: ఇక్కడి భద్రతను జిల్లా స్థానిక పోలీసులు పర్యవేక్షిస్తారు.

లాగ్‌బుక్‌లో నమోదు తప్పనిసరి

స్ట్రాంగ్ రూం ప్రాంగణంలోకి ఎవరు వచ్చినా, వెళ్లినా వారి పేరు, సమయం, కారణాన్ని లాగ్‌బుక్‌లో నమోదు చేయాలి. రిటర్నింగ్ ఆఫీసర్ రోజుకు రెండుసార్లు వచ్చి భద్రతను తనిఖీ చేసి, ఆ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపాలి.

అభ్యర్థులకూ భాగస్వామ్యం

ఈవీఎంలను లోపల పెట్టి సీల్ చేసే సమయంలో అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు ఉండొచ్చు. వారు కూడా ఈవీఎంలకు తమ సొంత సీళ్లను వేసుకునేందుకు అనుమతి ఉంటుంది.

- స్ట్రాంగ్ రూమ్ బయట అభ్యర్థులు.. తమ ప్రతినిధులను కాపలాగా పెట్టుకోవచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

తైవాన్‌పై సరైన నిర్ణయం తీసుకోండి

- అమెరికాకు చైనా సూచన

తైపే: చైనా, అమెరికా విదేశాంగ మంత్రుల మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణపై తైవాన్ ప్రభుత్వం శుక్రవారం ఆందోళన వ్యక్తం చేసింది. తమ సంబంధాలకు స్వయంపాలిత తైవాన్ అతిపెద్ద ముప్పు అని బీజింగ్ ఆ చర్చల సందర్భంగా అమెరికాకు స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో ఫోన్‌లో మాట్లాడిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఇరు దేశాల మధ్య సంబంధాల స్థిరత్వాన్ని కాపాడేందుకు తైవాన్ విషయంలో అమెరికా సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. చైనా విదేశాంగ శాఖ ఈ విషయాన్ని తెలుపుతూ వెలువరించిన ప్రకటనపై తైవాన్ స్పందించింది. 'తైవాన్ అంశంపై చైనా మరోసారి ఏకపక్షంగా బెదిరింపు వ్యాఖ్యలు చేస్తూ విడుదల చేసిన పత్రికా ప్రకటనపై ఆందోళన చెందుతున్నాం' అని తైవాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. స్వయంపాలిత తైవాన్‌ను తన నుంచి విడిపోయిన రాష్ట్రంగా చైనా పరిగణిస్తోంది. అవసరమైతే బలప్రయోగం ద్వారానైనా దానిని కబళించాలని చూస్తోంది.



సూరీడు సుర్రుమనని స్కూటీ!

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో పనిచేస్తున్న ఇంజినీరు పంకజ్ స్కూటీ ఇది. నగరంలో ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు చేరిన నేపథ్యంలో కేవలం రూ.1,500 ఖర్చుతో వాహనంపై ఇలా ప్రత్యేక ఏర్పాటు చేసుకున్నారు. పీవీసీ పైపులు, ఎల్బోలు, నట్లులను ఉపయోగించారు. పైకప్పులో పైన అమర్చిన వాటర్‌ప్రూఫ్ షీటు తీవ్రమైన ఎండ నుంచి రక్షణ కల్పిస్తుండగా, లోపలి ఫ్యాబ్రిక్ షీటు పైకప్పు నుంచి వెలువడే వేడిని తగ్గించడానికి ఉపయోగపడుతోంది.

చీకటి పడితే.. ఇకపై కట్టెల మంటలకు చెల్లు



దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా.. చీకటి పడితే ఆ గ్రామానికి కిరోసిన్ దీపాలు, కట్టెల మంటలే దిక్కయ్యేవి. గ్రామస్థురాలైన సోనీ బాయి మాటల్లో చెప్పాలంటే.. చీకట్లోనే కొన్ని తరాలు గడిచిపోయాయి. ఛత్తీస్‌గఢ్‌లోని ఖైరాగఢ్ జిల్లా సత్వీవారా అటవీప్రాంతంలో ఉన్న గ్వాలముండీ గ్రామానికి ఎట్టకేలకు విద్యుత్తు వెలుగులు వచ్చాయి. గ్రామంలో తొలిసారి బల్బు వెలగడంతో స్థానిక బైగా గిరిజనుల ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ గ్రామానికి సమీపంలోనే మధ్యప్రదేశ్ సరిహద్దు ఉంది. అటువైపు గ్రామాలకు చాలాకాలం క్రితమే విద్యుత్తు అందుబాటులోకి వచ్చింది. గ్వాలముండీ గ్రామస్థుల నిరీక్షణ ఇన్నేళ్లకు ఫలించింది. మూడు రాష్ట్రాల సరిహద్దులకు కూడలిగా ఉన్న ఈ ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టుల అడ్డా. కేంద్ర ప్రభుత్వ చొరవతో నక్సలిజం నుంచి విముక్తి పొందాక ఇప్పుడిప్పుడే అభివృద్ధి అడుగులు పడుతున్నాయి.

అంతరిక్ష కేంద్ర విస్తరణకు డ్రాగన్ యోచన

బీజింగ్: భూకక్ష్యలోని తన అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్‌ను విస్తరించుకోవాలని చైనా భావిస్తోంది. ప్రస్తుత పరిమాణంతో పోలిస్తే దీన్ని రెట్టింపు కన్నా ఎక్కువకు పెంచాలని భావిస్తోంది. రోదసిలో ఉన్న మరో అంతరిక్ష కేంద్రం ఐఎస్ఎస్‌ను 2031 నాటికి దశలవారీగా ఉపసంహరించాలని నాసా భావిస్తున్న తరుణంలో చైనా ఈ ఆలోచన చేస్తోంది.

ప్రస్తుతం భూకక్ష్యలో ఈ రెండు అంతరిక్ష కేంద్రాలే ఉన్నాయి. ఐఎస్ఎస్.. రోదసిలోనే అతిపెద్ద మానవ నిర్మిత కేంద్రంగా ఉంది. ఇందులో అమెరికా, రష్యా, ఐరోపా, జపాన్, కెనడాలు భాగస్వాములు. 2031లో దీనికి వీడ్కోలు పలికితే.. రోదసిలో తియాంగాంగ్ మాత్రమే ఏకైక అంతరిక్ష కేంద్రంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రోదసిలో తన సత్తాను పెంచుకునేందుకు తియాంగాంగ్‌ను భారీగా విస్తరించేందుకు చైనా సిద్ధమైంది. పెరుగుతున్న శాస్త్రీయ అవసరాలు, అంతర్జాతీయ సహకారం కోసం అంతరిక్ష కేంద్రాన్ని భారీగా మలచాలని చైనా సన్నాహాలు మొదలుపెట్టినట్లు స్థానిక మీడియా పేర్కొంది. తియాంగాంగ్‌లో తొలుత నాలుగో మాడ్యూల్‌ను అమర్చనున్నట్లు సమాచారం. అంతరిక్ష కేంద్రంలో కమాండింగ్ సెంటర్ అయిన తియాన్‌హే కోర్‌కు దీనిని అమర్చనున్నారు. దీంతో 'టీ' ఆకారంలో ఉన్న అంతరిక్ష కేంద్రం శిలువ (క్రాస్) ఆకారంలోకి మారనుంది. కొత్త మాడ్యూల్‌లో రెండు ల్యాబ్ యూనిట్లు సహా పలు డాకింగ్ పోర్టులుంటాయి. ఇది ఆరు మాడ్యూళ్లతో కూడిన పూర్తిస్థాయి నిర్మాణానికి మార్గం సుగమం చేస్తుంది. అంతిమంగా ఇది 180 టన్నుల బరువును కలిగి ఉంటుంది. ఈ విస్తరణ ఎప్పటికల్లా పూర్తవుతుందన్నది వెల్లడికాలేదు. తియాంగాంగ్ 2022లో సిద్ధమైంది. అప్పటినుంచి ఇక్కడ 280 శాస్త్రీయ ప్రయోగాలు, 28కు పైగా స్పేస్ వాక్‌లు జరిగాయి.


మేడే సందర్భంగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

డిజిటల్ సాంకేతికతతో సత్వర న్యాయం: సీజేఐ



గ్యాంగ్‌టక్: న్యాయ సాధన ప్రక్రియలకు సాంకేతికతను జోడించడం వల్ల భౌగోళిక దూరాభారాలు, న్యాయం కోసం అధికంగా డబ్బు వెచ్చించాల్సిన అగత్యం తొలగిపోతాయని, సత్వరం న్యాయం సిద్ధిస్తుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ శుక్రవారం తెలిపారు. 'సాంకేతికత - న్యాయ విద్య'పై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో సీజేఐ ప్రసంగించారు. కేసుల కాగితపు రికార్డులు కోర్టుల స్టోర్‌రూమ్‌లలో మగ్గిపోయే దశ నుంచి శక్తిమంతమైన డిజిటల్ వ్యవస్థకు మారుతున్నామని వివరించారు. ఒకప్పుడు కోర్టుకు వెళ్లడమంటే సహనానికి పరీక్షగా ఉండేదని సీజేఐ గుర్తుచేశారు. "హిమాలయ పర్వతాలు ఎంత గంభీరంగా ఉంటాయో, అక్కడ ప్రయాణం కూడా అంత నెమ్మదిగా, అనిశ్చితంగా ఉంటుంది. ఒక దశాబ్దం క్రితం సిక్కిం కక్షిదారుడు న్యాయం కోసం కోర్టుకు వెళ్లాలంటే ఇరుకైన కొండదారుల్లో ప్రతికూల వాతావరణంలో రోజుల తరబడి ప్రయాణించవలసి వచ్చేది. డిజిటల్ సాంకేతికత ఈ అడ్డంకులను తొలగిస్తోంది" అని ఆయన అన్నారు. న్యాయస్థానాలలో ఈ-సేవా కేంద్రాల విస్తరణ కూడా జరగాలని సీజేఐ అన్నారు. ఈ కార్యక్రమంలో సీషెల్స్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రోనీ జేమ్స్ గోవిందన్, శ్రీలంక సుప్రీం కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ దిలీప్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

2048లోపు ధనిక దేశాల్లో సర్వైకల్ క్యాన్సర్ మాయం




దిల్లీ: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)ను 2048లోపు అధికాదాయ దేశాలు పూర్తిగా నిర్మూలిస్తాయని ఓ అధ్యయనం అంచనావేసింది. పేద, మధ్య ఆదాయ దేశాలు (ఎల్ఎంఐసీ) ఈ క్యాన్సర్‌ను అరికట్టడానికి మరో దశాబ్దం పడుతుందని వెల్లడించింది. ఫలితంగా ప్రాంతాల మధ్య అంతరాలు భారీగా పెరుగుతాయని, మధ్య ఆదాయ దేశాల్లోని మహిళలు అత్యధికంగా ఈ వ్యాధి బారిన పడతారని పేర్కొంది. కెనడాలోని సీహెచ్‌యూ డీ-క్యూబెక్ విశ్వవిద్యాలయంలోని లావల్ పరిశోధన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు జరిపిన ఈ అధ్యయనాన్ని తాజాగా 'ద లాన్సెట్' జర్నల్ ప్రచురించింది. దాదాపుగా అన్ని రకాల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు (99%) హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) కారణంగా సోకుతున్నవేనని, హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో ఈ క్యాన్సర్‌ను నివారించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గతంలోనే తెలిపింది. 2030లోగా 15 ఏళ్లలోపు చిన్నారులకు 90% హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అందించాలని, 35-45 ఏళ్ల మధ్యలోని మహిళలకు 70% స్క్రీనింగ్ నిర్వహించాలని, క్యాన్సర్ లక్షణాలతో లేదా క్యాన్సర్ ఉన్న మహిళకు 90% చికిత్స అందించాలని '90-70-90' ప్రాతిపదికన ప్రతిదేశానికి డబ్ల్యూహెచ్‌వో లక్ష్యాలను విధించింది. వీటిని సాధించగలిగితే రాబోయే దశాబ్ద కాలంలో 3.7కోట్ల మంది మహిళలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడకుండా కాపాడవచ్చు. చాలా వరకు మధ్య ఆదాయ దేశాలు క్యాన్సర్ నిర్మూలనపై ఎక్కువ ఖర్చు చేయకపోవడంతో లక్ష్యాలను చేరుకోవడం ఆలస్యమవుతుందని అధ్యయనం పేర్కొంది.



దేశంలోనే అడ్డంకులు లేని తొలి టోల్ ప్లాజా

- గుజరాత్‌లో ప్రారంభం

దిల్లీ: టోల్ గేట్ల వద్ద రహదారి సుంకం కట్టడానికి వాహనదారులు బారులు తీరాల్సిన అగత్యాన్ని ఫాస్టాగ్ తొలగించింది. అయినా టోల్ ప్లాజాలలో ఇనుప రాడ్ల వంటి అడ్డంకులు కొనసాగుతున్నాయి. ఫాస్టాగ్ ద్వారా సుంకం చెల్లించిన తరవాతే ఆ కమ్మీలు పైకి లేస్తాయి. ఇలాంటి అడ్డంకులేవీ లేకుండా పలు వరుసల్లో వాహనాలు వేగంగా సాగిపోయే వసతిని దేశంలో మొట్టమొదటిసారి గుజరాత్‌లోని 48వ నంబరు జాతీయ రహదారిపై అందుబాటులోకి తెచ్చారు. సూరత్-భరూచ్ సెక్షన్‌లోని చోరయాసి టోల్ ప్లాజాను దేశంలో తొలి బహుళ వరుసల బ్యారియర్ లెస్ టోల్ ప్లాజాగా తీర్చిదిద్దినట్లు కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీ తన సోషల్ మీడియా పోస్టులో శుక్రవారం ప్రకటించారు. ఫాస్టాగ్‌కు తోడు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏ.ఎన్.పి.ఆర్) పద్ధతిని ఉపయోగించడం వల్ల వాహనదారులు టోల్ గేట్ వద్ద ఆగకుండానే ముందుకు సాగవచ్చు. వారి ఫాస్టాగ్ వ్యాలెట్ నుంచి సుంకం చెల్లింపు తనంత తానే జరిగిపోతుంది.


బుద్ధ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో పుణ్య స్నానానికి తరలివచ్చిన భక్తులతో నిండిపోయిన గంగానది

కార్మికులకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం

మే డే సందర్భంగా సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: కార్మికుల కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కార్మిక, కర్షక సంక్షేమం కోసం అనునిత్యం ప్రణాళికాబద్ధంగా ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. 'ఎక్స్' వేదికగా శుక్రవారం కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'వృత్తి ఏదైనా శ్రమించే ప్రతి మనిషికీ సమాన గౌరవం ఇవ్వడం మన కర్తవ్యం. అహర్నిశలూ శ్రమించే శ్రామికవర్గ హక్కులను గుర్తించే దినోత్సవమిది. దేశ ఆర్థిక పురోగతికి వెన్నెముకైన వ్యవసాయం ముందుకు వెళుతుందంటే రైతులు, రైతు కూలీల శ్రమశక్తే కారణం. వీరితో కలిసి నడిస్తేనే దేశం ప్రగతిపథంలో ముందుకు వెళుతుంది' అని వివరించారు.

కార్మికుల భద్రత, సంక్షేమమే ముఖ్యం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'దేశ ప్రగతిని ముందుకు నడిపించే కార్మికుల భద్రత, సంక్షేమానికి కృషి చేస్తామని 'ఎక్స్‌లో' ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వారికి మేడే శుభాకాంక్షలు తెలిపారు. 'పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టే అభివృద్ధి పనుల్లో శ్రమ చేసేవారిని కూలీలు అనకుండా.. ఉపాధి హామీ శ్రామికులుగా పిలవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా.. పరిహారం మొత్తాన్ని పెంచే చర్యలు చేపట్టింది' అని వివరించారు.

శ్రామికుడు లేనిదే ప్రపంచం లేదు: లోకేశ్

ఈనాడు, అమరావతి: కార్మికుల్ని గౌరవంగా జీవించేలా చేయడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. 'సమాజ ప్రగతిలో శ్రమజీవులది ముఖ్యపాత్ర. శ్రామికుడు లేనిదే ప్రపంచం లేదు. వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం' అని వెల్లడించారు.

- అభివృద్ధి వెలుగులకు జీవం పోసే కనిపించని హీరోలు శ్రామికులని.. వారికి మే డే శుభాకాంక్షలని మాజీ సీఎం జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. మరో ప్రకటనలో ప్రజలకు బుద్ధపూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు.
- పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ-సీతంపేట ఘాట్ రోడ్ వద్ద ఆటో లోయలో పడి నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మంత్రి లోకేశ్ ప్రణాళికలు ప్రశంసనీయం

- పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. "గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత 4% పైగా మెరుగుపడడం సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకువస్తున్న సంస్కరణలకు నిదర్శనం. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ అమలుచేస్తున్న ప్రణాళికలు ప్రశంసనీయం. మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, పరీక్షలకు ముందు తీసుకువచ్చిన వంద రోజుల ప్రణాళిక అద్భుత ఫలితాలకు దోహదపడ్డాయి. ముఖ్యంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో గత ఏడాది 72.8% ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 78.39%కి పెరిగింది" అని వెల్లడించారు. ఈ అద్భుత విజయం వెనుక ఉన్న ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.

పవనన్నా ఇది మనందరి విజయం: లోకేశ్

పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా అభినందించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. "పవనన్నా ఇది మనందరి విజయం. టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ సమష్టి కృషితో ఇది సాధ్యమైంది" అని లోకేశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

సమష్టి కృషితో పదోతరగతిలో సత్ఫలితాలు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: సమష్టి కృషితో పదోతరగతిలో సత్ఫలితాలు వచ్చాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ శుక్రవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. 'ఈ ఫలితాలు విద్యారంగంలో సానుకూల పరిణామానికి నిదర్శనం. విద్యాశాఖ మంత్రి లోకేశ్ నేతృత్వంలో అమలుచేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, విద్యా ప్రమాణాల పెంపునకు చేపట్టిన చర్యలు ఈ ఫలితాల్లో ప్రతిఫలించాయి' అన్నారు.

వాట్సప్‌లో ఏపీ మెడికల్ కౌన్సిల్ సేవలు

'మనమిత్ర' ద్వారా అందుబాటులోకి..

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ పౌరసేవా వ్యవస్థ 'మనమిత్ర' వాట్సప్ నంబర్ 9552300009 ద్వారా ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ (ఏఎంసీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. వాట్సప్‌లో 'హాయ్' అని మెసేజ్ చేస్తే పౌరసేవల మెనూ తెరుచుకుంటుంది. అందులో 'ఆరోగ్య శాఖ'లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు, రక్త లభ్యత స్థితి, ఔషధాలు-శస్త్రచికిత్సల సామగ్రి లభ్యతతో పాటు ఏపీ మెడికల్ కౌన్సిల్ సేవలూ ఉంటాయి. ఏఎంసీ సేవలు ఎంచుకుంటే 'డాక్టర్ నమోదు వివరాలు, రాబోయే సీఎంఈ కార్యక్రమాలు, సీఎంఈ క్రెడిట్ పాయింట్ల స్థితి, డాక్టర్ దరఖాస్తు స్థితి తనిఖీ చేయడం, దరఖాస్తు స్థితి పొందడం, సేవకు అవసరమైన పత్రాలు' ఆప్షన్లు వస్తాయి. వైద్యులు సెల్‌ఫోన్ నుంచి అవసరమైన ఆప్షన్ల ఎంచుకుని సేవలు పొందే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది.

పోలవరం పనుల వేగాన్ని మరింత పెంచాలి

- డీజిల్ కొరతను తీర్చేందుకు సహకరిస్తాం
- కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు

ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టులో మరిన్ని యంత్ర పరికరాలను సమీకరించాలి. పనులతో పాటు భూసేకరణ, పునరావాస కార్యక్రమాల వేగాన్ని పెంచాలి. పనులు వేగంగా చేస్తేనే.. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం కేటాయించిన నిధులను తీసుకోవడానికి వీలవుతుంది. ఏప్రిల్ పనుల పురోగతిలో లక్ష్యాన్ని చేరుకోలేదు. యుద్ధప్రభావం మీదకు ఆ నెపం వేసేస్తున్నారు. దీనిని అధిగమించేందుకు ప్రయత్నించాలి. కేంద్రం నుంచి మావంతు సహకారం అందిస్తాం' అని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు అన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల తీరుపై శుక్రవారం దిల్లీలోని తన కార్యాలయంలో సమీక్షించారు. ప్రాజెక్టు పురోగతిని పరిశీలించి సమగ్ర నివేదికలు ఇస్తుండాలని గత సమావేశంలో ఆయన వ్యాప్కోస్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వ్యాప్కోస్ నివేదికను సమర్పించింది. ఏప్రిల్‌లో లక్ష్యం మేరకు పురోగతి సాధించలేకపోయినట్లు పేర్కొంది. మరిన్ని యంత్ర పరికరాలను సమీకరించుకోవాలని సూచించింది. ఈ అంశంపై కాంతారావు ప్రశ్నించగా.. పోలవరంలో అవసరమైన యంత్రపరికరాలు ఉన్నాయని, డీజిల్ కొరత వల్ల వాటిని వినియోగించుకోలేకపోయామని సీఈ సాయిప్రసాద్, జలవనరులశాఖ ఈఎన్సీ నరసింహమూర్తి వివరించారు. యుద్ధం వల్ల పేలుళ్లకు అవసరమైన మెటీరియల్ కొరత తలెత్తిందని చెప్పారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ, గనుల శాఖ అధికారులతో.. ఈ అంశంపై మాట్లాడి వెసులుబాటు కల్పించే అవకాశం ఉందేమో పరిశీలించాలని కాంతారావు.. తన కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఎప్పుడు తీసుకుంటారని ప్రశ్నించగా.. సెప్టెంబరులో తీసుకుంటామని ఈఎన్సీ చెప్పారు. భూసేకరణ, పునరావాసాలపై నమ్మకంతో ఈ మాట అన్నారు కదా అంటూ ఆయన సరదాగా చమత్కరించారు. ఈఎన్సీ మాటలను వీడియో రికార్డు చేయండి.. అంటూ నవ్వులు పూయించారు. అంతర్రాష్ట్ర అంశాల పరిష్కారానికి సంబంధిత రాష్ట్రాలతో మాట్లాడాలని కేంద్ర జల సంఘం ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్‌కు సూచించారు.

■ భూసేకరణ, పునరావాస ప్రణాళికను పునరావాస కమిషనర్ ప్రశాంతి సమర్పించారు. ఆ ప్రణాళికతో సంతృప్తి చెంది.. అందుకు అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. పునరావాసం పురోగతిని ట్రాక్‌చేయాలని వ్యాప్కోస్‌ను కాంతారావు ఆదేశించారు. సమావేశంలో జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం అథారిటీ సీఈవో సంజీవ్ ఓబ్రా, కార్యదర్శి రఘురామ్, సీఈ రమేష్‌కుమార్, కేంద్ర జలశక్తి కమిషనర్ ప్రవీణ్, వ్యాప్కోస్, సీఎస్ఎంఆర్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలిరోజే రూ.12.60 కోట్ల ఆస్తిపన్ను చెల్లింపు

- పంచాయతీల్లో ప్రకటించిన 5% రాయితీకి భారీ స్పందన



రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజకు రూ.1.11 కోట్ల ఆస్తి పన్ను బకాయిల చెక్కు అందిస్తున్న తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని అశ్విన్ ఉడ్ పేనల్స్ నిర్వాహకులు

ఈనాడు, అమరావతి: పంచాయతీల్లో ఆస్తిపన్నుపై ప్రభుత్వం ప్రకటించిన 5% రాయితీపై తొలిరోజు శుక్రవారం ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.12.66 కోట్లకు పైగా చెల్లించి రూ.4.39 లక్షల మేర రాయితీ వినియోగించుకున్నారు. ఆన్‌లైన్‌లో రూ.3 కోట్లకు పైగా చెల్లింపులు చేశారు. మిగిలిన మొత్తానికి పలు సంస్థలు డీడీలు, చెక్కులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజను తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి అందించారు. పంచాయతీల్లో ఆస్తి పన్ను చెల్లింపులపై రాష్ట్రంలో మొదటిసారి 5% రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మే 1 నుంచి 31 లోపు చెల్లించే వారందరికీ రాయితీ వర్తిస్తుందని వెల్లడించింది. ఈ మేరకు ప్రజలతో పాటు తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు తదితర ప్రాంతాల్లో పలు ప్రైవేట్ సంస్థలు ఆస్తిపన్ను చెల్లించి రాయితీ అందిపుచ్చుకున్నాయి. నెలాఖరులోగా ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి 5% రాయితీ వినియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ కోరారు.



పోషకాహారలేమితోనూ మధుమేహం

మధుమేహం కొన్ని సందర్భాల్లో పోషకాహారలేమితోనూ వస్తుంది. చిన్నతనంలో బలవర్ధకమైన ఆహారం తీసుకోకపోవడం.. ముఖ్యంగా తక్కువ ప్రొటీన్‌నే తీసుకోవడం పాంక్రియాస్ అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. ఇది దీర్ఘకాల జీవక్రియల సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి భవిష్యత్తులో మధుమేహ ముప్పు కలగకుండా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి.

– విగ్నీ మురళీ, ఫిట్‌నెస్ కోచ్

సీఆర్‌డీఏ పరిధిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు

- మంత్రుల కమిటీ సిఫార్సులు ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ

ఈనాడు, అమరావతి: రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) పరిధిలో వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులను పునఃపరిశీలించేందుకు ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ సిఫార్సులను ఆమోదిస్తూ పురపాలిక, పట్టణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఆర్‌డీఏ ప్రాంతంలోని వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులను పరిశీలించేందుకు ప్రభుత్వం మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. మంత్రుల బృందం ఏప్రిల్ 20న సమావేశమై గత కేటాయింపులను సమీక్షించింది. కొత్త ప్రతిపాదనలను పరిశీలించి, ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది. వీటిని ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 8.516 ఎకరాలకు సంబంధించి నాలుగు కొత్త దరఖాస్తులకు మంత్రుల బృందం ఆమోదం తెలిపింది.

కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థ సెబీకి నెలపాడు వద్ద 1.78 ఎకరాలు 60 ఏళ్లకు లీజు ప్రాతిపదికన కేటాయించారు. ఎకరానికి రూ.4 కోట్లుగా లీజు ప్రీమియం నిర్ణయించారు. ఈ సంస్థ 5 ఎకరాలు కావాలని అభ్యర్థించగా.. 1.78 ఎకరాలు లీజుకు కేటాయించారు.

- శ్రీస్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాలు కోరగా.. నెక్కల్లు వద్ద 4.235 ఎకరాలు 60 ఏళ్లకు లీజు విధానంలో కేటాయించారు. ఎకరానికి రూ.50 లక్షల చొప్పున లీజుకు కేటాయించారు.
- తెదేపా మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం నిర్మాణం కోసం నౌలూరు వద్ద 0.5 ఎకరాలు కేటాయించి నిర్మాణానికి అనుమతి ఇచ్చారు.
- రాయపూడి వద్ద మల్టీపర్పస్ ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు 2.001 ఎకరాలు కేటాయించారు. సీఆర్‌డీఏ వద్దనే భూమి యాజమాన్య హక్కులు ఉంటాయి.

కేటాయింపులకు సవరణ, పునరుద్ధరణ

- మందడంలో కినార గ్రూప్ ఆఫ్ హోటల్స్‌కు కేటాయించిన ఎకరానికి సంబంధించి ఆపరేటర్ బ్రాండ్‌ను 'కీస్ సెలెక్ట్' నుంచి 'అకార్ మెర్క్యూర్'కి మార్పు చేస్తూ ఆమోదం. ఎకరా ధర రూ.1.5 కోట్లు.
- అమరావతి ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అకాడమీ డీపీపీ పాఠశాల స్థలాన్ని నెక్కల్లు నుంచి అబ్బరాజుపాలెం గ్రామానికి మార్పు. ఈ సంస్థ ఐదెకరాలు కోరగా, మూడు ఎకరాలు కేటాయింపు. ఎకరా ధర రూ.50 లక్షలు.
- ఏపీ రాష్ట్ర సహకార బ్యాంకుకు రాయపూడిలో సర్వే నంబర్ల మార్పుతో 0.495 ఎకరాలు కేటాయింపునకు ఆమోదం. ఎకరా ధర రూ.2 కోట్లు.

కార్మిక సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

15 నగరాల్లో ఇంటిగ్రేటెడ్ లేబర్ ఎమినిటీస్ సెంటర్లు: మంత్రి వాసంశెట్టి



టీఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు దానును సత్కరిస్తున్న వాసంశెట్టి సుభాష్. చిత్రంలో గొట్టిముక్కల రఘురామరాజు, నక్కా ఆనంద్‌బాబు తదితరులు

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కార్మికులంతా కలిసి పనిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని, టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. 'కార్మికుడు బలపడితే రాష్ట్రం బలపడుతుందనే లక్ష్యంతో సంక్షేమం, నైపుణ్యం, ఉపాధి, ఆరోగ్యం, గౌరవం అనే ఐదు స్తంభాలపై కార్మికరంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. వివాహ కానుక, ప్రసూతి సాయం, సహజ మరణాల సాయం, అంత్యక్రియల ఖర్చులు లాంటి పథకాలను ప్రభుత్వం పునఃప్రారంభించి భరోసా ఇచ్చింది. నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేకదృష్టి పెట్టి.. వేల మంది కార్మికులకు ఆధునిక సాంకేతిక శిక్షణ ఇస్తూ, వారి కుటుంబాలకు ఉపాధి చూపుతోంది. రాష్ట్రంలోని 15 నగరాల్లో ఇంటిగ్రేటెడ్ లేబర్ ఎమినిటీస్ సెంటర్లు ఏర్పాటుచేసి అవసరమైన సౌకర్యాలు ఒకేచోట అందించనున్నాం. కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ప్రివెంటివ్ హెల్త్ స్క్రీనింగ్, సంచార వైద్యసేవలు, డిజిటల్ హెల్త్‌రికార్డులు అమలుచేస్తున్నాం' అని వివరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెదేపాకు కార్మికులతో అనుబంధం ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. కార్మిక సంక్షేమం కోసం టీఎన్‌టీయూసీ పనిచేస్తోందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి నీటి కేటాయింపులపై జవాబివ్వండి

తెలంగాణకు కృష్ణా బోర్డు లేఖ

ఈనాడు, హైదరాబాద్: తాగు నీటి అవసరాలకు 10 టీఎంసీలు కావాలంటూ ఇటీవల ఏపీ బోర్డు లేఖ రాసిందని, దీనిపై అభిప్రాయం తెలియజేయాలంటూ కృష్ణా బోర్డు తాజాగా తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీకి లేఖ రాసింది. వేసవి అవసరాలకు గాను నాగార్జునసాగర్ నుంచి గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని ఏపీ లేఖ రాసిందని బోర్డు సూచించింది. దీనిపై మే ఐదో తేదీలోపు తెలంగాణ అభిప్రాయం తెలియజేయాలని, త్వరలో నిర్వహించనున్న కృష్ణా బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చిద్దామంటూ బోర్డు లేఖలో పేర్కొంది.

ఆస్తుల వార్షిక రిటర్న్‌లు సమర్పించని అదనపు ఎస్పీపై క్రమశిక్షణ చర్యలు

ఈనాడు, అమరావతి: ప్రస్తుతం నిరీక్షణలో ఉన్న అదనపు ఎస్పీ సి.నరేంద్రనాథ్‌రెడ్డిపై రాష్ట్రప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. 2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన వార్షిక ఆస్తుల రిటర్న్‌లు సమర్పించలేదని.. ఇది దుష్ప్రవర్తన కిందకు వస్తుందంటూ ఆయనపై అభియోగం మోపింది. వాటికి 10 రోజుల్లోగా సమాధానాలివ్వాలని నిర్దేశించింది. లేనిపక్షంలో తమవద్ద ఉన్న ఆధారాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపడతామని పేర్కొంది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆగిన లారీ.. ఆయువు తీసింది

- శంషాబాద్ ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- రోడ్డుపక్కన నిలిపిన లారీని ఢీకొట్టిన కారు
- ముగ్గురు చిన్నారులు సహా ఆరుగురి మృతి
- మరో మహిళకు తీవ్రగాయాలు



స్వర్ణగిరి ఆలయం వద్ద ఇరు కుటుంబసభ్యుల సెల్ఫీ. చిత్రంలో శివకుమార్, శ్రీనివాస్, కృష్ణచంద్ర, శ్వేత, లాస్య, రిషిక, మాధవ్

ఈనాడు, హైదరాబాద్ శంషాబాద్, న్యూస్‌టుడే: పిల్లలకు వేసవి సెలవులు కావడంతో బావాబామ్మర్దుల కుటుంబాలు కారులో ఆలయాల సందర్శనకు బయలుదేరాయి. మొదట వారు యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయాలను దర్శించుకొని ఓఆర్ఆర్ మీదుగా చిలుకూరుకి ప్రయాణమయ్యారు. కారులో సరదాగా కబుర్లు చెప్పుకొంటూ ప్రయాణిస్తున్నారు. ఇంతలో శంషాబాద్ వద్ద రోడ్డు పక్కన ఓ లారీ నిలిపి కనిపించింది.. దాన్ని తప్పించేలోపే క్షణాల్లో ఘోరం జరిగిపోయింది. కారు వేగానికి లారీ కింద భాగంలోకి దూసుకెళ్లిపోయింది.. ముగ్గురు చిన్నారులు సహా ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఒక్క మహిళ మాత్రమే తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన బొల్లి రాజుకు ఇద్దరు కుమారులు, కుమార్తె శ్వేత సంతానం. ఆమె భర్త కోడం శ్రీనివాస్(40) సిరిసిల్లలోని ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి కుమారులు కృష్ణచంద్ర(13), మాధవ్(10) ఉన్నారు. శ్వేత సోదరుడు బొల్లి శివకుమార్(37) హైదరాబాద్ సనత్‌నగర్‌లో ఉంటూ బీడీల వ్యాపారం చేస్తుండగా, ఆయన భార్య రాజేశ్వరి ఎలియాస్ లాస్య(35) పౌరసరఫరాల విభాగంలో ఉద్యోగిని. వీరికి కుమార్తె రిషిత(7) ఉంది. శ్రీనివాస్ కుటుంబం గురువారం శివకుమార్ ఇంటికి వచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున ఇరు కుటుంబాల్లోని ఏడుగురు సభ్యులు కారులో యాదగిరిగుట్టకు బయల్దేరారు. దైవదర్శనం పూర్తికాగానే మధ్యాహ్నం స్వర్ణగిరి దేవాలయానికి వెళ్లారు. అక్కడి నుంచి చిలుకూరు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేందుకు ఔటర్ ఎక్కారు. వీరి వాహనం హైదరాబాద్ శివారు తొండుపల్లి గ్రామ పరిధిలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16 వద్ద అత్యవసర మార్గంలో నిలిపి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు శివకుమార్, ఆయన భార్య రాజేశ్వరి, కుమార్తె రిషిత, శ్రీనివాస్, ఆయన కుమారులు కృష్ణచంద్ర, మాధవ్ అక్కడికక్కడే మృతిచెందారు. శ్వేతకు తీవ్రగాయాలు కాగా సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఫ్యూచర్‌సిటీ జాయింట్ సీపీ చందనాదీప్తి, డీసీపీ యోగేశ్‌గౌతమ్, శంషాబాద్ పోలీసు అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గురైన కారు బొల్లి శివకుమార్ పేరుతో రిజిస్ట్రేషనై ఉంది. దీనిపై అతివేగంగా నడిపినట్లు చలానాలున్నాయి. నిలిపి ఉన్న లారీ దూరాన్ని అంచనా వేయలేకపోవటం, వేగాన్ని నియంత్రించటంలో విఫలమై ఢీకొట్టి ఉండొచ్చని తెలిపారు. శివకుమార్ సోదరుడి ఫిర్యాదుతో శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ తాళ్లు వదులు కావడంతో ఆగాం

– శ్రీనివాస్, లారీ డ్రైవర్

చౌటుప్పల్ నుంచి నంద్యాలకు బియ్యం లోడుతో వెళ్తుండగా తాళ్లు వదులైనట్లు గమనించి శంషాబాద్ ఔటర్ అత్యవసర మార్గంలో లారీని నిలిపాం. ఆగిన ఐదు నిమిషాల్లోనే వెనుక నుంచి కారు వేగంగా వచ్చి లారీ కిందకు దూసుకెళ్లింది. నేను క్యాబిన్ దిగి కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించినా వీలు పడలేదు.



గుజరాత్, మహారాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో గవర్నర్

లోక్‌భవన్‌లో గుజరాత్, మహారాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

ఈనాడు, అమరావతి: విజయవాడలోని లోక్‌భవన్‌లో శుక్రవారం మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'లో భాగంగా నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. "గుజరాత్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని 'గుజరాత్ గౌరవ్ దివస్'గా నిర్వహించుకుంటారు. ఆ రాష్ట్రం సాంస్కృతికంగానే కాదు, ఆర్థికశక్తిగానూ అగ్రగామిగా నిలిచింది. దేశంలో మూడో అతిపెద్ద రాష్ట్రమైన మహారాష్ట్ర దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో 15% వాటాతో సంపన్న రాష్ట్రంగా నిలిచింది" అని గవర్నర్ వివరించారు. అంతకుముందు ఆయా రాష్ట్రాల గవర్నర్ల వీడియో సందేశాలను ప్రదర్శించారు. విజయవాడలోని గుజరాతీ సమాజ్ సభ్యులు గర్బా నృత్య ప్రదర్శననిచ్చారు.

రాక్రీట్ సంస్థపై కేసు నమోదు

- పేరేచర్ల జగనన్న లేఔట్‌లో రూ.10.65 కోట్ల దుర్వినియోగం
- మేడికొండూరు పోలీసులకు డీఈ ఫిర్యాదు

మేడికొండూరు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో పేదలకు ఇళ్ల కట్టకుండానే రూ.10.65 కోట్ల నిధులు కాజేశారన్న ఫిర్యాదుపై రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ తోపుదుర్తి అమర్‌నాథ్‌రెడ్డిపై గుంటూరు జిల్లా మేడికొండూరు పోలీసులు కేసు నమోదుచేశారు. అమర్‌నాథ్‌రెడ్డి వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనుచరుడు. సీఐ మధుసూదనరావు తెలిపిన వివరాల మేరకు.. వైకాపా ప్రభుత్వం నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మేడికొండూరు మండలం పేరేచర్ల శివారు ఇళ్ల నిర్మాణం (అర్బన్ లేఔట్) పనులు చేపట్టింది. మూడో ఆప్షన్ కింద మొత్తం 4,504 ఇళ్లు ప్రభుత్వం కట్టేందుకు అనంతపురం జిల్లాకు చెందిన రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. పనులు మొదలుపెట్టిన ఆ సంస్థ.. కాలపరిమితి లోపు పూర్తి చేయలేదు. పూర్తిచేసిన వాటిలో కొన్ని నివాసయోగ్యంగా లేవు. ఈ నేపథ్యంలో కొందరు లబ్ధిదారులు కొద్దినెలల క్రితం జిల్లా గృహనిర్మాణ సంస్థను ఆశ్రయించి అధికారులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం కలగజేసుకుని విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఇంటి పనులు పూర్తిచేయకుండానే ఉద్దేశపూర్వకంగా అవకతవకలు, మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడిందని, రూ.10.65 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని అధికారులు నిగ్గుతేల్చారు. దీనిపై ప్రత్తిపాడు డివిజన్ గృహనిర్మాణ సంస్థ డిప్యూటీ ఇంజినీర్ జున్నూరు బాబూరావు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐపీఎం ప్రధాన కార్యాలయంలో.. నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) ప్రధాన కార్యాలయంలోని నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఐపీఎం ఇన్‌ఛార్జి డైరెక్టర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ ఉత్తర్వులు జారీచేశారు. సస్పెండైనవారిలో సూపరింటెండెంట్ డి.శిరీష, సీనియర్ సహాయకులు జె.సుజాత, జి.అఖిల్, టి.సంగీతరావు ఉన్నారు. ఉన్నతాధికారుల అనుమతిలేకుండా విధులకు గైర్హాజరవ్వడం, స్వచ్ఛంద పదవీవిరమణ పొందిన గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమారికి రావల్సిన ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల విషయంలో సరిగా స్పందించకపోవడం లాంటి కారణాలతో సుజాతపై చర్యలు తీసుకున్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకపోవడం, పలుమార్లు హెచ్చరించినా మార్పులేకపోవడంతో మిగిలినవారిపై చర్యలు తీసుకున్నారు.

స్వచ్ఛరథాల్లో ఏప్రిల్‌లో 18 లక్షల కిలోల వ్యర్థాల సేకరణ

ఈనాడు, అమరావతి: పల్లెలను శుభ్రపరిచే కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన స్వచ్ఛరథాల్లో ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో 18.66 లక్షల కిలోల పునర్వ్యర్థాలు సేకరించామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇళ్లనుంచి సేకరించిన పాడైన ప్లాస్టిక్, గాజు, ఇనుము, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పాత దుస్తులు, పుస్తకాలకు బదులుగా రూ.3.31 కోట్ల విలువైన నిత్యావసరాలు ప్రజలకు అందించామని పేర్కొన్నారు.

సింగపూర్ విద్యా విధానంపై అధ్యయనానికి ఉపాధ్యాయుల బృందం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులతో కూడిన బృందం ఈ నెల 4 నుంచి 9 వరకు సింగపూర్‌లో సెకండరీ విద్యపై అధ్యయనానికి వెళ్లనుంది. వివిధ దేశాల్లో అవలంబిస్తున్న విద్యావిధానాల అధ్యయనానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను పంపిస్తామని గతంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇందులోభాగంగా 37 మంది ఉపాధ్యాయులతో కూడిన బృందాన్ని సింగపూర్‌కు పంపిస్తున్నారు. ఈ బృందం శనివారం బయలుదేరి వెళ్తుంది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులొచ్చిన 75లో 37మందిని సింగపూర్‌కు పంపిస్తుండగా.. మిగతావారిని జూన్, జులై నెలల్లో ఫిన్లాండ్‌కు పంపించనున్నారు.

ఏప్రిల్‌లో వాణిజ్య పన్నుల వసూళ్ల రికార్డు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఏప్రిల్ నెలలో వాణిజ్య పన్నుల వసూళ్లలో 12.07% వృద్ధి నమోదైంది. ఏప్రిల్‌లో రూ.5,542.70 కోట్లు వసూలైంది. ఇప్పటివరకు నమోదైన అత్యధిక నెలవారీ వసూళ్లు ఇవే. గతేడాది ఏప్రిల్‌తో పోల్చితే రూ.598.78 కోట్లు అధికంగా వసూలైంది. ఈ సంవత్సరంలో ప్రవేశపెట్టిన అనేక కొత్త ఆదాయ సమీకరణ కార్యక్రమాలు, ఏఐ ఆధారిత డేటా విశ్లేషణలు, ఏఐతో కూడిన తనిఖీలు, ఏఐ ఆధారిత జీఎస్టీ సర్దుబాట్ల వల్ల గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చాయని వాణిజ్య పన్నుల శాఖ ప్రకటించింది.

కొనసాగుతున్న వాణిజ్య పన్నుల ఉద్యోగుల నిరసనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాల వద్ద మూడోరోజు నాలుగో తరగతి ఉద్యోగులు సహా ఇతర ఉద్యోగులు నిరసనలు తెలిపినట్లు ఏపీ వాణిజ్య పన్నుల సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, రమేశ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల నిరసనలకు వాణిజ్య పన్నుల శాఖలోని ఉద్యోగులందరూ సంఘీభావం తెలుపుతున్నారని వెల్లడించారు. సెంట్రలైజ్డ్ రిజిస్ట్రేషన్ సంస్కరణ అంటూ రాష్ట్రవ్యాప్తంగా వేల బోగస్ రిజిస్ట్రేషన్లు, పన్ను ఎగవేతలు కొనసాగుతున్నట్లు ఆరోపించారు.

మోసకారి సంస్థల ఆస్తుల జప్తులో సహాయకారులుగా ఇన్‌స్పెక్టర్లు

ఈనాడు, అమరావతి: నియంత్రణ లేని డిపాజిట్ పథకాల నిషేధ నియమావళి-2022కి అనుగుణంగా.. గతంలో నియమితులైన కాంపిటెంట్ అథారిటీకి సహాయపడేందుకు ఇన్‌స్పెక్టర్లు లేదా అంతకంటే పైస్థాయి అధికారులను 'ఆఫీసర్స్ టూ అసిస్ట్'గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మోసకారి సంస్థల ఆస్తుల జప్తు, ఫ్రీజింగ్ తదితర అంశాల్లో కాంపిటెంట్ అథారిటీకి, సీఐడీ విభాగాధిపతికి వీరు సహాయం చేయాలని పేర్కొంది. దీనివల్ల మోసకారి సంస్థలపై కేసు నమోదైన యూనిట్లలోని అధికారులు... ఆస్తుల జప్తు ప్రక్రియలో పాల్గొనేందుకు అవకాశం కలుగుతుంది.

ఛాంపియన్స్



ఒక మ్యాచ్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్ల దెబ్బకు బెంబేలెత్తింది. మరో మ్యాచ్‌లో పంజాబ్‌పై 264 పరుగులు చేసినా ఓటమి తప్పలేదు. ఇంకో పోరులో బెంగళూరు మీద దారుణమైన ప్రదర్శనతో 75 పరుగులకే కుప్పకూలి ఓటమి కొనితెచ్చుకుంది. ఇలా హ్యాట్రిక్ ఓటములతో ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడ్డ దిల్లీ క్యాపిటల్స్.. మళ్లీ గెలుపు బాట పట్టింది. రాజస్థాన్ రాయల్స్ 226 భారీ లక్ష్యాన్ని నిలిపినా వెరవని డీసీ.. ఓపెనర్లు కేఎల్ రాహుల్, నిశాంక మెరుపులతో అలవోకగా విజయాన్నందుకుంది. రియాన్ పరాగ్ ఎట్టకేలకు ఫామ్ అందుకుని కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా రాజస్థాన్‌ను గెలిపించలేకపోయాడు.

దిల్లీ గెలుపు బాట

- రాజస్థాన్‌పై 226 పరుగుల ఛేదన
- అదరగొట్టిన రాహుల్, నిశాంక

పరాగ్, ఫెరీరా మెరుపులు వృథా





జైపుర్

ఐపీఎల్-19లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత దిల్లీ క్యాపిటల్స్ ఆత్మావశ్యక విజయాన్నందుకుంది. శుక్రవారం ఆ జట్టు 7 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (75; 40 బంతుల్లో 6×4, 5×6), నిశాంక (62; 33 బంతుల్లో 6×4, 3×6)తో పాటు నితీశ్ రాణా (33; 17 బంతుల్లో 3×4, 2×6) మెరుపులు మెరిపించడంతో 226 పరుగుల లక్ష్యాన్ని డీసీ.. 19.1 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి ఛేదించింది. మొదట రాజస్థాన్ 6 వికెట్లకు 225 పరుగులు చేసింది. పరాగ్ (90; 50 బంతుల్లో 8×4, 5×6), ఫెరీరా (47 నాటౌట్; 14 బంతుల్లో 2×4, 6×6) విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడారు. సీజన్లో తొలి మ్యాచ్ ఆడిన మిచెల్ స్టార్క్ (3/40) సత్తా చాటాడు. దిల్లీకి 9 మ్యాచ్‌ల్లో ఇది నాలుగో విజయం కాగా.. పదో మ్యాచ్ ఆడిన రాజస్థాన్ నాలుగో ఓటమిని ఖాతాలో వేసుకుంది.

ఇద్దరే తేల్చేశారు: గత మ్యాచ్‌లో 75 పరుగులకే కుప్పకూలిన దిల్లీ.. ఈ పోరులో 226 పరుగుల లక్ష్యం ముందున్నా ఏమాత్రం తడబడలేదు. ఓపెనర్లు నిశాంక, రాహుల్ శతక భాగస్వామ్యం నమోదు చేయడంతో ఆ జట్టు విజయానికి బలమైన పునాది పడింది. వరుస వైఫల్యాల నుంచి బయటపడుతూ నిశాంక ఈ మ్యాచ్‌లో విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అవతలి ఎండ్ నుంచి రాహుల్ సహకరిస్తుండగా.. అతను చెలరేగిపోయాడు. ఆర్చర్, బర్గర్ లాంటి మేటి బౌలర్ల బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడుతూ 23 బంతుల్లోనే నిశాంక అర్ధశతకం బాదేశాడు. పవర్‌ప్లేలో దిల్లీ 70/0తో నిలిచింది. 8 ఓవర్లు ముగిసేసరికి 26 పరుగులే చేసిన రాహుల్‌కు.. రవి బిష్ణోయ్ వేసిన తర్వాతి ఓవర్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో రెచ్చిపోయాడు. తర్వాతి ఓవర్లో జడేజా.. నిశాంకను ఔట్ చేసినా దిల్లీకి ఇబ్బంది లేకపోయింది. అప్పటికే టాప్ గేర్‌లోకి వచ్చేసిన రాహుల్.. నితీశ్ రాణా తోడవడంతో డీసీ లక్ష్యం దిశగా పరుగులు పెట్టింది. తొలి వికెట్‌కు నిశాంకతో 57 బంతుల్లో 110 పరుగులు జోడించిన రాహుల్.. రెండో వికెట్‌కు రాణాతో 30 బంతుల్లో 61 పరుగులు జత చేశాడు. 14 ఓవర్లకు దిల్లీ 166/1తో తిరుగులేని స్థితిలో నిలిచింది. వరుస ఓవర్లలో రాణా, రాహుల్ ఔటవడంతో రాయల్స్‌కు విజయం మీద కాస్త ఆశలు రేగినా.. అశుతోష్ (25 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (18 నాటౌట్) ఆ జట్టుకు అవకాశమివ్వకుండా డీసీ విజయాన్ని పూర్తి చేశారు.

కెప్టెన్ నిలిచాడు: మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన రాజస్థాన్‌కు ఆరంభంలో షాక్ మీద షాక్ తగిలినప్పటికీ.. పుంజుకుని భారీ స్కోరు సాధించింది. ఈ సీజన్లో నిలకడగా రాణిస్తూ రాయల్స్ బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలుస్తున్న యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో విఫలం కాగా.. పేలవ ఫామ్ నుంచి బయటపడుతూ సూపర్ ఇన్నింగ్స్ ఆడిన కెప్టెన్ పరాగ్, ఆఖర్లో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన ఫెరీరా జట్టుకు భారీ స్కోరు సాధించి పెట్టారు. గాయం వల్ల ఇప్పటిదాకా అందుబాటులో లేని స్టార్క్.. శుక్రవారం మైదానంలో అడుగుపెట్టగానే తన ప్రభావాన్ని చూపించాడు. తొలి బంతికే సిక్సర్ బాది స్టార్క్‌కు స్వాగతం పలికిన యశస్వి (6).. మూడో బంతికి అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ప్రమాదకర వైభవ్ సూర్యవంశీ (4)ని మరో విదేశీ పేసర్ జేమీసన్ బౌల్డ్ చేశాడు. 12 పరుగులకే ఓపెనర్ల వికెట్లు కోల్పోయిన రాయల్స్‌కు ఇక కష్టమే అనుకుంటే.. ఆ జట్టు త్వరగానే పుంజుకుంది. సీజన్లో తొలిసారి సాధికారిక ఇన్నింగ్స్ ఆడిన పరాగ్.. జురెల్ (42; 30 బంతుల్లో 4×4, 1×6)తో కలిసి ఇన్నింగ్స్ స్వరూపాన్ని మార్చేశాడు. జేమీసన్ వేసిన ఆరో ఓవర్లో వరుసగా 6, 4, 6 బాదిన అతను.. ఆ తర్వాత కూడా అదే దూకుడును కొనసాగించాడు. జురెల్ కూడా సమయోచితంగా షాట్లు ఆడడంతో రాజస్థాన్ 11వ ఓవర్లోనే 100 దాటింది. మూడో వికెట్‌కు 102 పరుగులు జోడించాక జురెల్ ఔటైనప్పటికీ.. జడేజా (20)తో కలిసి పరాగ్ మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. స్టార్క్ 16వ ఓవర్లో ఈ ఇద్దరినీ ఔట్ చేసి రాయల్స్‌ను దెబ్బ కొట్టాడు. ఆపై ఫెరీరా సిక్సర్ల మోత మోగించి స్కోరును 220 దాటించాడు.

రాజస్థాన్ ఇన్నింగ్స్: యశస్వి (సి) అండ్ (బి) స్టార్క్ 6; వైభవ్ (బి) జేమీసన్ 4; జురెల్ (సి) స్టబ్స్ (బి) అక్షర్ 42; పరాగ్ (సి) అక్షర్ (బి) స్టార్క్ 90; జడేజా (సి) అశుతోష్ (బి) స్టార్క్ 20; ఫెరీరా నాటౌట్ 47; శుభమ్ దూబె (సి) అశుతోష్ (బి) నటరాజన్ 6; ఆర్చర్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **225; వికెట్ల పతనం:** 1-6, 2-12, 3-114, 4-167, 5-168, 6-208; **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 4-0-40-3; జేమీసన్ 4-0-48-1; అక్షర్ పటేల్ 4-0-39-1; కుల్‌దీప్ యాదవ్ 4-0-41-0; నటరాజన్ 4-0-54-1

దిల్లీ ఇన్నింగ్స్: నిశాంక ఎల్బీ (బి) జడేజా 62; రాహుల్ (సి) ఫెరీరా (బి) ఆర్చర్ 75; నితీశ్ రాణా (సి) జురెల్ (బి) తుషార్ 33; స్టబ్స్ నాటౌట్ 18; అశుతోష్ నాటౌట్ 25; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం:** (19.1 ఓవర్లలో 3 వికెట్లకు) 226; **వికెట్ల పతనం:** 1-110, 2-171, 3-177; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-46-1; బర్గర్ 3-0-41-0; తుషార్ 4-0-38-1; బ్రిజేశ్ 3.1-0-35-0; బిష్ణోయ్ 2-0-28-0; జడేజా 3-0-33-1

తైపీని చిత్తు చేసి..

- థామస్ కప్ సెమీస్‌లో భారత్
- పతకం ఖాయం

హోర్సెన్స్ (డెన్మార్క్)



థామస్ కప్‌లో భారత్ అదరగొట్టింది. ఈ ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ టోర్నీలో అద్వితీయమైన ప్రదర్శనతో భారత పురుషుల జట్టు పతకం ఖాయం చేసుకుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారత్ 3-0తో చైనీస్ తైపీని చిత్తుచేసింది. పటిష్ఠమైన ప్రత్యర్థితో హోరాహోరీ పోరు ఖాయమనుకున్నా.. భారత షట్లర్ల అద్భుత ఆటతీరుతో క్వార్టర్స్ ఏకపక్షంగా ముగిసింది. లక్ష్యసేన్ అద్భుత పోరాటం.. సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ నిలకడ.. యువ ఆటగాడు ఆయుష్ శెట్టి సంచలన విజయంతో మ్యాచ్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. 2022లో థామస్ కప్‌లో విజేతగా నిలిచిన భారత్.. అంతకుముందు 1952, 1955, 1979లలో కాంస్య పతకాలు గెలుచుకుంది. తాజా విజయంతో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. సెమీఫైనల్లో ఫ్రాన్స్ లేదా జపాన్‌తో భారత్ తలపడనుంది.

క్వార్టర్స్ పోరులో తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ జట్టుకు శుభారంభం అందించాడు. ప్రపంచ ఆరో ర్యాంకర్ చౌ తీన్ చెన్‌పై అద్భుత విజయాన్ని నమోదు చేశాడు. ఒక గంటా 28 నిమిషాల పాటు సాగిన సుదీర్ఘ పోరులో లక్ష్యసేన్ 18-21, 22-20, 21-17తో తీన్ చెన్‌ను మట్టికరిపించాడు. రెండో గేమ్‌లో ప్రత్యర్థికి 2 మ్యాచ్ పాయింట్లు లభించినప్పటికీ.. లక్ష్యసేన్ ఏమాత్రం ఒత్తిడికి గురవలేదు. రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని గేమ్‌ను కైవసం చేసుకోవడం విశేషం. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో లక్ష్యసేన్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం డబుల్స్‌లో సాత్విక్- చిరాగ్ జోడీ 23-21, 19-21, 21-12తో సియాంగ్ చ్యూ- వాంగ్ లిన్ జంటపై గెలుపొందింది. ఒక గంటా 15 నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఈ జోడీ గొప్ప సమన్వయంతో ఆడి భారత్‌కు 2-0తో ఆధిక్యాన్ని అందించింది. రెండో సింగిల్స్‌లో 20 ఏళ్ల యువ సంచలనం ఆయుష్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ లిన్ చున్‌కు షాకిచ్చాడు. ఆయుష్ 21-16, 21-17తో వరుస గేమ్‌ల్లో లిన్ చున్‌ను ఓడించి భారత్‌కు 3-0తో విజయాన్ని అందించాడు. మంచి డిఫెన్స్.. దూకుడు.. మెరుపుల్లాంటి స్మాష్‌లతో విరుచుకుపడిన ఆయుష్.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు.

మేం గెలుస్తాం: ఆయుష్

థామస్ కప్ 2026 టైటిల్ గెలవగలమనే నమ్మకంతో తాము ఉన్నామని యువ షట్లర్ ఆయుష్ శెట్టి అన్నాడు. "మా జట్టు బలంగా ఉంది. ప్రతి ఒక్కరూ విజయంపై ధీమాగా ఉన్నారు" అని ఆయుష్ చెప్పాడు. ఆల్‌ఇంగ్లాండ్ ఛాంపియన్ లిన్ చున్ యికితో సింగిల్స్‌లో తాను ఎక్కువగా ఎటాక్ చేశానని, అతడికి ఎక్కువగా అవకాశాలు ఇవ్వలేదని అన్నాడు. తన ప్రదర్శన పట్ల ఆయుష్ సంతోషం వ్యక్తం చేశాడు. తాను అతిగా ఆలోచించడం మానేయడం వల్లే ప్రపంచ నంబర్ 6 చెన్‌తో మ్యాచ్‌లో పుంజుకున్నానని, కీలక సమయాల్లో మెరుగైన ప్రదర్శన చేశానని లక్ష్యసేన్ అన్నాడు.

క్లాసెన్.. ఆటోలో అలా..



హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ నగర వీధుల్లో సందడి చేశాడు. ఐపీఎల్‌లో విరామం లభించడంతో తన కుమార్తె లాయాతో కలిసి హైదరాబాద్‌లో చక్కర్లు కొట్టాడు. క్లాసెన్, లాయా సాధారణ ప్రయాణికుల్లా ఆటోలో ప్రయాణిస్తూ నగర అందాల్ని వీక్షించారు. మైదానంలో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగే క్లాసెన్.. కుమార్తెతో కలిసి అతి సాధారణ వ్యక్తిలాగా ఆటోలో తిరుగుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

రిలే బెర్తుల కోసం

గబోరన్ (బోట్స్‌వానా): ప్రపంచ రిలే పోటీల్లో సత్తాచాటి, 2027 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో బెర్తు ఖరారు చేసుకోవాలని భారత అథ్లెట్లు ఉత్సాహంగా ఉన్నారు. శనివారం నుంచి బోట్స్‌వానాలో జరగబోయే ప్రపంచ అథ్లెటిక్స్ రిలే పోటీల్లో అయిదు భారత జట్లు బరిలో దిగనున్నాయి. తొలి రోజు క్వాలిఫయింగ్ రౌండ్లో మిక్స్‌డ్ 4×100 మీటర్ల ఈవెంట్‌తో పోటీలు ప్రారంభమవుతాయి. మిక్స్‌డ్ 4×400, మహిళల 4×100, పురుషుల 4×100, పురుషుల 4×400 విభాగాల్లో భారత అథ్లెట్లు బరిలో దిగనున్నారు. ప్రతి ఈవెంట్లో టాప్ 12 జట్లు వచ్చే ఏడాది జరగబోయే ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.

భారత్ 8.. మకావు 1

దిల్లీ: ఐస్ హాకీ ఆసియాకప్‌లో భారత్ తొలి విజయాన్ని అందుకుంది. ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన భారత్.. మూడో మ్యాచ్‌లో 8-1తో మకావును చిత్తుగా ఓడించింది. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరుగుతున్న టోర్నీలో కెప్టెన్ గుర్‌తేజ్ సింగ్ భట్టి నాలుగు గోల్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. భారత జట్టు ఆరంభం నుంచి దూకుడుగా ఆడి, ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అజయ్ మొదటి గోల్‌తో శుభారంభాన్నిచ్చాడు. ఇఫ్తికార్, తంజిన్, దేవాన్ష్ తలో గోల్ సాధించారు.

శాంట్నర్.. నెల రోజులు

ఆక్లాండ్: న్యూజిలాండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కనీసం నెల రోజులు క్రికెట్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్‌లో ఈ నెల 23న సీఎస్కేతో మ్యాచ్‌లో ముంబయి తరఫున ఫీల్డింగ్ చేస్తుండగా శాంట్నర్ భుజానికి గాయమైంది. "శాంట్నర్ స్వదేశానికి చేరుకున్నాడు. స్పెషలిస్టును సంప్రదించాడు. అతడికి విశ్రాంతి అవసరమని, కోలుకోవడానికి కనీసం నెల రోజులు పడుతుందని వైద్యుడు చెప్పాడు" అని న్యూజిలాండ్ క్రికెట్ శుక్రవారం తెలిపింది. ఐర్లాండ్‌తో ఏకైక టెస్టు (మే 27 నుంచి)కు శాంట్నర్ దూరమయ్యాడు.

ఎస్‌ఆర్‌హెచ్‌లో ఆర్‌ఎస్ అంబ్రిష్



దిల్లీ: గాయపడ్డ పేసర్ శివమ్ మావి స్థానంలో ఆల్‌రౌండర్ అంబ్రిష్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి తీసుకుంది. గజ్జల్లో గాయం కారణంగా మావి ఐపీఎల్‌లో మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో అంబ్రిష్ సభ్యుడు. ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు (11) పడగొట్టింది కూడా అతడే. అంబ్రిష్ రూ.30 లక్షల కనీస ధరతో ఎస్‌ఆర్‌హెచ్‌కు ఆడనున్నాడు.

ఐపీఎల్‌లో ఈనాడు
చెన్నై × ముంబయి
వేదిక: చెన్నై, రా॥ 7.30

ఐపీఎల్‌లో 19వ సీజన్లో సగానికి పైగా మ్యాచ్‌లు పూర్తయ్యాయి. కొన్ని జట్లు తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తూ పాయింట్ల పట్టికలో పైపైకి దూసుకెళ్తుంటే.. కొన్ని జట్లు పేలవ ప్రదర్శనతో అట్టడుగు స్థానం కోసం పోటీ పడుతున్నాయి. కొన్ని జట్లు పడుతూ లేస్తూ సాగుతున్నాయి. ప్లేఆఫ్స్ స్థానాలపై ఇప్పటికే ఒక స్పష్టత వచ్చినట్లు కనిపిస్తున్నా.. విపరీతమైన పోటీ ఉండే, ఎప్పటికప్పుడు అనూహ్య ఫలితాలు వచ్చే ఐపీఎల్‌లో ముందే ఒక అంచనాకు వచ్చేయలేం. పట్టికలో కొంచెం కింద ఉన్న జట్లలో ఒకటో రెండో పైకి వస్తే ఆశ్చర్యమేమీ లేదు. ఈ సీజన్లో తడబడుతూ సాగుతున్న చెన్నై సూపర్‌కింగ్స్, ముంబయి ఇండియన్స్ శనివారం తలపడనుండగా.. ఈ మ్యాచ్‌లో ఓడే జట్టు పరిస్థితి సంక్లిష్టం కానుంది.

ఈ జట్లు పుంజుకోగలవా?

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
పంజాబ్	8	6	1	1	13	1.043
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	9	6	3	0	12	0.832
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	9	5	4	0	10	-0.192
దిల్లీ	9	4	5	0	8	-0.895
చెన్నై	8	3	5	0	6	-0.121
కోల్‌కతా	8	2	5	1	5	-0.751
ముంబయి	8	2	6	0	4	-0.784
లఖ్‌నవూ	8	2	6	0	4	-1.106

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

ఈనాడు క్రీడావిభాగం





గత ఏడాది ఛాంపియన్‌గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రన్నరప్ పంజాబ్ కింగ్స్.. ఈ ఐపీఎల్‌లోనూ సత్తా చాటుతున్నాయి. వీటికి తోడు రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా అదరగొడుతున్నాయి. పంజాబ్ 8 మ్యాచ్‌ల్లో ఆరు నెగ్గి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వర్షం వల్ల రద్దవడం వల్ల వచ్చిన ఒకటితో కలిపి మొత్తం ఆ జట్టు 13 పాయింట్లు సాధించింది. ఇక బెంగళూరు 9 మ్యాచ్‌ల్లో 6 నెగ్గి 12 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. సన్‌రైజర్స్ 9 మ్యాచ్‌లాడి 12 పాయింట్లతో, రాజస్థాన్ రాయల్స్ 10 మ్యాచ్‌ల్లో 12 పాయింట్లతో వరుసగా 3, 4 స్థానాల్లో ఉన్నాయి. వీటికి ప్లేఆఫ్స్ చేరడానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయి. గుజరాత్ 9 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 4 ఓటములతో మొత్తం 10 పాయింట్లు సాధించి అయిదో స్థానంలో ఉంది. 3, 4 స్థానాల్లో ఉన్న జట్లకు.. జీటీకి ఒక విజయమే తేడా కాబట్టి దాని అవకాశాలను కొట్టిపారేయలేం. మిగతా అయిదు జట్ల పరిస్థితి మాత్రం బాగా లేదు. 9 మ్యాచ్‌ల్లో నాలుగు నెగ్గిన దిల్లీ, 8 మ్యాచ్‌లాడి మూడు విజయాలు సాధించిన చెన్నై జట్ల పరిస్థితి కాస్త నయం. ఈ జట్లు ఇకపై ఆడబోయే మ్యాచ్‌ల్లో ఒకటికి మించి ఓటములు చవిచూస్తే ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడిపోతాయి. దిల్లీ మెరుగ్గానే ఆడుతున్నప్పటికీ.. త్రుటిలో ఓడిపోతోంది. గెలవాల్సిన కొన్ని మ్యాచ్‌లను ఆ జట్టు దూరం చేసుకుంది. ఇక ఈ సీజన్‌ను పేలవంగా ఆరంభించిన చెన్నై.. తర్వాత పుంజుకున్నట్లే కనిపించినా, మళ్లీ తడబడుతోంది. మరోవైపు కోల్‌కతా (8 మ్యాచ్‌ల్లో 5 పాయింట్లు), ముంబయి (8 మ్యాచ్‌ల్లో 4 పాయింట్లు), లఖ్‌నవూ (8 మ్యాచ్‌ల్లో 4 పాయింట్లు) పుంజుకుని ప్లేఆఫ్స్ రేసులోకి రావడం చాలా కష్టంగానే ఉంది. వరుసగా అయిదు మ్యాచ్‌లు ఓడి అట్టడుగు స్థానంలో కొనసాగుతున్న ఎల్‌ఎస్‌జీ.. ఈ సీజన్ మీద ఆశలు వదులుకోవాల్సిందే అనిపిస్తోంది. తన కంటే ఘోరమైన ప్రదర్శన చేస్తున్న కోల్‌కతా చేతిలో కూడా ఆ జట్టు ఓడిపోయింది. ఆ మ్యాచ్‌లో గెలిచేందుకు లఖ్‌నవూకే ఎక్కువ అవకాశాలు కనిపించాయి. కానీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆ ఓటమి తర్వాత కెప్టెన్ పంత్ నిరాశపడిపోయాడు. తమ జట్టుకు కాస్త విరామం కావాలని వ్యాఖ్యానించాడు. ఏమాత్రం స్ఫూర్తినివ్వలేని పంత్ కెప్టెన్సీనే ఆ జట్టుకు పెద్ద ప్రతిబంధకంగా మారింది. ఇక కోల్‌కతా ఈ సీజన్లో అతి కష్టం మీద రెండు విజయాలు సాధించగలిగింది. వర్షం వల్ల ఓ మ్యాచ్ రద్దవడంతో ఒక పాయింట్ ఆ జట్టు ఖాతాలో చేరింది. కెప్టెన్ రహానె సహా ప్రధాన ఆటగాళ్లు పేలవ ప్రదర్శన చేస్తుండడంతో కోల్‌కతాకు ఈ సీజన్ మీద ఆశలు లేనట్లే కనిపిస్తోంది. ఇక ముంబయి ఇండియన్స్ జట్టులో స్టార్ ఆటగాళ్లకు లోటు లేకపోయినా.. సమష్టి ప్రదర్శన కొరవడి వరుస ఓటములు చవిచూస్తోంది. ఆ జట్టు బౌలింగ్ ఏమాత్రం ఆశాజనకంగా లేదు. బుమ్రా సహా బౌలర్లందరూ తేలిపోతున్నారు. సన్‌రైజర్స్‌తో తన చివరి మ్యాచ్‌లో 243 పరుగులు చేసి కూడా ఓటమి పాలైంది ముంబయి. ముంబయి, లఖ్‌నవూ, కోల్‌కతా జట్లు తలో 5 మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. దాదాపుగా ప్రతి మ్యాచ్ గెలవాల్సిన స్థితిలో ఉన్నాయి. శనివారం చెన్నై చేతిలో ఓడితే ముంబయి కథ ముగిసినట్లే! మరోవైపు చెన్నై ఈ మ్యాచ్‌లో ఓడినా.. ప్లేఆఫ్స్ రేసులో బాగా వెనుకబడిపోతుంది.

భారత్ @ 3

దిల్లీ: మహిళల క్రికెట్ వన్డే ర్యాంకింగ్స్‌లో ప్రపంచకప్ విజేత భారత్ మూడో స్థానంలో కొనసాగుతోంది. తాజాగా విడుదలైన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఒక పాయింట్ కోల్పోయిన హర్మన్‌ప్రీత్ బృందం ఖాతాలో ప్రస్తుతం 124 పాయింట్లున్నాయి. నాలుగు పాయింట్లు కోల్పోయినప్పటికీ.. ఆస్ట్రేలియా (163) అగ్రస్థానాన్ని కాపాడుకుంది. ఇంగ్లాండ్ (128) మూడు పాయింట్లు మెరుగుపరచుకుని రెండో స్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా (100), న్యూజిలాండ్ (93), శ్రీలంక (89) వరుసగా నాలుగు, అయిదు, ఆరో స్థానాల్లో కొనసాగుతున్నాయి. అయితే థాయ్‌లాండ్, నెదర్లాండ్స్ ర్యాంకింగ్స్ పట్టిక నుంచి వైదొలిగాయి. గత మూడేళ్లుగా ర్యాంకింగ్స్‌కు అవసరమైన ఎనిమిది వన్డేలు ఆడకపోవడమే ఇందుకు కారణం.

షాట్‌గన్ ప్రపంచకప్ బరిలో భారత్

దిల్లీ: భారత షూటర్లు మరో సవాల్‌కు సిద్ధమయ్యారు. శనివారం కజకిస్థాన్‌లోని అల్మాటీలో ఆరంభమయ్యే ప్రపంచకప్ షాట్‌గన్ పోటీల్లో బరిలోకి దిగనున్నారు. 12 మంది సభ్యుల భారత బృందం ఈ టోర్నీలో ఆడుతుంది. ఒలింపియన్లు మైరాజ్ అహ్మద్ ఖాన్, అనన్‌జీత్ సింగ్, రైజా థిల్లాన్‌పై పతక ఆశలు ఉన్నాయి. ఈ ముగ్గురు ఏడాది విరామం తర్వాత ఒక అంతర్జాతీయ టోర్నీలో ఆడుతున్నారు. 42 దేశాల నుంచి 200కు పైగా షూటర్లు ఈ కప్‌లో పోటీపడుతున్నారు. స్కీట్, ట్రాప్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. డెన్మార్క్, కజకిస్థాన్, గ్రీస్, ఫిన్లాండ్ నుంచి భారత్‌కు గట్టిపోటీ ఎదురు కానుంది.

బీసీసీఐ శిబిరానికి అనన్య

ఈనాడు, హైదరాబాద్: తెలుగమ్మాయి దండు అనన్య మరో ఘనత సాధించింది. బీసీసీఐ అండర్-15 మహిళల ఎలైట్ క్రికెట్ టోర్నీలో అత్యధిక వికెట్లతో రాణించిన అనన్య.. వీవీఎస్ లక్ష్మణ్ సారథ్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ- బీసీసీఐ)కి ఎంపికైంది. ఈనెల 18 నుంచి జూన్ 11 వరకు భారత హై పర్ఫార్మెన్స్ అండర్-15 శిక్షణ శిబిరంలో 13 ఏళ్ల అనన్యకు చోటు లభించింది. ఇటీవల ముగిసిన జాతీయ అండర్-15 టోర్నీలో అనన్య 16 వికెట్లతో దేశంలోనే అత్యుత్తమ బౌలర్‌గా నిలిచింది. కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్‌తో సంచలన ప్రదర్శనతో మెరిసింది. హైదరాబాద్‌లోని రామానాయుడు క్రికెట్ అకాడమీలో టీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరినాథ్ దగ్గర అనన్య శిక్షణ తీసుకుంటోంది. "ప్రతిభావంతులైన క్రికెటర్లకు రామానాయుడు అకాడమీలో ఉచితంగా అత్యున్నత స్థాయి శిక్షణ ఇస్తున్నాం. తల్లిదండ్రుల మీద ఎలాంటి భారం పడకుండా పేద, మధ్య తరగతి క్రికెటర్లకు అన్ని రకాల వసతులు అందిస్తున్నాం. మమత మదివాడ (ఎమర్జింగ్ ఇండియా), ధృతి కేసరి (అండర్-19 ప్రపంచకప్), ప్రణవి చంద్ర (సౌత్‌జోన్), ప్రతీక (హైదరాబాద్ జట్టు), సంధ్య గోరా (అండర్-19 ఎన్‌సీఏ శిబిరం), వల్లి (ఆంధ్ర అండర్-19), జనిత్ర (హైదరాబాద్ అండర్-15, అండర్-19) ఈ అకాడమీ నుంచి వెలుగులోకి వచ్చినవారే" అని చాముండేశ్వరినాథ్ తెలిపారు.



అనన్య, చాముండేశ్వరినాథ్